గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# సుశాస్త్రీయం

టీవీయస్.శాస్త్రి




సుశాస్త్రీయం - శ్రీమతి కన్నాంబ - టీవీయస్.శాస్త్రి

శ్రీమతి కన్నాంబ గారి పేరు చెప్పగానే మొదటిగా గుర్తుకొచ్చేది, లవకుశలోని ఆమె పోషించిన కౌసల్య పాత్ర. తరువాత గుర్తుకొచ్చేది మనోహర లోని పాత్ర. ఆ రోజుల్లో ఆమెకు ధీటైన నటీనటులు, శ్రీ యస్వీ రంగారావు గారు,శివాజీ గారు మరియు సావిత్రి గారు. గంభీరమైన స్వరం, చక్కటి రూపం వీటికి తోడు మాటలు పలకడం లో ఆమె చాతుర్యం, హావభావాలు.. ఇవన్నీ చూస్తుంటే ఎవరికైనా అనిపించేది -- కళ దైవదత్తమైనదని! ప్రసిద్ధ రంగస్థల నటి, గాయని, చలన చిత్ర కళాకారిణిగా తెలుగునాట కీర్తి తెచ్చుకున్న కన్నాంబ పూర్తి పేరు పసుపులేటి కన్నాంబ. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు లో 1912 లో జన్మించిన కన్నాంబ ఆనాటి నావెల్ నాటక సమాజంలో పదమూడు సంవత్సరముల వయస్సులో బాల పాత్రలు వేస్తూ తొలిసారిగా నాటక రంగ ప్రవేశం చేసింది తన నాటకరంగానుభవంతో 1935 లో హరిశ్చంద్ర తెలుగు చలనచిత్రంలో చంద్రమతిగా అడుగు పెట్టింది. ఆ తరువాత ద్రౌపదీ వస్త్రాపహరణం లో ద్రౌపది గా అద్భుతంగా నటించి తెలుగు ప్రేక్షకుల మన్ననలను, ప్రశంసలను అందుకుంది. సుమారు 150 పౌరాణిక, జానపద మరియు చారిత్రక చిత్రాలలో తనదైన శైలిలో అద్వితీయంగా నటించి గొప్ప నటీమణిగా కీర్తి గడించింది. నవరసాలను సమర్ధవంతంగా అవలీలగా పోషించగల అద్భుత నటీమణి కన్నాంబ.

కన్నాంబ భర్త కడారు నాగభూషణం. ఇద్దరు కలసి 'రాజరాజేశ్వరి' చిత్ర నిర్మాణ సంస్థ ని స్థాపించి అనేక చిత్రాలు తెలుగు లోను , తమిళ, కన్నడ భాషలలోనూ నిర్మించారు. ద్రౌపదీ వస్త్రాపహరణం, హరిశ్చంద్ర, చంద్రిక, కనకతార, పల్నాటియుద్ధం, గృహలక్ష్మి, అనార్కలి, దక్షయజ్ఞం, లోడికోడళ్ళు, కృష్ణ కుచేల, లవకుశ తదితర చిత్రాలు ఆమె నటించిన ముఖ్యమైనవి. ఎం. జి. రామచంద్రన్, ఎస్.ఎస్. రాజేంద్రన్ శివాజీ గణేషన్, నాగయ్య, పి.యు. చిన్నప్ప, నందమూరి తారక రామారావు తదితర అగ్రశ్రేణి నాయకుల సరసన ఎన్నో చిత్రాల్లో ఆమె నటించింది. కన్నాంబ గారి పేరు వింటేనే గౌరవభావం కలుగుతుంది. అంత ప్రజ్ఞావంతురాలైన నటి మరొకరు కనబడరు. కేవలం ఒక కనుబొమ్మతో ఆవిడ ప్రేమ, కరుణ, రౌద్రం... ఒకటేమిటి, నవరసాలు

పలికించగలరు. నాకు ఆవిడ నటించిన లోడికోడళ్ళు అంటే చాల ఇష్టం. ఆవిడ తప్పితే ఆ భూమికను ఎవ్వరు చేయలేరేమో అనిపిస్తుంది.

ఆవిడ మంచి మనసు గురించి ఎంత చెప్పిన తక్కువే అవుతుంది. ఒక రకంగా చెప్పాలంటే, ఆవిడ ఔదార్యంలో నాగయ్య గారి లాంటి వారు. శ్రీ రాజరాజేశ్వరి ప్రొడక్షన్స్ (కన్నాంబ గారి సంస్థ) ఒక దాన ధర్మ నిలయంగా విలసిల్లింది అని ఇప్పటికీ చెప్పుకుంటారట! ఇటువంటి గొప్ప నటులు, నటీమణులు కటిక పేదరికంలో చనిపోయారు అని తలచుకొంటేనే బాధగా వుంటుంది. చనిపోయిన యాభై ఏళ్ల తరువాత కూడా ఆ మహా నటులను , నటీమణులను మనం నేటికి తలచుకోవడమే వారి ప్రతిభకు గొప్ప నిదర్శనం. ఒక కళాకారిణికి అంతకన్నా కావలసిన యశస్సు ఏముంటుంది? ఆవిడ విశాల హృదయాన్ని గురించి ఒక మాట తప్పక చెప్పి తీరాలి. కన్నాంబ గారి పెంపుడు కూతురు రాజరాజేశ్వరినే దర్శకుడు సి.యస్. రావు గారికిచ్చి పెళ్లి చేసినా, వాళ్ళు విడిపోయారు. తరువాత రాజసులోచన గారు, సి.యస్. రావు గారు ఒకరినొకరు ఇష్టపడుతున్నారని తెలిసి కన్నాంబ గారే దగ్గరుండి వివాహం చేయించారు. ఈ విషయం రాజసులోచన గారే స్వయంగా అన్నారని ఒక పత్రికలో చదివాను.

ఇక డి.వి. నరసరాజు గారు ఆయన పుస్తకంలో కన్నాంబ గారి గురించి, ఆవిడకు దక్కిన గౌరవం గురించి చెబుతూ -- ఒక సినిమాలో నటించే సమయంలో ఆవిడ మధ్యాహ్న భోజనం కోసం ఇంటికి వెళ్లి చాలా ఆలస్యంగా వస్తున్నారని, ఆవిడని తొందరగా రమ్మనే సాహసం చేయలేక, ఆ చిత్ర దర్శకులు ఒక కారు ఇచ్చి, "నరసరాజు గారూ, కన్నాంబ గారిని డ్రాప్ చేసి ఈ కారు పట్టుకెళ్ళి మీరు భోంచేసి, మరల తిరిగి వచ్చేటప్పుడు ఆవిడని తీసుకురండి టైంకి . " అని పంపారట. మొదట కన్నాంబ గారిని డ్రాప్ చేసిన కారు నరసరాజు గారిని డ్రాప్ చేయగానే, ఆయన గబగబా భోజనం ముగించి, బయటకు వచ్చి చూస్తే కారు కనబడలేదట. ఏమయింది చెప్మా అనుకుంటుంటే మాములుగానే కారు ఆలస్యంగా వచిందట. అందులో కన్నాంబ గారు ఉన్నారట (ముసుముసి నవ్వులు నవ్వుకుంటూ.. ) "నరసరాజు గారు, మిమ్మల్ని డ్రాప్ చేసాక మా ఇంటికి రమ్మని చెప్పాలెండి డ్రైవర్ ని" అన్నారట ఆవిడ. అంతటి పసిపిల్లలాంటి నిష్కల్మషమైన ఆవిడ మన హృదయాలలో ఎప్పటికీ వుంటారు. కన్నాంబ పాడిన "కృష్ణం - భజరాధా" గ్రాంఫోన్ గీతాలు, ఆ రోజుల్లో ప్రతి ఇంట మారు మ్రోగుతూ ఉండేవి. ఆమె గొప్ప నటీమణి మాత్రమే కాదు. చక్కని గాయని కూడా. సుమారు ఐదు దశాబ్దాలు తెలుగు చలన చిత్ర సీమలో తనదైన ప్రత్యేక బాణీని ప్రదర్శించిన శ్రీమతి కన్నాంబ 1964 లో మే 7 న తుదిశ్వాస వదిలింది.



రావికొండలరావు రచన నుండి

1) 'నేనే రాణినైతే ఏలనే ఈ ధర ఏకధాటిగా ... ' అని ఒక పాట. చేతిలో కత్తి పట్టుకొని, వీరావేశంతో గుర్రం మీద కూచుని ఠీవిగా, ధాటిగా కళ్లెర్రజేస్తూ పాడిన ఆ మహానటి పసుపులేటి కన్నాంబ. ఆ సినిమా పేరు 'చండిక' (1941), ఠీవి గురించి ఆ రోజుల్లో ఆ సినిమా చూసినవాళ్లు చెప్పుకొనే వారు. అందులో కన్నాంబ గారు ఇంకా కొన్ని పాటలు పాడారు. మరొక పాట - "ఏమే ఓ కోకిలా- ఏమో పాడెదవు. ఎవరే నేర్పినది ఈ ఆట ఈ పాట..." ఈ పాటలో ఆమె నవ్వులు రువ్వుతూ పాడతారు. మధ్యమధ్యలో వచ్చే ఆ నవ్వు - ఆమె తప్ప ఇంకెవరు అలా నవ్వులు కలుపుతూ పాడలేరని కూడా ఆనాటి జనం చెప్పుకునేవారు


2) కడారు నాగభూషణం గారిని వివాహం చేసుకొని శ్రీ రాజరాజేశ్వరీ ఫిలిం కంపెనీ స్థాపించి తెలుగు తమిళ భాషల్లో 22 చిత్రాలు నిర్మింపజేశారమే. 'సుమతి(1942) ', పాదుకా పట్టాభిషేకం (1954), సౌదామిని (1951), పేదరైతు (1952), లక్ష్మి (1953) సతీ సక్కుబాయి (1954), శ్రీకృష్ణతులాభారం (1955) , నాగపంచమి (1956) మొదలైన చిత్రాలు ఆ కంపనీ నిర్మించింది. జీతాలు ఇవ్వడంలో ఆ కంపనీ కి గొప్ప పేరు వుండేది. ప్రతినెలా ఒకటో తేది రాకముందే ముందు నెల చివరి రోజునే స్టాఫ్ కి జీతాలు ఇచ్చేసేది ఆ కంపనీ. వారి ఆఫీసు కూడా చాల విశాలమైన కాంపౌండ్ లో, కార్లు, వ్యాన్లతో కళకలలాడుతూ వుండేది. ఇప్పుడు 'టైటానిక్ చీరలు' అంటూ సినిమా పేర్లతో చీరలు వస్తునట్టు- అప్పుడు "కాంచనమాల గాజులు - కన్నాంబ లోలాకులు " అంటూ

ఆభరణాలు వచ్చేవి. కన్నాంబ గొప్ప ఐశ్వర్యవంతురాలు అనీ, బంగారు కాసులు డబ్బాల్లో పోసి, పప్పులు, ఉప్పులు పెట్టుకొనే డబ్బాల మధ్య ఎవరికీ తెలియకుండా ఉంచేవారని చెప్పుకునేవారు .

3) ఐశ్వర్యం ఎలా వస్తుందో ఎలా పోతుందో ఎవరూ చెప్పలేరని పెద్దలు చెబుతారు. ఎలా పోయాయో, ఏమైపోయాయో గాని, కన్నాంబ మరణంతో కంపనితో సహా అన్నీ పోయాయి. ఆమె భర్త నాగభూషణం గారు ఒక చిన్న గదిలో ఉంటూ కాలక్షేపం చేసేవారు. ఒకసారి ఒక మిత్రుడు ఆయన్ని కలవాలని ఆ గదికి వెళ్లి 'గుండె కలుక్కుమంది. ఆ వాతావరణం చూడలేక తిరిగి వచ్చేసాను' అని చెప్పారు. ఆ చిన్న గదిలో ఒక ట్రంకు పెట్టె, ఓ కుర్చీ మాత్రం వున్నాయి. ఎదురుగా కన్నాంబ ఫోటో, దండెం మీద తువ్వాలు తప్ప ఇంకా ఏమి కనిపించలేదు. ఆయన కిందనే చాప మీద కూర్చొని, దిన పత్రిక చదువుకుంటున్నారు అన్నాడు ఆ మిత్రుడు.

4) కన్నాంబ మృతదేహాన్ని వారి కులాచారం ప్రకారం నగలతోనే పూడ్చిపెడితే దొంగలు ఆ నగలను కాజేసి ఆమె శవాన్ని కూడా మాయం చేసారట.

*********************************************




సుశాస్త్రీయం - శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య - టీవీయస్. శాస్త్రి

ఇది అరుణతార శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య గారి శత జయంతి సంవత్సరం !!

ఈ సందర్భంగా ఆ మహనీయుని గురించి కొన్ని విశేషాలు తెలుసుకుందాము.

పేరు: పుచ్చలపల్లి సుందరయ్య

ఊరు: అలగానిపాడు, నెల్లూరు

జననం: 1913

మరణం : 19/05/1985

భార్య : శ్రీమతి లీలా సుందరయ్య

సంతానం : లేదు (సంతానం కలుగకుండా ఆపరేషన్ చేయించుకున్నారు)

ప్రజా నామం : కామ్రేడ్ పి ఎస్

ప్రత్యేకత : సి పి ఎమ్ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరు, రచయిత

భారత కమ్యూనిస్ట్ ఉద్యమ అగ్రనేత శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య గారి శత జయంతి సభ ఢిల్లీ లో జరగనుంది. ఈ సంవత్సరం మే 1 నుంచి సుందరయ్య గారి శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కోజికోడ్ లో ఇటీవల జరిగిన పార్టీ అఖిల భారత మహా సభ తీర్మానించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యం లో ఉత్సవాల ప్రారంభ సూచకంగా ఢిల్లీ లో ఈ సభని నిర్వహించారు. ఆ మహనీయుని స్మరించుకుంటూ, ఆయనను గురించి నాకు తెలిసిన కొన్ని విషయాలు చెబుతాను.

పుచ్చలపల్లి సుందరయ్య 1913లో జన్మించారు. స్వగ్రామం నెల్లూరు జిల్లా అలగానిపాడు. చిన్నప్పుడే తండ్రి పోవడం వల్ల బావగారింట్లో వుండి చదువుకునేవారు. 1921-30 మధ్య ప్రైవేటు ట్యూషన్ చెబుతున్న టీచర్ వెంకటరత్నం గారి వాల్ల వీరికి తెలుగు బాష మీద అభిమానం పెరిగింది. దానిని అభివృద్ధి చేసుకోవటంతో భోగరాజు నారాయణ మూర్తి "విమలాదేవి", "రాయచూరు యుద్ధం", "తిమ్మరసు" మొదలైన చారిత్రక నవలలు చదవటంతో స్వాతంత్ర యోధుల మీద భక్తి శ్రద్ధలు ఏర్పడ్డాయి. వేమన పద్యాలు, సుమతీ శతకం కంటస్థం చేయటంతో సాంఘిక సమానత్వ భావాలంకురించాయి. నియమబద్ధ జీవితానికి పునాదులు ఏర్పడ్డాయి. రాజమండ్రి లో వీరి బావగారు సెషన్స్ జడ్జిగా వున్నప్పుడు 1924-25 లో పందిరి మల్లికార్జున రావు గారితో పరిచయం ఏర్పడింది. వారి సలహా అనుసరించి కొమర్రాజు లక్ష్మణరావు గారి భారతదేశ చరిత్ర గ్రంధాలు, చిలుకూరి వీరభద్రరావు గారి ఆంధ్రుల చరిత్ర , వీరేశలింగం, చిలకమర్తి లక్ష్మి నరసింహం గార్ల గ్రంధాలు చదవటంతో పై బావాలూ ధృడ పడ్డాయి.

1925లో చిత్తరంజన్ దాస్ మరణించారనే వార్త విని, కాంగ్రెస్ ను గురించి, అది నడిపే పోరాటాన్ని గురించి తెలుసుకోవాలని కుతూహులపడ్డారు. రోజూ ఆంధ్ర దినపత్రిక చదవటం ప్రారంభించారు. 1919 లో డయ్యరు సేనాని జలియన్ వాలాబాగ్ లో జరిగిన మారణ హోమాన్ని గురించి కాంగ్రెస్ విచారణ కమిటీ ప్రకటించిన రిపోర్ట్ తెలుగులో వెలువడింది. అది చదివి బ్రిటిష్ పాలనను ఏవగించుకోసాగారు . 1925 డిసెంబరు లో ఒక వ్యక్తిగత విప్లవవాద గ్రూప్ లో చేరారు. తరవాత గాంధీజీ ఆత్మకథ చదివారు. వారి సంపాదకత్వంలో వెలువడుతున్న "యంగ్ ఇండియా" వార పత్రిక కూడా చదవసాగారు. అప్పటి నుంచి ఖద్దరు ధరించడం ప్రారంభించారు. సాధ్యమైన, తక్కువ అవసరాలతో జీవితాన్ని నియబద్ధంగా గడపటానికి కృషి చేసారు. క్రమంగా ఇతర భావ తరంగాలు వీరి ఆలోచనల్ని పదును పెట్టాయి. 1926లో మద్రాసు లో నాలుగవ ఫారం చదువుతున్నప్పుడు సావర్కార్ జీవితాన్ని గురించి చదివి ఉత్తేజం పొందారు. భారతీయ సంస్కృతిపై పాశ్చాత్య దేశాల్లో అనేక ఉపన్యాసాలిచ్చిన స్వామి వివేకానంద రచనల్ని చదివి, స్వదేశాభిమానాన్ని, స్వయం శిక్షణను అలవరుచుకున్నారు. తిలక్ మాండలే జైల్లో రచించిన "గీతా రహస్యం" వీరికి కర్తవ్య ప్రభోధం చేసింది. "నేను చదువుకుంటున్న హైస్కూల్లో గీతా రహస్యం మీద నేనిచ్చిన ఉపన్యాసం విని విద్యార్థులు, ఉపాధ్యాయులు మెచ్చుకున్నారు అని ఒక ఇంటర్వ్యూ లో అన్నారాయన. 1927లో జవహరలాల్ నెహ్రూ రష్యా నుంచి తిరిగి వచ్చి, ఆ దేశంలోని సోషలిస్ట్ వ్యవస్థను గురించి ధారావాహికంగా రాసిన వ్యాసాలు వీరిలో మొట్టమొదటిసారిగా సోషలిస్ట్ బీజాలు నాటాయి. 1927లో మద్రాసు లో జరిగిన కాంగ్రేస్ మహాసభ సంపూర్ణ స్వాతంత్ర్యం తన ధ్యేయం అని తీర్మానించడం, మరుసటి సంవత్సరం మద్రాసు లో సైమన్ కమీషన్ కి వ్యతిరేకంగా జరిగిన హర్తాళ్, బహిరంగ సభ ఇవన్నీ సుందరయ్య గారిలో స్వాతంత్ర్యేచ్చను ఇనుమడింప చేసాయి.

ఆ రోజు వీరు హై స్కూల్ లో చదువుకుంటున్న విద్యార్థులూ హర్తాళ్ లో పాల్గొన్నారు. మద్రాసు లో చదువుకొంటున్న రోజుల్లో సుందరయ్య గారు ప్రతీ ఏడాది వేసవి సెలవుల్లో స్వగ్రామం వెళ్ళేవారు. అలా వెళ్ళినప్పుడల్లా స్వంత పొలంలో కూలీలతో కలసి వ్యవసాయ పనులు చేసేవారు. స్కూల్ ఫైనల్ పాసయ్యాక 1929లో వీరు మద్రాసు లయోలా కాలేజ్ లో ప్రవేశించారు. ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడు కొంతమంది తెలుగు విధ్యార్థులతో కలిసి సోదర సమితిగా ఏర్పడి వ్యాయామం, గ్రంధ పటనం, ఖద్దరు విక్రయం మొదలైన కార్యక్రమాల్లో పాల్గొనేవారు. బొంబాయి నుండి వెలువడే యంగ్ లిబెరేటర్ పత్రికకు ఇతరులతో కలిసి చందాదారులను చేర్పించారు. అప్పుడే ' 'కమ్యూనిస్ట్ ప్రణాళిక', 'కూలిపని- పెట్టుబడి' మొదలైన మార్క్సిస్టు గ్రంధాలు కూడా చదివారు. ఆనాటి నుండి కమ్యూనిస్ట్ ఉద్యమంలో పనిచేయటానికి నిశ్చయించుకున్నారు. భారత జాతీయ పోరాటంలో పాల్గొన్న తెలుగు ప్రముఖుల్లో శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య గారు ఒకరు. కాంగ్రెస్, సోషలిస్ట్ పార్టీలలోని కొందరి నేతలతో కలిసి దక్షిణ భారతదేశం లో కమ్యూనిస్ట్ పార్టీ ని నిర్మించారు. పార్లమెంటుకి అయినా, శాసనసభకయినా సైకిల్ పైనే వెళ్ళేవారు. పెళ్లి చేసుకున్నప్పటికీ, పిల్లలు పుడితే ప్రజా ఉద్యమానికి సమయాన్ని కేటాయించలేనేమోననే ఆలోచనతో, సంతానం వద్దనుకున్నారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందినప్పటికీ తన పేరు చివర ఏనాడూ 'రెడ్డి' అని పెట్టుకోలేదు. వర్ణ వివక్షను వ్యతిరేకిస్తూ ఎప్పుడూ సహపంక్తి భోజనాలు చేసేవారు. మీరట్ జైల్లో ప్రారంభమయిన కమ్యూనిస్ట్ కుట్ర కేసు విచారణను గురించిన వార్తలు ప్రతీరోజు పత్రికల్లో వెలువడుతుండేవి. ఆ కేసులో ముద్దాయిలు ప్రాసిక్యూషన్ చెప్పే అబద్దాలకు గూబగుయ్యిమనేటట్లు జవాబులు చెప్పటం తమ ధ్యేయాన్ని గురించి, విధానాన్ని గురించి నిర్మొహమాటంగా బల్ల గుద్ది చెప్పటం ఇవన్నీ సుందరయ్య గారి ఆలోచనల్ని పదును పెట్టాయి.

ఒక రోజున విద్యార్థి గాంధీ టోపీతో క్లాస్ కి వచ్చి కూర్చున్నాడు. అది చూసి ఒక కాథలిక్ ప్రొఫెసర్ ఆ విద్యార్థిని బయటికి పంపించేసాడు. మరునాడు విద్యార్థులందరూ గాంధీ టోపీ లతో క్లాసు కి ప్రత్యక్షం, అది చూసి ప్రొఫెసర్ క్లాసు ని సస్పెండ్ చేసాడు. వాతావరణం ఉద్రిక్తంగా ఉంది. సోదర సమితి సభ్యులు ఇతర విద్యార్థులతో చేతులు కలిపి, సమ్మెకు పిలుపునిచ్చారు. ఇదంతా గమనిస్తున్న ప్రిన్సిపాల్ తెలివిగా, నోటీసు బోర్డులో ఎవరికీ తోచిన టోపీలు వాళ్ళు ధరించవచ్చని ప్రకటించాడు. విద్యార్థులకు ఇదొక ఘన విజయం.

ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుండగా, సుందరయ్య అలగానిపాడు వెళ్ళారు. అక్కడ వ్యవసాయ కార్మికులతో పనిచెయ్యటానికి 1930 వేమన జయంతి నాడు అవర్ణులకు, సవర్ణులకు కలిపి పంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. సవర్ణులు సుందరయ్యగారికి దగ్గర బంధువులు దీనిని సహించలేక హరిజనులని రానీకుండా ఆపుచేసారు. భూస్వాముల ఈ చర్యను అసమ్మతిగా సుందరయ్య రెండు రోజులు నిరాహారవ్రతం చేసారు. అది పేద ప్రజలలోనూ, హరిజనులలోనూ ప్రత్యేక అభిమానం కలిగించింది. నిరాహార దీక్ష పూర్తికాగానే సోదర సమితి పిలుపు మీద ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొనటానికి పశ్చిమగోదావరి జిల్లా వెళ్లారు. భీమవరం తాలూకాలో రెండు చోట్ల చట్ట ధిక్కారం చేశారు. దిరుసుమర్రు వాలంటీర్ శిబిరానికి వచ్చి, అక్కడ వాలంటీర్ కెప్టెన్ గా పనిచేసారు. చట్టధిక్కరానికి పాల్పడినాడని భీమవరం సబ్ కలెక్టర్ 1930 జూన్ 16న సుందరయ్య గారికి రెండేళ్ళు కఠిన శిక్ష విధించినారు. వీరికప్పుడు 17 ఏళ్లు మాత్రమే. మైనరు కావడం చేత తంజావూరులో బాల నేరస్తుల్ని నిర్బంధించే బోర్డర్స్ జైలుకు పంపించారు. ఆ జైల్లో పరిస్థితులు అతి నికృష్టంగా ఉండడం చూసి మరికొందరితో కలిసి నిరాహార వ్రతం చేశారు. అయిదో రోజున జైలు వార్డర్లు ఇనుప పట్కారుతో నోటిని తెరిచి గొంతులో గంజిపోశారు. తరువాత 24 గంటలూ ఒంటికోట్లో నిర్బంధిచారు. రెండు నెలల తరువాత తిరుచినాపల్లి జైలుకి మార్చారు. తిరిగి తంజావూరు బోర్డర్స్ జైలుకి మార్చారు. అక్కడ మళ్ళీ నిరాహారదీక్ష ప్రారంభించడం వల్ల రాజమండ్రి జైలుకు మార్చారు. ఆ జైల్లోని ఇతర రాజకీయ ఖైదీలతో రష్యా విప్లవాన్ని గురించి, అలాంటి విప్లవాన్నే మన దేశంలో కూడా నడపడం గురించి చర్చలు జరిపెవారు. రాజమండ్రి జైలులో లాహోర్ కుట్రకేసు ఖైదీలు శివవర్మ, విజయకుమార్ సిన్హాలతో వీరికి పరిచయమైంది. వారిది హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ ఆర్మీ, సోషలిజం సాధనకై వ్యక్తిగత విప్లవాద చర్యలను చేపట్టినవారు. అయితే గాఢమైన దేశభక్తి, అపారమైన ధైర్య సాహసాలు గలవారు. అదే సమయంలో తమ ఉద్యమంలో ద్యోతకమైన బలహీనతలు, అజాగ్రత్త వల్ల కలిగిన నష్టాలు కూడా వారు వివరించారు. ఆ సమయంలో సుందరయ్య గారికి ఎంతగానో తోడ్పడింది. శివవర్మ తన విప్లవ జీవితంలో ఎలా రహస్యంగా పనిచేసింది, జరిగిన పోరబాట్లు, విప్లవకారుల్లోని ధైర్యసాహసాలు అన్నీ వర్ణించి చెప్పేవారు.

శిక్షాకాలం పూర్తి కాకముందే సుందరయ్యగారు గాంధీ - ఇర్విన్ ఒడంబడిక ప్రకారం 1931 మార్చి 20వ తేదీన విడుదలయ్యారు. అప్పుడు వీరి బావగారు బెంగుళూరులో సెషన్స్ జడ్జిగా ఉండేవారు. అక్కడ సెయింట్ జోసెఫ్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరంలో ప్రవేశించారు. సుందరయ్య గారి కార్యకలాపాలను గురించి విని అమీర్ హైదర్ ఖాన్ 1931లో ఆయనను కలుసుకోవడానికి వెళ్ళారు. తనను కమ్యూనిస్టుగా పనిచేయమని సలహా ఇచ్చారు. తాను బి.ఎ పూర్తి చేస్తానని తల్లికి మాట ఇచ్చానని, అది పూర్తికాగానే తన కాలాన్ని కమ్యునిస్టు ఉద్యమంలో గడుపుతానని చెప్పారు. కానీ బెంగుళూరులో 1931లో ఆరుమాసాలు మాత్రమే చదివి, ఆ చదువు వల్ల ప్రయోజనమేమి ఉండదనుకొని చదువుకు స్వస్తి చెప్పి తిరిగి అలగానిపాడు వెళ్లారు. ఒకరోజున నెల్లూరు నుంచి వీరెరిగిన దువ్వూరి బలరామిరెడ్డి, చుండి జగన్నాధం, మరికొందరు అలగానిపాడు వచ్చారు.

వీరు స్వాతంత్ర్యోద్యమంలో జైళ్ళకు వెళ్లి, విడుదలై వచ్చాక వ్యక్తిగత విప్లవవాదాన్ని చేపట్టినవారు. సుందరయ్య గారిని కూడా తమ వెంట తీసుకుపోవాలనుకొని వచ్చారు. వీరి మధ్య దీర్ఘ చర్చలు జరిగాయి. వ్యక్తిగత విప్లవవాదం సరైనది కాదని ఎంత వాదించినా వారు వినలేదు. చివరకు వారు లాభం లేదని తిరిగి వెళ్ళిపోయారు. అంతకు రెండేళ్ళు ముందే సుందరయ్య గారికి వ్యక్తిగత విప్లవవాదం పట్ల నమ్మకంపోయింది.

సుందరయ్య వాడిన వస్తువులు, పుస్తకాలు హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉన్నాయి. కార్మికులను విపరీతంగా ప్రేమించే సుందరయ్య పుట్టిన రోజు కార్మిక దినోత్సవం కావడం యాదృచ్ఛికం. నా చిన్నతనంలో, ఆయనను గురించి అనేక విషయాలను ఆసక్తిగా వినేవాడిని. ఒక మిత్రుడు తన కలకత్తా అనుభవాలను గురించి ఇలా చెప్పాడు. ఒక పార్క్ దగ్గర అశేష జనసంద్రం. ఇళ్ల పైన, చెట్ల పైన, గోడలమీద నిలబడి ప్రజలు ఉత్సాహంగా ఒక ఉపన్యాసం శ్రద్ధగా వింటున్నారు. ఆ ప్రసంగించే వ్యక్తి శ్రీ సుందరయ్య గారు. ఆయన గొప్ప వక్త కాదు. సామాన్య ప్రజలను ఆకట్టుకునే విధంగా ప్రసంగించటం ఆయనకు చేత కాదు. ఎందుకంటే, ఆయనది 'ఊక దంపుడు' ఉపన్యాసం కాదు, పూర్తి సైద్ధాంతిక ఉపన్యాసం. అయినా, అంత మంది ప్రజలు ఆయన కోసం వచ్చారంటే ప్రజలకు ఆయన మీద ఉన్న అభిమానమే కారణం. ఒక తెలుగు తేజం వంగ దేశంలో తన వెలుగులు విరజిమ్ముతుంటే, ఆ విషయం విన్న నేను ఒక ఆంధ్రుడిగా పులకించి పోయాను. అదే సుందరయ్య గారి ఉపన్యాసం వినటానికి ఆయన సొంత గడ్డ అయిన ఆంధ్రదేశంలో పట్టుమని వందలలోనే జనం ఉంటారు. నేనెక్కడో చదివినట్లు నాకు గుర్తు -- కలకత్తాలో స్కూల్ విద్యార్థులకు drawing పరీక్ష జరుగుతుందట. ప్రశ్నా పత్రంలో 'ఇల్లు' బొమ్మ వెయ్యమని ఒక ప్రశ్న ఉందట. ప్రతి విద్యార్థి ఇల్లు బొమ్మ వేశాడు. అందులో విశేషమేమి లేదు! అయితే ప్రతి విద్యార్థి వేసిన ఇంటి బొమ్మ గోడ మీద 'సుత్తి-కొడవలి' బొమ్మ ఉంది. అదీ! సుందరయ్య గారి ప్రతిభ! చిన్న పిల్లల మనసులలోకి సైతం మార్క్సిస్ట్ సిద్ధాంతాలను నాటుకొని పోయేటట్లు చేయటం! జాతీయస్థాయి రాజకీయాలను ప్రభావితం చేసిన అటువంటి మహనీయునికి, ఆంధ్రదేశంలో తగిన గుర్తింపు రాలేదు. కార్మిక, కర్షక పోరాటాలను నడపడమొక్కటే స్వాతంత్ర సాధనకు మార్గమని ఆయన నమ్మారు. కొన్నాళ్ళ తరువాత అలగానిపాడు విడిచిపెట్టి ఎక్కడెక్కడ కమ్యునిస్టు ఉద్యమ నిర్మాణానికి అవకాశాలున్నాయో కనుగొనడానికి 1933-34 మధ్య ఆంధ్ర జిల్లాలు పర్యటించారు. శ్రీశ్రీ గారు ఎక్కడో ఇలా అన్నారు -- 'ఆంధ్రదేశంలో నువ్వు గొప్పవాడివి కావాలంటే, చచ్చిపో!' అని. చనిపోయిన తర్వాత కూడా ఆ మహనీయుని గొప్పతనం గుర్తించలేని 'ఆంధులం' మనం. పనికిరాని ప్రతి వారికీ శిలా విగ్రహాలు ఉన్నాయి! ఈ మహనీయునికి స్మారక చిహ్నాలను కూడా ఏర్పాటు చేసుకోలేని దౌర్భాగ్యులం మనం!

పొరుగు రాష్ట్రీయులైన తమిళ సోదరులు, పార్టీలతో నిమిత్తం లేకుండా, మహనీయుల పేర విగ్రహాలు, స్మారక మందిరాలు నిర్మించుకుంటారు.

అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన ఆ మహనీయుని నిస్వార్ధ సేవకు లాల్ సలాం చేస్తూ ఘనమైన నివాళి సమర్పించుదాం!

శ్రీ ఆరుద్ర గారు సుందరయ్య గారి దివ్యస్మృతికి సమర్పించిన 'బాష్పాంజలి' (సుందరయ్య మరణవార్త తెలియగానే స్పందించి

రాసిన కవిత)

జోహరు కామ్రేడు సుందరయ్య

జోహరు కామ్రేడు సుందరయ్య

నీలాంటి త్యాగజీవు లెందరయ్యా

అగ్రగామిగా నీవే ఉందువయ్యా

అంధ్రలోన పార్టీకి తండ్రివయ్యా

ప్రజారాజ్య స్థాపన నీ ధ్యేయమయ్యా

జగతి శక్తికి నీవు స్నేహమయ్యా

శ్రమజీవులు నిన్నెప్పుడూ మరువరయ్యా

సామ్యవాద సిద్ధాంతము విడువమయ్యా

నింగిలోన మన జెండా ఎగురునయ్యా

నేలమీద సమవృక్షం పెరుగునయ్యా

కలకాలం నీ బోధనలు తలతుమయ్యా

కన్నీటి వీడ్కోలు అందవయ్యా

జోహారు కామ్రేడు సుందరయ్య!!!

*************************************************




సుశాస్త్రీయం - రాజీవలోచన రాజసులోచన! - టీవీయస్.శాస్త్రి

sushasthreeyam - Raja Sulochana

అలనాటి మేటి నటి,నాట్యకళాకారిణి శ్రీమతి రాజసులోచన 05-03-2013న చెన్నైలోతన 78 వ ఏట తుదిశ్వాస విడిచారు. కొద్దికాలంగా ఈమె శ్వాసకోశాలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నారు. పలు భాషా చిత్రాలలో నాటి మేటి కధానాయకులైన ANR,NTR,MGR ల వంటి వారి సరసన కధానాయిక పాత్రలను పోషించిన ఈ అందాల తార నింగికేగింది. ఈమె జీవిత విశేషాలను క్లుప్తంగా వివరిస్తాను.

15 ఆగస్టు, 1935 న, విజయవాడలో జన్మించిన రాజసులోచన బాల్యం నుంచి మద్రాసులోనే పెరిగారు. తల్లి, తండ్రులు దేవకమ్మ, భక్తవత్సలం గార్లు. ఆచార వ్యవహారాల ఇంట పెరిగిన ఆమెకు సంగీతం, ఫిడేలు వంటి వాటిల్లో ప్రవేశం ఉన్నా, నృత్యమంటేనే ఎంతో మక్కువ! తన పదవ ఏటనుంచే డాన్స్ నేర్చుకోవడం మొదలు పెట్టారు. తాను నేర్చుకున్నది చుట్టుపక్కల ఆడపిల్లలకు నేర్పేవారు. ఎక్కడ అవకాశం లభించినా నాట్య ప్రదర్శన లిచ్చేవారు. ప్రసిద్ధ కూచిపూడి నాట్యగురువులు వెంపటి పెద సత్యం, పసుమర్తి కృష్ణమూర్తి, చినసత్యం, జగన్నాధ శర్మ మొదలైన వారి శిక్షణలో రాజసులోచన నాట్యం ఆమె నటించిన సినిమాకే

కలికితురాయిలా ఉండేది. భరత నాట్యం, కూచిపూడి, కధక్, కధాకేళి వంటి నాట్య కళలో శిక్షణను పొందారు. దేశ విదేశాలలో పలు నృత్య ప్రదర్శనలను ఇచ్చారు. అమెరికా, చైనా, జపాన్, శ్రీలంక , రష్యా, సింగపూర్ వంటి దేశాలలో ప్రదర్శనలిచ్చారు.


రాజసులోచన ఇచ్చిన నాట్య ప్రదర్శనలతోనే ఆమెకు సినిమాలలో నటించే అవకాశం వచ్చింది. కన్నడ సినిమా 'గుణసాగరి'లో తొలి సారిగా నటించినా, తమిళం చిత్రం 'సత్యశోధనై' రెండవ చిత్రం అయినా తెలుగులో 'కన్నతల్లి(1953)' సినిమాతో తన నట జీవితం మొదలు పెట్టారు. అందులో చిన్న పాత్రలో కనిపించిన వీరు 'సొంతవూరు' సినిమాతో కధానాయిక పాత్రలు వేయడం మొదలు పెట్టారు. అప్పటి నుంచి ఆమె ఎన్నో చిత్రాలలో కధానాయికగా నటించి ఆ చిత్ర విజయాలకి కారణమయ్యారు. ఎన్నో చిత్రాలు వందరోజులు ఆడాయి. నిర్మాతలకి కాసుల వర్షమూ కురిపించాయి.ఆమె నటించిన చిత్రాలలో 'రాజమకుటం' లోని సడిసేయకోగాలి... సడిసేయబోకే .. పాట నేటికీ సంగీతప్రియుల మనసులో మల్లెలు పూయిస్తుంది. జానపద ఇతి వృత్తంగల ఆ సినిమా ఆర్ధికంగా పెద్దగా విజయం సాధించక పోయినా రాజసులోచన గారి నటన, యన్. టి. రామారావు గారి నటన, బియన్ రెడ్డి గారి దర్శకత్వ ప్రతిభ ఆ చిత్రాన్ని వెండితెరపై స్థిరస్థాయిగా నిలిచేలా చేసింది.

ప్రముఖ సినీ దర్శకులు సియస్.రావుతో 1963లో వివాహం జరిగింది. వీరికి సంతానం - ఇద్దరు అమ్మాయిలు(వాళ్ళూ నృత్యకారిణులే!), ఒక అబ్బాయి. దాదాపు 300 చిత్రాలలో నటించిన ఆమె, చివరగా నటించిన సినిమా, లోటికోడళ్ళు (కొత్తది). తమిళ , కన్నడ, మళయాళం, మరియూ మరికొన్ని ఇతర బాషల సినిమాలలో కూడా నటించారు. సితారోంసే ఆగే, చోరీ చోరీ, నయా ఆద్మీ మొదలైన హిందీ సినిమాలలో కూడా నటించారు. ఆమె తెలుగులో నటించిన విజయవంతమైనవి, మరపురానివి కొన్ని--- కన్నతల్లి, సొంతవూరు, పెంకి పెళ్ళాం, లోడి కోడళ్ళు (పాతది), పాండవ వనవాసం, సారంగధర, పెళ్ళినాటి ప్రమాణాలు, మాంగల్యబలం, రాజమకుటం, శాంతినివాసం, టైగర్ రాముడు, జయభేరి, వాల్మీకి, వెలుగునీడలు, తిరుపతమ్మకధ, బభ్రువాహన, తాతామనవడు, లోడికోడళ్ళు (కొత్తది)...ఇలా చెప్పుకుంటూ పోతే ఈ జాబితాకు అంతే ఉండదు.

ఆమెతో నటించిన నటీనటులలోఐదుగురు ముఖ్యమంత్రులు ఉండటం విశేషం. అంతే కాకుండా అన్నాదురై, కరుణానిధి, యం.జి.ఆర్, జయలలిత, యన్.టి.రామారావు మొదలైన ముఖ్యమంత్రుల హయాంలో 'నృత్యరూపకాలను' రూపొందించి, నృత్య ప్రదర్శనలు ఇచ్చింది. ఆమె నాట్యం చేసిన పాత్రలలో ,వెలుగునీడలు సినిమాలో 'పాడవోయి భారతీయుడా' అంటూ ఆమె చేసిన నృత్యం, అలానే పాండవ వనవాసంలో ఆమె నృత్యాభినయం నేటికీ నా కళ్ళముందు మెదులుతున్నాయి. 'పుష్పాంజలి'అనే నృత్య కళా కేంద్రాన్నిస్థాపించి అనేకమందికి నాట్యంలో శిక్షణను ఇచ్చారు.

దివికేగిన ఈ 'రాజీవలోచనకు' నా ఘనమైన నివాళి!

*********************************************




సుశాస్త్రీయం - తెలుగు భాషోద్ధారకుడు శ్రీ చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ - టీవీయస్.శాస్త్రి

Charles Philip Brown

UNESCO వారు ప్రపంచం మొత్తం మీద 13 బాషలు మృతభాషలుగా మారే ప్రమాదముందని గుర్తించారు. త్వరలో తెలుగు బాష కూడా ఆ జాబితాలో చేరే అవకాశాలున్నాయని విశ్లేషకుల అంచనా!మాతృభాష మృతభాష కాకుండా కాపాడుకోవటం మన ధర్మం,కర్తవ్యం. మనిషిగా పుట్టినందుకు మనం ముఖ్యంగా ముగ్గురి ఋణాలను తీర్చుకోవాలి.

ఒకటి-జన్మనిచ్చిన తల్లి,రెండు-పుట్టిన గడ్డ,మూడవది- బావవ్యక్తీకరణకు బాసటగా నిలచిన మాతృబాష ఋణాన్ని! ఉగ్గుపాలతో నేర్చుకున్న భాషను మాట్లాడటానికి సిగ్గుపడే ప్రబుద్ధులున్న బిడ్డలను కన్న తెలుగుతల్లి దీనస్థితి చూస్తే బాధ వేస్తుంది. ప్రపంచ తెలుగుమహాసభలు జరిపి, చేతులు దులుపుకోవటం ప్రభుత్వానికి అలవాటుగా మారింది. సభలలో సరైన నిర్ణయాలు తీసుకోరు, తీసుకున్న నిర్ణయాలను కూడా సరిగా అమలుపరచరు. ప్రాచీన హోదా పొందిన ఈ తెలుగు భాషకు పరాయి గడ్డమీద పుట్టిన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ లాంటి వారు ఈ మధురమైన భాషను నేర్చుకొని, దాని అభివృద్ధికోసం వారి జీవితాన్నే అంకితం చేసిన విధానాన్ని చూస్తే, అటువంటి మహనీయునికి మన తెలుగు జాతి యావత్తు ఋణపడి

ఉండిందనటంలో ఏ మాత్రం సందేహం అవసరం లేదు.

తెలుగు భాషా సేవకుడైన C.P. బ్రౌన్ గారిని గురించిన కొన్ని విషయాలను తెలుసుకొని వారిని స్మరించుకోవటం మన కనీస ధర్మం! చార్లెస్ ఫిలిప్ బ్రౌన్,1798 నవంబర్ 10న కలకత్తాలో జన్మించాడు. ఈయన తండ్రి డేవిడ్ బ్రౌన్ పేరొందిన క్రైస్తవ మతప్రచారకుడు,నియమబద్ధమైన జీవితాన్ని గడిపిన వాడు.C.P.బ్రౌన్ చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయారు. ఆ తర్వాత C.P.బ్రౌన్ తల్లితో ఇంగ్లండు వెళ్ళిపోయాడు. C.P.బ్రౌన్ కు చిన్నతనం నుండి భారతీయ భాషలమీద మక్కువ ఎక్కువ. ఆ మక్కువతోనే ఇంగ్లండులో ఉన్నప్పుడే హిందుస్థానీ భాషను నేర్చుకున్నారు. కొంతకాలం తరువాత, మద్రాసులో 1817 ఆగష్టు 4 న,ఈస్ట్ ఇండియా కంపెనీలో ఉద్యోగిగా చేరాడు. ఆ రోజుల్లోనే తెలుగు భాషను నేర్చుకోవాలనే మక్కువ కలిగింది. ఒక మంచి ఉపాధ్యాయుని సహాయంతో తెలుగు భాషలో కొంతవరకు పరిచయాన్ని పెంచుకున్నారు.ఆయన తెలుగు నేర్చుకుంది ఉద్యోగ బాధ్యతలో ఒక భాగంగానే! అయితే, క్రమేపీ తెలుగు భాషలోని తియ్యదనం ఆయనను అమితంగా ఆకర్షించింది.1820 ప్రాంతంలో, ఆంధ్రదేశంలోని ఒక మారుమూల ప్రాంతమైన కడపలో డిప్యూటీ కలెక్టరుగా చేరాడు.ఆ ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలంటే, ప్రజలతో మమేకం కావాలి.వారి కష్ట సుఖాలను గురించి తెలుసుకోవాలంటే, తెలుగు భాషమీద పట్టు సాధించాలి. ఆయనకు ముందు పనిచేసిన ఉద్యోగులు, అనువాదకుల ద్వారా పదవిని నిర్వహించేవారు. అనువాదంలో మూలానికి అన్యాయం జరిగే ప్రమాదముందని గ్రహించి,ఇష్టపడి,కష్టపడి తెలుగు భాషను ఆసాంతం నేర్చుకోవటానికి సంసిద్ధుడయ్యాడు బ్రౌన్.


భాష నేర్చుకోవటానికి ఆయన ఎదుర్కొన్న ఇబ్బందులే, ఆయనను తెలుగు భాషా పరిశోధకుడిగా మార్చాయి. ఉద్యోగ రీత్యా ఈయన మచిలీపట్నం, గుంటూరు, చిత్తూరు, తిరునల్వేలి లాంటి ప్రదేశాలలో పనిచేసి, రెండవసారి అనగా 1826 లో మరలా కడపకు తిరిగివచ్చి, అక్కడే స్థిరపడ్డారు. ఇన్ని ప్రాంతాలను తిరగటం వలన, ఒక్కొక్క ప్రాంతంలో ఉండే మాండలికాలాను, భాషలోని తేడాలను, ఒకే మాటకు వివిధ ప్రాంతాలలో ఉన్న విభిన్న అర్థాలను పూర్తిగా ఆకళింపు చేసుకున్నాడు. వీటినన్నిటినీ దృష్టిలో ఉంచుకొని, తెలుగులో మొట్టమదటి నిఘంటువును ప్రచురించింది వీరే! నేటికీ మన పండితులందరు కూడా దీనినే ప్రామాణికంగా తీసుకుంటున్నారు .అంతేకాకుండా వారి పేరు మీద 'బ్రౌణ్యం' అనే పదం కూడా ఏర్పడింది. బ్రౌన్ చెప్పిందే 'బ్రౌణ్యం'! అలానే, ఒక వ్యాకరణ గ్రంధాన్ని కూడా వెలువరించారు.

ఆనాటి పండితుల సహాయాన్ని తీసుకొని తెలుగులోని చాలా ప్రాచీన గ్రంధాలను,కావ్యాలను అందరికీ అర్థమయ్యే విధంగా పరిష్కరించారు.దీనికోసం ఎంతోమంది పండితులను పోషించారు. విశేషమేమంటే, ఇదంతా తన సొంత ధనంలోనే నిర్వహించారు. పేదప్రజలకు ధన సహాయం చేసేవాడు. ఆయనలోని ధార్మిక దృక్పథం, పుస్తక ప్రచురుణలకు అయిన ఖర్చులవలన బ్రౌన్ ఆర్థికంగా దెబ్బతిన్నాడు. అప్పులు కూడా చేసాడు. ఈస్ట్ ఇండియా కంపెనీ వారికి ఇతని ధోరణి నచ్చక,1834 లో ఉద్యోగం నుండి తీసివేసారు. మరలా కొంతకాలం తరువాత, కంపెనీ వారికి పర్షియన్ అనువాదకుడిగా, 1837లో ఇండియాకు వచ్చాడు. నిజానికి అది ఒక మిష మాత్రమే! అసలు కారణం,ఆయనకు భారతదేశపు సంస్కృతి, భాషలపట్ల వ్యామోహం తీరకపోవటం వలన ఏదో ఒక రూపంలో ఈ దేశానికి వచ్చి తెలుగు భాషకు నూతన జవసత్వాలను తేవటం! అలా వచ్చిన ఆయన, అనుక్షణం తెలుగు భాష అభివృద్ధికోసం అహోరాత్రులు కృషిచేసాడు.

తేటతెలుగుకవి వేమన పద్యాలకు వెలుగు చూపించాడు. తెలుగువారికొక మంచి నీతిశతకం లభ్యపడటానికి కారకులయ్యారు. వేమన పద్యాలుగా చెప్పబడే 1164 పద్యాలను పరిష్కరించి ప్రచురించాడు. నలచరిత్ర, వసుచరిత్ర, పల్నాటి వీరచరిత్ర, ఆంధ్రమహాభారతం, శ్రీమద్భాగవతాలను కూడా ప్రచురించాడు. ఉద్యోగ బాధ్యతలు ఒక వైపు, తెలుగు భాషా సేవ మరొకవైపు - ఇలా సాగింది ఆయన జీవితం. ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వహించలేదనే విమర్శలను ఎదుర్కొన్నాడు.1854 లోఉద్యోగ బాధ్యతల నుండి విముక్తుడైన తరువాత, 1865లో లండన్ యూనివర్సిటీలో తెలుగు ప్రొఫెసరుగా పనిచేసారు. లండన్ నుండి ఆయన ఇండియాలోని భాషా ప్రేమికులతో తెలుగులో ఉత్తర ప్రత్యుత్తరాలను కొనసాగించారు. ఈ మహనీయుడు తెలుగు భాషకు చేసిన సేవను గురించి, ప్రఖ్యాత సాహితీ పరిశోధకుడు స్వర్గీయ శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రి గారు ఇలా అన్నారు, "ఆంధ్రభాషోద్ధారకులలో కలకాలము స్మరింపదగిన మహనీయుడు, మహావిద్వాంసుడు సి.పి.బ్రౌను" మరొక సాహితీ పిపాసి, పరిశోధకుడు అయిన స్వర్గీయ కొమర్రాజు లక్ష్మణరావు గారు, బ్రౌన్ ని గురించి ఈ విధంగా చెప్పారు, "సి.పి.బ్రౌను అనునాతడు ఆంధ్రభాషామతల్లి సేవకే జన్మమెత్తినట్లు కానవచ్చుచున్నది. ఇతడు ఆంధ్ర వాఙ్మయాభివృద్ధికి చేసినంతటి పని ఇటీవలి వారెవ్వరూ చేయలేదని చెప్పిన అతిశయోక్తి కానేరదు" తెలుగు భాషా సేవకోసం ఆజన్మ బ్రహ్మచారిగా ఉన్న ఈ మహనీయుడు,1884 డిసెంబర్ 12న, లండన్ లో తన 86 వ ఏట మరణించారు. ఆయనకు స్మృతి చిహ్నంగా కడపలో ఆయన నివాసమున్న గృహంలోనే ఒక గ్రంధాలయాన్ని ఏర్పాటు చేసారు. కానీ, నిధుల కొరత వలన అది సరిగ్గా నడవటం లేదనే విమర్శలు వినవస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు C.P. బ్రౌన్ అకాడెమీ అనే సంస్థను, తక్కువ ధరలో కొన్ని మంచి పుస్తకాలను ప్రచురించి తెలుగు సాహిత్యాన్ని ప్రతి ఇంటికి చేరువ చెయ్యాలనే సదుద్దేశ్యంతో నెలకొల్పారు. అది కూడా నిధుల కొరతతో కొట్టుమిట్టాడుతుంది. నేను ఈ మధ్య ఒక పుస్తకంకోసం ఆన్ లైన్ లో ఆర్డర్ ఇద్దామని ప్రయత్నించి విఫలుడనయ్యాను. దాని వెబ్ సైట్ నిర్వహణ కూడా సరిగా లేదు. మరీ దారుణం ఏమిటంటే, పుస్తకం విలువకు, పోస్ట్ ఖర్చులకు సరిపోయే మొత్తాన్ని చెక్కుద్వారా కొరియర్ లో పంపితే,ఆ చిరునామాలో అకాడెమీ లేదని నా లేఖ తిరిగి వచ్చింది. వెబ్ సైట్ లో కనీసం మారిన చిరునామాను కూడా సవరించలేని దీనస్థితిలో ఉంది ఆ అకాడెమీ. భాగ్యనగరంలో వీధి రౌడీలకు కూడా శిలావిగ్రహాలు ఉన్నాయి. కానీ, ఈ మహనీయుని శిలావిగ్రహాన్ని ప్రధాన కూడలి ప్రాంతంలో ఏర్పరచకపోవటం అనేది మన బాధ్యతారాహిత్యం, అవిధేయత, కృతఘ్నతా భావం అని నిస్సందేహంగా చెప్పవచ్చు. మన భాషకు ఇంత సేవ చేసిన మహనీయుని పట్ల మనం చూపించవలసిన కృతజ్ఞత ఇదేనా? అసలు ఈ వ్యాసానికి మొదట 'తెలుగు భాషా సేవకుడు శ్రీ చార్లెస్ ఫిలిప్ బ్రౌన్' అనే మకుటాన్ని ఉంచాను. భాషకు సేవ చేయవలసిన మనం భాషను ఉద్ధరించినట్లు బడాయిలు చెప్పుకోవటం చూసి,వ్యాసానికి 'తెలుగు భాషోద్ధారకుడు శ్రీ చార్లెస్ ఫిలిప్ బ్రౌన్' అనే మకుటాన్ని ఉంచాను. ఈ వ్యాసం ప్రేరణతో నైనా ,మాతృభాషను మృత భాషను కానివ్వకండి! తెలుగు భాషోద్ధారకుడు శ్రీ చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ కు స్మృత్యంజలి!

**********************************************




సుశాస్త్రీయం - అపర భగీరధుడు సర్ ఆర్థర్ కాటన్ దొర - టీవీయస్.శాస్త్రి

Arthur Cotton

ఏమాటకి ఆమాటే చెప్పుకోవాలి ! తెలుగు వాడికి ఒక మంచి సుగుణం ఉంది.'అన్నదాత'ను మరచిపోడు. మరచిపోకపోవటమే కాదు,వీలున్నప్పుడల్లా స్మరించుకుంటాడు.పోయినసారి గోదావరీ పుష్కారాలకి వెళ్ళినపుడు,అక్కడి పురోహితులు,అర్ఘ్యాలు విడిపించేటప్పుడు --ఒక చక్కని శ్లోకం చెప్పి నా చేత అర్ఘ్యం విడిపించారు.ఆ శ్లోకం ఈ విధంగా ఉంది---

"నిత్య గోదావరీ స్నాన పుణ్యదో

యో మహామతిహి:

స్మరా మ్యాంగ్లేయ దేశీయం

స్మరామి ఆంగ్లేయ

కాటనుం తం భగీరధం!

(మాకు గోదావరీ స్నాన పుణ్యాన్ని ప్రసాదించిన,అపర భగీరధుడు,ఆంగ్ల దేశానికి చెందిన కాటన్ గారికి నిత్యం స్మరించి తరిస్తున్నాము.)

ఈ శ్లోకం ప్రవచించిన మహానీయులెవరో ఇంతవరకు తెలియదు. కానీ,గోదావరీ నదీ వాసులు చాలామంది నేటికీ ఈ శ్లోకం చెప్పి కాటన్ దొరగారికి అర్ఘ్య ప్రధానం చేస్తూనే ఉన్నారు.ఒక సారి కాటన్ దొరగారు రాజమండ్రిలో పడవ ఎక్కుతుండగా,రేవులో ఈ శ్లోకం వినపడి--'కాటన్' అన్న మాట దొరగారి చెవిన పడిందట.దొరగారు,ఆయన అనువాదకుడి వైపు చూసి,పడవ దిగి సంకల్పం చెప్పుకుంటున్న ఆ బ్రాహ్మణుడిని--దాని అర్ధం గురించి అడిగి రమ్మని అన్నారట.ఆ బ్రాహ్మణుడు, అనువాదకునికి ఆ శ్లోకం అర్ధం వివరించి చెప్పి,అటువంటి భూసురిడిని (భూమి పై తిరిగే దేవుడు అనే అర్ధం)నిత్యం తలచుకుంటామని చెప్పాడట."ఆ దేవుడు మరెవరో కాదు,పడవలో ఉన్న ఆ కాటన్ దొరగారే!",అని ఆ అనువాదకుడు ఆ బ్రాహ్మణుడికి చెప్పగానే,ఆ బ్రాహ్మణోత్తముడు రేవులోకి పోయి దొరగారికి వందనం చేసాడట.దొరగారు సంతోషించి,ఆ బ్రాహ్మణుడికి పది రూపాయలు దక్షిణగా ఇచ్చి సత్కరించారట.

ఆ రోజుల్లో పది రూపాయలు అంటే వందేళ్ళ నాటి ధరల ప్రకారం,ఒక కుటుంబానికి నాలుగు మాసాలు సరిపడే జీవనభృతి.శ్రీ దువ్వూరి వెంకటరమణ శాస్త్రి గారు తమ ఆత్మకథలో కూడా కాటన్ దొరగారి విషయం ప్రస్తావించారు.అందులో,ఆయన ఈ విధంగా చెప్పారు.---బ్రాహ్మణులు గోదావరీ స్నానం చేస్తూ సంకల్పం చెప్పుకునేటప్పుడు,"కాటన్ దొర స్నాన మహం కరిష్యే" అని చెప్పుకునేవారట.

గోదావరీ నదికి ఆనకట్ట కట్టి ఆంధ్ర దేశానికి 'అన్నదాత' గా ప్రసిద్ధి చెందిన కాటన్ దొరగారి పాలరాతి విగ్రహాన్ని ఆ నదీ తీరాన్నే ప్రతిష్టించారు. స్నానపానాదులు,అర్ఘ్యప్రధానాలు ముగించుకొని,ఆ మహనీయుని విగ్రహానికి నమస్కరించి రావటం నేటికీ జరుగుతున్నది.అటువంటి మహనీయుడు,అపర భగీరధుడు అయిన కాటన్ దొరగారిని గురించి కొన్ని వివరాలు తెలుసుకుందాం.కాటన్ దొర అని గోదావరి ప్రజలు అభిమానంగా పిలుచుకొనే జనరల్ సర్ ఆర్థర్ కాటన్ 15 -05 -1803 న, Oxford లో జన్మించారు.బ్రిటీషు సైనికాధికారి మరియు నీటిపారుదల ఇంజనీరుగా పనిచేసేవారు.కాటన్ తన జీవితాన్ని భారతదేశంలో నీటిపారుదల,కాలువలు కట్టించడానికి ధారపోసాడు.ఈయన జీవితలక్ష్యం మరణించేసరికి పాక్షికంగానే నెరవేరింది.

1819లో మద్రాసు ఇంజనీర్స్ దళములో చేరి మొదటి బర్మా యుద్ధంలో పాల్గొన్నాడు. 1861లో కాటన్ సర్ బిరుదాంకితుడయ్యాడు. ఆర్థర్ కాటన్,1803, మే 15న హెన్రీ కాల్వెలి కాటన్ మరియు ఆయన శ్రీమతికి పదవ కుమారునిగా జన్మించాడు. వివిధ వృత్తులలో స్థిరపడి జీవనం సాగించిన పదకొండు మంది సోదరులలో కాటన్ఒకడు.15 సంవత్సరాల వయసులో కాటన్ 1818లో మిలటరీలో క్యాడెట్ గా చేరి అడ్డిస్కాంబ్ వద్ద ఈస్టిండియా కంపెనీ యొక్క ఆర్టిలరీ మరియు ఇంజనీరింగు సర్వీసులలో శిక్షణ పొందాడు. 1819లో రాయల్ ఇంజనీర్స్ దళంలో సెకండ్ లెఫ్టినెంట్ గా నియమితుడయ్యాడు.కాటన్ ముఖ్యంగా కృషి చేసి విజయాన్ని సాధించిన ప్రాజెక్టులలో గోదావరి నుండి నిర్మించిన కాలువల నిర్మాణం మొదటిదిగా చెప్పవచ్చు.

ఈ కాలువల విభజన,అన్ని ప్రాంతాలను కలుపుతూ సాగే విస్తరణ, ఒకప్పుడు వ్యవసాయంలో సామాన్య దిగుబడితో ఉన్న గోదావరి జిల్లాలను అత్యంత అభివృద్ధి, అధిక వ్యవసాయ దిగుబడులు గల జిల్లాలుగా మార్చాయి.కాటన్ 1836- 38 సంవత్సరాలలో కొలెరూన్ నదిపై ఆనకట్టను నిర్మించాడు.ఆ తర్వాత 1847- 52 సంవత్సరాలలో గోదావరిపై ధవళేశ్వరం వద్ద ఆనకట్టను పూర్తిచేసాడు.క్షామపీడితమైన గోదావరి డెల్టా సస్యశ్యామలమై కళకళలాడింది. తగ్గిపోతున్న జనసంఖ్య మూడు రెట్లు పెరిగింది.ఆరు లక్షల ఎకరాల భూమి సాగు కిందికి వచ్చింది. ఈ మహత్కార్యాన్ని ఆయన కేవలం అయిదేళ్ళలో పూర్తిచేసాడు.కృష్ణానదిపై విజయవాడ వద్ద ఆనకట్టకు ప్రోద్బలం కూడా కాటన్ దొరదే.ఇంతేకాక ఆయన బెంగాల్,ఒరిస్సా,బీహార్,మొదలైన ప్రాంతాల నదులను ప్రజలకు ఉపయోగ పడటానికి ఎన్నో పరిశోధనలు, పరిశీలనలు చేసాడు.ఆ మనీయుడు, 25-07-1899న, డోర్కింగ్ లో (బ్రిటన్) మరణించారు.


తెలుగు వారేకాదు తమిళులు,ఒరియాలు,బెంగాలీలు, బీహారీలు...మొత్తం భారతీయులే ఆయనకు శాశ్వత ఋణగ్రస్తులు.మూడున్నర ఏళ్ళ క్రితం కాటన్ దొరగారి మునిమనవడు అయిన శ్రీ రాబర్ట్ కాటన్ గారు, ఆంధ్రదేశానికి వచ్చి,గోదావరీ తీరాన్ని మొత్తం తనివితీరా పరిశీలించి,ఆంధ్రదేశ ప్రజలు,కాటన్ దొరగారిని స్మరించుకుంటున్న తీరుని చూసి ఆనందబాష్పాలు కార్చారు. ఆ మధ్య లండన్ లో జరిగిన ప్రపంచ తెలుగు మహా సభలలో,తెలుగువారు శ్రీ రాబర్ట్ కాటన్ దంపతులను ఘనంగా సత్కరించారు. తెలుగువారి కృతజ్ఞతా భావానికి వారి కళ్ళు చెమ్మగిల్లాయి.

ఆ అపర భగీరదుడిని మనం కూడా స్మరించుకొని జీవితాన్ని ధన్యం చేసుకుందాం!.

(శ్రీ ముళ్ళపూడివారి 'కోతికొమ్మచ్చి' స్ఫూర్తితో...ముళ్ళపూడి వారికి స్మృత్యంజలితో.....)
*********************************************

సుశాస్త్రీయం - మహర్షి చలం - టీవీయస్.శాస్త్రి

Maharshi Chalam



www.gotelugu.com www.gotelugu.com

(చలంగారి తత్త్వం ఏమిటో కొంతవరకు తెలుసుకోవటానికి దోహదపడే,చలంగారి ఈ క్రింది రెండు లేఖలను మీ కోసం అందిస్తున్నాను.)

శ్రీ చలంగారు శ్రీ నారాయణమూర్తి అనే వారికి 10 -06 -1956 న వ్రాసిన లేఖ-

"నా పుస్తకాలు జాగ్రత్తగా చదివినవారికి నేను అసలు సత్యమేమిటా అని ఈ సమస్యలన్నిటినీ తీర్చగల ULTIMATE TRUTH ఉందా, ఉన్నట్లు కనబడులోంది, అది ఏదా, అనే వెతుకులాట కనబడుతుంది. అందుకనే, మీకు నా ఉత్తరాలలో నా సిద్ధాంతం దొరకలేదు. నేను ఎంత గొప్పవారు గాని వారు చెప్పారు గనుక నమ్మనని, స్వతంత్రంగా బయలు దేరాను. ఆ యాత్రే నా పుస్తకాలలో కథలూ, నాటకాలూ, వ్యాసాల రూపంగా వచ్చింది.సత్యమనేది ఉంటే, బుద్ధితో కాదు, జీవితం అర్పించి అనుష్టిస్తేనే గాని తెలుసుకోలేమని, నమ్మేదానికీ, చేసేదాదానికి వ్యత్యాసముంటే ఆ సత్యం దొరకదని నమ్మి, నమ్మింది అనుష్టించడం వల్ల , మీ ఆంధ్రులనుంచి నా బతుకంతా రొష్టు పడ్డాను.

నా అన్వేషణే నన్ను అరుణాచలం తీసుకొచ్చింది; ఇదేమిటో తెలుసుకుందామని, నేను వెతికే సత్యం ఆధ్యాత్మికంలో ఉందేమోనని. రమణ భగవాన్ కరుణ వల్ల, ఆయన సహాయం వల్ల, ఒక్కరవ్వ తెలుసుకోగలిగాను.ఈశ్వరుడున్నారని -- ఈ సాధన, సత్యదర్శనం చేయిస్తుందనీ, కనుక నా జీవిత పద్ధతి ప్రకారం, నా జీవితం అర్పించేసాను. అదే వారు కోరేదీనీ. అర్పించడం సులభం కాదు. ప్రతి నిముషంలో కాలమూ, అన్ని ఆలోచనలూ, శక్తులూ అర్పించాలి. దానికి తీవ్ర సాధన కావాలి. అదీ నా ప్రయత్నం.

అనుభవంలోకి వస్తేనే గానీ, నేనేమీ తెలిసినట్లు మాట్లాడను, వ్రాయను.ఎప్పుడన్నా తెలుసుకోగలిగితే మాటలోనో, మౌనంలోనో చెబుతాను. తెలుకోలేకపోతే అంతే.

అప్పుడదో చిన్న పనికిరాని మౌనం. నేను ఇదివరకు వ్రాసినవన్నీ ఈనాటికీ నాకు సత్యమే, ఆ plane లో! ఇప్పుడు నేనింకో plane లోపనిచేస్తున్నాను. ఈ plane ఆ plane ని అబద్ధం చెయ్యదు. లోకం ఎంత సత్యమో,నా రచనలు అంతే సత్యం. నా పాత రచనలు తప్పుగా తోచిన నాడు, నా సొంత డబ్బుతోనన్నా, పత్రికల్లో అవన్నీ అబద్ధాలు చదవకండి, అని ఒక పేజి అంతా పెద్ద అక్షరాలతో ప్రకటన చేయిస్తాను....." --- చలం.

***********

చలం గారు చెప్పిన కొన్ని సూక్తులను ఒకచోట కూర్చి శ్రీ చందర్ గారు 'సాహిత్య సుమాలు'అనే ఒక పుస్తకాన్ని వెలువరించారు. ఆ పుస్తకం మీద శ్రీ చలంగారు తన అభిప్రాయాన్ని శ్రీ బి.వి.నరసింహారావు గారికి ఈ క్రింది విధంగా తెలియ జేశారు.

"బి.వి.నరసింహారావు గారికి,

చలం సూక్తులు చదివి ఎంత పొంగిపోతున్నారో మీరు? ఆ సూక్తులను మొదట చదివినపుడు, నేను ఇట్లాంటివి వ్రాయగలిగిన మనిషి పుట్టాడా, వ్రాసాడా, ఉన్నాడా అనిపించింది. ఎవరికి వారు తప్ప subject మీదనేకాని ఇంత range భూమి నుంచి ఆకాశం వరకు cover చేసారా? ఎవరో వ్రాసి వీటిని నేను చదివితే ఎవరు! ఎవరు! అని వెతికివుండనా? వెతికి ఈ జనన మరణ మానవ హృదయ రహస్యాన్ని నాకు విశదం చేయమని ఆయన ముందు కూలబడి ఉండనా? అనుకున్నాను. కాని ఇవి చలం వ్రాయలేదు. అతనిలోని hidden higher self వ్రాసాడు. అతనితో చలానికి ఎప్పుడో కాని, సంబంధం తక్కువ.-- చలం"

***************

"జ్ఞానాన్ని ఎక్కడినుంచో, ఎవరి దగ్గరనుంచో ఉపదేశం పొంది తెచ్చుకునేది కాదు. జ్ఞానం తనలోనేవుంది, అజ్ఞానమనే తెరని తొలగించగలిగితే చాలు, జ్ఞాన దర్శనమౌతుంది. గొప్ప జ్ఞానికావాలంటే మనిషి, ముందు అతని దేహానికి యోగం, ఆరోగ్యం కావాలి. పూర్వజన్మల, ఈ జన్మసంస్కారం కాలిపోవాలి. అహం నశించాలి. నిజం మాట్లాడారో అర్థం కాదు మనుష్యులకి. అబద్ధం మాట్లాడటం ఇష్టంలేదు. అందుకని మౌనులౌతారు జ్ఞానులు. జ్ఞానం అంటే మన మనసు తెలుసుకునేదంతా జ్ఞానమే. ఎన్నో విషయాలను విడివిడిగా తెలుసుకొని, చివరకు అవన్నీ ఈశ్వరుడని తెలుసుకోవడం - అదే అసలు జ్ఞానం."---మహర్షి చలం.

*********************************************




సుశాస్త్రీయం' - ఆంధ్ర రత్న శ్రీ దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గారు - టీవీయస్.శాస్త్రి

Duggirala Gopalakrishnaiah

స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న వారిలో ఆంధ్రులు గణనీయంగానే ఉన్నారు. వారిలో రత్నంలాంటి వాడు మన దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గారు.అనర్గళమైన తన వాక్పటిమతో,పద్యాలతో ఆ రోజుల్లో ఆంధ్రులను ఉత్తేజపరచిన ఈ మహనీయుడు చిరస్మరణీయుడు.

ఈయన 02-06-1889 న,కృష్ణా జిల్లాలోని పెనుగ్రంచిపోలు అనే ఒక కుగ్రామంలో శ్రీ కోదండరామయ్య, శ్రీమతి సీతమ్మ అనే పుణ్య దంపతలుకు జన్మించారు.

బాపట్ల ,గుంటూర్లలో హై స్కూల్ విద్యనభ్యసించారు.బాల్యం నుండి ఆయనకు కళలంటే ఎక్కువ మక్కువ. ఆ

మక్కువతోనే,యవ్వనపు తొలి దశలోనే స్కూల్ లో 'జాతీయ నాట్యమండలి' ని స్థాపించారు. నాటక,సంగీత,సాహిత్యాలను ప్రోత్సహించాలనే సదుద్దేశ్యం ఆ సంస్థ స్థాపించటం వెనక ఉన్నాయి.అలా కళలలో కూడా ఆయన ప్రావీణ్యాన్ని సంపాదించుకున్నారు.ఆ తర్వాత ఉన్నత విద్యలకై ఇంగ్లండ్ కు వెళ్ళారు. అక్కడి ఎడింబరో యూనివర్సిటీ నుండి M.A పట్టాను సంపాదించారు.కొంతకాలం శ్రీ ఆనంద కుమారస్వామి గారనే ప్రముఖిడికి సహాయకుడిగా పనిచేసారు.ఆ రోజుల్లోనే నందికేశ్వరుని సంస్కృత కావ్యమైన 'అభినయ దర్పణం' ను ఆంగ్ల భాషలోకి “The Mirror of Gesture” అనే పేరుమీద అనువదించారు.

“The Mirror of Gesture” ను కేంబ్రిడ్జి –హార్వర్డ్ యూనివర్సిటీ వారి ప్రెస్ 1917 లో ప్రచురించింది.స్వదేశానికి తిరిగివచ్చిన తరువాత కొద్ది రోజులు రాజమండ్రి ట్రైనింగ్ కళాశాలలోను ,బందరు జాతీయ కళాశాలలోను ఉపన్యాసకులుగా పనిచేసారు. గాంధీ గారి స్ఫూర్తితో,1919 లో స్వాతంత్ర్య సమరరంగంలోకి దూకారు. 1919 లో నాటి బ్రిటిష్ ప్రభుత్వం చీరాల , పేరాల నగరపాలక సంస్థలను కలిపి ఒకే మున్సిపాలిటీగా చేసింది. అలా చేయటం వలన ఆయా పట్టణాల అభివృద్ధికి ఆటంకం కలుగుతుందనే ఉద్దేశ్యంతో నాటి ప్రభుత్వం మీద సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభించారు.

ఆ ఉద్యమం చివికి చివికి పెనుప్రభంజనంగా మారింది. ఆంధ్రదేశపు ఉద్యమాలలో అదొక మైలు రాయిలా నిలిచింది.1920లో నాగపూరులో జరిగిన కాంగ్రెస్స్ మహాసభ తీర్మానాలను ప్రజలకు చేరువ చెయ్యటం కోసం, ఆంధ్రదేశమంతా తిరిగి నాటి బ్రిటిష్ కుటిల నీతిని ఎండగట్టి ప్రజలను చైతన్యవంతులను చేసారు.ఆయన ఉపన్యాసాలకు తండోప తండాలుగా ప్రజలు రావటం చూసిన బ్రిటిష్ ప్రభుత్వం వారి గుండెల్లో రైళ్ళు పరిగెత్తాయి. ఆయన ఉపన్యాసాల మీద ఆంక్షను విధించింది ప్రభుత్వం.ఆ ఆంక్షను ధిక్కరించి బరంపురంలో ఉపన్యాసం ఇస్తుండగా ఈయనను అరెస్ట్ చేసారు.బ్రిటిష్ ప్రభుత్వం వీరికి ఒక సంవత్సరం పాటు కఠిన కారాగార శిక్షను వేసింది.

ఆయనకి తెలుగు జానపద కళలంటే అమితమైన ప్రీతి. తోలుబొమ్మలాట,జముకుల కథ,వీధి నాటకాలు, బుర్రకథ, సాముగరిడీలు, గొల్లకలాపం, బుట్టబొమ్మలు, కీలుగుర్రాలు, కొమ్ముబూర, జోడు మద్దెల, పల్లె సుద్దులు, తూర్పు భాగోతం, పల్నాటి వీర విద్యావంతులు ... ఇంకా అనేకమైన కళారూపాలను అభిమానించి ప్రోత్సహించారు.

కళకు ఒక సామాజిక పరమార్ధముందని గ్రహించి,తద్వారా ప్రజలను దేశస్వాతంత్ర్యం కోసం కార్యోన్ముఖులను చేసారు.'సాధన' అనే పత్రికను స్థాపించారు. గ్రంధాలయ ఉద్యమంలో కీలకమైన పాత్రను పోషించారు.ఆయన పరమ భక్తాగ్రేసరుడు. వేషధారణ కూడా విభిన్నంగా ఉండేది. ఆధ్యాత్మిక వేత్త,రామభక్తుడైన ఈయన 'రామదండు' పేరుతొ ఒక స్వచ్ఛంద సంస్థను స్థాపించారు.'రామదండు'ను జాతీయభావాలతో కూడా చక్కగా,సమర్ధవంతంగా నడిపారు.

ఆ రోజుల్లో యువకులు ఈ సంస్థలో సభ్యులుగా ఉన్నందుకు గర్వపడేవారట! 1921 లో గుంటూరులో ఆయన ఒక ఉపన్యాసాన్ని

ఇస్తున్న సందర్భంలో ప్రజలు మైమరచిపోయారు. ఆ సభలోనే ప్రజలు ఆయనకు 'ఆంధ్ర రత్న' అనే బిరుదును ప్రసాదించారు.సహాయనిరాకరణ ఉద్యమం నాటి రోజుల్లో దేశమంతటినీ మూడు సంఘటనలు ప్రభావితం చేసాయి.వాటిలో మొదటిది, గోపాలకృష్ణయ్య గారి నాయకత్వంలో నడచిన చీరాల-పేరాల ఉద్యమం.'రామదండు' లో సుశిక్షితులైన అనేకమంది యువకులు ఆయన బాటలో నడిచారు.

విజయవాడలో జరిగిన కాంగ్రెస్స్ జాతీయ సమావేశాలలో 'రామదండు' కార్యకర్తలు చేసిన పనితీరు గాంధీ గారితో సహా పలువురి దృష్టిని ఆకర్షించింది. అది ఆయన నాయకత్వ పటిమ, యువకులు ఆయన నుండి పొందిన స్ఫూర్తి. 'రామదండు' నాటి బ్రిటిష్ ప్రభుత్వానికి సమాంతరంగా పనిచేయనారంభించింది. ప్రతి కులం నుండి ఒక సభ్యుని తీసుకొని సమాంతరంగా ఒక అసెంబ్లీని ప్రారంభించారు ఆయన.'రామదండు' సభ్యులు పాడే సంకీర్తనలు, భజనలు ప్రజలను మరింత ఉత్సాహ పరిచేవి. ప్రభుత్వ భూములలో షెడ్లను, పాకలను 'రామదండు' నిర్మించింది.చీరాల-పేరాల ఉద్యమాన్ని బ్రిటిష్ ప్రభుత్వం తన దమన నీతితో అణచివేసినా, ఆ ఉద్యమ స్ఫూర్తి ప్రజలలో అలానే నాటుకుపోయింది.

గోపాలకృష్ణయ్య గారు మంచి హాస్యప్రియులు. అవి స్వాతంత్రోద్యమం నాటి రోజులు. ఒక రోజు చిత్తరంజన్ దాస్ గారు గుంటూరు మీటింగ్ కి వెళుతూ కలకత్తానుండి వచ్చే మెయిల్ లో తెనాలిలో ఆగారు. తెనాలి ప్లాట్ ఫారం మీద ఆగివున్న గుంటూరు రైలెక్కి పడుకున్నారు. ఆ రైలు తెల్లవారుఝామున కానీ బయలుదేరదు. అదే రైలుకు గుంటూరు వెళ్ళటానికి వచ్చిన గోపాలకృష్ణయ్య గారు మొదటి బోగీ మీద 'సి. ఆర్. దాస్ ' అన్న పేరును చూసి ,"ఆహా !ఏమి నా భాగ్యం! నాకోసం టిక్కెట్టును రిజర్వు కూడా చేసారే!" అన్నారు తన సహచరులతో. "ఈ రిజర్వేషన్ మీకు కాదండి, సి. ఆర్.దాస్ గారికి "అని చెబితే ,అందుకు ఆయన "అవునయ్యా!నా పేరు కూడా సి. ఆర్.దాసే కదా! అదే చీరాల రామదాసు!" అని చమత్కరించారట .

ఈ 'ఆంధ్ర రత్నం' 40 సంవత్సరాల చిన్న వయసులోనే అనగా 1928లో అకస్మాత్తుగా దివికేగారు.

ఆంధ్రులను తేజోవంతులను చేసిన ఈ మహనీయునికి ఘనమైన నివాళిని సమర్పించుదాం!
********************************************




సుశాస్త్రీయం - 'ఆరో రుద్రుడు' : ఆరుద్ర - టీవీయస్.శాస్త్రి

The 6th Rudra - Arudra

'ఆరుద్ర'గా కలం పేరుతో ప్రసిద్ధుడైన ఈ రచయిత, అసలు పేరు భాగవతుల సదాశివ శంకరశాస్త్రి. ఆధునిక ఆంధ్ర సాహిత్య చరిత్రలో ఒక సముచిత స్థానాన్ని సంపాదించుకున్న మహానుభావుడు. ఇతను 'ఆరుద్ర' కాదు, 'ఆరో రుద్రుడు' అని శ్రీశ్రీ చేత అనిపించుకొన్న ధన్యజీవి. వీరు మహాకవి శ్రీశ్రీకి బంధువులు కూడాను.1925,ఆగష్టు 31న ఆరుద్ర జన్మించారు.

ఆరుద్ర జన్మస్థలం విశాఖపట్నం. అక్కడే ప్రాథమిక, మాధ్యమిక విద్యాభ్యాసం సాగించారు. తదుపరి కాలేజి విద్య కోసమై 1942 లో విజయనగరానికి చేరారు. శ్రీ యుతులు రోణంకి అప్పలస్వామి, చాగంటి సోమయాజులు వంటి రచయితల ప్రభావం చేత

communism వైపు ఆకర్షితులైనారు. 1943 నుండి 1947 వరకు భారత వైమానిక దళంలో Band Boy గా పనిచేసారు.

ఆ తర్వాత,మద్రాస్ కు మకాం మార్చి,'ఆనందవాణి' అనే పత్రికకు రెండేళ్ళు సంపాదకునిగా పనిచేసారు.1949 లో సినీరంగ ప్రవేశం చేసి, అనేక సినిమాలకు మాటలు, పాటలు వ్రాసారు.1954 లో ప్రఖ్యాత రచయిత్రి అయిన k.రామలక్ష్మి గారిని వివాహము చేసుకున్నారు. "సంతకం అక్కరలేని కవి ఆరుద్ర. అంత్య ప్రాసలే ఆయన వ్రాలుముద్ర. ఆరుద్ర పాటశాల, పాట 'చాల' వడిగా వరవడి దిద్దింది, తెలుగు సినిమాల ఆది 'ప్రాసాంతకం'అన్నది గిట్టని వాళ్ల కట్టుడు పన్ ను, దాని విగ్రహం తాత్పర్యం అడగవద్దు నన్ ను, మాటలు పన్ డటంలో గడసరి, పాటలు పేనడంలో పొడగిరి. జీవితం అంత అద్భుతంగా ఉపమించడంలో నేర్పరి. పొయట్రిక్స్ ప్రయోగించడం ---సరేసరి! అర్జంట్ రచనల్లో కూడా మరి, అరమెరుపైనా--తప్పనిసరి!"

'నానృషిః కురుతే కావ్యం అన్నారుగా పెద్దలు!'--- ఆరుద్ర గడ్డం పెంచిన కొత్తలో ఆయనకు రాంభట్ల కృష్ణమూర్తి ఎదురయ్యారట. 'ఏమిటి గడ్డం?'అని అడిగిన రాంభట్లను చూసి నవ్వేసి'నానృషిః కురుతే కావ్యం' అన్నారుగా పెద్దలు! అని చమత్కరించారట ఆరుద్ర.

కూనలమ్మ పదాలు కొన్ని

తాగుచుండే బుడ్డి

తరుగుచుండే కొద్ది

మెదడు మేయును గడ్డి

ఓ కూనలమ్మ

భార్య పుట్టినరోజు

భర్త మరచినరోజు

తగ్గెననుకో మోజు

ఓ కూనలమ్మ

ఏకపత్నీ వ్రతము

ఎలుగెత్తి మన మతము

వేల్పు భార్యలో?శతము

ఓ కూనలమ్మ

మనసు తెలుపని భాష

మంచి పెంచని భాష

ఉత్త సంద్రపు ఘోష

ఓ కూనలమ్మ

ఆరుద్ర బహుముఖ ప్రజ్ఞావంతుడు. వారు చాలా పద్యాలు, వ్యాసాలూ, కథలు, నాటికలు, తర్జుమాలు, సినిమా మాటలు, పాటలు, detective నవలలు...ఇలా ఎన్నో సాహిత్య ప్రక్రియలను చక్కగా నిర్వహించారు. అన్నిటినీ మించి వారు 'చదరంగం' మీద చక్కని పుస్తకం వ్రాసారు. 'త్వమేవాహం' (You are none other than me), 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' వీరి రచనలలో అత్యంత ప్రాముఖ్యమైనవి. 'సినీవాలి' అనే గ్రంధం కూడా విశిష్ట ప్రచారం సంపాదించుకుంది . సమకాలీన జీవనం ఇతివృత్తముగా తీసుకొని, అతి సులభమైన భాషలో వీరు వ్రాసిన 'కూనలమ్మ పదాలు' చాలా ప్రాచుర్యం చెందాయి, అది వ్యంగ్య రచన కూడాను.

ఎవరి మనో భావాలు దెబ్బతినకుండా చాలా చక్కగా సాగిన రచన అది. రెండవ ప్రపంచ యుద్ధం గురించి చాలా వ్యాసాలు వ్రాసారు, ఎందుకంటే ఆ సమయంలో వారు, మిలటరీలో పనిచేసారు కనుక. అతను సృష్టించిన గుమాస్తా పాత్ర 'సూర్యారావు' చాలా సజీవమైన పాత్ర.రామాయణం గురించి, ఎక్కువగా పరిశోధనాత్మకంగా చదివి 'రామునికి సీత ఏమవుతుంది?' అనే సంచలన గ్రంధాన్ని రచించారు. తమిళ భాషలోని 'తిరుక్కురళ్' ను తెలుగులోనికి తర్జుమా చేసారు. 'అభ్యుదయ రచయితల సంఘం' లో చాలా ముఖ్యమైన పాత్రను పోషించారు. 'త్వమేవాహం'ను1948 లో రచించారు. వారి గ్రంధాలన్నిటిలో ఇది master piece. తెలంగాణాలోని రజాకార్ ఉద్యమం, నిజాం నిరంకుశ పాలన, అందులోని ముఖ్యాంశాలు. త్వమేవాహం రాసిన నాటికి ఆరుద్రకు 'పైలా పచ్చీసు'వయసే. కుర్రాడికి కేవలం 24 ఏళ్ళే! ‘లోహ విహంగాలు’ రాసినప్పుడే ఆరుద్ర సొంత గొంతుక ఖంగుమంటోంది. ‘వెలిసిందట! అప్పుడే విశాఖపట్నంపై వర్షించిన బాంబు వృష్టి!/ ఓహో! ఏమిటీ జీవ ప్రవాహం/ యంత్రాల మాదిరి మనుష్యులు/ ప్రాణాలు పిడికిట పెట్టుకుని/ గుండెలు చేపట్టుకొని/ బలుసాకును వెతుక్కుంటూ/బతుకు బాటపై కిక్కిరిసి/ భుజాలు రాసుకుంటూ ఉన్మాదంతో/ పోతున్నారు రాసుకుంటూ, ఒత్తుకుంటూ!’. 1949లో ‘త్వమేవాహం’ వెలువడ్డానికి ముందే ఆరుద్ర విభిన్న సామాజిక విషయాలపై 43 కవితల దాకా రాసి ఉన్నాడు.

ఇవి విశాఖపట్నం, గాంధీజీ, స్వాతంత్ర్యం, తెలంగాణ సాయుధ పోరాటం వంటి విషయాలపై రాసిన బలమైన కవితలు. ప్రయోగశీలత, శబ్దాశ్రయ చమత్కారం, తీవ్రమైన అభ్యంతర ప్రకటన...ఇవన్నీ ఆరుద్రను అప్పటి కాలపు జాతీయ, అంతర్జాతీయ పరిణామాలను తన దృష్టి పథంలోకి తెచ్చుకున్న ప్రగతిశీలవాదిగా నిలపెట్టాయి. చెన్నపట్నంలో ఉన్న కాలంలో గాంధీజీ హత్యకు కవిత్వ స్పందన, ఇంకొన్ని మేజర్ ఇష్యూస్ పై ఈ పైలాపచ్చీసు యువకవి నమోదు చేసిన పరిణత స్పందనలు చూస్తాం .ఆరుద్ర మార్కు పంక్తులైన ‘మన స్వతంత్రం మేడిపండు/ మన దరిద్రం రాచపుండు’, ఈ దేశ స్వాతంత్య్రపు తొలి వార్షికోత్సవం 1948 ఆగస్టు 15కి రాసాడు ఆరుద్ర తన 23 ఏళ్ళ వయసులో. ఆయన సృజనాత్మకు ప్రతీకలైన రెండు, మూడు చిన్న విషయాలను ప్రస్తావిస్తాను.

ఒక ఇసుక గడియారం, మరొక నీటి గడియారంను కవితా వస్తువులుగా తీసుకొని 'కాలాన్ని' అద్భుతంగా నిర్వచించారు. గంటల ముల్లు, ధనస్వామ్యానికి ప్రతీక, నిముషాల ముల్లు మధ్య తరగతివారి మానసిక స్థితికి ప్రతీక, ఇకపోతే సెకండ్ల ముల్లు కష్టజీవులకు ప్రతీకగా తీసుకొని ---వారు రచించిన తీరు నేటికీ నన్ను మురిపిస్తుంది. అంతటితో ఊరుకున్నారా, ఒక stop watch ని విప్లవానికి కొలబద్దగా, అలారంను మనల్ని జాగృత పరచే సాధనగా చక్కగా సాగిన ఆకవిత, నేటికీ సాహిత్యప్రియుల మస్తిష్కంలో నిలిచిపోయింది. 1965 నుండి 1968 వరకు సమగ్ర ఆంధ్ర సాహిత్యాన్ని 12 సంపుటాలుగా ప్రచురించారు. ఆరుద్రకు వేలువిడిచిన మేనమామలైన శ్రీశ్రీ,నారాయణబాబూ అభ్యుదయ పథం వైపు తమ కవితా రధాన్ని పరిగెత్తించారు. ముందువాళ్లిద్దరూ ఆరుద్రకు వేలువిడిచిన మేనమామలట. వాళ్ల ప్రత్యక్ష ప్రభావం వల్లనే ఆరుద్ర సాహిత్య రంగ ప్రవేశం చేసారు.

గురజాడ అడుగుజాడల్లో నడవాలని యత్నించిన ఆరుద్రను ప్రభావితం చేసిన వారిలో అబ్బూరి, తాపీ, మల్లాది ముఖ్యులు. ప్రభావాల మాట ఎలా ఉన్నా ఇరవయ్యో శతాబ్ది ఉత్తరార్ధంలో తెలుగు కవితకు కొత్త పలుకుబడిని సవరించినవాడు ఆరుద్ర. అందుకే బాపుగారు ‘సంతకం అక్కర్లేని కవి ఆరుద్ర - అంత్యానుప్రాసలే అతని ముద్ర’ అన్నారట. ఈ పలుకుబడి సంపాదించుకోవడంలో ఆరుద్ర పై పఠాభి (ఫిడేల్ రాగాల డజన్ కవి) ప్రభావం గురించి ఇక్కడ చెప్పుకుని తీరాలి.

జాతి రత్నం

ఒకసారెవరో శ్రీశ్రీకి ఉత్తరం రాస్తూ ‘తమ శిష్య రత్నం ఆరుద్ర’ అంటూ ఏదో ప్రస్తావించారట. దానిమీదట,‘శిష్యుడంటే అతనొప్పుకోడు - రత్నమంటే నేనొప్పుకోను!’ అని చమత్కరించారట శ్రీశ్రీ. ఈ చమత్కారాల మాటెలా ఉన్నా లోకమంతా ఆరుద్రను శ్రీశ్రీ శిష్యుడిగానూ, మేలిజాతి రత్నంగానూ కూడా ఎన్నడో గుర్తించేసింది! ఆయన ఎన్నో సినిమా పాటలు వ్రాసారు, అన్నీ విశిష్ట ప్రజాదరణ పొందినవే. 'అంత్య ప్రాసల ముద్ర ఆరుద్ర' అనే నానుడి తెచ్చుకున్నారు. వీరి త్వమేవాహం చదివిన తర్వాత, శ్రీశ్రీ గారు, 'నేను ఇంక తెలుగులో వ్రాయనక్కర లేదు' అని అన్నారుట.

వారితో నా ప్రత్యక్ష సంభాషణ-నాకు వారితో ఒకసారి ముచ్చటించే భాగ్యం కలిగింది. నాకు వారు వ్రాసిన 'శ్రీ రామ నామాలు శతకోటి' (మీనా' సినిమాలోనిది) అనే పాట నాకు చాలా ఇష్టం. వారినేఅడిగాను, ఇంత చక్కని భావాన్ని ఎలా పొందగలిగారు? అని.

అందుకు వారు ఇచ్చిన సమాధానం నన్ను ఆశ్చర్యచకితుణ్ణి చేసింది. వారు ఈ విధంగా చెప్పారు, 'నేను ఎప్పుడో చిన్నప్పుడు, హిందీలో వచ్చిన 'రామరాజ్' అనే సినిమా చూసాను. అందులో మహిపాల్ రాముని వేషం వేసారు. ఆ సినిమాలో శ్రీరాముడు, లక్ష్మణుడుని పిలిచి,గర్భవతి అయిన సీతా మహాసాధ్విని కారడవులలో దించిరమ్మని కఠినంగా ఆజ్ఞాపించారు.అదే పని లక్ష్మణుడు ఆచరించి, అన్నగారికి చెప్పగానే, శ్రీరామచంద్ర ప్రభువు,భోరున విలపిస్తాడు.అప్పుడు,లక్ష్మణ స్వామి, "అన్నా! ఇంతకు ముందే

అడవులలో దించి రమ్మని కఠినంగా చెప్పిన వాడవు, ఇప్పుడు అతి బేలగా విలపించటానికి కారణం ఏమిటని?"అడుగగానే, రామచంద్ర ప్రభువు, "ఆ ఆజ్ఞ ఇచ్చినపుడు, నేను రాజారాముణ్ణి, ఇప్పుడు జానకిరాముణ్ణి అని చెప్పారట' ఈ భావం ఆరుద్రగారి మనసులో నాటుకు పోయింది.

ఎప్పుడైనా అవకాశం వస్తే దాన్ని పాటగా వ్రాయాలని వారి కోరిక. అయితే, వీరికన్నా ముందుగానే తమిళంలో కణ్ణదాసన్ ఆ ఇతివృత్తంతో ఒక పాట వ్రాయటం జరిగిందట. ఆ పాట చాలా జనాదరణ పొందిదట! ఆఖరికి,ఆయన కోరిక, 'మీనా' సినిమాలో ఆ పాట వ్రాసి తీర్చుకున్నారు. చివరిగా, ఆయన చెప్పిన విషయానికి నాకు చాలా సంతోషం కలిగింది. ఏ మాత్రం భేషజం లేకుండా, ఇది నా స్వంత పాట కాదు, హిందీ, తమిళ రచయితలకే ఆ గౌరవం దక్కాలి అని వారు వినయంగా చెప్పినప్పుడు, వారి వ్యక్తిత్వానికి మనసారా నమస్కరించి, సెలవు తీసుకున్నాను.

ఆ మహనీయుని కవితనొక దానిని మీకోసం ----

పగటిచుక్క

వాడికోరల నోరు తెరచిన

వన్యమృగమును పోలు చీకటి

మనిషిమీదకి దుముకుచున్నది

మధ్యాహ్నవేళ!

పగలుమాసిన ఇరులమూకను

పట్టి చీల్చగ పొడిచె నింగిని

పదను పట్టిన కత్తిమాదిరి

పగటిచుక్క

పట్టపగలే కారుచీకటి

ముట్టడిస్తే మూగవోయిన

పెద్దలంతా చుక్కపొడుపుకి

బొబ్బలు పెట్టిరి

ఇరుల బాధను తొలగజేసే

అరుణతారక వెలుగు సంపద


అడ్డు చెప్పినవారు సైతం

అనుభవిస్తురు

అటువంటి మహనీయుడు, హైదరాబాద్ లోని నిమ్స్ హాస్పిటల్ లో మూత్రపిండాల వ్యాధితో ఘోరంగా 1998 జూన్ 4 న చనిపోయారు. ప్రభుత్వం ఆర్ధికసహాయం చేస్తే కొంతకాలం బ్రతికే వారేనేమో! మనప్రభుత్వాలు ఓటుకు ఇచ్చే విలువ మరి దేనికీ ఇవ్వరు, ఎందుకంటే ఆరుద్ర గారు కనీసం ఒక వెయ్యి ఓట్లు తెచ్చే వాడయితే, ప్రభుత్వం ఏమైనా సహాయం చేసేదేమో!!

ఆయన అన్నట్లుగానే -కవిత కోసమే ఆయన పుట్టాడు,క్రాంతి కోసం కలం పట్టాడు.

ఆఖరికి ఆ 'రుద్రభూమికే' చేరుకున్న ఆమహనీయునికి,జోహార్లు సమర్పిస్తూ,ముగిస్తున్నాను.
*********************************************




సుశాస్త్రీయం : రేఖాచిత్రాల కాపు--బాపు - టీవీయస్.శాస్త్రి

Rekha Chitrala Kaapu - Bapu

అందమయిన అమ్మాయిని బాపు బొమ్మ లాగుందనటం తెలుగువారికి అలవాటైన మాట. అది నిజం కూడా! రేఖాచిత్రాలు ఆయన ప్రత్యేకత. బాపు తెలుగునాట పేరెన్నికగన్న బహుముఖ ప్రజ్ఞాశాలి. బాపు గీత, బాపు వ్రాత తెలుగువారి సంస్కృతిలో భాగమయ్యాయి. బాపు చిత్రం ప్రచురించని తెలుగు పత్రికలు అరుదు. ఆయన వేసిన కార్టూనులు, పుస్తకాల ముఖచిత్రాలు లెక్క పెట్టడం కష్టం. 'బాపు బొమ్మ' అనే మాట ఈరోజు చిత్రశైలికీ వాడుతారు, అందాల భామను వర్ణించడానికీ వాడుతారు. బాపు బొమ్మల గురించి ప్రసిద్ధి గాంచిన కవి ఆరుద్ర పద్య రూపంలో తన కవితల పుస్తకములో హృద్యంగా వర్ణించిన తీరు చిరస్మరణీయమైంది ఒకటుంది.

కొంటెబొమ్మల బాపు

కొన్ని తరముల సేపు

గుండె ఊయలలూపు

ఓ కూనలమ్మా!

ఇలా కూనలమ్మ పదం రాసి, ఆరుద్ర బాపుకు ఎప్పుడో చేసిన పద్యాభిషేకంతో ఏకీభవించని వారు లేరు.బొమ్మలే కాదు, బాపు చేతిలో తెలుగు అక్షరాలు కూడా హొయలు పోయాయి. బాపు రాత కూడా అంతే. ఇంతవరకూ తెలుగునాట ఎవరి చేతి వ్రాతకూ ఆ ప్రాముఖ్యత అందలేదు. తెలుగులో బాపు అక్షరమాల (ఫాంట్) ఎన్నో డి.టి.పి సంస్థలు, ప్రచురణ సంస్థలు వాడుతుంటాయి. బాపును గురించి క్లుప్తంగా తెలుసుకుందాం. వ్యంగ్యచిత్రాలకు(కార్టూన్స్)కు ఒక కొత్త రూపునిచ్చి, కథలకు, భావానికి తగిన బొమ్మలు వేసి , కథకుడికీ పేరు తెచ్చిన ఘనుడు బాపు. సహజమైన వాతావరణంలో, అతి సహజమైన కథలను తీసుకొని, వాటిని తెరపైకి అద్భుతంగా ఎక్కించిన బాపూని చూస్తే ఎవరికైనా బాపురే! అనాలనిపిస్తుంది. తెలుగు సినిమా స్థాయిని, ప్రేక్షకుడి స్థాయిని పెంచిన కమనీయ దృశ్య కావ్య దర్శకుడు శ్రీ బాపు.

సత్తిరాజు లక్ష్మీనారాయణ అంటే ఎవరికీ తెలియదు. బాపు అంటేనే అందరికీ తెలిసేది. బాపు గారి అసలు పేరు శ్రీ సత్తిరాజు లక్ష్మీనారాయణ. వీరు 15 -12 -1933 న, పశ్చిమ గోదావరీ జిల్లాలోని, నరసాపురంలో ధనవంతుల కుటుంబంలో, వేణుగోపాలరావు, సూర్యకాంతమ్మ దంపతులకు జన్మించారు.1955 లో మద్రాసు విశ్వవిద్యాలయం నుండి న్యాయ శాస్త్రంలో పట్టభద్రులు అయ్యారు.1955 లోనే వీరు ఆంధ్రపత్రికలో శ్రీ ముళ్ళపూడి వెంకట రమణ గారితో కలసి పనిచేసారు. అంతకు ముందునుంచే వీరికి స్నేహం ఉంది. వారు ఏకోదరులు కాకపోయినా, 'జోకో'దరులు! బాపు గారు 1960 వరకు వ్యాపార ప్రకటన రంగంలోనే ఉన్నారు. కామాక్షులు అంటే, 'కామా'లాంటి కళ్ళు గల అమ్మాయిలను అతి సుందరంగా సృష్టించిన చిత్ర బ్రహ్మ ఈయన. దేవుడు,దేవతల బొమ్మలు వేస్తే వాటిలో జీవకళ ఉట్టిపడటమే కాకుండా భక్తిభావం కూడా కలుగుతుంది. రవివర్మ బొమ్మలను మరిపించాడు అని చెప్పటంలో అతిశయోక్తి లేదు.



1959 లో శ్రీ ముళ్ళపూడి వెంకటరమణ గారు ఆంధ్రపత్రికలో 'సాక్షి'కథను వ్రాసారు. ఆ కథకు బాపు గారు బొమ్మలు వేసారు.అదే కథను తీసుకొని మొదటిసారిగా దర్శకుడిగా సినీరంగంలో అడుగు పెట్టారు. అతి తక్కువ ఖర్చుతో, స్టూడియోలకు వెలుపుల, సహజమైన వాతావారణంలో అతి సహజంగా చిత్రీకరించిన గొప్ప చిత్రం అది. ఒక స్థాయి ప్రేక్షకులను విశేషంగా ఆకర్షించింది. ఆ సినిమా 1968 లోతాష్కెంట్ ఫిలిం ఫెస్టివల్ లో ప్రదర్శించబడ్డది. నాకు ఇంకా గుర్తు, ఆ సినిమాకు పబ్లిసిటీ కూడా విభిన్నంగా ఇచ్చారు. 'ఇది తెలుగు సినీ జగత్తులో సాక్షి నామ సంవత్సరం' అని! అది అక్షరాలా నిజం. లవకుశ సినిమాను కొద్ది మార్పులతో మరియు ఒక ఆంగ్ల చిత్రమైన 'An Unseen Ghost' ను ఆధారంగా చేసుకొని, పూర్తి తెలుగుతనం ఉట్టిపడేటట్లు తీసిన సినిమా 'ముత్యాలముగ్గు'. ఆ సాంఘిక చిత్రంలో హనుమంతుని పాత్రను చొప్పించి మరీ రసవత్తరం చేసారు! ఆ సినిమా నుండే శ్రీ రావు గోపాలరావు, శ్రీ నూతన్ ప్రసాద్ ల ప్ర(తి)భ మొదలైంది. ఇషాన్ ఆర్యా కెమెరా పనితనం, ఆఖరి ఘట్టంలో అల్లు రామలింగయ్య గారి అద్భుత నటన, కొద్దిసేపు కనిపించినా చిరకాలం గుర్తుండేటట్లు నటించిన శ్రీ మాడా. ఇలా చెప్పుకుంటూపోతే ఆసినిమా సమీక్షే ఒక గొప్ప వ్యాసం అవుతుంది.

పండిత, పామరుల ప్రశంసలు పొంది ఆర్థికంగా కూడా విజయవంతమైన చిత్రమది. ఆ ప్రేరణతోనే పౌరాణిక కథలను నేపథ్యంగా తీసుకొని మరికొన్ని సినిమాలను తీసారు. వాటిల్లో ముఖ్యమైనది,'మనవూరి పాండవులు'. ఈ సినిమాలోనే చిరంజీవికి ఒక ప్రధానమైన పాత్ర లభించి, ఆయనకొక గుర్తింపు తెచ్చిపెట్టింది. 'రాజాధిరాజు' సినిమాలో ఒక 'నూతన' ప్రసాద్ ను చూపించారు. పెళ్లిపుస్తకంలో, దివ్యవాణిని ఎంతో చక్కగా చూపించారు. మిస్టర్.పెళ్ళాం చిత్రం ద్వారా AVS ను పరిచయం చేయటమే కాకుండా, చిత్రసీమలో ఆయనకొక ప్రత్యేకమైన స్థానం పొందటానికి తోడ్పాటు చేసారు. ఆయన లోని creativity వల్ల చాలా పాత్రలు సజీవంగా నిలిచిపోయాయి. బుద్ధిమంతుడు, సంపూర్ణ రామాయణం, సీతాకళ్యాణం, శ్రీ రామాంజనేయ యుద్ధం, శ్రీనాధ

కవిసార్వభౌమ లాంటి పెక్కు కళా ఖండాలకు దర్శకత్వం వహించిన విభిన్న దర్శకుడు ఈయన.80 ఏండ్ల వయసులో ఈ మధ్యనే ఆయన దర్శకత్వం వహించిన 'శ్రీ రామ రాజ్యం' ఒక కమనీయ భోజ్యం. ఈ మధ్యనే 'పద్మశ్రీ' కి బాపు సత్కారం లభించింది.




ఈ సినిమాలన్నీ ఒక ఎత్తు, సీతాకళ్యాణం ఒక్కటి ఒక ఎత్తు. ఎందుకంటే, సినిమా అనేది ఒక దృశ్య కావ్యం (Visual Media). నా ఉద్దేశ్యంలో అతి తక్కువ మాటలతో తీసిన సినిమాలే గొప్ప సినిమాలు. సీతాకల్యాణం రచన మొత్తం పది పుటలు ఉంటుందేమో! దర్శకుడి ప్రతిభ, నటీనటుల చక్కని హావభావాలు చాలు కథ, సన్నివేశాన్ని ప్రేక్షకుడు అర్థం చేసుకోవటానికి. అసలు మాటలు లేకుండా తీసిన 'పుష్పక విమానం' ఎంత విజయవంతం కాలేదూ? కొన్ని దృశ్యాలను మనం తెరపై చూడటం సాధ్యమా అనిపిస్తుంది. అటువంటి సన్నివేశం అయిన 'గంగావతరణం' ను అత్యత్భుతంగా రవికాంత్ లాంటి ఛాయాగ్రాహకుడి సహాయంతో ఎంతో కమనీయంగా తీసాడు మన బాపు.ఈ సినిమాని లండన్ లోని ఫిలిం విద్యాసంస్థలలోఒక బోధనా అంశంగా ఉంచారు. బాపు ప్రతిభకు ఇంతకన్నా తార్కాణం ఏమి కావాలి? ఈ మధ్యనే ఆయన మిత్రుడు, హితుడు, బంధువు అయిన శ్రీ ముళ్ళపూడి వారిని పోగొట్టుకొని, వెన్నెలకోసం పరితపిస్తున్న చకోరంలా ఉన్నారు. ఆయన సినిమాలు కొన్ని పరాజయం పాలు కావటంపై, ఆయనే హాస్యంగా ఇలా అన్నారు -- మేము చాలావరకు కామెడీ సినిమాలనే తీసాం, తీసిన తరువాత అవి ట్రాజెడీలు అయ్యాయి.

బాపుని గురించి కొందరి ప్రముఖుల అభిప్రాయాలు--

బాపు అందమైన మనుష్యులనే - ముఖ్యంగా స్త్రీలను - వేస్తాడేమో అనుకుని కొన్నాళ్ళు నేను కూడా అపోహపడ్డాను.కానీ, బాపు సృష్టించే అందం అతని బొమ్మల్లో ఉంది - మనుష్యుల్లో కాదు- కొడవటిగంటి కుటుంబరావు

బాపూ నీ బొమ్మలు-తల

లూపు గులాబి కొమ్మలు

బాపూ నీ రేఖలు - ముని

మాపు శకుంతల లేఖలు

బాపూ నీ లేఖిని - దరి

దాపు సుధారస వాహిని

బాపూ నీ భావము - వగ

బాపు కళకు నవ జీవనము - కరుణశ్రీ

భారత దేశానికి ఒక బాపు అయితే,తెలుగువారికి ఇద్దరు బాపూలు!

ఆ కళా ప్రియునికి కళాభివందనాలు!

*********************************************




సుశాస్త్రీయం : నటసార్వభౌమ 'యశస్వి'రంగారావు - టీవీయస్.శాస్త్రి

Article on SV Ranga Rao by TVS Sastry

సామర్ల వెంకట రంగారావు గారు (SVR) 03-07-1918 న లక్ష్మీనరసాయమ్మ, కోటేశ్వరరావులు అనబడే దంపతులకు కృష్ణాజిల్లాలోని నూజివీడులో జన్మించారు. స్వస్థలం కాకినాడ. తండ్రి excise inspector గా నూజివీడులో పనిచేసారు. తల్లి వెంకటేశ్వరస్వామి భక్తురాలు అవటం చేత కొడుకుకు వెంకట రంగారావు అనే పేరు పెట్టుకున్నారు.

ధనవంతులైన తల్లితండ్రులు ఇతనిని హైస్కూల్ విద్యకే మద్రాస్ పంపించారు. SVR తన 12 వ ఏటనే, హైస్కూల్ విద్య పూర్తి చేసి,B.Sc లో చేరారు. హైస్కూల్ విద్యార్థిగా ఉన్నప్పటి నుంచి ఇతనికి కళలంటే ఎక్కువ మక్కువ. కాలేజీలో చదువుకునేటప్పుడే, అతను తన నటనకు మెరుగులు దిద్దుకున్నాడు. డిగ్రీ పూర్తి అయిన తర్వాత, బందరులో Fire Service డిపార్టుమెంటులో ఉద్యోగం సంపాదించారు.

అప్పుడు ఆయన మదిలో రెండు ఆలోచనలుండేవి. M.Sc లో చేరటమా లేక సినిమా రంగంలో నటుడిగా కృషి చెయ్యటమా! అని. వారి బంధువైన బి.వి.రామానందం గారు తాను తీయబోయే సినిమాకోసం SVR ను సినీ రంగానికి ఆహ్వానించారు. ఆ సినిమా పేరు వరూధిని. రంగారావు గారు వెంటనే ఉద్యోగం మానివేసి, సినీరంగంలో ప్రవేశించటానికి మద్రాస్ పయనమయ్యారు. వరూధిని అనుకున్నంత విజయం సాధించలేదు. అందుచేత కొంతకాలం వరకు వారికి సినిమాలలో వేషాలు వేసే అవకాశం రాలేదు. తర్వాత రంగారావు గారికి విసుగు పుట్టి, జంషెడ్ పూర్ లో TATA వారి సంస్థలో కొన్నాళ్ళు ఉద్యోగం చేసారు. అయితే అతనికి నటన పైన ఉన్న ప్రేమ తొలగిపోలేదు, పైగా ఎక్కువ కూడా అయింది.

27-12-1947 న లీలావతి అనబడే కన్యామణితో వీరి వివాహం జరిగింది. SVR గారికి తదుపరి రోజుల్లో 'పల్లెటూరిపిల్ల' అనే చిత్రంలో విలన్ గా నటించటానికి శ్రీ బి.ఏ. సుబ్బారావు గారి నుండి ఆహ్వానం వచ్చింది. అయితే, దురదృష్టం ఏమిటంటే, వీరు మద్రాస్ వెళ్ళటానికి రైలు ఎక్కే సమయంలో, వారి నాన్న గారు స్వర్గస్తులైనారనే తంతి వార్త వచ్చింది. తండ్రి అంత్యక్రియలు పూర్తి చేసుకొని, మద్రాస్ వెళ్ళేటప్పటికి, ఆ వేషం మరొకరికి ఇవ్వబడింది. ఆయన అదృష్టమేమంటే--విజయా వారి, కే.వి.రెడ్డి గారి దృష్టిలో పడటమే! పాతాళ భైరవిలో నేపాలీ మాంత్రికుడి వేషం వేసే ఛాన్స్ వచ్చింది. వచ్చిన ఆ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవటమే కాకుండా, ఆయన ఆ పాత్ర పోషించిన తీరు పండిత పామరుల ప్రశంసలు అందుకుంది. ఇక విజయా వారికి ఈయన ఆస్థాన నటుడయ్యారు. ఆ తర్వాతనే విడుదలైన విజయా వారి 'పెళ్లిచేసిచూడు' సినిమాలో వీరు పోషించిన 'వియ్యన్న' పాత్ర కూడా నేపాలీ మాంత్రికుడి వేషం వలే తెలుగువారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది.



దాని తమిళ version లో కూడా అదే పాత్రను పోషించి, తమిళ ప్రజల మన్ననలను కూడా పొందారు. విజయా వారు మాయాబజార్ తీసేటప్పుడు, 'ఘటోత్కచుని' వేషానికి ముందుగా వీరిని తీసుకున్నారు. కే.వి.రెడ్డి గారు అన్నారుట 'ఆ వేషానికి వేరే ఆప్షన్ లేదు' అని. మాయాబజార్ అంత రసవత్తరంగా తయారు కావటానికి ముఖ్యకారకులలో అతిముఖ్యుడీయన! అలా నిర్విరామంగా వీరి నటయాత్ర తెలుగు, తమిళరంగాలలో కొనసాగింది. వీరు నటించిన నర్తనశాల లోని కీచకుని వేషానికి పలువురి ప్రశంసలు లభించింది. సతీ సావిత్రి అనే సినిమా తీసేటప్పుడు, చైనా ప్రధాని చౌ యెన్ లై , వీరిని సెట్లో యముని వేషంలో చూసి ఆశ్చర్య చకితులయ్యారట! జకార్తాలో జరిగిన ఇండోనేసియా ఫిలిం ఫెస్టివల్ లో, వీరి కీచకుని వేషానికి ఉత్తమ నటుని అవార్డుతో పాటుగా బంగారు పతకం కూడా దక్కింది. ముఖ్యంగా పౌరాణిక సినిమాలలో ప్రతినాయకుడిగా నటించి తనదైన ఒక ప్రత్యేక బాణీని ప్రవేశపెట్టారు.

రావణ బ్రహ్మ, దుర్యోధనుడు, హిరణ్యకశిపుడు, మాయల పకీరు, మున్నగు వేషాలు వీరిని తెలుగు ప్రేక్షకుల గుండెలపై చిరస్థాయిగా కూర్చో పెట్టాయి. సంభాషణల ఉచ్చారణ, పలికే విధానం, మాటల విరుపు, హావభావాలు మరెవరి తరంకావు. ఎంత మహా నటుడినైనా Dominate చేయ గల సత్తా సామర్ధ్యం వీరి సొంతం. వీరితో నటించాలంటే ఆనాటి అగ్రనటులు సైతం భయపడేవారు, ఒక్క సావిత్రి తప్ప! ఆయన సమకాలీనుడైన గుమ్మడి గారి మాటల్లో చెప్పాలంటే, ఇటువంటి నటుడు పొరపాటున మన దేశంలో పుట్టాడు, మరే దేశంలోనైనా పుట్టివుంటే ప్రపంచపు నటులలోనే మేటి నటుడయ్యే వాడు! ఇంతకన్నా గొప్ప అవార్డు, రివార్డ్ ఏమున్నది? వీరు నటించిన "బంగారు పాప" (1955) ఆర్థికంగా విజయం సాధించక పోయినా మంచి చిత్రంగా పేరు తెచ్చుకుంది. ఈ చిత్రంలో ఎస్.వి.రంగారావు గారి నటనను, లండన్‌లో చూసిన చార్లీ చాప్లిన్, ఇలియట్ "బ్రతికి ఉంటే చాలా సంతోషించి ఉండేవాడని" అన్నారు.(జార్జి ఇలియట్ రాసిన "సైలాస్ మార్నర్" అన్న ఆంగ్ల నవల 'బంగారుపాప'కు ఆధారం.)

చాలా సాంఘిక, చారిత్రిక, పౌరాణిక సినిమాలలో విభిన్న పాత్రలు పోషించి తనకు తానే సాటి అని అనిపించుకున్నారు రంగారావుగారు. బంగారు పాప అనే సినిమాలో ఒక గుడ్డివాని వేషం వేస్తున్నారు, అదే సమయంలో NTR గారు చిరంజీవులు అనే సినిమాలో గుడ్డివాని వేషం వేస్తున్నారు. ఇద్దరూ కలిసి పొద్దున్నే, మద్రాస్ రైల్వే స్టేషన్ కి వెళ్లి, గుడ్డి వారి హావభావాలు పరిశీలించేవారట! అలా సమాజంలో ఉన్న వ్యక్తులను పరిశీలించటం వల్లనే, వారి నటన అతి సహజంగా ఉండేది! ఆ రెండు సినిమాలలో వారి నటన అందరి మన్ననలను పొందిన విషయం మనందరికీ తెలిసినదే! తెలుగులో NTR నటించిన 'కథానాయకుడు' సినిమా ఎంత విజయం సాధించిందో మనందరికీ తెలిసిన విషయం. అందులో నాగభూషణం గారు ప్రతినాయకుడి పాత్రను అద్భుతంగా నటించారు. అదే సినిమాను తమిళంలో మళ్ళీ తీసేటప్పుడు, నాగభూషణం వేసిన పాత్రను తమిళ సినిమాలో SVR వేసారు. కేవలం SVR నటన వల్లనే ఆ సినిమా తెలుగులో కన్నా ఘనవిజయం సాధించింది! తమిళం కూడా అనర్గళంగా మాట్లాడే ఆయన, తమిళ సినిమాలలో నటించేటప్పుడు తమిళులు చాలామంది, వీరు మా తమిళుడే అని భావించేవారట! అగ్రనటులతో సమానంగా వీరు పారితోషికం తీసుకునే వారట!



రంగారావు గారిని గురించి     శ్రీ ధర్మవరపు సుబ్రహ్మణ్యం గారు

నాకు ఎస్వీరంగారావు గారంటే ప్రాణం. స్క్రీన్‌పై ఆయనుంటే పక్కన ఎంతమంది ఉన్నా మనం ఆయన్నే చూస్తాం. రంగారావుగారి ఆంగిక, వాచకాభినయాలను అనుకరించాలన్నా, అనుసరించాలన్నా సాధ్యంకాదు. ఆయన డైలాగ్ చెబుతుంటే, శృతిశుద్ధంగా ఉంటుంది. రంగారావుగారికి పలికినంత అలవోకగా డైలాగ్ లు     చాలా తక్కువమందికి పలుకుతాయి. తెలుగువాడిగా పుట్టిన కారణంగానే ఆయన ఎక్కువ జాతీయ పురస్కారాలకు నోచుకోలేకపోయారు. అదే ఏ హాలీవుడ్‌లోనో పుట్టుంటే, ఆస్కార్‌ను సొంతం చేసుకునేవారు. కీచకుడు, దుర్యోధనుడు, మాంత్రికుడు, రావణాసురుడు, బీదవాడు, జమిందార్... ఒకటేంటి, ఏ పాత్ర చేసినా ఆ పాత్రగా మారిపోయే మహానటుడాయన. ఎన్టీఆర్ లాంటి ఉద్దండ నటుడితో ఢీ అంటే ఢీ అని నటించిన మేరునటధీరుడు ఎస్వీఆర్. ఆయన సినిమాల్లో ఎక్కువసార్లు చూసిన సినిమా నర్తనశాల. ఓ యాభై సార్లకు తగ్గకుండా చూసాను. ఎన్నిసార్లు చూసినా కొత్తగా అనిపిస్తుంది.

వీరికి ముగ్గురు సంతానం. ఇద్దరు ఆడపిల్లలు(విజయ,ప్రమీల) ఒక కుమారుడు(కోటేశ్వరరావు). నిర్మాతగా కూడా మారి విజయవంతమైన నాదీ ఆడజన్మే!, చదరంగం, బాంధవ్యాలు, సుఖదు:ఖాలు లాంటి చక్కని     సినిమాలను తీసారు. చదరంగం, బాంధవ్యాలు--సినిమాలకు దర్శకత్వం కూడా వహించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు, పలు సంస్థల నుండి చాలా అవార్డ్స్, బిరుదులు పొందారు. అకస్మాత్తుగా, తీవ్రమైన గుండెనొప్పి వచ్చి, ఉస్మానియా హాస్పిటల్ లో వైద్యం తీసుకునే సమయంలో, మళ్ళీ మరొక్కసారి     గుండెనొప్పి చేత 18-03-1974 న తుదిశ్వాస విడిచారు. తన నటన చేత మనం ఇచ్చే డబ్బులకు మించి మనకు ఆనందం పంచిన ఈ మహానుభావుడు, మనకింకలేరు అన్నది తట్టుకోలేని నిజం! గుమ్మడి గారన్నట్లు, ఏ దేశంలోనో పుట్టి ఉంటారు! మళ్ళీ మనం ప్రపంచపు మేటి నటుడిని చూస్తామన్న మాట!

ఆ మహానటుడికి నా ఘనమైన నివాళి!!!

*********************************************



సుశాస్త్రీయం - లోపలి మనిషి - టీవీయస్.శాస్త్రి

Insider

మనలో మరో మనిషి ఉంటాడు.(అది 'అంతరాత్మ' కాదు) వాడు చాలావరకు ఇతరులకు కనపడకుండా జాగ్రత్త పడుతాడు.కారణం, మనం పైకి మంచిగా కనపడాలని చాలా తాపత్రయ పడుతాం. వాడు మాత్రం కొన్ని వేళలో మనం పైకి కనిపించేదానికి పూర్తి భిన్నంగా ఉంటాడు. లోపలున్న మనిషి పూర్తి మృగామూ కాదు, పూర్తి మనిషీ కాదు. రెండు రూపాలు, లక్షణాలు వాడిలో ఉంటాయి.'

అవకాశాలు లేక, చాలామంది ఈ దేశంలో నిజాయితీ పరులుగా ఉన్నారు కానీ, అవకాశాలుంటే వాళ్ళలో ఎంతమంది నిజాయితీగా ఉంటారు?' అని ముళ్ళపూడి వెంకటరమణ గారు ఒక సినిమాలో వ్రాసినట్లు నాకు గుర్తు. లోపలి మనిషిలోని మృగ లక్షణాలు, చీకట్లో బయట పడుతాయి. అంటే,సమాజం నిద్రించే వేళలో. చూడండీ! త్రాగుడు, వ్యభిచారం, మానభంగాలు, అక్రమసంబంధాలు, హత్యలు, దోపిడీలు,...ఇలాంటి ఆకృత్యాలన్నీ చీకట్లోనే ఎక్కువగా జరుగుతుంటాయి. అప్పుడు వాడిలోని మృగ లక్షణాలన్నీ విజ్రుంభించుతాయి. సమాజం మేల్కొనగానే, వాడు చాలా పెద్దమనిషిగా కనపడాలని తెగ తాపత్రయ పడిపోతాడు. కానీ, మనం వాడిలోని మృగాన్ని ఇట్టే గుర్తించగలం -- మత్తుగా కనపడే కళ్ళు, స్పష్టతలేని భావాలు, రూపం --మొదలగు లక్షణాలను చూసి. అందరిలోనూ ఇలానే ఉండడు, Insider.

కొంతమందిలో చాలా అద్భుత మైన వాడు ఉంటాడు. అప్పుడప్పుడూ, వాడు వాళ్ళను దాటి బయటకు వస్తాడు. ఉదాహరణకు, ఒక వ్యక్తితో మనకు కొంత సాన్నిహిత్యం ఏర్పడిన తర్వాత, అతనూ మనమూ స్వేచ్ఛగా, నిర్భయంగా మాట్లాడుకునే

సందర్భంలో, అసలు సంభాషణ జరిగేది 'లోపలి మనుషుల' మధ్యే! ఈ మధ్య నాకొక మిత్రుడు, పరిచియమై ఆనతికాలంలోనే సన్నిహితుడుగా కూడా అయ్యాడు. అతనిలో ఒక రచయిత ఉన్నట్లు నేను గుర్తించాను. పలు మార్లు ఆ మిత్రునికి, వివరించాను కూడా!' నీ లోపలి మనిషికి బయటకు రావటానికి కొద్దిగా దారి ఇవ్వమని' అతనో లేక అతనిలోని 'లోపలి మనిషో' సంఘర్షణ పడుతున్నారు, తటపటాయిస్తున్నారు.

లోపలున్న మనిషి ఉక్కపోసి ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్లుగా నాకనిపిస్తుంది. వాడు కనుక ఒక్కసారి బయటకు వస్తే, వాడు ఆ వ్యక్తినే కాదు, సమాజాన్ని కూడా ప్రభావితం చేస్తాడు. ఇది నిజం. మనమందరమూ కవులుగా అనుభూతి చెందకపోతే, కవిత్వాన్ని ఆస్వాదించలేం! అలాగే అన్ని కళలలోనూ అంతే. ఇవన్నీ, ఎలా చెబుతున్నానంటే--నేను అనుభవించినవి, నాకు అనుభవమైనవే ఎక్కువగా నేను చెబుతుంటాను. అప్పుడే అవి సహజంగా, నిజాయితీగా ఉంటాయి.

ఈ మధ్య నేను 'భవాని' అనే నాటకాన్ని చూసాను. అందులో 'శివాజీ' పాత్రను పోషించినవాడు నాకు స్నేహితుడు. ఆ నాటకంలో వాడు నటిస్తున్నట్లు నాకు చెప్పలేదు. 'మంచి నాటకం మా స్నేహితులు వేస్తున్నారు, మీరూ తప్పక రండి' అని మాత్రమే వాడు నాకు చెప్పాడు. నాటకం చూసి బిత్తర పోయాను. శివాజీ వేషం వేసిన వాడు నా మిత్రుడే! అద్భుతంగా నటించాడు. Dialogue delivery, modulation, హావ భావాలు నన్ను మంత్రముగ్ధుడిని చేసాయి. నాటకం అయిపోగానే, వాడిని ఆలింగనం చేసుకొని 'నీలో ఇంత చక్కని నటుడు ఉన్నాడని నాకు ఇంత కాలం ఎందుకు చెప్పలేదురా?' అని వాడిని ప్రశ్నిస్తే, 'నాకు ఇదే మొదటి నాటకానుభవం' అని చెప్పి నన్ను ఆశ్చర్యంలో ముంచెత్తాడు.

ఎందుకు చెబుతున్నానంటే, వాడి లోపల ఉన్న నటుడిని వెలుపలికి తీసుకొచ్చిన 'లోపలి నటుని' మేధస్సు ఎంత గొప్పదో! చాలా మందికి చక్కని భావాలు ఉంటాయి, ఉన్నాయి. అయితే వాటికి అక్షరరూపం ఇవ్వటానికి ఎందుకో తటపటాయిస్తుంటారు. ఒక్కసారి మీ లోపలిమనిషికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చి, వాడు ఏది చెబితే అది వ్రాయండి. మీరు వ్రాసింది బాగుందో లేదో కూడా మీకు మొట్ట మొదట చెప్పేది వాడే! వాడిని గురించి ఎందుకు ఆలోచించరూ? ఎందుకు వాడిని బయటకు రానివ్వరూ? ఇలా ఎంతకాలం మనం వాడిని బయటకు రాకుండా ఉంచుతాం? దానికి కారణాలు ఏమిటి? వాడికి 'స్వేచ్ఛ' ఎందుకు ఇవ్వరూ? మనం వాడికి స్వేచ్ఛ ఇవ్వటం లేదంటే, మనలోని భావాలను వాడు అంగీకరించటంలేదన్న మాట. కాకపోతే, మనలో ఉన్నవి సంకుచిత భావాలైనా కావచ్చు!

మీరే ఆలోచించండి!

( ఈ రచన వ్రాయటానికి నాకు ప్రేరణ, శ్రీ పి.వి.నరసింహారావు గారు వ్రాసిన.'Insider' అనే గ్రంధం. అందులోని 'ఆనంద్' అనే పాత్ర ఆయనిదే! సహజంగా గొప్ప పండితుడు కావటం చేత ఆ గ్రంధం, మనల్ని పూర్తిగా చదివింప చేస్తుంది. ఒక విధంగా చెప్పాలంటే,

ఇది ఆయన 'ఆత్మకథ' )

*********************************************




రంగస్థల మహానటుడు - శ్రీ పీసపాటి నరసింహమూర్తి గారు - టీవీయస్.శాస్త్రి

peesapati narasimha murthy

శ్రీ పీసపాటి నరసింహమూర్తి గారు(1920 -2007) ప్రముఖ రంగస్థల నటుడు. తెలుగు నాటకరంగంపై శ్రీ కృష్ణుడుగా తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని కల్పించుకున్న నటుడు.పద్యగానంలో తనకంటూ ఒక ఒరవడిని సృష్టించుకున్న నటుడు. శ్రీ పీసపాటి నరసింహమూర్తి గారు, విజయనగరం జిల్లా, బలిజపేట మండలం, వంతరం అనే గ్రామంలో 1920 జూలై 10 న జన్మించారు.

1938 లో 'రంగూన్ రౌడి' నాటకంలో కృష్ణమూర్తి పాత్ర ద్వారా శ్రీ పీసపాటి నాటకరంగంలోకి అడుగుపెట్టారు. 1946 లో 'పాండవోద్యోగ విజయాలు' నాటకంలో మొదటిసారిగా శ్రీకృష్ణుడి పాత్రను వేసారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఆయనకు రెండు పర్యాయాలు సంగీత నాటక అకాడమీలో సభ్యత్వం ఇచ్చి గౌరవించింది. 'అజోవిభో' వారు వీరికి 'ప్రతిభామూర్తి' అవార్డును యిచ్చి

గౌరవించారు. దాదాపు ఏడు దశాబ్దాలపాటు వేలాది ప్రదర్శనలు ఇచ్చిన శ్రీ పీసపాటి జాతీయ స్థాయిలో కూడా గుర్తింపును పొందారు.

పాండవోద్యోగ విజయాలులతో పాటు, గౌతమబుద్ధ, లవకుశ, చింతామణి, తారాశశాంకం... లాంటి నాటకాలు అనేకం ఆడిన శ్రీ పీసపాటికి ఎనలేని కీర్తిని తెచ్చిపెట్టింది ఆయన ధరించిన శ్రీ కృష్ణ పాత్రే! అత్యుత్తమ కృష్ణునిగా 'ఉద్యోగ విజయాలు' నాటక రచయితల్లో ఒకరైన శ్రీ చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి గారి నుండి అవార్డును అందుకోవటం, టంగుటూరి ప్రకాశంగారి నుండి నటరాజు విగ్రహాన్ని బహుమతిగా పొందటం, బిలాస్ పూర్ లో తెలుగురాని ఒక బెంగాలీ జంట నాటకం చూసి, గ్రీన్ రూంలో ఆయనను తనివితీరా ముద్దాడటం ... మొదలైన సంఘటనలు తన జీవితంలో మరువలేనివిగా వారు పేర్కొన్నారు.

పద్యగానంలో శ్రీ పీసపాటి గణనీయమైన మార్పులు తీసుకొని వచ్చారు. తెలుగు పౌరాణిక నాటకాల్లో పద్యాలను సుదీర్ఘమైన రాగాలలో పాడటం అలవాటుగా ఉండేది. ఒక నిముషం పద్యానికి ఐదేసి నిముషాల రాగం తీసి పాడటం ఆనవాయితీగా ఉండేది. శ్రీ పీసపాటివారు, ఆ పద్ధతిని విడనాడి, అనవసరమైన సాగతీతలను విసర్జించి, సాహిత్యానికి ప్రముఖ స్థానం కల్పిస్తూ పద్యాలు పాడి ప్రజలను అలరించారు. పీసపాటి వేషధారణలో కూడా మార్పులు తీసుకొనివచ్చారు. దేహానికి అంటిపెట్టుకొని ఉండే నీలపురంగు చొక్కాను ధరించి నిజంగా నీలపు కృష్ణుడనే అనే భావనను కలిగించారు.

పీసపాటి 1987 లో బొబ్బిలి మండలంలోని రాముడువలస అనే గ్రామానికి సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పద్య నాటకాలలో నటనాచాతుర్యంతో పాటుగా, పద్యాన్ని అర్థవంతంగా చదివి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసి, వారిని నాటకంలో పూర్తిగా లీనం చేయగలిగిన సమర్థుడు శ్రీ పీసపాటి. వేషభాషలు కూడా చక్కగా ఉండేవి. ఒక విధంగా చెప్పాలంటే, వీరు 'పండితుల నటుడు'. ఈయన నాటకంలో ఒన్స్ మోర్ పద్యాలు ఉండవు. కేవలం ఆంగిక, వాచికాభినయంతో నాటకాన్ని మొత్తాన్ని తన ఆధీనంలోకి తీసుకోగల మహానటుడు శ్రీ పీసపాటి.

వారితో నా ప్రత్యక్ష పరిచయం

అవి నేను గుంటూరు జిల్లాలోని గురజాలలో పనిచేస్తున్న రోజులు. శనివారం రాత్రి 'గయోపాఖ్యానం' నాటక ప్రదర్శన. ఆ నాటకం వేయించే కాంట్రాక్టర్ నాకు బాగా పరిచయస్తుడు. శ్రీ పీసపాటి వారు నిష్టాగారిష్టుడు. శ్రీ పీసపాటి వారికి మా ఇంటిలో బస ఏర్పాటు చేసారు. పీసపాటివారు శనివారం ఉదయాని కల్లా గురజాలకు వచ్చారు. స్నానపానాదులు ముగించుకొని, సంధ్యావందనం చేసుకొని తీరికగా కూర్చున్నారు. వారు తన గొంతును గురించి అనేక జాగ్రత్తలను తీసుకునేవారు. నా భార్యకు ఆయన ముందుగానే ఆయన తినేవి, తినకూడనవి వివరంగా చెప్పారు. శనివారం రాత్రి 10 గంటలకు నాటకం. ఎనిమిది గంటలకల్లా-- ఇడ్లీ, అల్లపు చట్నీ, కారప్పొడి, నెయ్యి వేసుకొని స్వల్పాహారం తీసుకున్నారు. కొబ్బరి చట్నీ నిషిద్ధం.

ఆయన నాటక వేషానికి సంబంధించిన పెట్టెను తీసి వేషానికి సంబంధించిన డ్రస్సును నాకు చూపించారు. మాటల సందర్భంలో నేను వారిని ఒక ప్రశ్న అడిగాను. అది ఏమిటంటే-- నటుడికి కావలసిన ముఖ్య లక్షణం ఏమిటని? అందుకు వారు సవివరంగా ఇలా చెప్పారు, "నటుడికి ముందుగా తను వేయబోయే పాత్రకు సంబంధించిన పూర్తి అవగాహన చాలా అవసరం. బావయుక్తంగా, అక్షరదోషాలు లేకుండా మాటలను చెప్పాలి. పాత్రకు తగ్గ ఆంగికాబినయం చాలా ముఖ్యం." వారితో పాటుగా నేనూ నాటకానికి బయలు దేరి వెళ్లాను. గ్రీన్ రూంలో ఆయన మేకప్ చేసుకునే విధానం చూసి అబ్బురపడిపోయాను. సాక్షాత్తు శ్రీ కృష్ణుడు లాగానే ఉన్నారు. నాటకాన్ని మొదటినుండి చివరివరకు అతి శ్రద్ధగా చూసి ఆనందించాను. కొన్ని సాంఘిక నాటకాల్లో కూడా నటించారు.

శ్రీ రావి కొండలరావు గారి పర్యవేక్షణలో, 'మా టీవీ' వారు 'కన్యాశుల్కం' నాటకాన్ని సీరియల్ గా తీసారు. అందులో శ్రీ గొల్లపూడి మారుతీరావుగారు గిరీశంగా, చల్లా జయలలితగారు మధురవాణిగా, శ్రీ పీసపాటివారు లుబ్ధావధానులుగా నటించారు. కొన్ని ఎపిసోడ్సు మాత్రమే వచ్చినట్లు, అసంపూర్తిగా ఆగిపోయినట్లు గుర్తు. ఆ సీరియల్ లో అందరికన్నా విశేష నటనా ప్రతిభ కనబరచినవారు పీసపాటి వారే! బహుశా: ఆయన వయసుకు తగ్గ పాత్ర కూడా కావటం వల్లనేమో, వారు మాటలు పలికే తీరు కూడా బాగుంది. అలా కేవలం పండితుల ప్రశంసలు అందుకున్న ఈ నటశేఖరుడు మంచి నటుడే కాదు పండితుడు కూడా!

శ్రీ పీసపాటివారిని గురించి శ్రీ గొల్లపూడి మారుతీరావు గారు

నా 68 వ సంవత్సరములో నేను గిరీశంగా, నా అన్నగారి పాత్ర అయిన లుబ్ధావధానులుగా ప్రఖ్యాత నటుడు శ్రీ పీసపాటివారితో కలసి నటించటం నా పూర్వజన్మ సుకృతం. ఆప్పుడు వారి వయసు 86 సంవత్సరాలు. శ్రీ రావి కొండలరావుగారి దర్శకత్వంలో నటించటం మరో అదృష్టంగా బావిస్తాను.

శ్రీ పీసపాటి నరసింహమూర్తిగారు,28-09-2007 న అమరలోకానికేగారు.ఆ మహానటుడికి నా ఘనమైన నివాళి!

*********************************************




సుశాస్త్రీయం -'మంచి గుమ్మడి' - టీవీయస్. శాస్త్రి

gummadi venkateshwara rao

నటుడన్న తరువాత అన్ని పాత్రలను పోషించి మెప్పించాలి. తండ్రిగా, రైతుగా, జమీందారుగా, తేనెపూసిన కత్తిలాంటి విలన్ గా... మరెన్నో విభిన్నమైన పాత్రలను పోషించి తెలుగు వారి మన్ననలను పొందిన 'మంచి గుమ్మడి పండు' లాంటి నటుడు శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావు గారు. అన్ని పాత్రలకూ న్యాయం చేకూర్చి నప్పటికీ, ప్రేక్షకులు మాత్రం వారిని సాత్వికమైన పాత్రల్లోనే చూడటానికి ఇష్టపడేవారు. బహుశా:ఆ పాత్రలు ఆయన స్వభావానికి దగ్గరగా ఉండటం వల్లనేమో! తెలుగు భాషను ఎంత మధురంగా పలకాలో ఈ తరం నటీనటులు నేర్చుకోవాలంటే, వారి సినిమాలన్నిటినీ చూసి తీరవలసిందే!

సినిమా రంగంలో 'గుమ్మడి' గా ప్రసిద్ధి చెందిన వీరు, అయిదు దశాబ్దాల పాటు తెలుగు చలన చిత్ర రంగంలో విభిన్న పాత్రలను పోషించి, తన ప్రత్యేకతను చాటుకున్నారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంచేత 'రఘుపతి వెంకయ్య' అవార్డును స్వీకరించారు. దాదాపుగా 500 లకు పైగా సినిమాలలో నటించారు. చలనచిత్ర రంగానికి వీరు చేసిన సేవలను గుర్తించి శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంవారు, ఈ మహానటునికి 'కళాప్రపూర్ణ' అనే బిరుదును ఇచ్చి సత్కరించారు. గుమ్మడి వెంకటేశ్వరరావు గారు అంటే తెలియనివారు తెలుగునాట ఉన్నారంటే నమ్మశక్యం కాని విషయం. అద్వితీయమైన నటనతో చిత్రసీమలో ఆయన తనకొక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. పౌరాణిక, సాంఘిక, జానపద, చారిత్రిక పాత్రలన్నిటిలోనూ విశేష ప్రతిభను

కనబరచారు. తండ్రిగా, అన్నగా, తాతగా--- వేషమేదైనా దానిని పండించటం ఆయనకు కరతలామలకం. ప్రేక్షకులు ఆయనను ఎక్కువగా కరుణరస పాత్రల్లోనే చూడటానికి ఇష్టపడేవారు. తెలుగువారి పంచకట్టులోని హుందాతనాన్ని చూపించటమే కాకుండా, 'అచ్చమైన తెలుగువాడంటే ఇలానే ఉండాలి' అనిపించేటట్లు వుండేవారు.

NTR తో నటించిన 'తోడుదొంగలు' (1954 ), 'మహామంత్రి తిమ్మరుసు' (1962) సినిమాలు గుమ్మడికి నటుడిగా మంచి పేరు తెచ్చిపెట్టాయి. 'తోడుదొంగలు' కు రాష్ట్రపతి బహుమతి రాగా, 'మహామంత్రి తిమ్మరుసు' లో ఆయన నటనకు జాతీయ స్థాయిలో ఉత్తమ సహాయ నటుడిగా బహుమతి వచ్చింది. 'మాయాబజార్' (1957), మాయింటి మహాలక్ష్మి(1959), కులదైవం(1960), కులగోత్రాలు(1962), జ్యోతి(1977), నెలవంక(1981), మరోమలుపు(1982), ఏకలవ్య(1982), ఈ చరిత్ర ఏ సిరాతో(1982), గాజుబొమ్మలు(1983), పెళ్ళిపుస్తకం(1991)... గుమ్మడికి పేరు తెచ్చిపెట్టిన సినిమాలలో కొన్ని మాత్రమే! తెలుగు విశ్వవిద్యాలయంవారు, మహామంత్రి తిమ్మరుసు లోని ఆయన కనబరచిన విశేష నటనా ప్రాభవానికి గుర్తింపుగా, డాక్టరేటుతో సన్మానించింది. 1982 లో 'మరోమలుపు' లోని నటనకు, ఉత్తమ సహాయ నటుడిగా రాష్ట్ర ప్రభుత్వంచేత నంది అవార్డును బహుమతిగా పొందారు. జాతీయ సినిమా బహుమతులకు న్యాయ నిర్ణేతగా మూడు సార్లు, రెండు సార్లు నంది అవార్డుల న్యాయ నిర్ణేత సంఘానికి అధ్యక్షునిగా పనిచేశారు. NTR అవార్డు, రఘుపతి వెంకయ్య అవార్డుల సంఘాలకు కూడా న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. ఆయన తన జీవితచరిత్రను 'తీపిగుర్తులు - చేదు జ్ఞాపకాలు' అన్న పేరుతో రచించారు. 1995లో ఆరోగ్యం సరిగాలేక, గొంతు సరిగా పనిచేయనప్పుడు, ఇతరుల గొంతును అరువు తీసుకోవటం ఇష్టంలేక నటించటం మానుకున్నారు. మరల శ్రీ జగద్గురు కాశినాయన చరిత్ర(2008)లో, ఆయన వయసు, గొంతు - ఆ పాత్రకు సరిపోవటం వల్ల నటించారు. అదే ఆయన ఆఖరి సినిమా.

గుమ్మడి స్వగ్రామం, తెనాలి దగ్గర రావికంపాడు అనే ఒక చిన్న గ్రామం. ఈయన ఒక సామాన్య రైతు కుటుంబంలో, 09-07-1927న బసవయ్య, బుచ్చమ్మ దంపతులకు జన్మించారు. గుమ్మడి గారికి ముగ్గురు తమ్ముళ్ళు, ఒక చెల్లెలు ఉన్నారు. గుమ్మడి గారి బాల్యమంతా గారాబంగా గడిచింది. ఉమ్మడికుటుంబ వాతావరణంలో పెరిగిన గుమ్మడి జీవితం ఆయన నటజీవితంలో ప్రతిఫలించి, సాత్విక పాత్రలలో ఆయన జీవించటానికి సహకరించింది. తన తండ్రి బసవయ్య, పెదనాన్న నారయ్య గార్లు రక్తసంబంధంతోనే కాకుండా స్నేహానుబంధంతో మెలిగేవారని గుమ్మడి మాటల్లో తెలుస్తుంది. గుమ్మడి ప్రారంభ విద్య నుండి స్కూల్ ఫైనల్ వరకు స్వంత వూరు అయిన రావికంపాడుకు మూడు కిలోమీటర్ల దూరంలో వున్న కొల్లూరు ఉన్నత పాఠశాలలో జరిగింది. అక్కడనే ఆయన SSLC దాకా చదివారు. ఈ దశలోనే, తమ గ్రామంలో శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య గారి ఉపన్యాసం వల్ల ప్రభావితుడయ్యి, కమ్యూనిష్టు పార్టీ పట్ల ఆకర్షితుడయ్యాడు. గుమ్మడి SSLC లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు అయ్యారు. తరువాత విద్యాభ్యాసాన్ని గుంటూరులోని హిందూ కాలేజిలో కొనసాగించాలని ఎంతో అభిలాషించినా, ఆయన దారితప్పి కమ్యూనిష్టు ఉద్యమం వైపు ఆకర్షితుడవుతాడని భయపడి, పెద్దలు దానికి అంగీకరించలేదు. అదీగాక, ఆయనకు వివాహ ప్రయత్నాలను మొదలు పెట్టారు. అప్పుడు ఆయన వయసు 17 సంవత్సరములే! ఆయన వివాహం 1944 లో పెద్దల సమక్షంలో నాయనమ్మకు అమ్మమ్మ అయిన 103 సంవత్సరాల వృద్ధురాలు, నాయనమ్మ, అమ్మమ్మ వంటి పెద్దల ఆశీర్వచనంతో జరిగింది. గుమ్మడిని తన కుమారుడిగా భావించిన ఆయన అత్తగారు, ఆయన విద్యాభిలాషను గమనించి, వివాహానంతరం గుంటూరులోని హిందూ కాలేజిలో ఉన్నత విద్యాభ్యాసానికి సహకరించింది. అత్తగారి సహకారంతో గుంటూరు, హిందూ కాలేజిలో

ఇంటర్ వరకు(1944-46) చదువు సాగింది. ఆయన సహవిద్యార్థి, ప్రముఖ చలనచిత్ర నటి సీనియర్ శ్రీరంజని కుమారుడైన యమ్. మల్లికార్జునరావు సాహచర్యంతో ఆయనలో కలిగిన విపరీతమైన సినిమా వ్యామోహం వలన, ఇంటర్ పరీక్షలో అపజయం పాలైనారు. ఈ అపజయం వలన, అవకాశం కోసం చూస్తున్న పెద్దలు వారిని వెనుకకు పిలిపించి వ్యవసాయపు పనులను అప్పగించారు. అంతటితో ఆయన విద్యార్థి జీవితం ఒక ముగింపుకు వచ్చింది.

గుమ్మడి గారి రంగస్థల జీవితం యాదృచ్ఛికంగా ప్రారంభం అయింది. ఆయన ఎనిమిదవ తరగతి చదువుతున్న రోజులలోనే, ఉపాధ్యాయుని ఆదేశంతో పేదరైతు అనే నాటకంలో వయోవృద్ధుడైన రైతు పాత్రను పోషించారు. ఆ నాటకంలో అయన నటనకు మంచి గుర్తింపు లభించింది. అలా ఆయన రంగస్థల ప్రవేశం జరిగింది. ఒకసారి ఆయన వీరాభిమన్యు నాటకం చదవటం తటస్థించింది. ఆ కాలంలో పద్య నాటకాలకు ఎక్కువ ఆదరణ వుండేది. వీరాభిమన్యు నాటకంలో వచనం ఎక్కువగా వుండటం చేత, ఆ నాటకం వీరిని బాగా ఆకర్షించింది. కొంతమంది స్నేహితులను కూర్చుకొని స్వంత ఖర్చుతో ఆ నాటకాన్ని రంగస్థలానికి ఎక్కించి, అందులో తాను దుర్యోధనుడి పాత్రను అభినయించారు. ఆ నాటకానికి లభించిన ప్రాచుర్యం ప్రముఖ దుర్యోధన పాత్రధారి శ్రీ మాధవపెద్ది వెంకటరామయ్య గారి దాకా చేరింది. ఒకసారి ఆయనను, శ్రీ మాధవపెద్ది వెంకటరామయ్య్య గారే స్వయంగా పిలిచి, దుర్యోధన పాత్రను మరింత రసవత్తరంగా నటించటం గురించి వివరించి ఆశ్చర్యపరిచారు. ఆ తరువాత వారిరువురికీ పెరిగిన పరిచయం, శ్రీ మాధవపెద్ది వెంకటరామయ్య గారి నాటకంలో గుమ్మడి గారు దుర్యోధన పాత్ర , మాధవపెద్ది వారు కర్ణ పాత్రను నటించేవరకు వెళ్ళింది. ఆ నాటకంలో నటించిన అనంతరం, ఆయన గుమ్మడితో, "నాటకంలో బాగా నటించావు. కాని, నాటకంలో నటించటానికి కావలసిన ఆంగికాభినయం కంటే సాత్వికాభినయం నీలో ఎక్కువగా ఉంది. సినిమాలలో ప్రయత్నిస్తే, అభివృద్ధిలోకి వస్తావు" అని సలహాను ఇచ్చారు. సినిమాల మీద గుమ్మడిగారికి ఉన్న వ్యామోహం, వెంకటరామయ్య గారి సలహాతో మరీ ఎక్కువైంది.

ఆ తరువాత గుమ్మడి మనసు సినిమాలవైపు మళ్ళింది. గుమ్మడి హై స్కూల్ లో చదువుకునే రోజుల్లో ఆయన తెలుగు మాస్టర్ గారైన శ్రీ జాస్తి శ్రీ రాములుగారి వల్ల, ఆయనకు తెలుగు భాషపై మక్కువ పెరిగింది. ఆ కాలంలో ఆయన తెనాలిలో, ఆంధ్రా రేడియోస్ అనే వ్యాపార సంస్థను ప్రారంభించారు. వ్యాపారం పెట్టినా, నటనా వాసనలు ఆయనను వదలని కారణంగా, ఆయన షాపు నాటక సమాజానికి కార్యాలయంగా మారింది. వ్యాపారంలో నష్టాలను చవిచూసారు. కుటుంబం ఇద్దరు పిల్లలవరకు పెరిగింది . తెనాలిలో ఆయనను కలసిన ఆయన సహవిద్యార్థి, మిత్రుడు మల్లికార్జునరావు సినిమాలలో నటించమని సలహాను ఇచ్చాడు. గుమ్మడి, మల్లికార్జునరావుగారితో కలసి తొలిసారి మద్రాసుకు ప్రయాణ మయ్యారు. మద్రాసులో, శ్రీ కే. వీ. రెడ్డి, యెచ్. యమ్. రెడ్డి వంటివారిని కలసి అవకాశం కోసం వారిని అర్థించి చూసారు. వారి వద్ద నుండి సముఖమైన సమాధానం రాకపోవటం వల్ల తిరిగి తెనాలికి వెళ్లి యధావిధంగా జీవితం సాగించారు. శ్రీ డీ. యల్. నారాయణ గారికి గుమ్మడి గారి నటన అంటే ఎంతో ఇష్టం. ఆయనకు ఎప్పుడు సినిమాలలో అవకాశం కల్పించాలా అని తగిన సమయంకోసం చూసేవారు. గుమ్మడిగారి ఫోటోలు ఎప్పుడూ ఆయన జేబులోనే ఉండేవి. తమిళనాడు టాకీస్ అదినేత అయిన సౌందరరాజన్ అయ్యంగారితో మాటల సందర్భంలో, సౌందరరాజన్ అయ్యంగారు తాను తెలుగులో తీయబోయే సినిమాకు కొత్తవాళ్ళు కావాలన్న వెంటనే, శ్రీ డీ. యల్. నారాయణ గారు ఆయన జేబులో ఉన్న గుమ్మడిగారి ఫోటోలను చూపించారు.

వాటిని చూసిన సౌందరరాజన్ అయ్యంగారు గుమ్మడి గారికి అవకాశం ఇవ్వటంపై మొగ్గు చూపటంతో, గుమ్మడి గారి సినిమా జీవితం ఆరంభమైంది. ఆ విషయం గుమ్మడి గారికి తంతి ద్వారా తెలియజేసి, వెయ్యి రూపాయల పారితోషికం కూడా ఇవ్వటానికి నిర్ణయం జరిగింది. ఆ చిత్రం పేరు 'అదృష్ట దీపుడు '(1950). దానిలో గుమ్మడిగారి పాత్ర ముక్కామల గారికి అసిస్టెంట్. రెండవ సినిమా, నవ్వితే నవరత్నాలు. మూడవ సినిమా పేరంటాలు, నాలుగవ సినిమా ప్రతిజ్ఞ. వీటన్నిటిలో చిన్న చిన్న పాత్రలు మాత్రమే లభించాయి. తదుపరి అవకాశాలు లేవని, తిరిగి వెళ్లాలని భావించిన సమయంలో, NTR తో కలిగిన పరిచయంతో, NTR గారు గుమ్మడిని వెళ్ళవద్దని చెప్పారు. తన స్వంత చిత్రం ' పిచ్చిపుల్లయ్య' లో మంచి వేషం ఇచ్చారు. అది ప్రతినాయక పాత్ర. దానితో గుమ్మడి సినీజీవితం మరో మలుపు తిరిగింది. N. T. రామారాగారు, వారి తదుపరిచిత్రమైన 'తోడుదొంగలు ' లో కూడా గుమ్మడిగారికి మంచి పాత్రను ఇచ్చారు. ఆ సినిమా ఆర్థికంగా విజయం సాధించకపోయినా, ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా అవార్డును పొందింది. అలా సాగుతున్న ఆయన సినీ జీవిత ప్రస్థానంలో, మరో మంచి మలుపు 'అర్ధాంగి ' సినిమా. 'అర్ధాంగి' సినిమాలో ఆయన వేషం, జమీందారు మరియు శాంతకుమారి గారి భర్త. ఆ సినిమాలో, దర్శకుడు పుల్లయ్యగారు ఆయనను ఆ వేషానికి ఎన్నిక చేసే సమయంలో శాంతకుమారి గారు అభ్యంతరం చెప్పారు. ఆయన తన కన్నా చిన్న వాడని, తన భర్త పాత్రకు నప్పడని ఆవిడ అభ్యంతరం. పుల్లయ్య గారు, ఎవరు చెప్పినా వినకుండా గుమ్మడి గారినే ఆ పాత్రకు తీసుకున్నారు. ఆ సినిమా అఖండ విజయాన్ని చవిచూసింది.

అక్కడినుండి ఆయన చివరివరకూ నటయాత్రలో వెనక్కు తిరిగి చూసుకోనవసరం లేకపోయింది. చిన్న వయసులోనే కారక్టర్ నటుడయ్యారు. నిజానికి, రామారావు, నాగేశ్వరరావుల కన్నా చిన్నవాడై నప్పటికీ, అనేక సినిమాలలో వారికి తండ్రిగా, మామగా నటించారు. నటించిన ప్రతి పాత్రలో ఒదిగిపోవటం, ఆయన ప్రత్యేకత. అత్యంత వైరుధ్యమైన వసిష్ఠ, విశ్వామిత్ర లాంటి పాత్రలను నటించి ప్రశంసలు పొందారు. కర్ణుడిగా, ధర్మరాజుగా, సత్రాజిత్తుగా, బలరాముడిగా, భ్రుగుమహర్షిగా, భీష్ముడిగా-- పౌరాణిక పాత్రలలో ఆయన కనబరచిన నటన మరువలేనిది. సాంఘిక చిత్రాలలో సాత్విక పాత్రలతో పాటు ప్రతినాయకునిగా (నమ్మినబంటు, లక్షాధికారి, ఇద్దరు మిత్రులు మొదలైనవి) ఆయన కనబరచిన నటన శ్లాఘనీయం. రామారావు గారితో ఆయనకు కుటుంబ సాన్నిహిత్యం కూడా పెరిగింది. ఆయన సలహామేరకు, కుటుంబాన్ని మద్రాసుకు తీసుకొని వచ్చారు. గుమ్మడి గారిగి అయిదుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. బాధ్యతాయుతమైన తండ్రిగా వ్యవహరించారు. కుటుంబ శ్రేయస్సు దృష్ట్యా చిత్రాల నిర్మాణానికి దూరంగా ఉండిపోయారు. కుమార్తె మరణం, భార్య మరణం కొంత బాధను కలిగించినా, తృప్తికరమైన జీవితాన్ని అనుభవించినట్లు వారి మాటల్లో చెప్పుకున్నారు.

మొదటి సినిమాలో నటించే సమయంలో నాగయ్య గారి కార్యాలయంలో ఒక రూములో ఉండే గుమ్మడి, తరువాత తన మకాంను ఒక హోటల్ కు మార్చారు. ఆ సమయంలో TNT ఆఫీసుకు ఎదురుగా వున్న హోటల్ రూములో టీ. వీ. రాజు గారితో కలసివున్న రామారావుగారితో ఏర్పడిన పరిచయం సన్నిహితంగా మారి, ఆ పరిచయం గుమ్మడి గారి నటజీవితానికి పునాది అయింది. అర్ధాంగి సినిమాలో ఆయన భార్యగా నటించిన శాంతకుమారిగారు, ఆయనకన్నా ఎనిమిది ఏళ్ళు, ఆయన కుమారుడిగా నటించిన నాగేశ్వరరావు గారు మూడు ఏళ్ళు పెద్దవారు. ఆయన చిన్నకుమరుడిగా నటించిన జగ్గయ్య గారు ఒక ఏడాది పెద్ద. సినీ జీవితపు తొలినాళ్ళలో, తీసుకొని వచ్చిన డబ్బులు అయిపోయి, రెండురోజులు మంచినీటితో సరిపెట్టుకున్నారు. పెళ్లి నాటి ఉంగరాన్ని తాకట్టు పెట్టి, తరువాతి రోజుల్లో దాన్ని విడిపించుకున్నారు. వారి జీవితంలో

ఇబ్బందిపడ్డ రోజులివే! మహామంత్రి తిమ్మరుసులో ఎన్. టి. ఆర్. శ్రీ కృష్ణదేవరాయల పాత్రను పోషించినా, సినిమాకు గుమ్మడి నటించినపాత్ర పేరు ఉండటం విశేషం. అలాగే, మర్మయోగి సినిమాకు కూడా. ఇవి అరుదైన సంఘటనలు.

'తీపిగుర్తులు - చేదు జ్ఞాపకాలు'

శ్రీ గుమ్మడి తన స్వీయ చరిత్రను, 'తీపిగుర్తులు-చేదు జ్ఞాపకాలు' అనే పేరు మీద వ్రాసుకున్నారు. అందులోనుండి రామారావు గారికే సంబంధించిన రెండు తీపిగుర్తులు-చేదు జ్ఞాపకాలను చెబుతాను.

తీపిగుర్తులు

శ్రీ గుమ్మడి గారికి ఎప్పుడూ చేతిలో సిగరెట్టు ఉండవలసిందే. అవి రామారావు గారు సీతారామకళ్యాణం సినిమాను తీస్తున్న రోజులు. దానికి దర్శకుడు కూడా రామారావు గారే. ఆ సినిమాలో గుమ్మడి గారిది విశ్వామిత్రుడి వేషం. గడ్డం. మీసాలు, చేతిలోదండం, కమండలాలతో అచ్చం విశ్వామిత్రుడు లాగానే ఉన్నారు. విరామం మధ్యలో సిగరెట్టు తాగాలనిపించింది. ఆ వేషం సిగరెట్టు పెట్టె , అగ్గిపెట్టె పెట్టుకోవటానికి అనుకూలంగా లేదు. అదీగాక, ఆ వేషంలో సిగరెట్టు తాగితే రామారావు గారు ఒప్పుకోరు. అప్పుడు గుమ్మడి గారు ఏమి చేసారో తెలుసా? తన సహాయకుడి చేత సిగరెట్టు పెట్టె, అగ్గిపెట్టెను తెప్పించుకొని, వాటిని కమండలంలో పెట్టుకొని, toilet కు వెళ్ళినప్పుడల్లా గబగబా రెండు దమ్ములు పీల్చి వచ్చేవారు. ఆ సినిమాలో మొత్తం ఆయన కమండలంలో మంత్రజలానికి బదులుగా సిగరెట్టుపెట్టె, అగ్గిపెట్టె ఉన్నాయి.

చేదు జ్ఞాపకాలు

నాగేశ్వరరావు, రామారావు గార్ల మధ్య చెలరేగిన వివాదాలు చిలికిచిలికి గాలివానగా మారాయి. గుమ్మడి ఆ సమయంలో ఎక్కువగా నాగేశ్వరరావు గారి సినిమాలలో నటించటం వల్ల, కొన్ని అనుకోని సంఘటనలవల్ల, గుమ్మడి, రామారావుల మధ్య దూరం అధికమయింది. ఆ దూరం ఎంతవరకు పోయిందంటే, గుమ్మడిగారి కుమార్తె వివాహానికి కూడా రామారావు గారు హాజర్ కానంతవరకు! ఇందుకు తాను ఎంతో బాధపడినట్లు గుమ్మడిగారు ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. చిట్టిచెల్లెలు అనే సినిమాలో వారిద్దరూ, తండ్రీ కొడుకులుగా కలసి నటించినప్పటికీ, వారిద్దరూ కలసి నటించే దృశ్యాలు లేకుండా ఆ సినిమాను తీయటం జరిగింది. కాలగతిలో, నాగేశ్వరరావు, రామారావు గార్ల మధ్య ఉన్న విబేధాలు తొలగి పరస్పరం తెలుసుకొని, అందులో గుమ్మడి గారి ప్రమేయం ఏమీ లేదని తెలుసుకున్న రామారావు గారు తిరిగి గుమ్మడికి చేరువ కావటంతో ఆయన మనసు కుదుటపడ్డది.

ఈ మహానటుడు హైదరాబాద్ లోని కేర్ హాస్పిటల్ లో 26-01-2010 న, శరీరంలో చాలా అవయవాలు పనిచేయకపోవటం వల్ల మరణించారు. ఆయన, చివరి సారిగా 'మాయాబజార్ '(రంగుల్లోకి మార్చినది) ప్రదర్శించినప్పుడు ప్రజల మధ్య గడిపారు. "ఆ గొప్ప సినిమాను రంగుల్లో చూడటానికేమో, నేను ఇంత దీర్ఘ కాలం బతికి ఉన్నాను." అని తన సంతోషాన్ని వ్యక్తం చేసారు.

ఈ మహానటుడుని గురించి శ్రీ గొల్లపూడి మారుతీరావు గారు-


గుమ్మడిగారు విపరీతమైన ఆవేశి, కోపిష్ఠి. ఆయనకి నచ్చిన విషయాన్ని నెత్తిన వేసుకుని పదిమందికీ ఎలా పంచుతారో, నచ్చని విషయాన్ని కుండ బద్దలుకొట్టేవరకూ నిద్రపోరు. ఈటీవీ ఛానల్ కో, దినపత్రికకో సంబంధించిన ఏదో విషయానికి క్రుద్ధులయి ఫోనెత్తి సరాసరి రామోజీరావు గారితోనే చెప్పారట. నచ్చని విషయంలో దాపరికం లేదు, నిజాయితీ లోపం లేదు. ఓ గొప్ప నటుడి ఆవేశం, కోపం అతని నటనలో తప్పక తర్జుమా అవుతుంది. ద్రోణుడూ, బలరాముడూ ఇందుకు ఉదాహరణలు. ఆ కోపం గుమ్మడిగారి నటన కాదు. ఆయన ఆస్తి. ఆయన చేసే పాత్రల్లో రాజీ లేదు. మధ్యేమార్గం లేదు. ద్రోణుడయినా, భానోజీ అయినా ఆయన కళ్ళముందు రూపుకట్టాలి. తర్వాతనే మన కళ్ళముందుకు ఆయన తెచ్చేది. నేను రాసిన ఒకానొక సినిమాలో నాకిష్టమయిన ఒక పాత్రకి ఆయన్ని అనుకున్నాం. నాకు ముందు రోజు పొల్లాచిలో షూటింగ్. వేషం వేసుకుని లొకేషన్ కి వచ్చారట. బడిపంతులు వేషం. తన అవగాహనని అర్థం చేసుకోని డైరెక్టర్ ని ఒప్పించాలని ప్రయత్నించి, సాధ్యంకాక, విసిగి- విగ్గుతీసేసి వెళ్ళిపోయారు. మరునాడు నాకు చెప్పారు. ఆయన్ని ఆ పాత్రకి నష్టపోయినందుకు బాధపడినా, నటుడిగా, రచయితగా ఆయన నిజాయితీకి గర్వపడ్డాను. ఉత్తమమయిన కళకి ఆయన తలవొంచే గొప్ప సందర్భాన్ని నేను మరిచిపోలేను.

ఓ విదేశీయానంలో నేనూ, మా శ్రీమతి, గుమ్మడిగారూ వస్తున్నాం. ఆ విమానంలో ఎమ్. ఎస్. సుబ్బులక్ష్మి గారున్నారు. విమానం గాలిలో తేలేదాకా విలవిలలాడిపోయారు గుమ్మడి. తర్వాత మా ఆవిడా, ఆయనా లేచి వెళ్ళారు ఆమె దగ్గరికి. మా ఆవిడ తన చిన్నాయన శ్రీపాద పినాకపాణిగారి పరపతిని చెప్పుకుంది. కాని ఆ గాన సరస్వతికి గుమ్మడిగారు తెలియదు. మా ఆవిడ పరిచయం చేసింది. ఆవిడ పవిత్రమైన గంగానది. అందులో ఎందరు భక్తులో మునకలు వేస్తారు. వారి ఉనికి నదికి తెలియనక్కరలేదు. ఇద్దరూ సభక్తికంగా ఆమెకి పాదాభివందనం చేసి వచ్చారు గర్వంగా. జీవితాన్ని తన షరతులలోనే నడిపారు. తెరమీద కన్నీళ్ళు ఆయన బాంక్ అకౌంట్. జీవితంలో వాటిని స్వయంగా రెండుసార్లే చూసాను. వారి శ్రీమతి కన్ను మూసినప్పుడు. ప్రాణప్రదమయిన కూతురు వెళ్ళిపోయినప్పుడు. దేనిలోనూ రాజీపడని నిరంకుశుడు, గర్విష్ఠి, కోపిష్ఠిని అనారోగ్యం ఆఖరి రోజుల్లో లొంగదీసింది. అద్భుతమైన వాచకంతోనే అశేష ప్రజానీకాన్ని అలరించిన ఆయన గొంతు సహకరించకపోవడం ఆయన్ని కృంగదీసింది. ఓ గొప్ప నటుడికి విధి చేసిన భయంకరమైన దోపిడీ అది. మొదటిసారిగా గుండె కలుక్కుమంది.

ముందు ముందు కంప్యూటర్ యుగం వినోదాన్ని వింతగా అలంకరిస్తుంది. నేటితరం సంప్రదాయానికి అప్పుడే దూరంగా జరిగిపోతోంది. హారీపోటర్ చదివే పసివాడికి హరిశ్చంద్రుడి వైభవం తెలుసుకునే ఆస్కారం పోతోంది. డిజిటల్ ధర్మమాంటూ ఒక గొప్ప ఇతివృత్తం ఈ దేశంలో చచ్చిపోయి చాలారోజులయింది. ఆ ఇతివృత్తాన్ని ఒక జీవితకాలం తన సొత్తుగా, మాధవపెద్ది, అద్దంకి, పులిపాటివారికి వారసుడుగా ఓ తరాన్ని ప్రభావితం చేసిన ఆఖరి యోధుడి నిష్క్రమణాన్ని తలపండిన అభిమానులే తలచుకుని కంటతడిపెట్టే రోజులొచ్చేసాయి. అయితే గుమ్మడివంటి మహానటుల చరిత్రని పంచరంగుల కలగా భద్రపరిచే ప్రయత్నాలు అదృష్టవశాత్తూ ఈ దేశంలో ప్రారంభమయాయి. నిన్నటి "మాయాబజార్" అందుకు మంచి శకునం. ముందు తరాలకి తెర అంతా పరుచుకున్న ఇలాంటి మహానటుల విశ్వరూపం- ఆనందాన్నీ, ఆశ్చర్యాన్నీ, గర్వాన్నీ, ఈ కళని అపురూపమయిన వారసత్వ వైభవాన్నీ సంతరించక మానదు.

ఆ మహానటుడికి నా కళాభివందనాలు!

*********************************************




శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు గారు - టీవీయస్.శాస్త్రి

kandukuri veereshalingam panthulu

శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు గారు ఒక గొప్ప సాహితీ వేత్త, సంస్కర్త. వితంతు వివాహాలు నిర్వహించిన మహనీయుడు. అలాగే, బాల్య వివాహాలను కూడా అడ్డుకున్నారు. శ్రీ వీరేశలింగం పంతులు గారు 16-04-1848 వ తేదీన శ్రీ సుబ్బారాయుడు, పూర్ణమ్మ దంపతులకు రాజమహేంద్రవరంలో జన్మించారు.

వీరిది ఒక సనాతన, సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబం. వీరేశలింగం గారికి మూడేండ్ల ప్రాయంలో ఆ రోజుల్లో ప్రాణాంతక వ్యాధి అయిన

మశూచి వ్యాధి సోకింది. భగవదనుగ్రహం వల్ల దేశ ప్రజల అదృష్టం వల్ల వారు ఆ వ్యాధి నుండి బ్రతికి బయట పడ్డారు. కానీ, వారికి నాలుగు సంవత్సరాల వయసులోనే పితృ వియోగం కలిగింది. ఆ తరువాత వారి తండ్రి గారి సోదరుడైన శ్రీ వెంకట రత్నం గారు వీరిని దత్తు తీసుకొని సొంత బిడ్డ లాగా పెంచారు. ప్రాథమిక విద్య అంతా రాజమహేంద్రవరంలోనే సాగింది.

అటుపైన ఆంగ్ల విద్యను అభ్యసించటానికి వీరిని ఒక మిషనరీ స్కూల్ లో చేర్పించారు. వీరిలోని చురుకుదనం, మేధస్సు , వివిధ రంగాల పట్ల వీరికున్న మక్కువ మొదలైనవి అప్పుడే బయటపడ్డాయి. స్వభావ రీత్యా అత్యంత విశిష్టమైన వ్యక్తి కావటం చేత తన వ్యక్తిత్వానికి మరిన్ని మెరుగులు దిద్దుకున్నారు. స్కూల్ మొత్తం మీద ఉత్తమ విద్యార్థిగా గుర్తించపడ్డారు.

1869 వ సంవత్సరంలో మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణులై, కోరంగి అనే గ్రామంలో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారు. అక్కడ రెండు, మూడు సంవత్సరాలు ఉపాధ్యాయుడిగా, ప్రధాన ఉపాధ్యాయుడిగా పనిచేసిన పిమ్మట ధవళేశ్వరంకు మకాం మార్చారు. అక్కడ ఒక ఆంగ్ల మాధ్యమ విద్యాలయంలో ఉపాధ్యాయుడిగా చేరారు. ఆ రోజుల్లో సమాజంలో ఉన్న మూఢ ఆచారాలు వీరిని కలచివేసాయి. ముఖ్యంగా స్త్రీల సమస్యలు వీరిని ప్రభావితం చేసాయి. సంఘ సంస్కరణకు నడుం బిగించారు. వితంతు వివాహాలు నిర్వహించటం, బాల్య వివాహాలు నిరోధించటం వీరి సంస్కరణలోని ముఖ్యాంశాలు. స్త్రీలకు విద్య నేర్పించక పోవటమే ఈ దురాచారాలకు కారణమని భావించి ధవళేశ్వరంలో 1874 బాలికల కోసం ప్రత్యేకంగా ఒక విద్యాలయాన్ని ప్రారంభించారు.

1876లో ఒక తెలుగు పత్రికను ప్రారంభించి, ఆ పత్రికలో స్త్రీల సమస్యలను గురించి అనేక వ్యాసాలు వ్రాసారు. ఆ తరువాత వీరు 'వివేక వర్ధిని' అనే పత్రికను స్థాపించి తన ఉద్యమానికి ఊతగా ఆ పత్రికను నడిపారు. సంస్కరణకు సంబధించిన వ్యాసాలతో పాటు, సమాజంలోని దురాచారాలను, అవినీతి, కల్మషాన్ని తన రచనా వ్యాసంగంతో కడిగివేసారు. ఆ రోజుల్లో ఆ పత్రిక మద్రాసు నుండి ముద్రించబడేది. ఆ పత్రికకు అనతికాలంలోనే విశేష స్పందన వచ్చింది. ఆ పరిస్థితుల దృష్ట్యా పంతులు గారు రాజమహేంద్రవరంలోనే తన సొంత ముద్రణాలయాన్ని ప్రారంభించారు. ఆ రోజుల్లోనే వీరు స్త్రీలను చైతన్య పరచటానికి మరియూ వారికున్న హక్కులు తెలియచేసి వారిని జాగృత పరచటానికి 'సతీహితబోధిని' అనే మరో పత్రికను కూడా ప్రారంభించినారు. 1878లో దేవదాసీ, భోగం మేళం లాంటి దురాచారాలను ఎండగడుతూ(anti-nautch movement ) తీవ్రమైన ఉద్యమాలు చేసారు. వితంతు వివాహాలు వీరి ఆధ్వర్యంలో విరివిగా జరగటం మొదలయ్యాయి. 11-12-1881 న వారు గోగులపర్తి శ్రీ రాములు, గౌరమ్మ అనే వారికి చేసిన మొదటి వితంతు వివాహం.

సమాజం నుంచి ఎన్నో అడ్డంకులు, విమర్శలు వచ్చినప్పటికీ వాటినన్నిటినీ ఓర్పుగా, ధైర్యంగా ఎదుర్కోవటమే కాకుండా, తన రచనల ద్వారా, ఉపన్యాసాల ద్వారా ప్రజలను ఒప్పించి మెప్పించగలిగారు. వారి సంస్కరణాభిలాషకు విదేశీయులనుండి కూడా ప్రశంసలు లభించాయి. శ్రీ ఈశ్వర చంద్ర విద్యాసాగర్ గారు వీరికి సమకాలికులు మరియూ వారి భావాలు కూడా పంతులుగారి భావాలే! అలా శ్రీ ఈశ్వర చంద్ర విద్యాసాగర్ గారు వీరిని మరింత ప్రోత్సహించారు. తరువాతి కాలంలో వీరు ఒక వితంతు శరణాలయం ప్రారంభించారు. బాల్య వివాహాలను నిరోదించటం పై దృష్టి సారించి దాని కోసం ఒక చట్టం కూడా రావటానికి కృషి

చేసారు. 'కన్యాశుల్కం' లాంటి దురాచారాలను ఎండగట్టారు. తరువాత బాలికలకు విద్యకోసం మరొక విద్యాలయాన్ని స్థాపించారు. 'రావు బహదూర్' అనే బిరుదు పొందారు. తరువాత బ్రహ్మసమాజం వైపు ఆకర్షితులై దాని వ్యాప్తికోసం విశేష కృషి చేసారు. బ్రహ్మసమాజం యొక్క ఉద్దేశ్యాలను దృష్టిలో ఉంచుకొని 'హిత కారిణి' అనే మరొక విద్యాలయాన్ని కూడా ప్రారంభించారు.

తెలుగు, ఆంగ్ల, సంస్కృత భాషలో విశేష పాండిత్యం ఉండటం వల్ల వీరు పెక్కు గ్రంధాలను రచించారు. వ్యాసాలు, జీవిత చరిత్రలు, ఆత్మకథలు, నవలలు లాంటి పెక్కు ప్రక్రియలను తెలుగు బాషలో ప్రవేశపెట్టారు. తెలుగులో మొట్ట మొదటి నవలైన 'రాజశేఖర చరిత్ర' వీరు వ్రాసినదే! Oliver Goldsmith వ్రాసిన "The Vicar of Wakefield", కు ఇది స్వేచ్చానువాదం. వ్యావహారిక బాషా ఉద్యమానికి వీరు చేసిన కృషి మరువరానిది. సమాజంలోని దురాచారాలాను ఖండిచటం కోసం చాలా వ్యంగ్య నాటకాలు కూడా వ్రాసారు.

శ్రీ వీరేశలింగం గారికి వారి పదమూడవ సంవత్సరంలో బాపమ్మ గారితో వివాహం అయింది. అప్పుడు బాపమ్మ గారి వయసు ఎనిమిది సంవత్సరాలే! భర్త సంస్కరణలను, ఉద్యమాలను,భావాలను అర్ధం చేసుకొని వారి వెనుక నిలబడి ప్రోత్సహించిన మహిళా శిరోమణి బాపమ్మ గారు. శ్రీ గురజాడ వారి రచనలకు వీరి జీవితమే ప్రేరణ! గురజాడవారి 'కన్యాశుల్కం' నాటకం లోని సౌజన్యా రావు పంతులు గారి పాత్ర వీరేశలింగం గారిని దృష్టిలో ఉంచుకొని సృష్టించినదే! 1885లో మొదటి భారత జాతీయ congress సమావేశాలలో పాల్గొన్నారు. గోదావరీ తీరాన కోటిలింగాలు ఉన్నాయి. ఎన్నోలింగాలు నదీ ఉధృతికి కొట్టుకొని పోయాయి. ఒక్క గొప్ప లింగం మిగిలింది,అదే వీరేశ'లింగం'! తెలుగువారిని చైతన్యవంతులుగా చేసిన ఈ మహనీయుడు 27-05-1919 న తమ 71 వ సంవత్సరముల వయసులో, తుది శ్వాస విడిచారు.

ఆ మహనీయునికి నా స్మృత్యంజలి....

*********************************************



నవయుగ వైతాళికుడు--శ్రీ గురజాడ అప్పారావు - టీవీయస్.శాస్త్రి

gurajaada apparao

శ్రీ గురజాడ అప్పారావు గారు తన రచనల ద్వారా సామాజిక చైతన్యం తెచ్చిన ఘనుడు! కన్యాశుల్కం నాటకంలో ఆయన సృష్టించిన గిరీశం, మధురవాణి, బుచ్చమ్మ, వెంకటేశం, రామప్పంతులు, అగ్నిహోత్రావధాన్లు, సౌజన్యారావు పంతులు లాంటి మొదలైన పాత్రలు కూడా అంతే ప్రఖ్యాతి పొందాయి. 'దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్' అని ఎలుగెత్తి చాటిన వైతాళికుడు ఆయన. సాంఘిక దురాచారాలైన బాల్య వివాహాలను, కన్యాశుల్కాన్ని ఖండించిన మహనీయుడు. కుల, మత, వర్గ విబేధాలను రూపుమాపేందుకు ఆయన చేసిన కృషి మరువరానిది.

శ్రీ గురజాడ 21-09-1861 న నేటి విశాఖ జిల్లాలోని రాయవరం గ్రామంలో జన్మించారు. తండ్రి వెంకట రామదాసు, తల్లి కౌసల్యమ్మ. పదేళ్ళ వరకు చీపురుపల్లిలో చదివారు. విజయనగరంలో బి.ఏ చదువుతున్నపుడు వాడుక భాషా ఉద్యమ నాయకుడు గిడుగు రామమూర్తి ఆయనకు సహాధ్యాయి. వారిద్దరూ ప్రాణస్నేహితులు. బెంగాలీ భాషకు ఠాగూర్ వలే, వీరుకూడా

తెలుగు వ్యవహారిక భాషా ప్రచారానికి ఎనలేని కృషిచేసారు.1884 లో మహారాజ కాలేజ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరారు.1885లో అప్పలనరసమ్మ గారితో వివాహమైంది. 1886 లో డిప్యూటీ కలెక్టరు ఆఫీసులో హెడ్ క్లర్కుగా పనిచేసారు.1886లో రాజావారి సంస్థానంలో చేరారు. 1887 లో కళాశాలలో అధ్యాపక పదవిని నిర్వహించాడు. 1911 లో మద్రాసు యూనివర్సిటీ లోని బోర్డ్ ఆఫ్ స్టడీస్ లో సభ్యులయ్యారు.శ్రీ గిడుగు రామమూర్తి గారితో కలసి వాడుక భాషావ్యాప్తికి నడుంబిగించారు. ఆ రోజుల్లో సంఘదురాచారాల బాధితులలో, బాలవితంతులు, వేశ్యలు అధికంగా ఉండేవారు. ఆ ప్రేరణతోనే వీరు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కన్యాశుల్కం నాటకాన్ని మొత్తం వాడుక భాషలో రచించారు. 1890 ప్రాంతంలో వ్రాసిన ఈ నాటకం లోని, ప్రతి మాట ఒక'quotation'!

'తాంబూలాలిచ్చేశాను, ఇక తన్నుకు చావండి'

'డామిట్! కథ అడ్డంగా తిరిగింది'

'పొగ తాగనివాడు దున్నపోతై పుట్టున్'

'నాతో మాట్లాడటమే ఒక education'

'నమ్మినచోట చేస్తే మోసం, నమ్మని చోట చేస్తే లౌక్యం'

.... ఇలాంటివి కోకొల్లలు. ఇవన్నీ వారి నాటకంలోనివే! అవి నేటికీ, రేపటికీ కూడా మరువలేనివి. వారి రచనలన్నీ నాటి సామాజిక పరిస్థితులను తనదైన బాణీలో వినిపించేవారు. అందుకు చక్కని ఉదాహరణ 'కన్యాశుల్కం', పూర్ణమ్మకథ లాంటివి. వారి భాషా శైలి ఆడంబరంగా ఉండేది కాదు. ఆనాటి బ్రాహ్మణ సమాజంలో ఉన్న అనాచారాలను, దురాచారాలను కడిగి వేసారు. సౌజన్యారావు పంతులు గారిని ఉద్దేశించి ఒక వేశ్య అయిన, మధురవాణి చేత, ఆయన ఇలా చెప్పిస్తారు -- "బ్రాహ్మణులలో కూడా మంచివారు ఉంటారన్న మాట!" అని. కుహనా బ్రాహ్మణులకు అది ఒక కొరడా దెబ్బ. అలా సమాజంలో ఉన్న అనేక లోపాలను చూపించి తెలుగు వారికి వెలుగుజాడ అయ్యారు శ్రీ గురజాడ. అంత గొప్ప నాటకమైన కన్యాశుల్కం 13 -08 -1992 న నూరు సంవత్సరాల పండుగను పూర్తి చేసుకుంది. కొన్ని వేల ప్రదర్శనలు ఇవ్వబడింది. 'గిరీశం' పాత్రను ప్రముఖులు ఎందరో వారివారి ఫక్కీలో నటించి పెరుతెచ్చుకోవటమే కాక ,నాటకం యొక్క గొప్పతనాన్ని ప్రజలకు గుర్తు చేసారు. కన్యాశుల్కం నాటకం యొక్క వంద సంవత్సరాల పండుగను విజయనగరంలోని గురజాడ వారి గృహంలో కవులు, రచయితలు, నటులు అతి సంబరంగా చేసుకున్నారు. శ్రీ గురజాడ వారి 76 వ జయంతి సందర్భంలో, శ్రీ జొన్నలగడ్డ సోమయాజులుగారు('శంకర శాస్త్రి') వారి బృందం కన్యాశుల్కం నాటకాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. సోమయాజులు గారి సోదరుడైన శ్రీ రమణమూర్తి గిరీశం పాత్రకు ప్రాణ ప్రతిష్ఠ చేశారు. శ్రీ గురజాడ వారు కన్యాశుల్కం నాటకాన్ని ఆనాటి సంఘంలో ఉన్న దురాచారాలైన బాల్య వివాహాలను, ఆడపిల్లలను అమ్ముకునే విష సంస్కృతిని ఎండగట్టారు. వీరు సృష్టించిన గిరీశం పాత్ర అజరామరమైనది. నేటికీ మహారాజశ్రీ గిరీశం గారిలాంటి ఆషాడ భూతులు మన మధ్యనే ఉన్నట్లనిపిస్తుంది. శ్రీ గురజాడవారి 'పుత్తడి బొమ్మ-పూర్ణమ్మ' బాల్య వివాహ దురాచారానికి బలైపోయిన ఒక అమాయకురాలైన బాలిక కరుణామయ గాథ. దీన్ని వీరు ఒక గేయ కథలాగా వ్రాసారు. వీరికి ఆంగ్ల సాహిత్యంలో చక్కని ప్రావీణ్యం ఉంది. వీరు ఆంగ్లంలో 'Songs and the blue hills' అనే గేయాలు వ్రాసారు. వారు వ్రాసిన కథలలలో -- మీ పేరేమిటి?, పెద్ద మసీదు, సంస్కర్త హృదయం, మాటా- మంతి లాంటి మొదలైన వాటిలో ఆనాటి సామాజిక పరిస్థితులను ప్రతిబింబ జేస్తూ నేటికీ నూతనంగా కనిపిస్తాయి. అంతేగాక, శ్రీ గురజాడ అప్పారావు గారు తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన

గొప్ప సాహితీకారులలో ఒకడు. హేతువాది.19 వ శతాబ్దంలోను, 20 వ శతబ్దిమొదటి దశకంలోను ఆయన చేసిన రచనలు ఈనాటికీ ప్రజల మన్ననలను పొందుతున్నాయి. రాశిలో తక్కువైనా, ఆయనవి వాసికెక్కిన రచనలు. 1892 లో నాటకపు తొలి ప్రదర్శన జరిగింది. 1897లో కన్యాశుల్కం తొలి కూర్పును మహారాజా ఆనంద గజపతికి అంకితమిచ్చారు. ఇప్పుడు మనకు దొరుకుతున్న కన్యాశుల్కం రెండవ కూర్పును 1909 లో రచించారు. వీరి రచనలకు ప్రేరణ -- శ్రీ వీరేశలింగంగారి సంస్కరణోద్యమం. ఒక విధంగా చెప్పాలంటే, కన్యాశుల్కం లోని 'సౌజన్యారావు పంతులుగారి' పాత్ర వీరేశలింగం గారిని దృష్టిలోఉంచుకొని సృష్టి చేసినదేనని చాలామంది అభిప్రాయం. 53 సంవత్సరాల వయసులో 1915 నవంబర్ 30 న శ్రీ గురజాడ అప్పారావు గారు అనారోగ్యం చేత మరణించారు. ఆయనకు ముగ్గురు సంతానం - ఇద్దరు కుమార్తెలు , ఒక కుమారుడు. గురజాడ రచనల్లో కన్యాశుల్కం (నాటకం) అగ్రగణ్యమైనది. కన్యాశుల్కం దురాచారాన్ని విమర్శిస్తూ గురజాడ రచించిన ఈ నాటకం భారతీయభాషల్లో వెలువడిన ఉత్తమోత్తమమైన రచనలలో ఒకటి. 1892 లో ప్రచురించిన మొదటి కూర్పుకు ఎన్నో మార్పులు చేసి 1909 లో రెండవకూర్పును ప్రచురించారు. వాడుక భాషలో, విజయనగర ప్రాంత యాసలో రాసిన ఈ నాటకం 100 సంవత్సరాల తరువాత కూడా ఈ నాటికీ పాఠకులను అలరిస్తూ ఉంది. ఈ నాటకం కన్నడం, ఫ్రెంచి, రష్యన్, ఇంగ్లీషు (2 సార్లు), తమిళం, హిందీ (2 సార్లు) భాషల్లోకి అనువాదమైంది. గురజాడ మరణం తరువాత కన్యాశుల్కం పై ఎన్నో వివాదాలు రేగాయి. అది అసలు ఆయన రాయనేలేదనీ, వేరెవరో రాస్తే, తన పేరు వేసుకున్నారని ఒకటి; ఆయన ఇంగ్లీషులో రాస్తే, వేరే ఒకాయన దానిని తెలుగులోకి అనువదించారని మరొకటి, ఇలాగ కొన్ని వివాదాలు రేగాయి. చివరికి ఆవాదనలన్నీ అసత్యాలని తేలిపోయాయి. ఈ వివాదాలన్నీ గురజాడ మరణం తరువాత వచ్చినవే. ఇన్ని వివాదాల మధ్య కన్యాశుల్కం కొన్ని వందల ప్రదర్శనలు పూర్తి చేసుకుంది. 100 ప్రదర్శనలు పూర్తి చేసుకున్న మొదటి తెలుగు సాంఘిక నాటకమదే!

"తెలుగు భాష లో ప్రధమ శ్రేణిని నిలిచే పది పుస్తకాలలో 'కన్యాశుల్కా'నికి ప్రధమస్థానం ఇస్తాను. ప్రపంచపు నూరు గొప్ప పుస్తకాలలో 'కన్యాశుల్కం' ఒకటి. కన్యాశుల్కం నాటకానికి సాటి రాగల రచన భారతీయ సాహితంలో మృచ్ఛకటికం తప్ప మరోటి లేదు" - శ్రీశ్రీ

"కన్యాశుల్కం బీభత్స రస ప్రధానమైన విషాదాంత నాటకం" - శ్రీ శ్రీ

"కవిత్రయమంటే తిక్కన, వేమన, గురజాడ" - శ్రీశ్రీ

"గురజాడ 1915 లో చనిపోలేదు, అప్పుడే ఆయన జీవించడం ప్రారంభించాడు" - దేవులపల్లి కృష్ణశాస్త్రి

శ్రీ గురజాడ వారి కన్యాశుల్కం నాటకాన్నివ్రాసి 120 సంవత్సరాలు అవుతుంది, గురజాడవారి 150 వ జయంతి ఉత్సవాలను గత సంవత్సరంలో జరుపుకున్నాం. ఈ సందర్భంలో శ్రీ వెల్చేరు నారాయణరావు గారు కన్యాశుల్కం నాటకాన్ని ఆంగ్లంలోకి అనువాదం చేసి'Girls for sale' అనే పేరుమీద విడుదల చేసారు, దీని ప్రచురుణ కర్తలు పెంగ్విన్ క్లాసిక్స్ సంస్థ. దీనిని ఒక అంతర్జాతీయ

ప్రతిగా విడుదల చేసారు. అంతకు ముందు 2007 నుండీ ఇండియానా యూనివర్సిటీ ప్రెస్ ముద్రణగా ఈ ఆంగ్లానువాదం చలామణిలో ఉంది. కన్యాశుల్కం ఆంగ్లంలోకి అనువదించ పడినదని మనం సంతోష పడనవసరం లేదు. ఈ ప్రతిలో చాలా తప్పులు(ఘోరమైనవి కూడా)దొర్లినవి. గురజాడ వారి పేరు పూర్తిగా ఇవ్వకపోవటమే కాకుండా, ఆయన పేరులో స్పెల్లింగ్ సరిగా లేకపోవటమనేది, అనువాదకుని మరియూ ప్రచురుణకర్తల నిర్లక్ష వైఖరికి నిదర్శనం. దానిసంగతి పక్కన పెడితే, నాటకంలోని 5వ అంకంలో, రామప్ప పంతులు ప్రయోగించిన 'అపవిత్రపు ముండాకొడుకు' అనే తిట్టును 'Impure Low Caste Bastard' అని అనువదించారు. ఇది తప్పుడు అనువాదమే కాకుండా, కు(ల)సంస్కారంతో కూడినది కూడా. ఇది అనువాదం కాదు, 'అనువధ' అని గురజాడ అభిమానులు గగ్గోలు పెడుతున్నారు. 'అపవిత్రపు ముండాకొడుకు' అనే తిట్టులో కులప్రసక్తి లేనేలేదు! ఈ ప్రతిని మళ్ళీ పరిష్కరించి విడుదల చేస్తే బాగుంటుంది.

ఆ మహనీయుని నూట ఏబది సంవత్సరాల ఉత్సవాలు పూర్తైన సందర్భంలో, వారికి నా ఘనమైన నివాళి.!!!

గురజాడ మూడు యాభైల పండగ


శ్రీ శ్రీ రెండు యాభైల పండగ

మహాకవులు గురజాడా శ్రీ శ్రీ లు

తెలుగు అక్షరానికి మహా పండగ.

ఎప్పటికీ ఆణిముత్యం-- దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్!

*********************************************




కరుణశ్రీ' జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు - టీవీయస్.శాస్త్రి

Karunasri 'Jandhyala Papayya Sastry'

శ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు (1912--1992) 20వ శతాబ్దములో బాగా జనాదరణ పొందిన తెలుగు కవులలో ఒకరు. వీరి కవిత్వము సులభమైన శైలిలో, సమకాలీన ధోరణిలో, చక్కని తెలుగు నుడికారముతో విన సొంపుగా ఉంటుంది. ఖండకావ్యములు వీరి ప్రత్యేకత.అందునా కరుణ రసప్రధానముగా చాలా కవితలు వ్రాసి,"కరుణశ్రీ"గా ప్రసిద్ధులైనారు.

కరుణశ్రీ, గుంటూరు జిల్లా, పెదనందిపాడు మండలములోని కొమ్మూరు గ్రామములో 1912 ఆగస్టు 4న జన్మించారు. తల్లి మహాలక్ష్మమ్మ, తండ్రి పరదేశయ్య. కొమ్మూరులో ప్రాథమిక, మాధ్యమిక విద్య చదివిన పాపయ్యశాస్త్రి గారికి సంస్కృత భాషపై మక్కువ పెరిగింది. భమిడిపాటి సుబ్రహ్మణ్యశర్మ, కుప్పా ఆంజనేయశాస్త్రిగార్ల వద్ద సంస్కృత కావ్యాలు చదివారు. రాష్ట్రభాషా, విశారద, ఉభయభాషాప్రవీణ, హిందీ భాషాప్రవీణ పరీక్షలలోఉత్తీర్ణుడై అమరావతి లోని రామకృష్ణ విద్యాపీఠములోనూ, గుంటూరు స్టాల్ గర్ల్స్ హైస్కూలులోనూ, ఆంధ్ర క్రైస్తవ కళాశాలలోనూ అధ్యాపకునిగా పనిచేసారు.

శ్రీ N.T.Rama Rao గారు వీరి విద్యార్థే! ఆయన పద్యం చదివే తీరు, వారి కమనీయమైన గాత్రం ఇప్పటికీ నా చెవులలో ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. చక్కని పంచెకట్టు, భుజం మీద శాలువా, చేతిలో పుస్తకం, ముఖం మీద చెరగని చిరునవ్వు,

గంభీరమైన నడకతో వారు నడిచే తీరు ఇప్పటికీ నాకు కళ్ళకు కట్టినట్లు ఉంది. ఆ కమనీయమూర్తిలో, మొదటి సారిగా నేను విచారం/విషాదం చూసింది, ఘంటసాల గారి మరణవార్త విన్నప్పుడే! ఘంటసాల గారు, గుంటూరు వచ్చినప్పుడు విడిది చేసేది వారి ఇంటిలోనే. సరస్వతీదేవి యొక్క కవల పిల్లలు వారు. ఒకరు సాహిత్యమూర్తి, మరొకరు సంగీత మూర్తి.

ఇద్దరూ కలసి, శారదాదేవి ఆస్థానంలో సాహిత్య, సంగీత సభలు నిర్వహించటానికే , ఈ లోకం విడిచి వెళ్ళారు. ఒక చెప్పులు కుట్టుకొనే మనిషి, వారి గీతాలను స్వర బద్ధంగా ఉచ్ఛారణ దోషం లేకుండా పాడటం విని ఆయన ఎంత సంతోషించారో! బ్రతికినంతకాలం రిక్షా ఎక్కలేదు. మనిషిచే మోయించుకోవటం, మానవత్వానికే తీరని మచ్చ అని వారి అభిప్రాయం. తన దగ్గరికి వచ్చే ఒక బీద విద్యార్థి అయిన, మహబూబ్ భాషాను పోషించటమే కాకుండా, అతను వ్రాసే పద్యాలను సవరించి, ప్రోత్సహించేవారు. మానవతా విలువులున్న మహామనిషి ఆయన. పద్యాన్ని చక్కగా భావయుక్తంగా చదవమని, అందరికీ సూచనలు ఇచ్చేవారు.

వారి శ్రీమతి అనసూయమ్మగారు ఆయన సహధర్మచారిణి మాత్రమే కాదు, ఆయనకు ఉన్న ఒక గొప్ప స్నేహితురాలు. వారికి ఇద్దరు కొడుకులూ, ఒక కూతురూ ఉన్నారు. 'కళ్యాణ కల్పవల్లి' పేరు మీద తెలుగు లోని ప్రఖ్యాత కవులను గురించి ఒక కావ్యాన్ని చాలా గొప్పగా వ్రాసారు. 'ఉమర్ ఖయ్యాం' అనే పద్య కావ్యం కూడా కమనీయంగా ఉంటుంది. వారి కలంలో సిరాకు బదులుగా పంచదార, తేనే కలిపి వ్రాస్తారేమో! అంత మధురంగా ఉంటుంది వారి కవిత్వం. అంతేకాకుండా జనబాహుళ్యంలోకి విపరీతంగా చొచ్చుకొని వెళ్ళిన వారి పద్యాలను గురించి వారితో ముచ్చటిస్తుంటే, వారి ముఖంలో ఆనందరేఖలు స్పష్టంగా కనపడేవి. పిల్లలకోసం వారు వ్రాసిన 'తెలుగుబాల'--ఆ రోజుల్లో మేము ఆనందంగా చదువుకునేవారం.

పిల్లలే కాదు, పెద్దలు కూడా చదవలసిన పద్య కావ్యమది. సులభ శైలిలో ఉంటుంది. సాంప్రదాయ కవితా రీతులతో, పిల్లలకు, పెద్దలకు, సామాన్య ప్రజలకు అర్థమయేటట్లు కవితలల్లిన మొదటి 'ప్రజాకవి' ఆయనేనని చెప్పవచ్చు. ప్రఖ్యాత తెలుగు సినీ నటులు శ్రీ గుమ్మడి వేంకటేశ్వరరావు గారు, వారి అమ్మాయిలకు, ఉదయశ్రీ, విజయశ్రీ అనే పేర్లు పెట్టి ----శ్రీ పాపయ్య శాస్త్రిగారి మీద ఉన్న అభిమానాన్ని, వారి కవిత్వం పట్ల ఆయనకున్న ప్రేమను చాటుకున్నారు. ఈ విషయం తెలుసుకున్నప్పుడు, శ్రీ పాపయ్య శాస్త్రిగారు, ఎంతో సంతోషించారు. తెలుగు సాహిత్యంలో 50 ముద్రణలు చూసిన ఏకైక గ్రంధం ఒక్క 'ఉదయశ్రీ'నే! వారణాసిలో, ఒక కవి సమ్మేళనంలో, ఒక హిందీ కవి తన పుస్తకం పదిసార్లు ముద్రించ పడిందని ఆనందపడుతున్న సందర్భంలో, 50 ముద్రణలు చూసిన 'ఉదయశ్రీ' కావ్యకర్త శ్రీ పాపయ్య శాస్త్రి గారిని చూసి ఆశ్చర్యంతో, ఆదరంతో ఆలింగనం చేసుకున్నారు.

శ్రీ అక్కినేని నాగేశ్వరరావుగారు, మనసు ప్రశాంతంగా లేనపుడు, ఘంటసాల గారు పాడిన పుష్పవిలాపం వింటానని, వారే పలుమార్లు చెప్పారు. ఆయన కనపరచిన ప్రతిభకు ప్రభుత్వం నుండి తగిన గుర్తింపు రాలేదు. అదే విషయం వారితో ప్రస్తావిస్తే, ప్రజల మెప్పే తనకు పద్మశ్రీ, పద్మభూషణ్ కన్నా గొప్ప బిరుదులు, అనే వారు. బుద్ధునిలోని కరుణ ఆయనను ఎక్కువగా

ప్రభావితం చేసింది. అందుకనే, వారు 'కరుణశ్రీ' అనే పేరుతోనే అనేక కావ్యాలు వ్రాసి ప్రసిద్ధులయ్యారు. పుష్పవిలాపం మరియు కుంతీకుమారి వంటి కవితలు ఘంటసాలగారి గంధర్వగానం వల్ల మరింత ప్రసిద్ధి చెందాయి.

'పుష్పవిలాపాన్ని' చిరకాలం తెలుగు వారు గుర్తుంచుకునేటట్లు చేసిన ఘనత ఘంటసాలదే! జీవించినంత కాలం కవిత్వం రాసి, రాసినంత కాలమే జీవించిన కవి కరుణశ్రీ. జనరంజకుడైన ఈ కవి తన కలాన్ని తేనెలో ముంచి మధురాతి మధురమైన కవితా పద చిత్రాలతో పఠితల హృదయాలను రసప్లావితం చేసాడు. 'కరుణశ్రీ'గా ఖండాంతర ఖ్యాతినార్జించిన ఆయనకు పోతన భాగవతమే గురువు. పోతనలాగే లలిత పదకవితలనల్లుతూ పండిత, పామరుల ప్రశంసలను అందుకున్నారు.

పూబాలల గుండె కోతను వినిపించుకున్న వారు ఎవరున్నారు? ఒక్క కరుణశ్రీ తప్ప. అలాగే 'కుంతి కుమారి' ఖండకావ్యము కూడాను. కరుణశ్రీ కలం నుంచి జాలువారిన అలాంటి కవితలెన్నని ఎంచి చెప్పగలం? "ఉదయశ్రీ నా హృదయం, విజయశ్రీ నా శిరస్సు, కరుణశ్రీ నా జీవితం" అంటూ శాస్త్రిగారు ఖండాంతర ఖ్యాతి గాంచిన ఈ మూడు కావ్యాలను తనకు ప్రీతిపాత్రమైనవని పేర్కొన్నారు. కవిగా, పండితునిగా, విమర్శకునిగా, వ్యాఖ్యాతగా, సంపాదకునిగా, బాలసాహిత్య కథకునిగా, ఉపన్యాసకునిగా భాసిల్లిన ఆ బహుముఖ ప్రజ్ఞాశాలి 76 గ్రంథాలను రచించారు. ఆయన సాహిత్య కృషిపై కనీసం మూడు పీహెచ్‌డీ సిద్ధాంత వ్యాసాలు ప్రచురితమయ్యాయి. రాష్ట్ర, జాతీయ స్థాయిలలో ఎన్నో పురస్కారాలు అందుకున్న ఆయనకు శ్రీవెంకటేశ్వర విద్యాలయం గౌరవ డాక్టరేటును ఇచ్చి గౌరవించింది.

తిరుమల తిరుపతి దేవస్థానంవారు పోతన భాగవత వ్యాఖ్యాన సంపాదుకులుగా పనిచేయడానికి కరుణశ్రీనే సరైన వ్యక్తిగా గుర్తించి గౌరవించింది. 21 -06 -1992 న వారు తమ కవితా ప్రస్థానానికి ముగింపు చెప్పి, శాశ్వత నిద్రలోకి వెళ్ళారు. వారు గుంటూరులోని రవీంద్రనగర్ లోని మా ఇంటి సమీపంలోనే ఉండేవారు. నాకు వారితో పరిచయ భాగ్యమే కాక, కొంత చనువు కూడా ఉండేది. అది వారు ఇచ్చినదే! నేను అప్పుడప్పుడూ వారిని కలిసి నాకు కలిగిన సందేహాలు అడిగి తీర్చుకునే వాడను.

ఆయనకు పోతన కవిత్వమంటే ప్రాణం. నిజం చెప్పాలంటే, పోతన మహాకవియే శ్రీ పాపయ్యశాస్త్రి గారిగా మరల జన్మించారని చెప్పటంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. నేను ఒకసారి వారితో ఇలా నా సందేహం అడిగాను---"కాటుక కంటి నీరు చనుపయింబడ ఏల ఏడ్చెదవమ్మ భారతీ!" అని పోతన గారు అన్నారు కదా!, అంత కరుణరస సన్నివేశంలో 'చనుపయింబడ' అనే పదం ఎందుకు వాడారు?, సామాన్యంగా ఎవరైనా ఏడుస్తే కంటి నీరు పాదాలమీద పడుతాయి. పోతన గారు, 'చనుపయింబడ' అని అనటంలో శారదాదేవి వక్షసంపదను గుర్తుచేసినట్లున్నది.

కరుణరస సన్నివేశంలో ఈ శృంగార భావం ఎందుకు?--- అని నేను అడుగగానే, వారు ఇలా చెప్పారు--శిశువు తల్లివద్ద చనుబ్రాలు త్రాగేటప్పుడు, పాలు త్రాగుతూ మరొక చేతితో వేరొక వక్షం పైన చేయి వేసుకుంటాడు. ఆ సన్నివేశం, సందర్భంలో వాడికి

ఎటువంటి మనో వికారాలు ఉండవు. మనంకూడా అలానే 'శారదాదేవి' శిశువులమే! ఆ భావం తోనే అమ్మను చూడాలి.---అని నాకు వారు వివరించి చెప్పిన సంఘటన నాకు ఎప్పటికీ గుర్తుంటుంది. వారు వ్రాసిన ఒక ప్రబోధ గీతాన్ని మీకోసం ఈ క్రిందనే పొందుపరుస్తున్నాను. జాతీయతను, దేశభక్తిని రగిలించే ఈ మహత్తర పద్యాన్ని చదివి ఆస్వాదించండి.

తెనుగుతల్లి

కనిపింపదే నేడు! కాకతీయ ప్రాజ్య

సామ్రాజ్య జాతీయ జయ పతాక

వినిపింపదేనేడు! విద్యానగర రాజ

సభలోని విజయ దుందుభుల మ్రోత

వెలగదే నేడు! బొబ్బిలి కోట బురుజుపై

తాండ్రపాపయ తళత్తళల బాకు

నిప్పచ్చరంబయ్యెనే నేడు-వీర

పల్నాటి యోధుల సింహనాద లక్ష్మి

చెక్కు చెదరని - యేనాడు మొక్కవోని-

ఆంధ్ర పౌరుషమిప్పుధ్వాన్నమయ్యె;

మరల నొకమాటు వెనుకకు మరలి చూచి

దిద్దుకోవమ్మ: బిడ్డల తెనుగు తల్లి

"వాణి నా రాణి" యంచు సవాలు కొట్టి

మాట నెగ్గించు "వీరు" లీ పూట లేరు!

తిరిగి యొకమాటు వెనుకకు తిరిగి చూచి

దిద్దుకోవమ్మ! బిడ్డల, తెనుగు తల్లి!

శ్రీ పాపయ్య శాస్త్రి గారు చక్కని,హాస్య ,వ్యంగ్యోక్తులతో పద్యాలు వ్రాసి,చదువుకున్నామని విర్రవీగే వారికి మంచి చురకలు వేసే వారు. మచ్చుకి, ఈ క్రింది పద్యాన్ని చూడండి.

చదువు రానివేళ 'చంకరుండ'న్నాడు

చదువు కొనెడివేళ 'సంకరు'డనె

చదువు ముదిరిపోయి షంకరుండనెనయా

స్నిగ్ధ మధురహాస ! శ్రీనివాస!

వారి అబ్బాయి శ్రీ జంధ్యాల జయకృష్ణ బాపూజీ కూడా సాహితీ పిపాసే, తండ్రి గారిలాగా! గుంటూరులోని హిందూ కళాశాలలో తెలుగు ఉపన్యాసకుడుగా పనిచేసి, ప్రస్తుతం గుంటూరులోనే విశ్రాంత జీవితం గడుపుచున్నారు.

ఈమధ్యనే శ్రీ పాపయ్య శాస్త్రిగారి శతజయంతి ఉత్సవాలను ఆయన అభిమానులు ఘనంగా జరుపుకున్న సందర్భంలో, వారికి నా ఘనమైన నివాళి !

**********************************************





జాతీయ త్రివర్ణ పతాక నిర్మాత శ్రీ పింగళి వెంకయ్య గారు - టీవీయస్.శాస్త్రి

pingali venkayya

జాతీయ పతాక నిర్మాత శ్రీ పింగళి వెంకయ్య గారు మన ఆంధ్రుడవ్వటం, మనం చేసుకున్న అదృష్టం. దేశం కోసం తన సర్వస్వాన్ని త్యాగం చేసిన ఈ మహనీయుని నిత్యం మనం స్మరించుకోవాలి. ఈ మహనీయుని జీవిత చరిత్రను బాలబాలికలకు పాఠ్యాంశంగా చేయాలి. ఆ మహనీయుని గురించిన కొన్ని ఆసక్తికర విషయాలను తెలుసుకుందాం. శ్రీ పింగళి వెంకయ్యగారు 2-8-1876న కృష్ణాజిల్లా దివితాలూకా భట్లపెనుమర్రు గ్రామంలో వారి మేనమామల ఇంట్లో పుట్టారు. వీరి తండ్రిగారి పేరు హనుమంతరాయుడు గారు, తల్లి గారి పేరు శ్రీమతి వెంకటరత్నమ్మ గారు. తాతగారి పేరు అడవి వెంకటాచలం గారు(తల్లి గారి తండ్రి ). వీరి బాల్యం, ఎలిమెంటరీ విద్యాభ్యాసం అక్కడే పూర్తిచేసారు. 12 సంవత్సరాలకే లోయర్ సెకండరీ విద్య పూర్తిచేసి, కారణాంతరాలవల్ల బందరులో హైస్కూలు విద్యను పూర్తిచేసి, 19ఏండ్ల ప్రాయంలోనే యుద్ధంలో చేరాలనే కోరికతో బొంబాయి వెళ్ళి సైన్యంలో చేరి ఆఫ్రికాకు వెళ్ళారు.

అక్కడ గాంధీ గారిని కలవడం, ఆయన విధానాల పట్ల ఆకర్షితులు కావడం వలన స్వదేశం గురించిన ఆలోచనలు పెరిగాయి. ఆఫ్రికానుండి తిరిగి వస్తూ దారిలో అరేబియా, ఆఫ్ఘనిస్థాన్ దేశాలను కూడా సందర్శించి తిరిగి స్వదేశానికి చేరారు. మద్రాసులో అప్పట్లో ప్లేగు వ్యాధి ప్రబలటంతో వ్యాధి నివారణాధికారిగా పనిచేసారు. ఆ తరువాత రైల్వే గార్డుగా కూడా కొంతకాలం పనిచేసారు. అయితే, ఆయనకు ఉద్యోగంపై ఆసక్తి లేకపోవటం వలన, శ్రీలంకలోని కొలంబోలో 'సిటీ కాలేజ్'లో రాజకీయ, ఆర్థిక శాస్త్రాలను అభ్యసించారు. దేశభక్తిగల వెంకయ్యగారు 1906లో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ మహాసభలలో పాల్గొని ఆనాటి సభాధ్యక్షులు అయిన దాదాభాయి నౌరోజి గారి మన్ననలను పొంది, కాంగ్రెస్ విధాన నిర్ణయసభ సభ్యునిగా గుర్తింపు పొందారు. అక్కడ కలిసిన మునగాల రాజా దృష్టిని ఆకర్షించిన ఆయన, వారి ఆహ్వానంమీద మునగాల సంస్థానంలో చేరారు.

అక్కడ వ్యవసాయం మీద ఆసక్తితో పనిచేయటమే కాకుండా, రాజావారి కోరిక మేరకు ఎంతో జిజ్ఞాస, పట్టుదలతో పరిశోధనలు జరిపి 'వ్యవసాయ శాస్త్రం' అనే గ్రంథాన్ని ప్రజలకు అందించారు. మునగాలలో ఒక వ్యవసాయ క్షేత్రాన్ని నిర్మించారు. ఆకాలంలోనే గాంధీగారు ఖాదీ ఉద్యమాన్ని చేపట్టడంతో, వెంకయ్యగారు అమెరికా నుండి ప్రత్తి గింజలను తెప్పించి ఇక్కడ గింజలతో సంయోగం జరిపి ప్రాక్టికల్ గా వారు సన్ననూలునిచ్చే ప్రత్తిని పండించి, దేశ సౌభాగ్యానికి తోడ్పడ్డారు. వారి కార్యదక్షత, పరిశీలనాదృష్టి, పట్టుదలతో తెలివిగా ఆలోచనలు చేసి ఫలితాన్ని సాధించటం, వారి తపన నుండి ఈతరం ఎంతగానో స్ఫూర్తి పొందాలి. అందుకే ఆయన్ని 'ప్రత్తి వెంకయ్య' అని పిలిచారట. ఆ రోజుల్లో వారికి లండన్ లోని 'రాయల్ అగ్రికల్చరల్ సొసైటీ' వారు సభ్యత్వం ఇచ్చి గౌరవించారు.

బందరులో శ్రీ ముట్నూరి కృష్ణారావు గారు, కోపల్లె హనుమంతరావు గారు, వీరి ప్రతిభా విశేషాలను గుర్తించి జాతీయ కళాశాలలో అధ్యాపకుడి స్థానాన్నిచ్చి గౌరవించారు. వారికి అంతర్జాతీయ దృష్టి ఉందనటానికి ఒక నిదర్శనం-చైనాలో 'సన్‌యట్‌సెన్' అనే ఆయన సాధించిన రాజకీయ విప్లవం. ఆ విప్లవ చరిత్రను రహస్యంగా సేకరించి వారి పేరన ఒక గ్రంథాన్ని వ్రాసి చైనా, మనదేశం మీదకు దండయాత్ర చేస్తుందని, దలైలామా మనదేశానికి వస్తారని చెప్పారట వెంకయ్యగారు. వారి మేధాసంపత్తి నుండి మనం ఎంతైనా నేర్చుకోవాల్సివుంది. అందుకే ఆయనను 'రాజకీయ ద్రష్ట' గా అభివర్ణించారు ఆనాటి పెద్దలు.

1906 సంవత్సరంలో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ సభలలో ఇంగ్లీషు వారిని ఒక పక్క మన దేశాన్ని వదలి పొమ్మంటూనే మరొకపక్క వారి జెండాను ఉపయోగించడం పింగళి వెంకయ్యగారిలో సరికొత్త ఆలోచనకు నాంది పలికింది. మనకంటూ ఒక జెండా కావలనే తపనతో 'భారతదేశ జాతీయ పతాకం' అనే గ్రంథాన్ని ఆయన 1916లో మనకు అందించారు. వారిని 'జెండా వెంకయ్య' గా పిలిచారట అప్పుడు. ఇక్కడ ఒక ముఖ్యమైన విషయాన్ని గురించి చెప్పాలి. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో,చాలాకాలం మన వారు బ్రిటిష్ దేశపు 'యూనియన్ జాక్'నే ఎగురవేసే వారు. ఇది, సహేతుకంగా లేదని వాదించి, గాంధీ గారి కోరిక మీద జాతీయ త్రివర్ణ పతాకాన్ని రూపొందించిన తెలుగు తేజం శ్రీ పింగళి వెంకయ్య గారు.1921 మార్చి 31, ఏప్రియల్ 1 వ తేదీలలో బెజవాడలోని గాంధీనగరంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ మహాసభలలో శాంతి సౌభాగ్యాలకు చిహ్నంగా మూడు రంగులతో, మన జాతీయ జెండా గాంధీజి సమక్షంలో ఏకగ్రీవంగా కరతాళ ధ్వనులమధ్య ఆమోదించబడింది.

మెదట పతాకం మధ్యలో రాట్నం ఉన్నా, తరువాత పెద్దలు ధర్మానికి గుర్తుగా అశోక చక్రంతో మన జాతీయ జెండాను శ్రీ వెంకయ్య గారి కోరిక మేరకు మార్పు చేసారు. ఆ పతాకమే, పింగళి వెంకయ్యగారి గుర్తుగా భారత దేశపు గగనాన విహరిస్తూ మన అందరికీ 'భారతదేశం మనది' అనే స్పూర్తినిచ్చింది. ఇంతటి విశిష్టమైన వ్యక్తి చివరిదశలో దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించి, నిరాడంబరంగా 1963 జూలై 4న దివికేగారు! కీర్తిశేషులైనారు!! తన జీవితాన్ని అంతా ప్రజలకు అంకితమిచ్చిన ఈ మహనీయుని జీవితాన్ని ఈ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా తలచుకోవటం ఎంతో సమంజసం! జాతీయపతాక నిర్మాతను 'భారతరత్న' బిరుదుతో సత్కరించక పోవటం, స్వాతంత్ర్య సమరయోధుల పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష వైఖరిగా కనిపిస్తుంది! ప్రభుత్వం కనీసం ఆ దిశగా ప్రయత్నం చేసి, ఆ మహనీయుని 'భారతరత్న' బిరుదుతో సత్కరించి, పార్లమెంట్ సెంట్రల్ హాల్ లో వారి శిలా విగ్రహం ప్రతిష్టించటమనేది ప్రభుత్వం చేపట్టవలసిన తక్షణ కర్తవ్యం! ఆయన పేరు మీద గణనీయంగా స్మారక చిహ్నాలను ఏర్పాటు చేయటం ఎంతైనా అవసరం. ముందు తరాల వారికి వారిని గురించి తెలియచేయటం కోసం, విద్యార్ధులకు వారి జీవితాన్ని పాఠ్యాంశంగా చేయాలి. ఆ నిస్వార్ధ సేవకునికి, దేశభక్తునికి మన వంతుగా ఘనమైన నివాళి సమర్పించుకుందాం!!

దేశమాత కోసం తన సర్వస్వాన్ని త్యాగం చేసిన మహామనిషి శ్రీ వెంకయ్య గారు!

************************************************




కాంచనమాల కన్నీటి కథ - టీవీయస్. శాస్త్రి

kaanachana maala story

కాంచనమాల అలనాటి యువకుల కలలరాణి, దక్షిణ భారతదేశపు మొట్టమొదటి అందగత్తె(Dream Girl) అయిన నటీమణి ఈమె అని చెప్పవచ్చును. కాంచనమాల అందానికి ఆ రోజుల్లోమహా కవులే సలాం చేశారు. శ్రీ శ్రీ గారు 'సంధ్యా సమస్యలు' అనే తన కవితా ఖండికలో, ఈ విధంగా వ్రాసారు

ఆ సాయంత్రం. . . . .

రాక్సీ లో నార్మాషేరర్,

బ్రాడ్వే లో కాంచనమాల!!

ఎట కేగుటో సమస్య తగిలిందొక విద్యార్థికి!

(రాక్సీ, బ్రాడ్వే లు ఆ రోజుల్లో మద్రాస్ లో పెద్ద Theaters )

చిత్తజల్లు కాంచనమాల(మార్చి 5, 1917 - జనవరి 24, 1981) తొలితరం నటీమణులలో ఒకరు. ఆంధ్రా ప్యారిస్ గా పేరుపొందిన తెనాలి పట్టణం ఆవిడ స్వస్థలం. ఆ కాలంలో బాగా పేరు తెచ్చుకున్న నటీమణులలో ఈవిడ కూడా ఒకరు. కాంచనమాల మార్చి 5, 1917 లో గుంటూరు జిల్లా తెనాలి సమీపంలోని ఐతావరప్పాడులో జన్మించారు. తండ్రి పేరు దాసరి నారాయణదాసు. కాంచనమాల, గాలి వెంకటేశ్వర్లు అనే యువకుణ్ణి ప్రేమించి పెళ్ళాడారు. ఇతను కూడా ఆమెతో కొన్ని సినిమాలలో నటించాడు. గాలి వెంకటేశ్వర్లు అలనాటి ప్రఖ్యాత సంగీత దర్శకుడైన గాలి పెంచలనరసింహారావు గారి సోదరుడు. ఈయన 'వాలిసుగ్రీవ' లాంటి కొన్ని సినిమాలలో హీరోగా నటించారు. చిన్నాన్న దగ్గర సంగీతం నేర్చుకున్న కాంచనమాల ఓ చిన్న పాత్ర ద్వారా సినిమాలో ప్రవేశించారు. కాంచనమాల రూపలావణ్యం, విశాలనేత్రాలు, అందమైన ముఖం చూసి సి. పుల్లయ్య ఆమె చేత వై. వి. రావు నిర్మించిన శ్రీకృష్ణ తులాభారము (1935) లో మిత్రవింద వేషం వేయించారు. ఆ సినిమాలో తన అందంతో అందరి చూపులని తన వైపుకి తిప్పుకున్నారు ఈమె. ఆ రోజుల్లో తల్లులు పిల్లను నిద్రపుచ్చటానికి, 'దినదినము పాపడిని దీవించి పొండి దేవలోకములోని దేవతల్లారా' అనే కాంచనమాల గారి పాటను పాడేవారట. 1938 లో 'మాలపిల్ల' అనే సినిమాను శ్రీ గూడవల్లి రామబ్రహ్మంగారు నిర్మించారు. ప్రఖ్యాత రచయిత శ్రీ చలంగారి నాటకం యొక్క ఇతివృత్తం ఆ సినిమా కథ. అది, ఒక బ్రాహ్మణ యువకుడు, ఒక మాల పిల్ల ప్రేమకథ. మాలపిల్ల సినిమాలోని కాంచనమాల బొమ్మ వున్న కాలండర్, ఆ రోజుల్లో ప్రతి ఇంటికీ అలంకారంగా గోడలకు వేలాడుతుండేదట! అదీ ఆమె యొక్క అందం! విశాలమైన కళ్ళు ఆమెకు మరింత శోభను చేకూర్చాయి.

ఇంతటి అందగత్తె శ్రీ రామబ్రహ్మం గారి చేతే ఒక సారి తిరస్కరించబడిందట. శ్రీ రామబ్రహ్మంగారు తన తప్పును గుర్తించటానికి ఎక్కువ సమయం తీసుకోలేదు. గ్రామీణ వాతావరణానికి చెందిన ఒక మాలపిల్ల పాత్ర అయిన 'సంపాలత' పాత్రకు ఆమెను ఎన్నిక చేసారు. ఆ రోజుల్లోని సినీ పండితులు, ఈ అందాలబొమ్మ ఒక విశిష్టమైన పాత్రను ఎలా పోషించగలదని పలు అనుమానాలు వ్యక్తం చేసారు. కాంచనమాల వారి అనుమానాలను పటాపంచలు చేసి , ఆ పాత్రను అద్భుతంగా పోషించింది. సినిమా మొదటి భాగంలో

నిరక్షురాలైన గ్రామీణ యువతిగా అద్భుతంగా నటించిన ఆమె, రెండవ భాగంలో చదువుకున్న ఒక అధునాతన యువతిగా అదే ప్రతిభను కనబరచింది. ఆ రోజుల్లో ఆమెను ప్రఖ్యాత హాలీవుడ్ అందాల తార ఐన Greta Garbo తో పోల్చేవారు. 1935 లో ఆమె శ్రీ చిత్తజల్లు పుల్లయ్య గారి దర్శకత్వంలో వచ్చిన 'శ్రీ కృష్ణ తులాభారం'లో నటించిది. ఆ సినిమాకు పాటలు వ్రాసినది, తెలుగులో మొదటి సినీ గేయ రచయిత అయిన శ్రీ చందాల కేశవదాసు గారు. ఆ సినిమాకు మాతృక వారు వ్రాసిన నాటకమే! అ సినిమాలోనే శ్రీ రేలంగి గారు కూడా ఒక చిన్న వేషం వేసారు. ఆమె తరువాతి సినిమా, 1936 లో నిర్మించిన 'వీరాబిమన్యు'. అందులో ఉత్తరగా నటించారు. ఆ సినిమాకు రచయిత శ్రీ కొడవటిగంటి కుటుంబరావు గారు. గృహలక్ష్మి(1938) లో మాత్రం వాంప్ పాత్ర పోషించారు. విప్రనారాయణలో దేవదేవిగా ఆమె అందం, అభినయం అప్పటి ప్రేక్షకులకు సూదంటు రాయిలా గ్రుచ్చుకుంది. అలానే 'సక్కుబాయి' సినిమాలో నటించి మంచి పేరు తెచ్చుకుంది. కాంచనమాల నటించిన 'వందేమాతరం' దక్షిణ భారత దేశంలో రజతోత్సవం జరుపుకొన్న మొదటి సినిమాగా చెప్పుకోవచ్చు. కేరళ, తమిళనాడు, కర్ణాటకలో కూడా అది విజయవంతమైంది. ఆ రోజుల్లో ఈ సినిమాలో నాగయ్య గారు కాంచనమాల కలసి పాడిన యుగళ గీతం 'మధురా నగరిలో చల్ల నమ్మబోవుదు' అనే పాట ప్రతి ఇంటిలోనూ మార్మోగిపోయేదట.

కాంచనమాల స్లీవ్ లెస్ జాకెట్, పెద్ద చెవి రింగులు, అందమైన కళ్ళు, చిరునవ్వు ఒలకించే పెదవులు, చేతిలో కాఫీ కప్, భుజాలమీదకు విరబోసుకున్న జుట్టుతో అందంగా వుండే ఈ అందాలరాశి బొమ్మ ఉన్న కాలండర్ 1940 వ సంవత్సరములో ప్రతి ఇంటికీ అదొక అలంకారం. ఆ కాలండర్ 'మాలపిల్ల' సినిమాకు సంబంధించినది. నటనా ప్రావీణ్యం లేకుండా కేవలం తన అందంతోనే ప్రసిద్ధి చెందింది కాంచనమాల. మాలపిల్ల సినిమాలో ఒక సాంప్రదాయపు బ్రాహ్మణ యువకుడు, ఒక గ్రామీణ మాలపిల్లను ప్రేమించి పెళ్లి చేసుకుంటాడు. ఆ రోజుల్లో, ఆ ఇతివృత్తంతో సినిమా తీయటమే ఒక సాహసం. ఆరోజుల్లో సంఘంలోని సామాన్య జనం భావాలు , ఆ సినిమా గురించి ఇలా వున్నాయి-- 'కులం ఏదైతేనేమి? అంత అందగత్తె ఏకులంలోపుట్టితే ఏముంది? ఆమెను పెళ్లి చేసుకోవటం కన్నా అదృష్టం ఏముంది?' ఆమె అందాన్ని చూసి ఆశ్చర్యపడి, అలనాటి హిందీ అందాల తార నర్గీస్ తల్లిగారైన జద్దన్ బాయి గారు, కాంచనమాలను హిందీ సినీరంగానికి ఆహ్వానించారు. జద్దన్ బాయి గారు నిర్మాత, దర్శకురాలు. అలాగే అలనాటి హిందీ ప్రముఖ నటులైన, మోతీలాల్, మెహబూబ్ ఖాన్ గార్లు కూడా ఈమెను హిందీ సినీరంగానికి ఆహ్వానించారు. అలా తొలితరం గ్లామర్ క్వీన్ గా వెలుగొందారు ఆమె. అప్పట్లోనే కాంచనమాల చీరలు, జాకెట్లు, గాజులు బాగా అమ్ముడయ్యేవి. ఆ సమయంలోనే గృహలక్ష్మిలో వాంఫ్ రోల్ ధరించిన ఈమె విమర్శకుల మన్ననలు కూడా అందుకుంది. ఆ తర్వాత వచ్చిన వందేమాతరం సినిమాలో ఈమె చిత్తూరు నాగయ్య గారి సరసన నటించారు. అది నాగయ్య గారి రెండవ సినిమా. ఈ చిత్రం ద్వారా నాగయ్య గారు, కాంచనమాల గారు ఇద్దరూ పేరు తెచ్చుకున్నారు. ఆ సమయంలోనే వచ్చిన మళ్ళీపెళ్ళి, వితంతు వివాహాన్ని ప్రబోధించే చిత్రం. ఈ చిత్రంలో ఆమె వితంతువుగా కూడా అందంగా ఉన్నారని అందరూ చెప్పుకునేవారట. ఆ తర్వాత ఆమె నటించిన ఇల్లాలు సినిమా విడుదల అయి మునుపటి సినిమాలంత విజయం సాధించ లేకపోయినా ఆంధ్ర పత్రిక ఫిలిం బ్యాలెట్ లో ఉత్తమనటిగా ఇల్లాలు చిత్రం ద్వారా కాంచనమాల ఎంపిక అయ్యారు. ఆ సమయంలో విడుదలైన మైరావణ కూడా అన్ని తరగతుల ప్రజాదరణను అందుకోలేకపొయింది. ఆమె కేవలం 11 సినిమాలలోనే నటించింది. అందులో అయిదు సినిమాలు కనకవర్షం కురిపించాయి. అప్పుడే ఆమె దుర్దశ ప్రారంభం అయిందని చెప్పవచ్చు.

ఆ తర్వాత జెమినీ వాసన్ గారి నిర్మాణ సారధ్యంలో బాలనాగమ్మ రూపుదిద్దుకుంది. ఆ సినిమాలో కాంచనమాలను బాలనాగమ్మ

పాత్రకు తీసుకున్నారు. శ్రీ గోవిందరాజు సుబ్బారావుగారు మాయల ఫకీరు, శ్రీ బందా కనకలింగేశ్వరరావు గారు కథానాయకుడు. శ్రీ ఈమని శంకరశాస్త్రి గారు సంగీత దర్శకుడు. ఆ సినిమాలో ఇన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. ఆ సమయంలో వారి చిత్రాలలో మాత్రమే నటిస్తానని కాంచనమాల అగ్రిమెంట్ వ్రాసి ఇచ్చారు. అదే ఆమె చేసిన పెద్ద తప్పయింది. ఆ సమయానికే, కాంచనమాల దగ్గరకు ఎన్నో మంచి ప్రాజెక్టులు రాసాగాయి. ఆ రోజుల్లో వాసన్ గారి ప్రవర్తన గురించి పలు వివాదాస్పద కథనాలను చెప్పుకునేవారు. వాసన్ ఆమె అందానికి కూడా మోహితుడై ఆమెను వేధించటం ప్రారంభించాడు. ఎన్ని ప్రలోభాలు చూపెట్టినా ఆమె వాసన్ మాయలో, మోహంలో చిక్కుపడ లేదు. అది, వాసన్ ఆగ్రహానికి గురి అయింది. ఒప్పందం ప్రకారం, ఆ సినిమా నిర్మాణం పూర్తి కాకుండా ఆమె మరే చిత్రంలో నటించటానికి వీలులేదు. ఆ సమయంలో వాసన్ గారు కూడా కొత్త ప్రాజెక్టులు ఏమీ నిర్మించకపోవడంతో కాంచనమాల వాసన్ గారితో అగ్రిమెంట్ రద్దు చేయమని కోరగా ఆయన వీల్లేదు అని చెప్పడంతో మాటమాట పెరిగి "నీ దిక్కున్న చోట చెప్పుకో నీవు కోటీశ్వరుడవి ఐతే నా కేంటి?" అని అన్నారు కాంచనమాల. ఈ మాటలన్నీ జెమినీ వాసన్ ఆమెకు తెలియకుండా గదిలో టేప్ రికార్డర్ లో రికార్డ్ చేసి ఆమెకే వినిపించాడు. ఈ టేపుతో కోర్టుకెక్కి నీ అంతు చూస్తానన్నారు వాసన్. అది ఆమెకు ఊహించని షాక్. తెలుగులో ఆ సినిమాను విడుదల చేయకుండా చాల రోజులు ఆపి, ఉజ్వలంగా ఉన్న ఆమె సినీ జీవితాన్ని నాశనం చేసాడు వాసన్.

అలా తన సినీ జీవితం నాశనం కావటం వల్ల ఆమెకు మతి భ్రమించింది. ఆ తరువాత తెలుగులో బాలనాగమ్మ విడుదల అయింది. ఆ తర్వాత ఆమెకు ఎవ్వరూ అవకాశాలు ఇవ్వలేదు. ఈ సమయం లోనే బాలనాగమ్మ విడుదల అయి అఖండ విజయం సాధించింది. దాని వలన వచ్చిన లాభాలతో ముందు నుండి వాసన్ కు ఉన్న అప్పులన్నీ తీరిపోయాయి. కాంచనమాల నటనకు ఈ సినిమా గీటురాయి. కానీ ఆ సినిమానే హీరోయిన్ గా ఆమెకు ఆఖరి చిత్రం అయింది. ఆంధ్రుల కళ్ళన్నీ తన వైపుకి తిప్పుకున్న ఆమె కళ్లు ఆ షాక్ తో శూన్యంలోకి చూడటం మొదలుపెట్టాయి. హిందీ చిత్ర సీమలో అవకాశాలు వచ్చిన తెలుగు మీద మమకారంతో తిరస్కరించిన ఆమెకు ఇలా జరగడం అత్యంత విచారకరం. ఆమె బ్రతికి ఉండగానే తెలుగు చలన చిత్ర జగతి ఓ మహానటిని కోల్పోయింది. ఆ స్థితిలో ఉండగానే ఆమె భర్త గాలి వెంకటేశ్వర్లు గారు క్షయ వ్యాధితో మరణించారు. దాంతో ఆమె అసలు కోలుకోలేదు.

కాంచనమాల స్నేహితురాలు, నటి ఐన లక్ష్మీరాజ్యం 1963 లో నర్తనశాల చిత్రం నిర్మించారు. లక్ష్మీరాజ్యం బలవంతంతో ఓ చిన్న పాత్రను పోషించారు కాంచనమాల. ఆ చిత్రంలో ఆమె నటిస్తున్నారనే వార్తలు రాగానే ఎంతో మంది కాంచనమాల గారిని చూడటానికి వస్తే, ఆమె ఎవ్వరినీ గుర్తు పట్టకపోగా, మీరెవరూ నాకు తెలియదు అని చెప్పడంతో వారందరూ నిరాశతో వెనుదిరిగారు. దాదాపు 20 ఏళ్ళ తర్వాత మేకప్ వేసుకున్నా కాంచనమాల గారిలో ఏ మాత్రం ఆనందం కానరాలేదు. నటనలో ఆమె నుండి స్ఫూర్తి పొందిన వారిలో జి. వరలక్ష్మి ఒకరు. తొలితరం నటీమణుల్లో ఒకరైన కృష్ణవేణి గారు తీసిన దాంపత్యం సినిమా సమయంలో కాంచనమాల గారిపై ఉన్న అభిమానంతో ఆమె ఛాయా చిత్రాన్ని సెట్ లో ఉంచారు.

వడ్ల బస్తా కేవలం 3 రూపాయలు ఉన్న రోజుల్లోనే ఆమె 10000/- పారితోషికంగా తీసుకునేవారు. 1975 లో ప్రపంచ తెలుగు మహాసభల్లో ఘన సత్కారం పొందినా ఈమె కళ్ళు శూన్యాన్ని తప్ప మరోవైపు చూడలేదుట. విప్లవ కవిగా పేరు పొందిన శ్రీశ్రీ కూడా

అభిమానంతో అందమైన కాంచనమాల గారిపై 2 సార్లు కవితలల్లారు. జీవించినంత కాలం విలాసవంతమైన జీవితం గడిపింది. తెనాలిలో మొన్న ఈ మధ్యవరకూ ఆమెకు చెందిన గొప్ప బంగళాను 'కాంచనమాల బంగళా' గా పిలిచేవారు. తెనాలి వాసులందరికీ సుపరిచితమైన భవంతి అది. ఈ మధ్యనే దానిని పడగొట్టి Apartment గా కట్టారు. ఆ బిల్డర్ ఆమె జ్ఞాపకార్థం, దానిపేరు 'కాంచనమాల అపార్ట్మెంట్స్' అనే పేరునే ఉంచాడు. కాంచనమాల 1981 జనవరి 24 న మద్రాసులో ఈ లోకాన్ని వదిలి పరలోకాన్ని చేరారు.

శ్రీ శ్రీ గారు అన్నట్లు---

విసిగిన ప్రాణుల పిలిచే దెవ్వరు?


దుర్గతి, దుర్గతి,

దుర్మతి, దుర్మృతి!

"స్త్రీ ఒక మాట వల్ల, చూపు వల్లా పురుషునికి సందిచ్చిందా... ఇక అతని అధికారానికి, కోరికలకి, విన్నపాలకి అంతం ఉండదు. అసలు పర్యవసానం అక్కర్లేని స్త్రీ మొదటినించి విముఖంగానే ఉండాలి... నిప్పు వలె ఉండాలి"------ చలం

దుర్మోహితులు అందాన్ని నాశనం చేయాలనుకుంటే, గులాబిని ముళ్ళుకూడా రక్షించలేవు! ఇదే ఆమె జీవితం నేర్పిన నీతి వాక్యం!!

ఆ అందాల నటీమణికి నా ఘనమైన నివాళి!




బహుముఖ ప్రజ్ఞావంతురాలు శ్రీమతి మాలతీ చందూర్ - టీవీయస్. శాస్త్రి

sht. maalathi chandoor biography

తెలుగువారందరికీ సుపరిచయమైన పేరు శ్రీమతి మాలతీ చందూర్. ఈమె రచయిత్రి, కాలమిస్టు, సాహిత్య అకాడమీ బహుమతి గ్రహీత, ఒక్క మాటలో చెప్పాలంటే బహుముఖ ప్రజ్ఞావంతురాలు. మాలతీ చందూర్ కృష్ణాజిల్లాలోని నూజివీడులో 1930 లో జ్ఞానాంబ, వెంకటేశ్వర్లు అనే దంపతులకు జన్మించారు. తల్లితండ్రులకు వీరు ఏడుగురు సంతానం. ఆరుగురు సోదరుల మధ్య అనురాగ ఆప్యాయతలతో పెరిగిన ఏకైక ఆడపడుచు ఈమె. ఆమె బాల్యం ఎక్కువభాగం నూజివీడులోనే గడిచింది. ఈమె, నూజివీడులోని ఎస్. ఎస్. ఆర్ పాఠశాలలో ఎనిమిదవ తరగతి వరకు చదివారు. ఆ తరువాత, ఏలూరులోని ఆమె మేనమామగారైన చందూర్ గారింటిలో ఉండి, సెయింట్ థెరిస్సా స్కూల్లో ఇంగ్లీషు మీడియంలో చదువుకున్నారు. అక్కడే ఆమెకు ప్రఖ్యాత రచయిత్రులు డి. కామేశ్వరి, ఆనందారామం లాంటి వారితో పరిచయమయ్యింది.

ఆ రోజుల్లో ఏలూరు నుండి 'కథావీధి' అనే సాహిత్య పత్రిక ప్రచురించబడేది. అక్కడికి అతి తరచుగా శ్రీశ్రీ, విశ్వనాథ సత్యనారాయణ, కృష్ణశాస్త్రి, నండూరి సుబ్బారావు, వెంకట చలం లాంటి నాటి ప్రఖ్యాత రచయితలు, కవులు వచ్చేవారు. ఈమెకు చిన్నతనం నుండీ సాహితీ అభిలాష ఉండటం చేత, వీరందరిని చూడటానికి ఉబలాటపడటమే కాకుండా, వారితో పరిచయాన్ని కూడా పెంచుకుంది. 1947 లో, అనగా ఆమె తన 17 వ ఏట, మేనమామగారైన శ్రీ చందూర్ గారితో కలసి మద్రాసుకు చేరారు. 1947 డిశంబర్ లో వీరిరువురికీ వివాహం జరిగింది. పాఠశాలలో ఆమె చదువుకుంది, కేవలం 8 వ తరగతి వరకే! పెళ్ళైన తరువాత ప్రైవేటుగా ఎస్. ఎస్. ఎల్. సి పూర్తిచేసారు. ఆమె విద్యార్హత అదే! నిరంతరం అనేక పుస్తకాలు అధ్యయనంచేసి అపారమైన

జ్ఞానసంపదను సొంతం చేసుకున్నారు. తన 19 వ ఏటనే ఈమె రచనా వ్యాసంగాన్ని చేపట్టారు. మొదట్లో ఆకాశవాణిలో తన రచనలను, చదివి వినిపించేవారు.

ఆ రోజుల్లోనే ఈమెకు మరికొంతమంది ప్రముఖ రచయితలైన ఆచంట జానకిరాం, బుచ్చిబాబు, రాజమన్నార్, మునిమాణిక్యం నరసింహారావు గార్ల వంటి వారితో పరిచయమయింది. 1952 నుండి అనేక కథలను, వ్యాసాలను, నవలలను వ్రాసారు. 1952 నుండి ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక ద్వారా ఈమె స్త్రీల కోసం'ప్రమదావనం' అనే శీర్షికను అప్రతిహతంగా, నిరాటంకంగా నిర్వహించారు. దాదాపుగా నాలుగు దశాబ్దాలపాటు ఆ శీర్షికను విజయవంతంగా నిర్వహించి, గిన్నీసు బుక్ లో స్థానం సంపాదించుకున్నారు. విశేష మేమంటే, పురుషులు కూడా ఎక్కువగా ఆ శీర్షికను చదివేవారు. ఆమె విజ్ఞానఖని, నడిచే విజ్ఞాన సర్వస్వం! ఆ శీర్షికలో పాఠకులు ఆమెను రకరకాల ప్రశ్నలను వేసేవారు. వాటిలో వ్యక్తిగత సమస్యలు కూడా ఉండేవి. వాటన్నిటికీ నేర్పుగా, ఓర్పుగా సమాధానమిచ్చి, పాఠకులను సంతృప్తి పరచటమే కాకుండా, వారి ప్రశంసలు కూడా పొందారు. ఉదాహరణకి, రెండవ ప్రపంచయుద్ధానికి కారణాలు ఏమిటని ఎవరైనా అడిగితే, దాని పూర్వాపరాలతో పాటు హిట్లర్ చరిత్ర కూడా చెప్పేది.

ఆ రోజుల్లో, నా స్నేహితులు, వారికి తెలియని విషయం నన్ను ఏదైనా అడిగితే, నేను వారితో సరదాగా -- అన్నీ తెలియటానికి నేనేమైనా మాలతీచందూర్ నా! అనే వాడిని!! తెలుగులో మొదటి సారిగా వంటల పుస్తకాలను గురించి చక్కగా వ్రాసారు. ఆ పుస్తకం ఎన్నో ముద్రణలకు నోచుకుంది. దాదాపుగా 25 నవలలను, స్త్రీల ఇతివృత్తాన్ని నేపథ్యంగా తీసుకొని వ్రాసారు. 300 ఆంగ్ల రచనలను తెలుగులోకి అనువదించారు. ప్రతి వారం, పాఠకులకు ఒక ఆంగ్ల నవలను కూడా పరిచయం చేసారు. స్వాతి పత్రిక వీటిని 'పాత కెరటాలు' అనే శీర్షిక ద్వారా ప్రచురించారు. ఉత్తమ కాలమిస్టుగా అనేక పురస్కారాలు అందుకున్నారు. 70వ దశకములో కేంద్ర సెన్సారు బోర్డు సభ్యురాలిగా 11 సంవత్సరాలు పనిచేసారు. తెలుగు, తమిళ, ఆంగ్ల భాషలపై మంచి పట్టు సాధించారు. అనేక తమిళ రచనలను కూడా తెలుగులోకి అనువదించారు.

ఆమె మొదటి కథ 'రవ్వ లడ్డూలు' కాగా, మొదటి నవల 'చంపకం చెదపురుగులు'. ఆమె వ్రాసిన వాటిలో మరికొన్ని ముఖ్యమైనవి--'ఆలోచించు, భూమిపుత్రి, హృదయనేత్రి, కలల వెలుగు, మనసులోని మనసు, శతాబ్ది సూరీడు, శిశిర వసంతం'. 1987లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు, 1993లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, కలకత్తాకు చెందిన భారత భాషా పరిషత్ అవార్డు, తెలుగు వర్సిటీ అవార్డు అందుకున్నారు. ఇంకా పెక్కు సన్మానాలు, సత్కారాలు పొందారు. ఈమెకు, ఇంతటి పేరు ప్రఖ్యాతులు రావటం వెనుక ఆమె భర్త అయిన చందూర్ గారి పాత్ర కూడా మరువలేనిది. గత కొద్దికాలంగా కాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఈమె, 21-08-2013 న చెన్నైలో తుదిశ్వాస విడిచారు. ఆమె పార్థివ శరీరాన్ని, ఆమె కోరిక మేరకు, పరిశోధనల నిమిత్తం చెన్నైలోని శ్రీ రామచంద్ర వైద్య కళాశాల వారికి ఆమె మిత్రులు, కుటుంబ సభ్యులు అందచేసారు.

'ముదితల్ నేర్వగ రానిది కలదే, ముద్దాడ నేర్పించినన్ ' అన్న దానికి ప్రత్యక్ష నిదర్శనం ఈమె జీవిత చరిత్ర. స్వయంకృషి, పట్టుదలతో ఎన్నో శిఖరాలాను అధిరోహించిన ఈమె మరణం, సాహితీలోకానికి ఒక తీరని పెద్ద లోటు. ఈమె స్త్రీల

ఇతివృత్తాంతాన్ని నేపథ్యంగా తీసుకొని అనేక నవలలు వ్రాసినప్పటికీ, నేటి కొద్దిమంది స్త్రీవాద రచయిత్రుల లాగా పురుష ద్వేషి మాత్రం కాదు! స్వయంకృషితో పైకి వచ్చిన ఈ నారీశిరోమణి మరణానికి సంతాపం తెలియచేస్తూ, భగవంతుడు ఆమె ఆత్మకు శాంతి కలిగించాలని వేడుకుంటున్నాను.

అరుదైన ఈ రచయిత్రికి ఘనమైన నివాళిని సమర్పించుదాం!

************************************************




ఆంధ్ర కేసరి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు గారు - టీవీయస్. శాస్త్రి

andhra kesari tanguturi prakasam pantulu

స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర ప్రధమ ముఖ్య మంత్రి, ప్రజా నాయకుడు అయిన శ్రీ ప్రకాశం పంతులు గారిని గురించి నాకు తెలిసిన విషయాలు క్లుప్తంగా చెబుతాను. 'ఆంధ్ర కేసరి'గా వారిని తెలుగు ప్రజలు గౌరవంగా పిలుచు కుంటారు. శ్రీ ప్రకాశం పంతులు గారు నేటి ప్రకాశం జిల్లాలో ఒక పేద కుటుంబంలో జన్మించారు. ఈ తెలుగు వారి ముద్దుబిడ్డను కన్న ధన్యజీవులు గోపాలకృష్ణయ్య , సుబ్బమ్మ దంపతులు. ప్రకాశం గారికి తన పదకొండవ ఏటనే పితృ వియోగం కలిగింది. తల్లి ఒక చిన్న

భోజనశాలను ఒంగోలు పట్టణంలో నడుపుతూ కుటుంబ భారం మోసింది. కష్టపడి పిల్లలను బాగా చదివించి వున్నత స్థితికి తీసుకొని రావాలని ఆవిడ సంకల్పం. శ్రీ హనుమంతరావు నాయుడు గారు ప్రకాశం గారికి గురువు మరియూ మార్గ దర్శకుడు. వారు రాజమహేంద్రవరం వెళ్ళుతూ, అక్కడ విద్యాభ్యాసానికి మంచి అవకాశాలు వున్నాయనే భావనతో ప్రకాశం గారిని కూడా తన వెంట తీసుకొని వెళ్ళారు. ప్రకాశం గారికి న్యాయవాది కావాలనే బలమైన కాంక్ష ఉన్నప్పటికీ, మెట్రిక్యులేషన్ పరీక్షలోనే ఉత్తీర్ణులు కాలేక పోయారు. దానికి కారణం, ఆయనకు స్నేహితులు ఎక్కువ. అంతకు మించి వారికి నాటకాలంటే చెప్పలేనంత పిచ్చి.

ఒక పక్క నాటకాలలో వేషాలు వేస్తూనే, పట్టుదలతో చదివి మద్రాసుకు వెళ్లి అక్కడ లా కాలేజీలో చదివి, రాజమహేంద్రవరంలో న్యాయవాది వృత్తిని ప్రారంభించారు. ఆ వృత్తిలో వారు బాగారాణించి పేరు ప్రఖ్యాతులు మరియూ అత్యధిక ధనం అనతికాలంలోనే సంపాదించారు. అచిర కాలంలోనే రాజమహేంద్ర పురవాసుల మన్నన సంపాదించి, రాజమహేంద్రవరానికి మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికయ్యారు. అప్పుడు వారి వయసు 30 సంవత్సరాలు. వారి ప్రజా జీవిత ప్రస్థానంలో తొలి సోపానం ఇదే! ఆ తరువాత బారిస్టర్ చదువులకై ఇంగ్లాండ్ వెళ్లి అక్కడ తన చదువును విజయవంతంగా పూర్తి చేసుకొని తిరిగి స్వదేశానికి వచ్చారు. శ్రీ దాదాబాయి నౌరోజీ నేతృత్వంలో రాజకీయాలలో ప్రవేశించి చురుకుగా పని చేసి అతి తక్కువ కాలంలోనే పలువురు జాతీయ నాయకుల దృష్టికి వెళ్ళారు. స్వాతంత్ర్య పోరాట ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు.

ఆ కాలంలో బ్రిటిష్ వారు నియమించిన సైమన్ కమీషన్ భారత దేశానికి వచ్చింది. నాటి కాంగ్రెస్ పార్టీ వారు, సైమన్ కమీషన్ వారి రాకను వ్యతిరేకిస్తూ, 'సైమన్ గో బాక్' అనే నినాదాన్ని తీసుకొని వ్యతి రేకించమని దేశంలోని కార్యకర్తలందరికీ ఆదేశాలు యిచ్చారు. సైమన్ కమీషన్ వారి రాకను వ్యతిరేకించటానికి ముఖ్య కారణం-- ఆ కమీషన్ లో ఒక్క భారతీయుడు కూడా లేక పోవటమే!సైమన్ కమీషన్ వారికి ప్రతి చోట నల్ల జండాలతో , వారి రాక పట్ల తీవ్ర నిరసన తెలిపారు. సైమన్ కమీషన్ వారు మద్రాసు కు వచ్చిన సమయంలో పోలీసు వారు ఆందోళన కారులను అడ్డగించారు. దానితో ప్రజలు మరీ వుగ్రులై విపరీతంగా గుమికూడి సైమన్ కమీషన్ పట్ల తమ నిరసనను మరీ తీవ్ర స్వరంలో వినిపించారు. పరిస్థితి అదుపు తప్పింది. పోలీసులు కాల్పులు ప్రారంభించారు. ఒక యువకుడు వెంటనే అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రజలు చనిపోయిన యువకుని శవం తీసుకోవటానికి ముందుకు వురుకుతున్నారు. పోలీసులు, ముందుకు వస్తే మళ్ళీ కాల్పులు జరుపుతామని హెచ్చరికలు జారీ చేశారు. ఆ సమయంలో ప్రకాశం గారు ధైర్యంగా పోలీసులను సమీపించి, తన చొక్కా బొత్తాములను తీసి గుండె చూపించి, "గుండులతో ముందు నన్ను కాల్చండి" అని పోలీసులకు ప్రతి సవాల్ విసిరారు. పరిస్థితిని అర్థం చేసుకున్న పోలీసులు ప్రకాశం గారికీ, ఆయన అనుచరులకూ దారి యిచ్చారు. ఈ సంఘటన తరువాత నుండీ ప్రజలు ప్రేమతో వీరిని 'ఆంధ్ర కేసరి' అని పిలిచి గౌరవించేవారు.

1941 లోదక్షిణభారతదేశం నుండి సత్యాగ్రహంలో పాల్గొన్న మొదటి వ్యక్తి ప్రకాశంగారు. 1942 లో Quit India ఉద్యమంలో పాల్గొని మూడేండ్లు కఠిన కారాగారవాస శిక్షను అనుభవించారు. 1945 లో జైలు నుండి విడుదల అయిన తరువాత దక్షిణ భారత దేశమంతా విస్తృత పర్యటన చేసి ప్రజలూ వారి సమస్యలతో మమేకమయ్యారు. 1946 లో మద్రాసు ప్రెసిడెన్సీ కి జరిగిన ఎన్నికలలో ప్రకాశం గారు ముఖ్యమంత్రి అయ్యారు. తమిళుడు అయిన కామరాజ్ గారు వీరి నాయకత్వాన్ని బలపరచారు. ఆ ఎన్నికలో వీరికి ప్రధాన ప్రత్యర్థి శ్రీ రాజాజీ. కాని ఆ ప్రభుత్వం 11 నెలలు మాత్రమే పనిచేసి పడిపోయింది. కానీ, ప్రకాశం గారి ప్రజా

జీవన యాత్రలో ఏ మార్పూ లేదు. సామాన్య మానవుడి సంక్షేమమే ఆయన జీవిత లక్ష్యం. దానికోసం జీవించినంత కాలం పోరాడారు. 1948 లో, నెహ్రూ గారు ప్రకాశం గారి క్షేమం దృష్టిలో వుంచుకొని వారించినా, నిజాం పరిపాలనలో వున్న హైదరాబాద్ రాష్ట్రం అంతా పర్యటించి ప్రజలను చైతన్యవంతులను చేశారు. రజాకార్ల నాయకుడైన ఖాసిం రజ్వీని కూడా కలిసారు. ఆయన ధైర్య సాహసాలకు రజాకార్లు 1952 లో గౌరవ సూచనగా మార్చింగ్ కూడా చేశారు. అలా శత్రువు గుహలోకి ధైర్యంగా చొరపడగల సింహం శ్రీ ప్రకాశం గారు.

తర్వాత కాంగ్రెస్ పార్టీని వీడి 'ప్రజా పార్టీ'ని స్థాపించి విశేష ప్రచారం చేసి కృషి చేసినప్పటికీ, అది అధికారంలోకి రాలేక పోయింది. ఈ పరిస్థితులలో 1952 లో పొట్టి శ్రీ రాములు గారు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న సమయంలో వారికి మద్దతుగా వీరూ ఆ ఉద్యమంలో పాల్గొన్నారు. రాజ్యాంగంప్రకారం భాషా ప్రయుక్త రాష్ట్రాలను ఏర్పాటు చేసి నపుడు, తెలుగు భాష మాట్లాడే వారికి ప్రత్యేక రాష్ట్రం యెందుకు ఇవ్వరు? అని నెహ్రూ ను నిలదీసి ఒక రూపాయి నోటును విసిరివేసి, "చూడండి! ఈ రూపాయి నోటులో ఒక్క రూపాయి అని తెలుగులో వ్రాసివుంది, మాకు ప్రత్యేక రాష్ట్రం యెందుకు ఇవ్వరూ?" అని గర్జించారు. పొట్టి శ్రీ రాములు గారి ఆత్మార్పణం తరువాత 1953 అక్టోబర్ లో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. నెహ్రూ గారి కోరిక మేరకు ప్రకాశం పంతులు గారు మొదటి ముఖ్యమంత్రి అయ్యారు. కమ్యూనిష్టులు మద్దతు విరమించుకోవటం లో ఒక సంవత్సరం తరువాత వారి ప్రభుత్వం కుప్పకూలింది. 1955 లో మధ్యంతర ఎన్నికలు వచ్చినప్పటికీ, ప్రకాశం గారు ప్రత్యక్ష రాజకీయాలనుండి విరమించుకున్నారు.

1956 నవంబర్ 1 వ తేదీన పూర్వపు హైదరాబాద్ రాష్ట్రం విలీనంతో 'ఆంధ్ర ప్రదేశ్' అవతరణ జరిగింది. ప్రకాశం గారి ముఖ్య అనుచరుడైన శ్రీ నీలం సంజీవరెడ్డి గారు ముఖ్యమంత్రి అయ్యారు. వారు ప్రత్యక్ష రాజకీయాలనుండి విరమించు కున్నప్పటికీ ప్రజలతో సంబంధాలను జీవించినంత కాలం కొన సాగించారు. ఒక సారి ఒంగోలు లో పర్యటించే సందర్భంలో తీవ్రమైన వడ దెబ్బ తగిలి, హైదరాబాద్ లోని హాస్పటల్ కు తరలించారు. కానీ, ఏ మాత్రం లాభం లేకపోయింది. వారిని 20 మే, 1957. న మృత్యువు కబళించింది. ప్రముఖ గాయని శ్రీమతి టంగుటూరి సూర్యకుమారి వీరి అన్నగారి కూతురు. మరొక ప్రముఖ నటుడు శ్రీ విజయ చందర్ వీరి మనవడు(కూతురి కొడుకు). శ్రీ విజయ చందర్, ప్రకాశం గారి జీవిత చరిత్రను 'ఆంధ్ర కేసరి' అనే పేరుతొ ఒక మంచి సినిమా తీయటమే కాకుండా , అందులో ప్రకాశం గారి పాత్రను కూడా పోషించారు. ఈ సినిమా తప్పక చూడవలసిన సినిమా!

ఆంధ్ర దేశ ప్రజల హృదయాలలో చిరంజీవి గా వున్న ఆ మహనీయునికి నా స్మృత్యంజలి...

*********************************************




బహుముఖ ప్రజ్ఞావంతురాలు-శ్రీమతి భానుమతిరామకృష్ణ - టీవీయస్. శాస్త్రి

smt. bhanumati ramakrishna biography

డాక్టర్ పద్మభూషణ్ శ్రీమతి పాలువాయి భానుమతి (07-09-1925 to 24-12-2005) బహుముఖ ప్రజ్ఞావంతురాలు. ఆమె నిర్మాత, దర్శకురాలు, గాయని, సంగీత దర్శకురాలు, రచయిత్రి , స్టూడియో నిర్వాహకురాలు. తెలుగు, తమిళ భాషలలో అగ్రశ్రేణి హీరోలతో ఆమె పోటిపడి నటించింది. ఆమె బొమ్మరాజు వెంకట సుబ్బయ్య, సరస్వతమ్మ దంపతులకు దొడ్డవరం(ప్రకాశం జిల్లా)లో జన్మించింది. ఆమె తండ్రి గారు స్వతహాగా నటులు మరియు శాస్త్రీయ సంగీత ప్రియులు. అందుచేత, బాల్యంలోనే ఆమె తండ్రి గారి వద్ద సంగీత విద్యను అభ్యసించింది. ఆమె 1935లో చిత్రసీమలో ప్రవేశించి దాదాపుగా 200 లకు పైగా తెలుగు, తమిళ చిత్రాలలో నటించి విశిష్ట నటిగా పేరు తెచ్చుకుంది.

చిత్రసీమలో ఆమెను అష్టావధాని , అభినయ సరస్వతి అని పిలిచే వారు. కొన్ని సినిమాలకు ఎడిటర్ గాను పనిచేసింది. అందరికి తెలియని మరియొక విషయము ఏమిటంటే, ఆమెకు జ్యోతిష్యములో కూడా ప్రవేశం ఉంది. వేదాంత ధోరణి కూడా ఎక్కువే! 1939 లో సి. పుల్లయ్య గారి దర్శకత్వములో నిర్మించిన 'వరవిక్రయం' అనే సినిమాలో కాళింది అనే పాత్ర ద్వారా పరిచయం అయింది . ఆ

తరువాత, మాలతీమాధవం, ధర్మపత్ని, రత్నమాల చిత్రాలలో నటించింది. మొదటి సారిగా ఆమె popular అయిన సినిమా కృష్ణ ప్రేమ. ఆ తర్వాత చక్రపాణి, స్వర్గసీమ , లైలామజ్ను, విప్రనారాయణ, మల్లేశ్వరి, బాటసారి, అంతస్తులు మున్నగు సినిమాల ద్వారా విశిష్ట నటిగా పేరు తెచ్చుకుంది . మొదటిసారిగా 1953లో చండిరాణి సినిమాకు ఒకేసారి తెలుగు, తమిళ, హిందీ బాషలలో దర్శకత్వం వహించి ఒక కొత్త రికార్డును నెలకొల్పింది. ఆమె చివరి సినిమా పెళ్ళికానుక(1998). అదే సినిమాలో బాలు గారితో కలసి ఆమె పాడిన ‘బంగారుబొమ్మకు’ అనేది ఆమె చివరి పాట.

అన్నాదొరై ఆమెను Nadippukku Ilakkanam" (means Grammar for acting) అనే బిరుదుతో సత్కరించారు. ఆ బిరుదుకు ఆమె పూర్తిగా అర్హురాలు. నటనతో పాటు ఆమెకు కర్ణాటక , హిందుస్తానీ సంగీతాలలో విశేష ప్రజ్ఞ ఉంది. ఆమె పాత్రలకు ఆమే పాడుకునే వారు. ఆమె పాడిన, పిలిచిన బిగువటరా, ఆకాశ వీధిలో... లాంటి పాటలు ఇంకా సంగీత ప్రియుల నోళ్ళల్లో నానుతున్నాయి. వీటన్నిటితో పాటుగా ఆమె ఒక విభిన్న రచయిత్రి. ఆమె 'అత్తగారి కథలు' చాలా పేరు తెచ్చుకున్నాయి. 'నాలో నేను' అనే ఆత్మకథను వ్రాసుకున్నారు. ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి వారి బహుమతి స్వీకర్త కూడాను. భానుమతి తల్లిదండ్రులిద్దరూ సంగీతంలో ప్రవేశమున్నవారే. సంగీతంలో తన తొలిగురువు తండ్రి కావడం విశేషం. ఆమెకు ఎమ్మెస్ సుబ్బులక్ష్మిగారంటే ఎంతో అభిమానం. ఒకసారి త్యాగరాజ ఆరాధనోత్సవాల సమయంలో తిరువాయూరులో సుబ్బులక్ష్మిగారితో కలిసి ‘ఎందరో మహానుభావులు’ కీర్తన పాడే అవకాశం లభించింది. ఆ గాత్రమాధుర్యం సినీరంగంలోని ప్రముఖుల దృష్టిని ఆకట్టుకుంది. ఇక అప్పటి నుంచి గాయకునిగా, నటిగా, సంగీత దర్శకులురాలిగా, నిర్మాతగా, రచయిత్రిగా సినిమా రంగంలో తన ప్రతిభను అన్నివిధాలా చాటుకున్నారు.

కృష్ణ ప్రేమ అనే సినిమా షూటింగ్ సందర్భములో, ఆ సినిమా అసిస్టెంట్ డైరెక్టర్ అయిన పి. ఎస్. రామకృష్ణారావు గారితో ప్రేమ వివాహం జరిగింది. ఆ తదుపరి భరణి స్టూడియోను నిర్మించి దాన్ని సర్వాంగ సుందరముగా తీర్చి దిద్దారు. ఆమె చాలా రివార్డ్స్, అవార్డ్స్ తీసుకొన్నారు. 2005 లో 'స్వర్గసీమ' ను చేరారు. చాలా మంది ఆమెను అహంభావి అని భావించేవారు. కాని, అది అహంభావంకాదు, స్వాతిశయం, ఆత్మాభిమానం మాత్రమే!స్వర్గీయ ముళ్ళపూడి వెంకట రమణ గారు పాత్రికేయునిగా పనిచేస్తున్న రోజుల్లో, ఆయనకు భానుమతి గారిని ఇంటర్వ్యూ చేసే అవకాశం వచ్చింది. భానుమతికి అహంభావం ఎక్కువ అని అందరూ ఆమెకు దూరంగా ఉండేవారు. ఇంటర్వ్యూ చేసే అవకాశం వచ్చింది కదా, ఆమెను ఒక పట్టు పడుదామని ముళ్ళపూడివారు అనుకున్నారు. పాత్రికేయునిగా తన తలపొగరును కూడా ఆమెకు చూపించాలని నిర్ణయించు కున్నారు. భానుమతి గారిని రమణ గారు అడిగిన మొదటి ప్రశ్న-- "మీకు తలపొగరు ఎక్కువటగా?". దానికి ఆమె తడుముకోకుండా వెంటనే ఇలా సమాధానం చెప్పారు--"నా ఎదురుగా ఉండి నన్నే ఆ మాట అడగటానికి నీకెంత తలపొగరు?", అని సమాధానం చెప్పారు. ఆ సమాధానానికి ముళ్ళపూడివారు ఖంగు తిన్నారు. వెంటనే భానుమతి గారు పకపకా నవ్వుతూ, "దీన్ని తలపొగరు, అహంభావం అనకూడదు, ఆత్మాభిమానం అనాలి. భానుమతి ఎవరి ముందూ తలదించుకోదు. దానిని అర్థం చేసుకోలేని వాళ్ళు ఇలాంటి పేర్లు పెడతారు. అంతే కానీ, నేనూ అందరి ఆడవాళ్ళ లాంటి దాన్నే" అని ఎంతో అనునయంగా భానుమతి గారు సమాధానం చెప్పారు. ఈ విషయాన్ని ముళ్ళపూడివారు తన 'కోతికొమ్మచ్చి'లో తీపిగుర్తులుగా చెప్పుకున్నారు.

ఎప్పుడూ ఎవరిని లెక్క చేయదు. S. Rajeswara Rao గారు సంగీత దర్శకత్వం వహించిన సినిమాలకు పర్యవేక్షకురాలిగా ఆమె పేరు వేయించుకుంది . ఆమె చేసుకున్న చిన్న చిన్న తప్పుల వల్లే మిస్సమ్మ, పాతాళభైరవి లాంటి విజయా వారి సంస్థలలో మంచి ఛాన్స్ లు పోగొట్టుకొంది. మిస్సమ్మ సినిమాను ఆమెతో కొంతవరకు తీసారు కూడా! కానీ విజయా వారికి ఎందుకో ఆమె తీరు నచ్చలేదు ! మిస్సమ్మ సినిమాలోని ఆమె నటించిన ఒక సన్నివేశానికి సంబంధించిన స్టిల్ ను మీకోసం ఇక్కడ పొందుపరుస్తున్నాను.

ఒక సారి N. T. Rama Rao గారు తాతమ్మకల అనే సినిమా తీస్తున్నప్పుడు ఆమె వేసే పాత్రను D. V. Narasa Raju గారు నిర్ణయించారు. నటించమని ఆమెను అడగటానికి N. T. Rama Rao గారికి బెరుకు. ఎందుకంటే, అందులో ఆమెది ఒక ముదుసలి పాత్ర. ఆ పనికి ఆయన నరసరాజు గారినే పురమాయించారు. నరసరాజు గారు ఆమెను ఎట్లాగో ఒప్పించారు. అయితే remuneration ఎంత ఇవ్వాలి అంటే, అందుకు ఆమె తడుముకోకుండా, N. T. R. ని తన సినిమాలో బదులుగా నటించమని చెప్పింది. అందుకు N. T. R. అంగీకరించారు. అదీ ఆమె స్థాయి!!

ఆమెకు ముళ్ళపూడి, బాపుల మీద విపరీతమైన ప్రేమ, అభిమానం. వాళ్ళ సినిమాల్లో నటించాలని ఆమె కోరిక. ఆమెతో వేగాలంటే వీళ్ళకు భయం. అందుచేత వారి సినిమాలలో నటించలేక పోయారు. అయితే, ప్రయత్నాలు మానలేదు. వాళ్ళు బుద్ధిమంతుడు తీసే రోజుల్లో, ఒక సారి రమణ గారికి ఫోన్ చేసి పిలిపించుకొన్నారు. ఆవిడ మాట్లాడే తీరు కూడా చాలా గమ్మత్తుగా ఉంటుంది. రమణ గారితో, "ఏమోయ్! రమణ గారు!! మీరు అదేదో సినిమాను గోదావరి వద్ద తీస్తున్నారటగా? అందులో స్కూల్ ఇన్స్పెక్టర్ పాత్ర ఉందటగా! అది ఆడవారు వేసినా సరి పోతుందని నా అభిప్రాయం" అని చెప్పి పంపించారు. రమణ గారికి గొంతులో వెలక్కాయ పడ్డట్టు అయ్యింది. వెంటనే రమణ గారు, ఆమె భర్త రామకృష్ణారావు గారికి వెళ్లి ఈ విషయం చెప్పారు. అందుకు ఆయన ఒక సలహా ఇచ్చారు. షూటింగ్ అంతా గోదావరి ఒడ్డున, టెంట్లు వేస్తారు, A. C. లు గట్రా ఏమి ఉండవు అని చెప్పమన్నారు. అలాగే, రమణ గారు వెళ్ళి, "అమ్మా! ఆ ఎండలలో ఆ జనం మధ్యలో మీరు చాలా ఇబ్బంది పడుతారు, A. C. లు కూడా ఉండవు"అని చెప్పారు. అందుకు , ఆమె, "ఏమి పరవా లేదోయ్! రమణ గారు!! అది మన సినిమా! నేను కూడా కష్ట పడుతాను" అని చెప్పింది. రమణ గారికి గుండెల్లో రైళ్ళు పరుగెత్తుతున్నాయి. మళ్ళీ రయ్యిమని రామకృష్ణారావు గారి దగ్గరకు వెళ్లి, ఈ గండం నుంచి తప్పించండి మహా ప్రభో అని మొర పెట్టుకొన్నారు. చాలా సేపు రామకృష్ణారావు గారు దీర్ఘంగా ఆలోచించి ఒక మంచి సలహా ఇచ్చారు. అది ఏమిటంటే, మీ పాత్రకు పాట లేదని చెప్పమన్నారు. వెంటనే, రమణగారు, రివ్వున ఆమె దగ్గరకు వెళ్లి, "అమ్మా! మీరు వేయబోయే పాత్ర ఒక స్కూల్ ఇన్స్పెక్టర్ పాత్ర, ఆ పాత్రకు ఎన్ని విధాల ఆలోచించినా, పాట పెట్టటం కుదరటం లేదు" అని అనగానే, అందుకు ఆమె వెంటనే, "పాటలేని పాత్ర నాకెందుకు?" అని, ఈసారి పాట ఉన్న మంచి పాత్ర నా కోసం సృష్టించవోయ్! రమణ గారు!!" అనటం జరిగింది. ప్రస్తుతానికి గండం గడిచినందుకు సంతోషించి(లోలోపల) రమణ గారు ఆమె ఆశీర్వచనాలు తీసుకొని బయట పడ్డారు. ఇదంతా, రమణ గారి స్వీయ చరిత్ర 'కోతి కొమ్మచ్చి' లో ఉంది. ఇదంతా ఎందుకు చెపుతున్నానంటే, భానుమతి గారిని పాటను విడదీయలేము. ఆమె సంగీత సరస్వతి.

*************************************************




www.gotelugu.com www.gotelugu.com www.gotelugu.co

భారతరత్న' శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య - టీవీయస్.శాస్త్రి

Bharata Ratna - Sri Mokshagundam Visvesvarayya

భారతదేశంలోని ప్రఖ్యాత ఇంజనీరు అయిన శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారిని గురించి తెలుసుకోవాల్సిన ఆసక్తికరమైన విషయాలను కొన్నిటిని తెలుసుకుందాం! ఈయన భారతదేశంలోనే కాకుండా ప్రపంచ ప్రఖ్యాత ఇంజనీర్లలో అతి ముఖ్యుడు. వీరి అసలు పేరు విశ్వేశ్వరాయ. కానీ వారిని అందరూ విశ్వేశ్వరయ్య అని ప్రేమగా పిలిచేవారు.

ఈయన, 15-09-1860న, శ్రీనివాస శాస్త్రి, వెంకాయమ్మ అనే పుణ్యదంపతులకు, నేటి కర్ణాటక రాష్ట్రంలోని, బెంగుళూరు సమీపంలోని ముద్దినేహళ్లి అనే కుగ్రామంలో జన్మించారు. వీరిది అతి పేదకుటుంబం. వీరి పూర్వీకులు కర్నూలు జిల్లాలోని 'మోక్షగుండం' గ్రామానికి చెందినవారు. ఉదర పోషణార్థం, వారు కర్ణాటకలోని మైసూరు ప్రాంతానికి వలస వెళ్ళారు. శ్రీ విశ్వేశ్వరయ్య గారి తండ్రి గొప్ప సంస్కృత పండితుడు, ఆయుర్వేద వైద్యుడు. సంపాదనకోసం ఎక్కువగా ఇతర గ్రామాలను సంచరించేవారు. కుటుంబ బరువు, బాధ్యతలు మోయటం విశ్వేశ్వరయ్యగారి తల్లి మీద పడింది. ఆమె గొప్ప భక్తిపరాయణురాలు. విశ్వేశ్వరయ్యగారు తల్లి సంరక్షణలో విద్యాబుద్ధులు పొందటమే కాకుండా-ఋజువర్తన, క్రమశిక్షణ కూడా అలవాటు చేసుకున్నారు. ఆ మహాతల్లి కొడుకును చక్కగా తీర్చిదిద్దింది.

ఆయన బాల్యంలోనే వారి కుటుంబం చిక్ బళ్ళాపూరుకి మకాం మార్చింది. అయన ప్రాథమిక విద్య చిక్ బళ్ళాపూరులోనే జరిగింది. ఉపాధ్యాయులు అతని ప్రతిభను గుర్తించి, అతని మీద ప్రత్యేక శ్రద్ధ తీసుకునే వారు. వీరికి గణిత శాస్త్రమంటే ఎక్కువ మక్కువ. ఈ విషయాన్ని గ్రహించి శ్రీ నాదముని నాయుడు గారు అనే ఉపాధ్యాయుడు ఇతనికి గణిత శాస్త్రంలో బాగా తర్ఫీదునిచ్చి, ప్రవీణుడిని చేసారు. మేనమామగారైన శ్రీ రామయ్య గారి ఆర్ధిక సహాయంతో బెంగుళూరులోని సెంట్రల్ కళాశాలలో బి. ఎ లో చేరారు. సరిగ్గా ఈ సమయంలో శ్రీ విశ్వేశ్వరయ్య గారికి పితృవియోగం కలిగింది. అప్పుడు విశ్వేశ్వరయ్య గారి వయసు 15 సంవత్సరాలే! ఈ విషాద ఘట్టం ఆయనను మానసికంగా బాగా కృంగతీసింది. తన్ను తానే ఓదార్చుకొని, గుండె నిబ్బరపరచుకొని, పిల్లలకు ట్యూషన్లు చెప్పి కష్టపడి బి. ఎ ను పూర్తిచేసారు. అదృష్ట వశాత్తు మైసూరు మహారాజావారి దృష్టిలో పడ్డారు. రాజావారి ఆర్ధిక సహాయంతో పూనాలో ఇంజనీరింగ్ విద్యను పూర్తిచేసారు.

ఇంజనీరింగ్ విద్యను విజయవంతంగా పూర్తిచేసుకున్న తరువాత, మొదటిసారిగా బొంబాయిలో ప్రభుత్వ ఉద్యోగిగా చేరారు. ఆ సమయంలో వీరు బొంబాయిని ఒక సుందర నగరంగా తీర్చిదిద్దారు. 1908 లో నిజాం నవాబు ఆహ్వానం మేరకు, నిజాం ప్రభుత్వంలో ఇంజనీరుగా చేరి పలు రిజర్వాయులను నిర్మించటమే కాకుండా, హైదరాబాద్ ను ఒక సుందర నగరంగా తీర్చిదిద్దారు. నిజాం నవాబు వీరి మేధస్సును గుర్తించి 1912 లో దివాన్ గా పదోన్నతిని కల్పించారు. విశాఖపట్నం రేవును సముద్రపు కోత నుండి రక్షించే వ్యవస్థను రూపొందించడంలో కూడా ఆయన పాత్ర ఉంది. ఏ పనిని ఆయనకు ఎవరు అప్పగించినా, ఆయన ఆ పనిని ఒక తపస్సుగా చేపట్టేవారు. రోజుకు 18 గంటలు పనిచేయటం ఆయనకు నిత్యకృత్యం. ఈ క్రమశిక్షణ, పట్టుదల, నీతినిజాయితీలే ఆయనను ప్రఖ్యాత వ్యక్తిగా తీర్చిదిద్దాయి అనటంలో ఏమాత్రం సందేహం లేదు.

ఆయన తన చివరిదశలో కూడా ఇలా అనేవారు, "నాకు ఈ క్రమశిక్షణ, ఋజువర్తన ప్రసాదించింది నా మాతృమూర్తే!" అని. నిజం నవాబు తనకు అప్పగించిన పని పూర్తి అయిన తరువాత, నాటి మైసూరు రాష్ట్రంలో ఉద్యోగిగా చేరారు. అన్ని విధాలా ఆ రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడ్డారు. వారి పనితీరుని, నిజాయితీని మెచ్చి, మైసూరు మహారాజావారు బహుమానాలతో, బిరుదులతో సత్కరింపతలచిన వేళ, విశ్వేశ్వరయ్య గారు వాటిని సున్నితంగా తిరస్కరించారు. జీతం తప్ప మరే ఇతర ప్రతిఫలాన్ని ఆయన తన జీవితంలో ఆశించలేదు. నేటి కర్ణాటక రాష్ట్రంలోని కృష్ణరాజ సాగర్ డ్యాం, బృందావన్ గార్డెన్స్, మైసూరు విశ్వ విద్యాలయం మొదలగునవి ఆయన కృషి వలెనే సాధ్యపడ్డాయి. ఆయన ప్రఖ్యాత ఆర్ధికవేత్త కూడా! ఆయన మైసూరు బ్యాంకు అనే సంస్థను కూడా స్థాపించి, మధ్యతరగతి ప్రజలకు పొదుపు చేసుకోవలసిన అవసరం గురించి తెలియచేసారు.

ఆయన ప్రతిభను గుర్తించి, దేశంలోని అనేక విశ్వవిద్యాలయాలు ఆయనను డాక్టరేట్ తో సత్కరించాయి. 1917 లో బెంగుళూరులో ప్రభుత్వ ఇంజనీరింగు కాలేజి స్థాపించడంలో అయన ప్రముఖ పాత్ర వహించారు. తరువాత ఈ కాలేజికి ఆయన పేరే పెట్టడం జరిగింది. ఈనాటికి కూడా విశ్వేశ్వరయ్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కర్ణాటక లోని ప్రముఖ విద్యా సంస్థల్లో ఒకటి. ఆయనకు బ్రిటిషు ప్రభుత్వపు నైట్హుడ్ (సర్) బిరుదు వచ్చింది. 1955 లో భారత ప్రభుత్వం ఆయనను 'భారతరత్న' బిరుదుతో సత్కరించింది. ప్రాంతీయ బేధాలను పట్టించుకోకుండా భారత దేశానికి అనితర సేవలందించిన ఈ మహనీయుడు, తన శతజయంతి ఉత్సవాలను పూర్తిచేసుకొని, 12-04-1962 న స్వర్గస్తులయ్యారు. ఎవరైనా అఖండ మేధావిని గురించి

చెప్పేటప్పుడు, 'ఆయన బ్రెయిన్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారి బ్రెయిన్'అని చెప్పటం ఒక సామెతగా మారింది. ఆయన పుట్టిన రోజును 'ఇంజనీర్స్ డే !' గా జరుపుకోవటం ఒక ఆనవాయితీగా వస్తుంది. పనిని, కర్తవ్యాన్ని దైవంగా భావించే శ్రీ విశ్వేశ్వరయ్య గారి జీవిత చరిత్ర మన అందరికీ ఆదర్శనీయం! ఆచరణీయం!!

నీతినిజాయితీలతో, క్రమశిక్షణతో పనిచేయటమే ఆయనకు మనమిచ్చుకునే నివాళి!

**********************************************




తెలుగు వారి సీత-శ్రీమతి అంజలి దేవి! - టీవీయస్.శాస్త్రి

Telugu vaari seeta - Anjali Devi

తెలుగు చలన చిత్రపు స్వర్ణయుగానికి చెందిన నటీనటులు ఒక్కొక్కరూ దివికేగుతున్నారు.అలా దివికేగిన వారి జాబితాలో ప్రముఖ తార శ్రీమతి అంజలీదేవి గారు కూడా ఈ మధ్యనే చేరారు.ఈ నటీమణి 13-01-2014 న హృద్రోగ వ్యాధితో చెన్నైలోని ఆమె స్వగృహంలో మరణించారు. ఆ నటీమణికి స్మృత్యంజలి ఘటిస్తూ, ఆమెను గురించిన కొన్ని విశేషాలు తెలుసుకుందాం! శ్రీమతి అంజలీదేవి పేరు తలచుకున్నప్పుడల్లా గుర్తుకొచ్చేది, 'లవకుశ' లో ఆమె నటించిన సీత పాత్ర. సీత పాత్రకు ప్రాణప్రతిష్ట చేసిన నటీశిరోమణి ఆమె.ఆ తర్వాత ఎంతమంది ఆ పాత్రలో నటించినప్పటికీ,తెలుగు సినిమా ప్రేక్షకుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయింది మాత్రం ఆమె ఒక్కతే. 'లవకుశ'లో సీతమ్మవారి పాత్రకు ఎంతటి గుర్తింపు తెచ్చిందంటే, ఆమె ఎక్కడ కనిపించినా జనం ఆమెకు పాదాభివందనం చేసేవారు.లవకుశ సినిమా 50 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో ఒక పత్రికలో ఆమె వెలిబుచ్చిన భావాలను ఆమె మాటల్లోనే విందాం! "లవకుశ సినిమాకు తల్లీ,తండ్రీ అంతా దర్శకుడు సి.పుల్లయ్యగారే. ఈ సినిమా క్రెడిట్ ముందుగా ఆయనకే దక్కాలి. సినిమా విడుదలై యాభయ్యేళ్లయినా, ఇప్పటికీ తెలుగు ప్రజల నోళ్లలో నానుతున్నదంటే అందుకు ఆయనే కారణం.

నన్ను 'గొల్లభామ' సినిమా ద్వారా గ్లామర్ పాత్రలో పరిచయం చేసిన ఆయన, ఆ తరువాత రేలంగి వెంకట్రామయ్య సరసన పెట్టి 'పక్కింటి అమ్మాయి' పేరుతో కామెడీ చిత్రం రూపొందించారు. సి.పుల్లయ్యగారితో నా మూడో సినిమా 'లవకుశ'. అప్పటి వరకూ గ్లామర్ పాత్రలు పోషించిన నన్ను పవిత్రమైన సీత పాత్రకు తీసుకోవడం పట్ల ఇండస్ట్రీలో విపరీతమైన వ్యతిరేకత వచ్చింది. ఎంతోమంది ఆయన్ని వద్దంటూ వారించారు. రాజ్యం ఫిలింస్ నిర్వాహకురాలు లక్ష్మీరాజ్యం అయితే "డ్యాన్సులు చేసుకునే అమ్మాయిని ఇంత మంచి పాత్రకు ఎలా ఎంపిక చేసారు ?" అంటూ దర్శకుణ్ణి నిలదీసారట. అయినా ఆయన వెనక్కి తగ్గలేదు.సీత పాత్ర చేసేటప్పుడు నేను ప్రత్యేకంగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేదు. అన్ని పాత్రల్లాగే ఆ పాత్రలో లీనమై నటించాను. ఎప్పటిలాగే ఉదయాన్నే భగవంతుడికి పూజలు చేసుకుని షూటింగ్‌కి వెళ్లేదాన్ని. వృత్తిని నేను పవిత్రంగా భావిస్తాను. ఆ పవిత్రతతో పని చేస్తే చాలు.

'కీలుగుర్రం' సినిమాలో రాక్షసి పాత్ర వేసాను. అందుకని రాక్షసంగా ఉండలేంగా. నిజానికి ఆ పాత్ర నేను చేయనని చెప్పాను. కానీ నా భర్త శ్రీ పెనుపాత్రుని ఆదినారాయణరావు గారు నచ్చచెప్పి నన్ను ఒప్పించారు.ఏ పాత్ర వేసినా, మనం మనసుపెట్టి నటించాలి, అంతే అన్నారు. సీత పాత్రను నేను ఎంతో ప్రేమతో, భక్తిభావంతో చేసాను." అంతే కాక, సువర్ణసుందరి , అనార్కలి, జయసింహ, పాండురంగ మహాత్మ్యం లాంటి పెక్కు చిత్రాలలో ఆమె నటించిన పాత్రలు సజీవంగా నిలిచిపోయాయి.తెలుగు సినిమా తొలితరం నటీమణుల్లో అగ్రతారగా, అత్యధిక కాలం హీరోయిన్‌గా చేసి తెలుగు ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచారు అంజలీదేవి. విశేషమేమంటే, ఇంత మహానటి తొలినాళ్ళలో కీలుగుఱ్ఱం లాంటి సినిమాలలో వాంప్ పాత్రలను కూడా పోషించింది.

అన్నిటికంటే, ఆశ్చర్యకరమైన విషయమేమంటే, ఆమె సినీరంగ ప్రవేశం చేసేనాటికే వివాహిత మరియు ఇద్దరు పిల్లల తల్లి. భర్త శ్రీ ఆదినారాయణరావు గొప్ప సంగీత దర్శకుడు.ఇద్దరూ రంగస్థల అనుభవం ద్వారానే సినీ రంగ ప్రవేశం చేసారు. భర్త ప్రోత్సాహంతో సినీనటిగా మారింది. శ్రీమతి అంజలీదేవి 24 -08 -1927 న, తూర్పుగోదావరి జిల్లాకి చెందిన పెద్దాపురంలో జన్మించారు. అసలు పేరు అంజనీకుమారి. ఎనిమిదేళ్లకే రంగస్థలంపై నటించారు. ఆ తర్వాత కాకినాడ యంగ్‌మెన్ హ్యాపీక్లబ్‌లో చేరి నాటకాలు వేసారు. మొదటిసారిగా బాలనటిగా హరిశ్చంద్రలో 'లోహితుని' పాత్రలో 1940 లో నటించారు.1947లోశ్రీ పుల్లయ్య గారి దర్శకత్వంలో నిర్మించబడ్డ గొల్లభామ సినిమా ద్వారా డ్యాన్సర్‌గా వెండితెరకు పరిచయమై, ఎల్వీ ప్రసాద్ 'కష్టజీవి'తో హీరోయిన్ అయ్యారు. 1940 నుండి నటిగా ప్రయత్నాలు చేస్తూ,చిన్న చిన్న వేషాలు వేసినప్పటికీ, ప్రేక్షకుల, పరిశ్రమ దృష్టిలో నటిగా గుర్తింపు పొందినది మాత్రం 1947 నుండే.అక్కడి నుండి ఆమె వెనక్కి తిరిగి చూడలేదు. తెలుగు,తమిళ, కన్నడ సినిమాలలో ప్రముఖ నటుల సరసన కథానాయిక పాత్రలను పోషించి మెప్పించింది.అంజలి పిక్చర్స్ అనే సంస్థను స్థాపించి సువర్ణసుందరి, అనార్కలి,భక్త తుకారాం లాంటి పలు చక్కని సినిమాలను నిర్మించారు.

వీరి సినిమాలలో సంగీతానికి మంచి ప్రాధాన్యముండేది. సువర్ణసుందరిలో 'హాయి హాయిగా ఆమని సాగే' అనే పాట నేటికీ సంగీతప్రియుల నాలుకపైన నాట్యం చేస్తుంది.అదే సినిమాను హిందీలోకి డబ్ చేసినప్పుడు,అవే ట్యూన్సును ఉంచారు.పైన ఉదహరించిన పాటకు తెలుగులో ఘంటసాల, జిక్కిలకు ఎంత పేరు వచ్చిందో అంతే పేరు హిందీలో రఫీ,లతామంగేష్కర్ లకు

కూడా వచ్చింది. వీరి సొంత సినిమాలన్నీ సంగీత ప్రధానమైనవే! 1994లో 'పోలీసు అల్లుడు' తర్వాత ఇక నటించలేదు. తెలుగు సినిమా పరిశ్రమకు ఆమె చేసిన సేవలకు గుర్తింపుగా 2005 లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు రఘుపతి వెంకయ్య అవార్డును ఇచ్చి సత్కరించింది. 2008 లో అక్కినేని నాగేశ్వరరావు జాతీయ అవార్డును కూడా పొందారు. ఈమె పుట్టపర్తి సత్యసాయికి పరమ భక్తురాలు. ప్రస్తుతం ఆమె నట వారసురాలిగా ఆమె మనుమరాలు శైలారావు కూడా అడపా తడపా తెలుగు,తమిళ సినిమాలలో నటిస్తున్నారు.

నటీశిరోమణి శ్రీమతి అంజలీదేవికి కళాంజలిని సమర్పించుకుంటూ,

ఆమె ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుని మనసారా ప్రార్థించుదాం!




నటనాలయం - నటసామ్రాట్ శ్రీ అక్కినేని నాగేశ్వరరావు గారు! - టీవీయస్.శాస్త్రి

Natanaalayam - Akkineni Nageswarar Rao Garu

82 ఏండ్ల తెలుగు సినీ పరిశ్రమలో 65 ఏండ్లకు పైగా నటించి, జీవించినంత కాలమూ నటించాలనే తలంపు గల గొప్పనటుడు, మహామనిషి శ్రీ అక్కినేని నాగేశ్వర రావు గారు. ఈయన విద్యాధికుడు కాదు, చెప్పుకోతగ్గ నిండైన విగ్రహం లేదు, గంభీరమైన కంఠస్వరం లేదు, విశాలమైన నేత్రాలు లేవు(నాగేశ్వరరావు గారివి లోతైన కళ్ళు) - వీటన్నిటినీ అధికమించి ఒక నటుడు, ముందు చెప్పినవన్నీ పుష్కలంగా ఉన్న NTR తో పోటీపడి నటించి, నటుడిగా తన ప్రత్యేకమైన ముద్రను వేసుకొని,కేవలం నటనా

ప్రాభవంతోనే తెలుగు సినీ ప్రేక్షకులను అలరించిన ఈ మహానటుడిని గురించి కొన్ని ఆసక్తికరమైన విశేషాలు తెలుసుకుందాం!

ఈయన 20-09-1923 న, కృష్ణాజిల్లాలోని, గుడివాడకు సమీపంలో ఉన్న కుగ్రామమైన రామాపురంలో, అక్కినేని వెంకటరత్నం, పున్నమ్మ గార్లనే పుణ్యదంపతులకు జన్మించారు. (నాగేశ్వరరావు గారి జన్మదినాన్ని గురించి భిన్నమైన అభిప్రాయాలున్నాయి. కొందరు ఆయన జన్మించింది 20-09-1924 అని, మరికొందరు 16/17-09-1922 అని చెబుతుంటారు). వారిది అతి బీదకుటుంబం. ప్రాధమిక విద్య కూడా పూర్తిచేయలేకపోయాడు శ్రీ నాగేశ్వరరావు గారు. పొలం పనులు చూసుకునే ఒక సామాన్యుడు, అసమాన్యుడిగా ఎదిగి దేశ, విదేశాలలో తన కీర్తి పతాకాన్ని ఎగురవేసి, అమెరికా, ఇంగ్లండ్, ఫ్రాన్స్, జర్మనీ, రష్యా, ఆస్ట్రేలియా లాంటి పెక్కు విదేశాలను దర్శించి అక్కడి వారి మెప్పు కూడా పొందటమనేది ఒక అసాధారణమైన విషయం. చిన్నతనంనుండి ఇతనికి నటన మీద ఎక్కువ ఆసక్తి. వీరు అయిదుగురు అన్నదమ్ములు. తల్లి పున్నమ్మ గారు నాగేశ్వరరావు గారిని ఆడపిల్లగా ముస్తాబు చేసి మురిసిపోయేది. దానికి తగ్గట్లుగానే, మొదట్లో వీరు రంగస్థలం మీద స్త్రీ పాత్రలనే పోషించి పేరు తెచ్చుకున్నారు.

1941లో, 17 ఏండ్ల వయసులో 'ధర్మపత్ని' అనే సినిమా ద్వారా వీరి సినీరంగ ప్రవేశం జరిగింది. అందులో వారు ఒక చిన్న పాత్రను పోషించారు. నాటి ప్రముఖ సినీ దర్శకుడు శ్రీ ఘంటసాల బలరామయ్య గారు ఇతనిని ఒకానొక సందర్భంలో విజయవాడ రైల్వే స్టేషన్ లో చూడటం తటస్థించింది. శ్రీ బలరామయ్య గారికి నాగేశ్వరరావు గారి ప్రతిభ నచ్చింది. వెంటనే వారు తీయబోయే 'సీతారామజననం' అనే సినిమాలో కథానాయకుడి పాత్ర అయిన శ్రీ రాముని పాత్రకు నాగేశ్వరరావు గారిని నిర్ణయించారు. అలా ఒకవైపు సినిమాలలో నటిస్తూనే, రంగస్థల నాటకాలను కూడా ప్రదర్శించేవారు. వారు ప్రదర్శించిన నాటకాలలో ఆశాజ్యోతి,సత్యాన్వేషణ, తెలుగు తల్లి మొదలైనవి ప్రఖ్యాతమైనవి. సినీ, నాటక రంగాలలో అఖండ విజయాన్ని సాధించారు. తర్వాతి కాలంలో సినిమాలలో ఎక్కువ అవకాశాలు రావటం వలన రంగస్థల నాటకాలకు స్వస్తి చెప్పక తప్పలేదు.

ఒక్కొక్క మెట్టు అధిరోహిస్తూ, వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగ పరచుకుంటూ, ఋజువర్తన, క్రమశిక్షణతో అగ్రస్థానానికి చేరుకోవటం కోసం ఆయన చేసిన కృషి, పట్టుదలను అన్ని రంగాలకూ చెందిన నేటితరం యువకులు ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలి. వివిధ సినిమాలలో విభిన్నమైన పాత్రలను పోషించారు. రెండు తరాలపాటు ఆంధ్రయువత అక్కినేనినే అనుసరించింది, అనుకరించింది. పాటలకు ఆయన వేసే స్టెప్స్ తర్వాతి తరంవారు అనుసరించక తప్పలేదు. ఆయన ప్రతి కదలిక, చూపు కూడా ఒక బావాన్ని ప్రస్ఫుటిస్తుంది. తమిళుల ఆరాధ్యుడైన శివాజీ గనేషన్ కు ఈయన అభిమాన నటుడు. నాగేశ్వరరావు గారు పేరు చెప్పగానే గుర్తుకొచ్చే పాత్ర 'దేవదాసు'. అప్పట్లో ఆయనికి ఈ పాత్రను ఇవ్వటానికి చాలామంది తటపటాయించారు. శ్రీ పేకేటి శివరాం, డి.యల్. నారాయణ గార్ల పట్టుదలతో చివరికి ఆ పాత్ర నాగేశ్వరరావు గారికే దక్కింది. ఆ పాత్రలో,పతాక సన్నివేశాలను రక్తికట్టించటానికి ఆయన కొన్ని రోజులు భోజనం కూడా పూర్తిగా మానేసారట! ఆ పాత్రను ఆయన పోషించిన తీరుకు ఆంధ్రదేశపు ప్రజలు ఆయనకు బ్రహ్మరధం పట్టారు. దేవదాసు పాత్రకు నాగేశ్వరరావు గారు ప్రాణప్రతిష్ట చేసారు. మొదటిసారి విడుదుల అయిన చాలాకాలం తరువాత, మళ్ళీ విడుదలైన ఈ సినిమా అప్పుడు కూడా శతదినోత్సవం జరుపుకోవటం ఒక గొప్ప విశేషం!

ఎప్పుడు ఆ సినిమా విడుదలైనా 50 రోజులకు తక్కువ కాకుండా ఆడుతుంది. అలా దేవదాసు ఆయన వలన అజరామరుడయ్యాడు! అప్పటి నుండి ఆయన తెలుగు ప్రేక్షకుల చేత 'ట్రాజెడీ కింగ్'అని పిలువబడ్డారు. నిజజీవితంలో నాస్తిక భావాలు గల ఈయన, ఆయన ప్రవృత్తికి పూర్తి భిన్నమైన 'విప్రనారాయణ' పాత్రను ఆయన పోషించిన తీరు అమోఘం. అక్కినేని నాస్తికుడు అనడంకంటే హేతువాది అని అనటం బాగుంటుందని కొందరంటారు. సాటి మనిషిని ఆపదలలో ఆదుకోవడమే దేవతారాధనగా ఆయన భావిస్తారు. ఆచార వ్యవహార పరుడైన ఒక శ్రీవైష్ణవ భక్తుని మనకు విప్రనారాయణ పాత్రలో ఆయన చూపించారు. ఆయన కీర్తికిరీటంలో ఆ పాత్ర మరో కలికితురాయి. తర్వాత చాలాకాలం తర్వాత, బాపూరమణలు తీసిన 'బుద్ధిమంతుడు'సినిమాలో ఆయన ఒక ఆస్తికుడిగా,మరొక అభ్యుదయ భావాలుగల యువకుడిగా ద్విపాత్రాభినయనం చేసి, ఆ సినిమా అఖండ విజయం కావటానికి కారకులయ్యారు. బాపూరమణలకు ఈయన అత్యంత ఆత్మీయుడు. వారికి మొదటి రోజుల్లో కొన్ని సినిమాలు తీయటానికి ఈయన ఆర్థిక సహాయం కూడా చేసారు. శ్రీ నాగేశ్వరరావు గారి జీవిత చరిత్రను శ్రీ ముళ్ళపూడి వెంకటరమణ గారు 'కథానాయకుడి కథ' అనే పేరు మీద ఒక గ్రంథాన్ని కూడా వ్రాసారు. ఆయన పోషించిన మరో మరపురాని పాత్ర 'బాటసారి' సినిమాలోది. ఇలా చెప్పుకుంటూ పోతే, ఆ పాత్రల జాబితాకు అంతే ఉండదు.

ప్రేమికుడిగా, భగ్నప్రేమికుడిగా పలు విజయవంతమైన చిత్రాలలో నటించి నాటి కుర్రవాళ్ళకు ఆరాధ్యుడయ్యాడు ఈ 'ఎవర్ గ్రీన్ హీరో'. అన్నపూర్ణా పిక్చర్స్ అన్న సంస్థను నెలకొల్పి పలు విజయవంతమైన చిత్రాలను శ్రీ దుక్కిపాటి మధుసూదనరావు గారి ఆధ్వర్యంలో నిర్మించారు. డాక్టర్ చక్రవర్తి సినిమాను నిర్మిస్తున్న రోజుల్లో, గుండెజబ్బు చేయటం వలన, అమెరికా వెళ్లి ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకొని మృత్యుంజయుడయి క్షేమగా తిరిగివచ్చారు. వయసు పైబడుతున్న కొద్దీ ఆయనలో హుషారు, నటనా ప్రాభవం పెరుగుతూ వచ్చాయి. వృద్ధాప్యం గురించి, అనారోగ్యం గురించి ఎక్కువగా మాట్లాడటమే ఒక పెద్ద రోగమని ఆయన అంటుండేవారు.

ఆ తరువాత, దసరాబుల్లోడు, ప్రేమనగర్, ప్రేమాభిషేకం లాంటి పలు విజయవంతమైన చిత్రాలలో నటించి ప్రేక్షకుల నీరాజనాలు అందుకున్నారు. జీవితాన్ని పూర్తిగా చదివారు. స్వయంకృషితో ఎంతో నేర్చుకున్నారు. చక్కని ఆంగ్ల భాషలో అనర్గళంగా మాట్లాడగలరు. He is a self-made Man! అక్కినేని ఆలోచనలు, నేను చూచిన అమెరికా అనే గ్రంథాలని వ్రాసారు. 'స్వీయ లోపంబులెరుగుట పెద్ద విద్య' అనే అక్కినేని గారు చెప్పిన సూక్తి గుర్తుకు వచ్చినప్పుడల్లా, ఆయన ఆత్మజ్ఞానాన్ని ఎరిగిన ఒక మహాజ్ఞాని అనిపిస్తుంది. విద్యాధికుడు కాకపోవటం వలన, ఆయనకు విద్యమీద మక్కువ ఎక్కువ!

గుడివాడలో ఆయన పేరు మీద ANR కాలేజ్ ను స్థాపించారు.1957లోనే ఆంధ్ర విశ్వవిద్యాలయానికి భూరి విరాళమిచ్చారు . తెలుగు సినీపరిశ్రమ మద్రాసు నుండి హైదరాబాద్ కు తరలి రావటంలో ఈయన కృషి మరువరానిది. బంజారాహిల్స్ లోని బండరాళ్ళలో అన్నపూర్ణా స్టూడియోను అపురూపంగా తీర్చిదిద్దారు. ఆయన పోషించిన చివరి పాత్ర, బాపూరమణలు నిర్మించిన 'శ్రీరామరాజ్యం'లోని వాల్మీకి పాత్ర! తొలినాళ్ళలో శ్రీరాముని పాత్రను పోషించిన ఈయన, శ్రీ రాముని పాత్రను రమణీయంగా తీర్చిదిద్దిన వాల్మీకి పాత్రను ఎంతో మక్కువతో నటించారు. తెలుగు సినీచరిత్రను ఒక 1000 పేజీల గ్రంథంగా వ్రాస్తే, అందులో

750 పేజీలు నాగేశ్వరరావు, రామారావు గార్లకే కేటాయించాలని అనటంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు! తెలుగు వారికే కాదు, తమిళులకు కూడా ఆయన ఆరాధ్యదైవమే. ఆరోగ్యం విషయంలో ఆయన జాగ్రత్తగా ఉండేవారు. మానసిక ప్రశాంతత, మితాహారం, సంతృప్తి - ఈ మూడు తన ఆరోగ్య రహస్యాలని ఆయన చాలా ఇంటర్వ్యూలలో చెప్పేవారు.


జాతీయస్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన ఫాల్కే అవార్డు అందుకున్నశ్రీ అక్కినేని, 2005లో కోటిరూపాయల మూలధనంతో తన పేరిట ఒక జాతీయ అవార్డును ప్రారంభించారు. ఎన్టీఆర్ జాతీయ అవార్డు, రఘుపతి వెంకయ్య అవార్డులతో పాటుగా, భారత ప్రభుత్వం అందించే అత్యున్నతమైన పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ అవార్డుల్ని కూడా అక్కినేని అందుకున్నారు.

తమిళనాడు ప్రభుత్వం నుండి కళైమామణి బిరుదును, మధ్యప్రదేశ్ ప్రభుత్వం నుండి కాళిదాసు సమ్మాన్ అవార్డును కూడా పొందారు. ఆయనకు విశేషమైన పేరు ప్రఖ్యాతులు తెచ్చిన కొన్ని సినిమాలు - లైలామజ్ను(1949), దేవదాసు(1953), విప్రనారాయణ(1954), అనార్కలి(1955), తెనాలి రామకృష్ణ(1956), మహాకవి కాళిదాసు(1960), బాటసారి(1961), శ్రీకృష్ణార్జున యుద్ధం(1963), ప్రేమనగర్(1971), ప్రేమాభిషేకం (1981). ఆయన నటించిన ఆఖరి చిత్రం శ్రీరామరాజ్యం అని చెప్పవచ్చు. అది ఆయన 255 వ సినిమా. నటన అంటే ఏమిటో చాలామంది వారికి తోచిన విధంగా చెప్పారు. కానీ, అక్కినేని చెప్పినదే నాకు నచ్చింది. ఆయన ఏమి చెప్పారంటే, 'నటించటం అంటే నటిస్తున్నట్లుగా ప్రేక్షకుడికి అనిపించకుండా నటించటం'! అంటే నటన సహజత్వానికి దగ్గరగా ఉండటమని అర్థం. చాలామంది ఫలానా నటుడు పాత్రలో జీవించాడని చెబుతుంటారు. అది పూర్తి అబద్ధం. పాత్రలో జీవించితే రచయిత చెప్పిన మాటలు నటుడు పలకలేడు, దర్శకుడు చెప్పినట్లు నటించలేడు. అందుకే, నాగేశ్వరరావు గారు చెప్పిన నిర్వచనం నాకు బాగా నచ్చింది.

ఈ మధ్యనే భార్యను కోల్పోయారు. ఎంతో ధైర్యం, గుండె నిబ్బరంగల మనిషి ఈయన. కొడుకు నాగార్జున, మనవడు నాగచైతన్యలతో కలసి ఈయన ప్రస్తుతం 'మనం' అనే చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాలో నటిస్తున్నప్పుడు, 90 ఏండ్ల వయసులో కాన్సర్ వ్యాధి బారిన పడ్డారు. నిజానికి ఆ వ్యాధికి నివారణ లేని విషయం ఆయనకు కూడా తెలుసు. అయినా సరే, మనోధైర్యాన్ని వీడకుండా, Oct 19, 2013 న తన స్టూడియోలో పత్రికా సమావేశాన్ని ఏర్పాటుచేసి, తనకు కాన్సర్ వ్యాధి సోకిందని, తనను ఎవరూ ఓదార్చి, సానుభూతులను తెలుపవద్దని ధైర్యంగా చెప్పారు. తాను కోరుకునేది అశేష ఆంధ్ర ప్రేక్షకుల ఆశిస్సులని చెప్పారు. అయితే, దురదృష్టవశాత్తు ఆరోగ్యం పూర్తిగా క్షీణించటంతో ఆయన 22-01-2014 న అశేష ఆంధ్ర ప్రజలను అనంత దు:ఖ సాగరంలో ముంచి దేహయాత్ర ముగించారు. ఆయన మరణంతో తెలుగు సినిమా ప్రపంచంలో స్వర్ణయుగం అంతరించిందని చెప్పవచ్చు! తెలుగు సినిమా చరిత్రలో మరొక శకం ముగిసింది! ఈ మహానటుడికి, మహామనీషికి వందనం, అభివందనం, పాదాభివందనం! అశ్రునయనాలతో ఆయనకు కళాంజలిని సమర్పించుకుంటున్నాను!!

ఆ మహానటుడికి మరణంలేదు! ఆయన నిత్యం అభిమానుల హృదయాలయాల్లో ప్రేమాభిషేకాన్ని అందుకుంటూ, చిరంజీవిగా ఉంటారు!

***********************************************



సుశాస్త్రీయం: మరో మహాత్ముడు - ఆంధ్రా గాంధి - శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య గారు - టీవీయస్.శాస్త్రి

Vavilala Gopalakrishnayya Biography

రెండు జతల ఖద్దరు బట్టలు, గాంధీజి బొమ్మ వున్న ఒక ఖద్దరు సంచిలో సద్దుకొని నిత్యమూ ఏదో ఒక ప్రజా ఉద్యమంలో పాల్గొనటానికి సిద్ధంగా ఉండే ఈ అసాధారణ వ్యక్తి మన ఆంధ్రుడే అని గర్వంతో చెప్పుకోవచ్చు. ఏక సంథాగ్రాహి, తెలుగు ఆంగ్ల భాషలలో అనేక గ్రంథాలు రచించిన ఈ మేధావి మన తెలుగు బిడ్డ అని చెప్పు కుంటానికి ఎంత గొప్పగా ఉంటుందో నాకు! పెద్ద విద్యాధికుడు కాదు, సామాన్యమైన మాధ్యమిక విద్యాలయంలో చదువుకున్న విద్యే! అయితేనేమి, అమోఘమైన ధారణ కలిగిన వ్యక్తి. ఎంతో మంది మేధావులు, విద్యావంతులు-- విశ్వ విద్యాలయాలలో వీరి 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వపు బడ్జెట్ ఉపన్యాసాలు' వినటానికి కుతూహల పడేవారు ఆరోజుల్లో! ప్రజా ఉద్యమాలు సరే సరి, అవే వారికి ఊపిరి, ఉత్తేజం! సాహిత్య పిపాసి. గురజాడ వారి కన్యాశుల్కం గురించి ఎంత విశ్లేషణ పూర్వకంగా విపులీకరించి చెబుతారో! ఈ మహనీయుడు మా నాన్నగారైన శ్రీ తెలదేవలపల్లి వేంకటేశ్వర్లు గారికి ఆప్తులు, మాకు బంధువు కూడాను. అట్టి మహనీయుని జీవిత చరిత్ర గురించి నాకు

తెలిసిన కొన్ని విషయములు మీకూ తెలియ చేయటానికి గర్వపడుతున్నాను.

శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య గారు 17-09-1906 న గుంటూరు జిల్లాలోని సత్తెనపల్లి అనే ఊరిలో జన్మించారు. వీరి తల్లి తండ్రులు శ్రీమతి పేరిందేవి, శ్రీ నరసింహం గార్లు. తల్లి తండ్రులకు వీరు నాలుగవ సంతానం. చదువుకునే రోజుల్లోనే గాంధీజి స్వాతంత్ర్య ఉద్యమం వైపు ఆకర్షితులై, విద్యను మధ్యలోనే ఆపి వేసి అనేక ఉద్యమాలలో పాల్గొని బ్రిటిష్ వారిచే జైలు శిక్షలు కూడా అనుభవించారు. జీవితమంతా నిరాడంబరంగా గడిపారు. ఆజన్మ బ్రహ్మచారి. అజాత శత్రువు. పల్నాడు పుల్లరి సత్యాగ్రహంలో శ్రీ గార్లపాటి నరసింహారావు గారితో కలసి పాల్గొని జైలు శిక్ష కూడా అనుభవించారు. ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం కావాలని పోరాటం చేసిన యోధుడీయన!. 1925 లోనే సత్తెనపల్లిలో 'శారదా నిలయం' అనే గ్రంధాలయం నెలకొల్పటమే కాకుండా, గ్రంధాలయ ఉద్యమాలు చేసి, అనేక గ్రంధాలయాల ఏర్పాటుకు కృషి చేసారు. 1952లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి శాసన సభ్యునిగా సత్తెనపల్లి నుండి ఉభయ కమ్యూనిస్ట్ పార్టీల మద్దతులో అభ్యర్ధిగా పోటీచేసి ఎన్నికయ్యారు. ఆ తరువాత వీరు చాలాసార్లు Independent అభ్యర్ధిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జీవితాంతం గాంధేయ వాదిగా కొనసాగిన వీరు శ్రీ ప్రకాశం పంతులు గారికి సన్నిహితుడు.

మరో ఆంధ్ర ప్రముఖుడు అయిన శ్రీ తెన్నేటి విశ్వనాధం గారు, వీరు ఆ రోజుల్లో ఆంధ్ర ప్రదేశ్ శాసనసభలో ప్రతిపక్ష నేతలుగా ఉండి అనేక ప్రజా సమస్యలపైన అర్ధవంతమైన చర్చలు చేసారు. వీరి చర్చల మధ్యలో కొన్ని హాస్యోక్తులు నా కింకా గుర్తున్నాయి. శ్రీ బ్రహ్మానందరెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్న రోజులవి. ఒక రోజు శాసన సభలో ఒక తీవ్రమైన విషయంపైన సుదీర్ఘ చర్చ జరుగుతుంది. బ్రహ్మానందరెడ్డి గారు అసహనంగా ఉన్నారు. ఆ అసహనంలో వారు ఇలా అన్నారు "గోపాలకృష్ణయ్య గారూ! మీరు చెబుతున్న విషయం అర్ధవంతంగా లేదు. నేను ఒక చెవితో విని మరొక చెవితో వదిలి పెడుతున్నాను" అని ఒక చిన్న వ్యాఖ్య చేశారు. వెంటనే గోపాలకృష్ణయ్య గారు "ముఖ్యమంత్రి గారు నేను చెప్పిన దంతా ఒక చెవితో విని మరొక చెవితో వదిలి పెడుతున్నారంటే, నాకొక అనుమానం, ఆ రెండు చెవుల మధ్య ఉండవలసిన 'బ్రహ్మ' పదార్ధం లేని వట్టి 'ఆనందరెడ్డి' గారేమో మన ముఖ్య మంత్రి" అని వారు విసిరిన ఛలోక్తికి సభలోని అందరితోపాటు బ్రహ్మానందరెడ్డి గారు కూడా నవ్వుకున్నారు. బ్రహ్మానందరెడ్డి గారు వీరిని సరదాగా వావిలాల గోలకృష్ణయ్య గారు అని పిలిచేవారు.

పత్రికా విలేఖరిగా జీవితం ప్రారంభించి ప్రజా సేవలో బ్రతికినంతకాలం జీవించిన ధన్య జీవి మన గోపాలకృష్ణయ్య గారు. సుదీర్ఘమైన ఆయన ప్రజా జీవిత ప్రస్థానంలో అనేక ఉద్యమాలలో పాల్గొన్నారు.అందులో ముఖ్యమైనవి 'విశాలాంధ్ర' ఉద్యమం, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం. అన్నిటికన్నా అతి ముఖ్యమైనది నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ కోసం వీరు చేసిన కృషి మరువ రానిది. పండిత నెహ్రూ గారిచేత ఈ ప్రాజెక్ట్ కు శంఖుస్థాపన చేయించటంలో వీరి కృషి అభినందనీయం. ఆ ప్రాజెక్ట్ వల్ల నేడు నల్గొండ మరియూ గుంటూరు జిల్లాలు సుభిక్షంగా ఉన్నాయంటే, దానికి కారకులైన శ్రీ వావిలాల వారిని మనం నిత్యం స్మరించుకోవాలి. ఆ ప్రాజెక్ట్ నుండి జల విద్యుత్తు కూడా ఉత్పత్తి అవుతుంది. అది నేడు ఒక గొప్ప పర్యాటక ప్రాంతం కూడా.1990 లో వీరు మద్యనిషేధ ఉద్యమంలో పాల్గొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ అధికార భాషా సంఘానికి వీరు మొట్ట మొదటి అధ్యక్షులుగా కూడా పనిచేసారు. వారి హయాంలోనే ప్రభుత్వ కార్యాలయాలలో తెలుగు భాషలో ఉత్తర ప్రత్యుత్తరములు, notifications మొదలుగునవి ఎన్నో అమలు

పరచబడినవి. ఆంధ్ర విశ్వ విద్యాలయంవారు వీరికి 'కళాప్రపూర్ణ' అనే సత్కారంతో గౌరవించి తన ప్రత్యేకతను నిలుపుకుంది. భారత ప్రభుత్వం వీరిని 'పద్మ భూషణ్' బిరుదుతో సత్కరించింది.

ఎన్నో పోరాటాలు చేసిన యోధుడు, ఆజన్మ బ్రహ్మచారి, అపర భీష్ముడు శ్రీ గోపాలకృష్ణయ్యగారిని మృత్యువు వారిని 96 సంవత్సరాల వయసులో, 29 -04 -2003 న అనారోగ్యం పాలుచేసి ఓడించింది. భౌతికంగా వారు మనలను విడిచిపోయారు కానీ, నాగార్జున సాగర్ నుంచి ప్రవహించే కృష్ణా జలతరంగాలలో వారు చిరునవ్వుతో నిత్యం మన క్షేమాన్ని కనిపెడుతూనే ఉన్నారు! అయితే ఆ మహనీయుని స్మారక చిహ్నాలు, ఒక ఉద్యానవనం సత్తెనపల్లిలో ఏర్పాటు చేస్తామన్న ప్రభుత్వం చేసిన వాగ్దానం శుష్కవాగ్దానం గానే మిగిలి పోయింది. వావిలాల గోపాలకృష్ణయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ హయర్ స్టడీస్ అనే సంస్థని గుంటూరు అరండల్‌పేటలో ఏర్పాటు చేసారు. దానినే 'వావిలాల సంస్థ' గా పిలుస్తుంటారు. అందులో గోపాలకృష్ణయ్య గారు సేకరించిన వేలాది పుస్తకాలతో ఒక గ్రంథాలయం కూడా ఉన్నది.

వారి రచనలు

తెలుగులో నలభై అయిదు, ఆంగ్లంలో పదహారు పుస్తకాలు

1922లో తొలి రచన 'శివాజీ'

1947లో 'మద్రాసు మంత్రివర్గమా ఎక్కడికి?'

1951లో 'విశాలాంధ్రం'

1976-77 'ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయోద్యమం'

విదేశ పర్యటనలు


1952 లో శాంతి సభలలో పాల్గొనే నిమిత్తం భారత దేశ ప్రతినిధిగా చైనా దేశంలో పర్యటించారు.

1952 లోనే శాంతి సభలలో పాల్గొనే నిమిత్తం భారత దేశ ప్రతినిధిగా రష్యా దేశంలో పర్యటించారు.

1992 లో ప్రపంచ తెలుగు మహా సభలలో పాల్గొనే నిమిత్తం అమెరికా దేశంలో పర్యటించారు.

'ఆంధ్రాగాంధి', 'అపరభీష్ముడు' అయిన వారికి నా ఘనమైన నివాళి!!!

**********************************************



తెలుగు సినీ ప్రముఖుడు శ్రీ యల్.వీ.ప్రసాద్ గారు - టీవీయస్.శాస్త్రి

L. V. Prasad Biography

యల్. వీ. ప్రసాద్ అని సినీప్రపంచంచే పిలువబడిన శ్రీ అక్కినేని లక్ష్మీవరప్రసాద్ గారు నటుడు, నిర్మాత, దర్శకుడు, స్టూడియో అధినేత. వీరు సినిమా పరిశ్రమకు చేసిన సేవలను గుర్తించి భారత ప్రభుత్వం వీరిని 1982లో దాదా సాహెబ్ ఫాల్కే అవార్డుతో సత్కరించింది. వీరు హిందీ,తెలుగు, తమిళ, కన్నడ మొదలైన పలు భాషలలో సినిమాలను, నిర్మించటంగానీ, దర్శకత్వం వహించటంగానీ, నటించటం గానీ జరిగింది. హిందీ, తమిళ, తెలుగు భాషలలో తొలి టాకీ చిత్రాలయిన ఆలంఅరా, కాళిదాస్ మరియూ భక్తప్రహ్లాద మూడింటిలోనూ ఆయన నటించాడు. తెలుగువారిలో బహుశా ఆయన ఒక్కరే ఈ ఘనత సాధించి ఉంటాడు. ఈ సినీ ప్రముఖుని గురించిన కొన్ని విషయాలను తెలుసుకుందాం.

యల్.వీ.ప్రసాద్ గారు 17-01-1908న పశ్చిమగోదావరి జిల్లాలోని, ఏలూరు సమీప గ్రామమైన సోమవరప్పాడులో ఒక ధనవంతుల కుటుంబంలో జన్మించారు. వీరిది వ్యవసాయదారుల కుటుంబం. తండ్రి శ్రీరాములు, తల్లి బసవమ్మ.మొదటి నుండీ వీరికి చదువు మీద ఆసక్తి తక్కువ. నాటకాల మీద వ్యామోహం ఎక్కువగా ఉండేది. తొలిరోజుల్లో నాటకాలలో చిన్న చిన్న వేషాలు వేసారు. 1924 లో మేనమామ కూతురైన సౌందర్య మనోహరమ్మతో వీరికి వివాహం జరిగింది. కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో కాలం

వెళ్ళబుచ్చుతుంది. ఈ పరిస్థితులలో ప్రసాద్ గారు 1930 లో ఇంటిలో ఎవరికీ చెప్పకుండా జేబులో ఒక వంద రూపాయలు వేసుకొని జీవనోపాధి కోసం వూరు వదలి బొంబాయికి వెళ్ళారు. సినీ పరిశ్రమకు చెందిన ఎవరితోనూ సంబంధాలు లేకపోవటం వలన కనీసం స్టూడియోల లోపలి కూడా అడుగు పెట్టలేకపోయారు.

అలా ఒక ఆరు నెలలు అన్ని స్టూడియోల చుట్టూ తిరిగారు. ఆఖరికి వీనస్ ఫిలిం కంపెనీలో ఒక చిన్న ఉద్యోగాన్ని సంపాదించారు. అక్కడ కొంత కాలం పనిచేసిన తరువాత నెలకు 30 రూపాయల జీతం మీద ఇంపీరియల్ లైట్ కంపెనీలో చేరారు. భారత దేశంలో మొదటి టాకీ చిత్రమైన 'ఆలం అరా' నిర్మించిన శ్రీ ఇరానీ గారు ఆ కంపెనీకి అధినేత. ఆ సినిమాలో ఒక చిన్న అతిధి పాత్రలో ప్రసాద్ గారు నటించారు. ఆ రోజుల్లో ఇరానీ గారికి సహాయకుడిగా శ్రీ హెచ్. యమ్. రెడ్డి గారు పని చేస్తుండేవారు. ఆ సమయంలోనే ప్రసాద్ గారికి రెడ్డి గారితో పరిచయం అయింది. రెడ్డి గారి ప్రతిభను గుర్తించిన ఇరానీ గారు వారికి తెలుగులో మొదటి టాకీ చిత్రానికి దర్శకత్వం వహించే బాధ్యతను అప్పగించారు. ఆ సినిమానే భక్త ప్రహ్లాద. ఆ సినిమాలో ప్రసాద్ గారు ఒక చిన్న పాత్రలో నటించటానికి రెడ్డి గారు అవకాశాన్ని కల్పించారు. అదే సమయంలో తమిళంలో తీసిన మొదటి టాకీ చిత్రమైన కాళిదాస్ లో కూడా వీరు నటించారు. అప్పటినుండి యల్.వి.ప్రసాద్ గారి పేరు సినీ పరిశ్రమలో మార్మోగిపోయింది.1940లో మకాంను బొంబాయి నుండి మద్రాస్ కు మార్చి శ్రీ హెచ్. యమ్. రెడ్డి గారికి సహాయ దర్శకుడిగా పనిచేయనారంభించారు.

రెండవ ప్రపంచ యుద్ధపు రోజులవి. ముడి ఫిల్మ్ కు కొరత ఏర్పడింది. సినిమా పరిశ్రమ కూడా మందకొడిగా సాగుతున్న రోజులవి. 1946 లో నిర్మించిన 'గృహప్రవేశం' సినిమాలో వీరు ప్రముఖ పాత్రను పోషించారు. ఆ సినిమాకి ఆధారం శ్రీ త్రిపురనేని గోపీచంద్ గారు వ్రాసిన ఒక కథ. ఆ సినిమాలో నటించటమే కాకుండా, దానికి దర్శకత్వం కూడా నిర్వహించారు ప్రసాద్ గారు. ఆసినిమాకు, వారు పోషించిన పాత్రకు విశేష ప్రశంసలు లభించాయి.ఆర్థికంగా కూడా ఆ సినిమా విజయవంత మయింది. ప్రసాద్ గారు పరిశ్రమలో నిలదొక్కుకున్నారు. 1947 లో పల్నాటియుద్ధం సినిమాను తీసే రోజుల్లో, ఆ సినిమాకి దర్శకత్వం వహిస్తున్న శ్రీ గూడవల్లి రామబ్రహ్మం గారి ఆరోగ్యం సరిగా లేకపోవటం వలన, ఆ సినిమాకు ప్రసాద్ గారు దర్శకత్వ బాధ్యతలను తీసుకున్నారు. ఆ సినిమా కూడా విజయవంతమయింది. ఇక పరిశ్రమలో ప్రసాద్ గారి జైత్రయాత్ర ప్రారంభమైంది. ప్రముఖ దర్శకుడిగా పేరుతెచ్చుకున్నారు.

1949 లో మనదేశం సినిమాకు దర్శకత్వం వహించి, ఆ సినిమాలోనే తెలుగువారి తెరవేల్పు అయిన శ్రీ నందమూరి తారక రామారావు గారిని ఒక చిన్న పాత్రలో పరిశ్రమకు పరిచయం చేసారు.1950 లో అక్కినేని నాగేశ్వరరావు, రామారావు గార్లతో సంసారం అనే సినిమాను తీసారు. ఈ సినిమాలో సావిత్రి గారు కూడా ఒక చిన్న వేషంలో నటించారు. ఆ సినిమా అఖండ విజయాన్ని చవిచూసింది. తరువాత విజయా వారి సంస్థలో మిస్సమ్మ, పెళ్ళిచేసి చూడు, షావుకారు, అప్పుచేసి పప్పుకూడు లాంటి మనోహర దృశ్య కావ్యాలకు దర్శకత్వం వహించారు. 1955 లో నిర్మాతగా మారి పలు విజయవంతమైన సినిమాలు తెలుగు, తమిళ, హిందీ, కన్నడ భాషలలో నిర్మించారు. ఆ సమయంలోనే సగంలోనే ఆగిపోయిన ఒక స్టూడియోను కొన్నారు. 1970 లో హిందీలో ఖిలోనా అనే సినిమాను నిర్మించి, దర్శకత్వం వహించారు. బొంబాయిలో ఏ సినిమా హాల్ వద్ద మొదట్లో watchman గా పనిచేసారో, ఆ హాల్ లోనే ఈ సినిమా రజతోత్సవం జరుపుకోవటం విశేషం.1981 లో నిర్మించిన ' ఏక్ దూజే కే

లియే' అఖండ విజయాన్ని చవిచూడటమే కాకుండా, కమల్ హాసన్ హిందీ ప్రేక్షకుల మనసు కూడా దోచుకోవటానికి దోహదపడింది. ఈ సినిమాలో బాలసుబ్రహ్మణ్యం పాడిన హిందీ పాటలకు విశేష ఆదరణ లభించింది.

1965 కల్లా ప్రసాద్ స్టూడియోను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. 1974లో అధునాతన కలర్ ఫిలిం ల్యాబ్ ను నిర్మించారు. ఇండియాలో ఉన్న మంచి లాబ్ లలో ఇది ప్రముఖమైనది. యల్.వి. ప్రసాద్ కంటి వైద్యశాలకు భూరి విరాళాన్ని ఇచ్చారు. దేశంలోనే ఇది ఒక ప్రముఖ నేత్ర వైద్యశాల. ఆయన జీవితంలో అపజయాలు లేవు. అన్ని రంగాలలో కూడా ప్రధముడిగా నిరూపించుకోవటం ఆయన ప్రత్యేకత. సహృదయుడు, సౌమ్యుడు,సునిశిత స్వభావుడు. ఈ లక్షణాలే వీరి విజయానికి కారణాలు. ఇలా జీవించినంత కాలం సినీ పరిశ్రమకు సేవలు చేసిన ఈ మహనీయుడు 22-06-1994 న అనారోగ్యంతో మరణించారు. 2006 లో భారత ప్రభుత్వం వీరి పేరు మీద తపాలా బిళ్ళను విడుదల చేసింది. 2008 లో వీరి శతజయంతి ఉత్సవాలను పరిశ్రమలోని వారందరూ ఒక పండుగగా జరుపుకున్నారు.

వారి వారసులు కలర్ లాబ్ ను, ఐమాక్స్ సినిమాహాల్ మొదలైన వాటిని విజయవంతంగా నడుపుతున్నారు. వారి మనవడు అయిన శ్రీ రవిశంకర ప్రసాద్ గారు ఈమధ్యనే దుర్మరణం పాలు కావటం అందరికీ తెలిసిన విషయమే. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు వీరి పేరు మీద పరిశ్రమకు చెందిన వ్యక్తులకు ఏదైనా పురస్కారాన్ని ఏర్పాటు చేయటం ఎంతో సమంజసం. కృషితో, పట్టుదలతో స్టూడియో లైట్ బాయ్ నుండి స్టూడియో అధిపతి దాకా ఎదిగిన ఈ మహనీయునికి నా కళాభివందనాలు! స్మృత్యంజలి!!

********************************************




పఠాభి - భావకవిత్వంలో ఒక వి(సు)లక్షణ కవి - టీవీయస్.శాస్త్రి

Pattabhi Rami Reddy Tikkavarapu Biography

ఈ రోజు మీకు, తెలుగుదేశం పూర్తిగా మరచిపోయిన ఒక గొప్ప భావకవిని పరిచయం చేయటానికి గర్విస్తున్నాను."వచన పద్యమనే దుడ్డు కర్రతో-పద్యాల నడుముల్ విరగ దంతాను" అని నిక్కచ్చిగా చెప్పిన ఘనుడాయన.ఆయనే శ్రీ పఠాభి. తెలుగు కవిత్వానికి కొత్త రక్తం ఎక్కించాలనే తపనతో భావకవిత్వానికి నూతన వరవడిని దిద్దారు.ఆ ఉద్దేశ్యంతోనే తన పేరును కొత్తగా"పఠాభి"గా మార్చుకొని భావకవిత్వానికి కొత్త సొగసులు కూర్చాడు . ఆయన పూర్తి పేరు శ్రీ తిక్కవరపు పట్టాభిరామిరెడ్డి గారు.వీరు 19-02-1910 న నెల్లూరులో శ్రీ రామిరెడ్డి,సుదర్శనమ్మ అనే దంపతులకు జన్మించారు.

విద్యాభ్యాసం----1933 దాకా నెల్లూరులోని వి.ఆర్. హైస్కూల్ లో,మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో ఇంటర్మీడియట్(1933 -35 ),శాంతి నికేతన్ లో బి.ఏ(లెక్కలు,ఇంగ్లీష్,ఆర్థిక శాస్త్రం.) వీటన్నిటిని మించి గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ గారి విద్యార్థి(1935-37 ).అటు తర్వాత,కలకత్తా విశ్వ విద్యాలయంలో యం.ఏ,అటుపై న్యూయార్క్ ,కొలంబియా విశ్వవిద్యాలయంలో యం.ఏ(ఇంగ్లీష్),మ్యూజియం అఫ్ మోడరన్ ఆర్ట్ లో 'కోర్సు ఇన్ మోషన్ పిక్చర్ అప్రిసిఏషన్'.

అమెరికాలో ఉండగా,దాని మిత్ర రాజ్యమైన బ్రిటన్ కు వ్యతిరేకంగా భారతదేశం స్వాతంత్ర్యపోరాటం జరుపున్నందుకు, నిర్బంధ సైనిక విధాన్ని తిరస్కరించారు.

వివాహం----స్నేహలతను ప్రేమించి పెళ్ళాడారు.శ్రీమతి స్నేహలతారెడ్డి గారి తల్లి బెంగాలి వనిత,తండ్రి తమిళుడు.వీరికి ఇద్దరు సంతానం.అమ్మాయి పేరు నందన ఇషబెలియా,అబ్బాయి పేరు కోణార్క్ మనోహర్.

రాజకీయ జీవితం--భార్యా భర్తలిద్దరూ సోషలిష్టు నాయకుడు స్వర్గీయ డాక్టర్ రాంమనోహర లోహియాకు సన్నిహిత అనుచరులు.శ్రీమతి స్నేహలతారెడ్డి శ్రీ జార్జి ఫెర్నాండెజ్ కు అతి సన్నిహితురాలు.ఎమర్జెన్సీ కాలంలో ఈమెను తీహార్ జైలులో నిర్బంధించారు.జైలు నుండి విదులైన తరువాత అనారోగ్యం పాలై మరణించారు.

సినీ రంగ జీవితం---కన్నడంలో మొదటిసారిగా,నిర్మించి దర్శకత్వం వహించిన 'సంస్కార'అనే సినిమాకు 1970 లో ఉత్తమ చిత్రంగా రాష్ట్రపతి స్వర్ణ పతకం(ఫాల్కే అవార్డు) ,లొకార్నో చలన చిత్రోత్సవంలో కంచుపతకం,మన్ హైం చలన చిత్రోత్సవంలో కాథొలిక్, ప్రొటెస్టంట్ జ్యూరి అవార్డులు గెలుచుకున్నది. అది ఒక అద్భుతమైన సినిమా.అందులో ఆయన శ్రీమతి స్నేహలతారెడ్డి గారే నాయికగా నటించినట్లు నాకు గుర్తు.తెలుగులో శ్రీ కే.వి.రెడ్డి గారితో భాగస్వామిగా పెళ్లినాటి ప్రమాణాలు, శ్రీ కృష్ణార్జున యుద్ధం,భాగ్యచక్రం అనే సినిమాలను నిర్మించారు.సంస్కార సినిమాకు శ్రీ సింగీతం శ్రీనివాసరావు గారు సహాయకుడిగా పని చేసినట్లు గుర్తు.వారిద్దరూ మంచి స్నేహితులు.కన్నడ సినీ చరిత్రలో మొదట రాష్ట్రపతి అవార్డు గెలుచుకున్న చిత్రం'సంస్కార'.చాలా గొప్ప సినిమా.ఇది ఒక ప్రసిద్ధ కన్నడ రచయిత వ్రాసిన నవలను ఆధారంగా చేసుకొని నిర్మించిన

చిత్రం.ఆలోచన రేకెత్తించే ఈ గొప్ప చిత్రాన్ని చూసే అదృష్టం నాకూ కలిగింది.

రచనా వ్యాసంగం-- చలాన్నీ శ్రీ శ్రీ ని బాగా ఆకళింపు చేసుకున్నాడు. తన 20 వ ఏటనే 'ఫిడేలు రాగాల డజన్'(1939), నీలగిరి నీలిమలు(1950) అనే వాటిని ముద్రించారు."పద్యానికి ,గద్యానికి అంట కట్టి ,గ్రాంధికానికి వ్యావహారికానికి పెళ్లి చేసి ,తెలుగు ,ఇంగ్లీష్ కు పొత్తు కలిపి కవిత్వం రాస్తాను .వచన కవిత్వం అనే పేరుతో పిలుస్తా .వాటిని దుడ్డు కర్రల్ని చేసి పద్యాల నడుము విరగ గొడ్తా"అన్నాడు .తన కవిత్వాన్ని గురించి ఈ విధంగా ఆయనే స్వయంగా చెప్పుకున్నాడు. "నా కవిత్వం నూతనములో బహు నూతన కవిత్వం "అని గర్వంగా చెప్పుకున్నాడు ."భోగం పిల్ల చనులు బూందీ పొట్లాల లాగా ''ఉన్నాయి"అన్నాడు. విశృంఖల శృంగారాన్ని వ్రాసి వినుతికెక్కాడు .భోగం దాన్ని "సంఘానికి వేస్ట్ పేపర్ బాస్కెట్"గా వర్ణించి పాఠకులను ఆలోచనలలో పడేసాడు.

ఆముద్రితాలు--కయిత నా దయిత,పఠాభి పన్ చాంగం.

హాబీ- -గణిత శాస్త్రం.

వీరు సహజంగానే గొప్ప ధనవంతులు. గొప్ప కళాప్రియులు.

వీరిని గురించి ప్రముఖుల అభిప్రాయాలు--

చలం గారు--తెలుగుదేశాన ఈ రాగాల డజను, డజను దెబ్బలుగా,అరడజను పూలుగాను,వేయి కన్నీటి చుక్కల వేడిగాను,నూరు వెక్కిరింపుల నాలికల్ జాచినట్లు,కలవర పరచగలవు.

బెజవాడ రామచంద్రారెడ్డి గారు---రాగాల డజన్ కాదు,దీన్ని రోగాల డజన్ అనాలి.

విశ్వనాధ సత్యనారాయణ గారు--పఠాభి అనే కవి ఉన్నాడు.ఆ పేరులోనే అతని లక్షణం తెలుస్తుంది కదా!పట్టాభి అన్నది పఠాభి అయింది.రెండు టాలు ఎందుకని ఒత్తు ఠా పెట్టాడు.వీళ్ళందరూ పూర్వ కవిత్వ సంప్రదాయాలమీద దాడి ఎత్తిన వాళ్ళు. పూర్వ కవిత్వంలో చంద్రుడూ,మలయానిలం,మన్మధుడు,కోకిల వీటిని ఆశ్రయించి వాళ్ళు పద్యాలల్లుతారు.ఈ కొత్త కవులకు అవంటే మంట.ఆయన విప్లవం అంతా పూర్వ కవితా సమయాలమీద.

శ్రీ శ్రీ --- పఠాభి 'ఫిడేలు రాగాలు డజన్ 'నన్ను చాలా ప్రభావితం చేసిందని ఆరుద్ర స్వయంగా ఒప్పుకుంటాడు.ఛందస్సుల మీద పఠాభి కున్నంత అధికారం శిష్లాకు గాని,నారాయణబాబు గానీ లేదు.ఈనాడు ఆరుద్ర ముద్ర అంటారే(ఫోర్జరీ అనబోను గాని),అది నిస్సందేహంగా పఠాభి ముద్రే!అది దాటి ఆరుద్ర ఇప్పటికీ ఇంకా బయట పడలేదు.

ఈ 'ఫిడేలు రాగాల డజన్' కు ముందు మాటగా 'ఇంట్రో' అనే పేరు మీద శ్రీశ్రీ క్లుప్తంగా పఠాభి కవితారీతులని గొప్పగా కొనియాడాడు.ఒక్క ఈ చిన్ని పుస్తకంతో సాంప్రదాయకవుల గుండెల్లో రైళ్ళు పరుగెత్తించిన పఠాభి 'ఫిడేలు రాగాల డజన్'నుండి ఒక కవితను మీకోసం ఈ క్రింద తెలియజేయుచున్నాను.

ఆత్మకథ

ఎవర్నని యనుకొంటారో మీరు నన్ను!

ఏను పఠాభిని ......

కాంగ్రేసు రాష్ట్రపతి స్థానానికోసం

బాబూ సుభాసుబోసుతో పోటీ చేసి

ఓడిపోయిన డాక్టర్ పట్టాభిని

గాన్నేను,మరో పఠాభిని;

అయితే అతగాడికున్నంత

ఉపజ్ఞ నాకున్ లేదని తలపకండీ,

గాంధీటోపి జవ్వారుజాకట్

మీసాలు లేనంత మాత్రాన!

పయిజమ్మాలు వేస్తాను కాబట్టి

నన్ను మీరు షోదాయని సోషలిస్టని

తిట్టబోకండి, ప్రఖ్యాతంగానున్న

కవిన్నేను;

నాకు విచిత్రంబగు భావాలు కలవు

నా కన్నులందున టెలిస్కోపులు

మయిక్రోస్కోపు లున్నవి.

నా ఈ వచన పద్యాలనే దుడ్డుకర్రల్తో

పద్యాల నడుముల్ విరుగదంతాను,

చిన్నయసూరి బాల వ్యాకరణాన్ని

చాలా దండిస్తాను;

ఇంగ్లీష్ భాషాభాండారంలో నుండి

బందిపోటుం జేసి కావాల్సిన

మాటల్నుదోస్తాను.

నా యిష్టం వచ్చినట్లు జేస్తాను

అనుసరిస్తాను నవీనపంథా; కానీ

భావకవి న్మాత్రము కాన్నే,నే

నహంభావకవిని.

ఈ పుస్తకం మొదటి ముద్రణ 1939 లో జరిగింది.తర్వాతి కాలంలో ఈయన ఎక్కువ కవితలు వ్రాయలేదు.కారణం మాత్రం తెలియదు.ఈ పుస్తకంలోని పన్నెండు కవితలూ అద్భుతమైనవి.ఆయన "పఠాభి పన్ చాంగం"నుండి కొన్ని 'పన్'లు--- ఉద్యోగుల్లో రెండు రకాలు –ఒకరు చేసే వారు –మరొకరు కాజేసే వారు.కాంగ్రెస్ వాళ్లకు వడకటం తగ్గి –ఏకటం హెచ్చింది. జిహ్వ పని వాదించుటే కాదు –ఆస్వాదించుట కూడా! కవితా పట్టాభిషిక్తుడు పఠాభి.తెలుగు భావకవిత్వానికి కొత్త అందాలను కూర్చిన ఈ వి(సు)లక్షణ కవి May 6, 2006 న మరణించారు.

పఠాభికి శ్రద్ధాంజలి ఘటిస్తూ....

**********************************************



'సరస్వతీ పుత్ర' శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు గారు - టీవీయస్.శాస్త్రి

Sri Puttaparthi Narayanacharyulu garu biography

(ఇది వారి శతజయంతి సంవత్సరం)

ఒక మనిషి ఒక భాషలో పరిపూర్ణుడు కావటానికే ఒక జీవితకాలం సరిపోదు. అలాంటిది ఒక వ్యక్తి 15 భాషలను నేర్చుకోవటమే కాకుండా వాటన్నిటిలో పాండిత్యాన్ని పొందటం చాలా అరుదైన, అసాధ్యమైన విషయం. అట్టి అసాధ్యమైన విషయాన్ని సుసాధ్యం చేసిన వ్యక్తి, మహామనిషి, బహుభాషాకోవిదుడు, 'సరస్వతీ పుత్రుడు' శ్రీ పుట్టపర్తి నారాయణా చార్యుల గారిని గురించి నాకు తెలిసిన, నేను సేకరించిన విషయాలను మీకు సగర్వంగా తెలియచేయటానికి సంతోషిస్తున్నాను. ఆయనకు ఛాందస భావాలు గిట్టవు. దైవంతో పాటు మానవుడు కూడా కావాలనే మానవతావాది ఆయన. నూట యాభై గ్రంథాలు రచించినా, నిత్య విద్యార్థిలాగే ప్రవర్తించే నిగర్వి ఆయన.

శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు గారు అనంతపురంజిల్లాలోని, చియ్యేడు అనే గ్రామంలో 28-03-1914న శ్రీనివాసాచార్యులు, లక్ష్మీదేవి అనే పుణ్య దంపతులకు జన్మించారు. వారి ఇంటి పేరు తిరుమల. శ్రీ కృష్ణదేవరాయల గారి గురువైన శ్రీ తిరుమల తాతాచార్యులగారి వంశం వీరిది.అటుపైన వీరి వంశీయులు పుట్టపర్తిలో స్థిరనివాసం ఏర్పరుచుకోవటం వల్ల వీరి ఇంటిపేరు 'పుట్టపర్తి' అయ్యింది. తండ్రి ఉపాధ్యాయుడు. తల్లి గృహిణి. వాళ్లది విద్వత్వంశం. ఆచార్యులు గారు పుట్టిన కొన్ని రోజులకే తల్లి మరణించింది. తండ్రికి ఉద్యోగ ఒత్తిడి. పైగా భార్య మరణించిన దు:ఖంలో ఉన్నారు. అటువంటి స్థితిలో ఆచార్యులు గారు దేనికీ పనికిరాని పరిస్థితిలో ఉండగా, ఆ కుటుంబ సన్నిహితుడొకడు ఆచార్యులుగారిని తన వెంట పెనుగొండకు తీసుకొని వెళ్లి పిట్ దొరసానికి పరిచయం చేసాడు. ఆమె పెనుగొండ సబ్ కలెక్టర్ గారి భార్య. ఆమె గొప్ప ఆంగ్ల విద్వాంసురాలు. ఆమె

నారాయణాచార్యుల గారిని ఆంగ్లభాషలో గొప్ప ప్రవీణునిగా చేసింది. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు ఈయనకు స్వయానా మేనమామ. శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు గారు బాల్యంలోనే భారత, భాగవతాది గ్రంధాలను అభ్యసించటంతో పాటుగా సంగీత, నాట్య శాస్త్రాలలో కూడా శిక్షణ తీసుకున్నారు. అలా ఆయన సంగీత, సాహిత్య, నాట్య శాస్త్రాలతో సమలన్కృతు లయ్యారు. సుప్రసిద్ధ నర్తకి రంజకం మహాలక్షుమ్మ గారి వద్ద వీరు సంగీత, నృత్యాలను అభ్యసించారు. ఇవే కాకుండా నాటకాలలో స్త్రీ పాత్రలను ధరించారు. రంగస్థలంపై నాట్యప్రదర్శనలిచ్చారు. ఎన్నో ప్రదేశాలను తిరిగారు. చివరకు కడపలో స్థిరపడ్డారు. అక్కడే చాలాకాలం ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగి తన ఇంటిని సాహితీ మాగాణంగా మార్చుకున్నారు.

12 యేండ్ల అతి చిన్న వయసులోనే 'పెనుగొండ లక్ష్మి' అనే కావ్యాన్ని వ్రాసారు. చాలా విచిత్రమైన సంఘటన ఏమంటే, ఆయన విద్వాన్ పరీక్షలు వ్రాసేటప్పుడు తను బాల్యంలో వ్రాసిన ఈ కావ్యామే వారికి పాఠ్యగ్రంధంగా ఉండటం! మరీ ఆశ్చర్యకర విషయమేమంటే, ఆ పరీక్షలో ఆ కావ్యానికి సంబంధించిన ఒక ప్రశ్నకు జవాబు వ్రాయటానికి ఆయనకు సమయం సరిపోలేదు. ఆ ఒక్క ప్రశ్నకే రమారమి 40 పేజీల జవాబు వ్రాయటంతో ఆయన ఆ పరీక్షలో ఉత్తీర్ణుడు కాలేకపోయారు. ఆయన చేపట్టని సాహితీ ప్రక్రియలేదు. కవిసామ్రాట్ శ్రీ విశ్వనాధ సత్యనారాయణగారి ప్రఖ్యాత నవల' ఏకవీర'ను వీరు మళయాళంలోకి అనువదించారు. మరాఠీ నుంచి ధర్మానంద కోశాంబి, వినాయక సావర్కర్ వంటి రచయితల రచనలను తెలుగులోకి అనువదించారు. ఆంగ్ల భాష నుండి మెరుపులు- తలుపులు, అరవిందులు, గీతోపన్యాసములు తెలుగులోకి అనువదించారు . సంస్కృతంలో శివకర్ణామృతం, అగస్త్యేశ్వర సుప్రభాతం, మల్లికార్జున సుప్రభాతం తదితర గ్రంథాలను వ్రాసారు.

బాల్యంలోనే వీరికి వివాహం జరిగింది. పెళ్లిరోజే అత్తగారు మరణించారు. రెండవ రోజునే భార్య గతించింది. పునర్వివాహం చేసుకున్నారు. రెండవభార్య విదుషీమణి. ఆమె పేరు కనకమ్మ గారు. భార్యాభర్తలిద్దరూ సాహిత్యగోష్టులను నిర్వహించేవారు. ఆవిడ ఎంతోమంది శిష్యులను తీర్చిదిద్దింది. భార్యతో కలసి ఆయన వ్రాసిన కావ్యం 'స్వర్ణగేయార్చనం' పండితలోకాన్ని పరవశింపచేసింది. అష్టాక్షరీ మంత్రాన్ని పరమనిష్టతో సాధనచేసారు. తంత్ర శాస్త్రంలో కూడా ప్రావీణ్యాన్ని సంపాదించారు. ఆంగ్ల భాషపైన కూడా మంచి పట్టును సాధించారు. దాదాపుగా 150 గ్రంధాలను వివిధ భాషలలో వ్రాసారు.

'శివ తాండవం'

ఇవన్నీ ఒక ఎత్తైతే వారు వ్రాసిన 'శివ తాండవం' ఒక ఎత్తు. వైష్ణవ వంశంలో పుట్టి, వైష్ణవ సంప్రదాయంలో పెరిగి, ఆది దంపతులైన పార్వతీ పరమేశ్వరుల నాట్యహేలను, లాస్యాన్ని గురించి కమనీయంగా వ్రాసిన కావ్యమే 'శివ తాండవం'. ఇంతకన్నా అద్వైతమూర్తులు మరెవ్వరు ఉంటారు? ఒక సారి విజయవాడలో శ్రీ విశ్వనాధ సత్యనారాయణగారి సమక్షంలో శ్రీ పుట్టపర్తి వారు శివతాండవ కావ్యాన్ని ఆలపిస్తూ నాట్యం చేసారు. ఆ అద్భుత దృశ్యానికి పరవశించి ఆ కవిసామ్రాట్ ఈ సరస్వతీ పుత్రుని తన భుజాలమీద ఎక్కించుకొని ఆనందపడి పోయారట! రాజకీయ, సామాజిక అంశాలను కూడా సృజించారు. వామపక్ష భావజాలంగల శ్రీ హరీంద్రనాధ ఛట్టోపాధ్యాయాకు వీరు అత్యంత అభిమానులు. కమ్యూనిష్టులు కూడా వీరిని సన్మానించిన సంఘటనలున్నాయి.

హృషీకేశ్ లో శ్రీ పుట్టపర్తి వారి పాండిత్యాన్ని పరీక్షించి స్వామి శివానంద సరస్వతి 'సరస్వతీ పుత్ర ' అనే బిరుదును ప్రసాదించారు. భారత ప్రభుత్వం వీరిని పద్మశ్రీ సత్కారంతో గౌరవించింది. జ్ఞానపీఠ సత్కారానికి వీరు పూర్తి అర్హులైనప్పటికీ, వారిని ఆ అవార్డు వరించలేదు. దానికి వారు కొంత కలత చెందారు. వారికి ఆ అవార్డు రాకపోవటం తెలుగువారి దురదృష్టం. ఎన్నో విశ్వ విద్యాలయాలు వీరిని గౌరవ డాక్టరేట్ తో సత్కరించాయి. వీరు తెలుగులో వ్రాసిన కొన్ని ముఖ్యమైన గ్రంథాలు--పెనుగొండ లక్ష్మి, మేఘదూతం, షాజి, గాంధీ ప్రస్థానం, క్రాంతి సందేశం మొదలైనవి. సంస్కృతంలో వీరు వ్రాసిన 'త్యాగరాజస్వామి సుప్రభాతం' చాలా ప్రసిద్ధి చెందింది.

ఆంగ్లంలో--లీవ్స్ ఇన్ ది విండ్, ది హీరో మొదలైనవి ప్రఖ్యాతి చెందినవి. పర్షియన్ బాషలో కూడా వీరికి చక్కని ప్రావీణ్యముంది. నారాయణా చార్యులుగారు విశ్వనాధవారి లాగానే స్వాతిశయపరుడు. ఒకసారి అనంతపురంలో జరిగిన ఒక సభలో వారు మాట్లాడుతూ, "నేను 14 భాషలలో పండితుడను. నన్ను మించిన పండితుడు మరెవ్వరులేరు. నాకు అహంకారముంది. అందులో న్యాయముంది." అని సగర్వంగా ప్రకటించుకున్న ధైర్యశాలి! ఈ సరస్వతీపుత్రుని నందమూరి తారకరాముడు మనసారా సత్కరించి ఆనందభరితుడయ్యాడు. ప్రతిభకు తగిన గుర్తింపు లభించని ఈ సరస్వతీ పుత్రుడు 01-09-1990, శనివారం, ఏకాదశి నాడు తెలవారుతుండగా భాగవత సారాన్ని వివరిస్తూ మృత్యువు కౌగిట్లోకి జారిపోతూ చెప్పిన మాటలివి, "భక్తుడు, భగవంతుడు ఒకటేరా!" అంతే, 'శ్రీనివాసా!' అంటూ గుండె పట్టుకొని ఒక పక్కకు ఒరిగిపోయారు. శివైక్యం చెందారు. అంతకు మునుపే నిర్వాణషట్కాన్ని తెప్పించుకొని చదివారు.

'కవిత్వాన్నీ, పాండిత్యాన్నీ కలగలిపి ఔపోశన పట్టిన అగస్త్యుడు ఈ మహనీయుడు ' అని శ్రీ నారాయణరెడ్డి గారన్నది అక్షర సత్యం.

పుట్టపర్తి ధిషణకు జైకొట్టగ మనసాయె నాకు.

కలితీ కనరాని క్షీరకళలు చిలుకు అతని పలుకు


వెలితి ఎరుగలేని కడలి పొలుపు తెలుపు అతని తలపు

వ్యవహారాజ్ఞత అంటని వైదిక జాతకుడాతడు

రక్తికి భక్తికి సేతువు రచియించిన రసికుడతడు!!!

శ్రీ నారాయణరెడ్డి గారు సరస్వతీపుత్రునికి సమర్పించిన పై కవితా నీరాజంతో ఆ మహనీయునికి ఘనమైన నివాళిని సమర్పించుకుందాం!

***********************************************




నాట్యకళకు వన్నెలద్దిన శ్రీ వి.ఏ.కే.రంగారావు - టీవీయస్.శాస్త్రి

Sri VAK Rangarao Biography

వి.ఏ.కే.రంగారావు - ఈ పేరు సంగీత సాహిత్య ప్రియులందరికీ సుపరిచితమే! ప్రతి సంవత్సరం, డిసెంబరు మాసం చివర్లో చెన్నైలో జరిగే తెలుగు సంగీత, నాట్య సమ్మేళన సభల్లో ఓ వ్యక్తి అందరి దృష్టిని ఆకర్షిస్తుంటారు. చలాకీగా, సందడిగా కనిపించే ఆయన పట్ల నాట్యకోవిదులు, సంగీత విద్వాంసులు వినయ విధేయతలు కనబరుస్తుంటారు. ఆయనపై భక్తితో మరి కొందరు పాదాభివందనం కూడా చేస్తుంటారు. మొహమాట పడకుండా నమస్కరించిన వారినందరినీ ఆశీర్వదిస్తూ, అడపాదడపా చమత్కార సంభాషణలతో అక్కడి వాతావరణాన్ని ఆనందమయంగా మార్చే ఆ పెద్దాయన పేరు వెంకట ఆనందకృష్ణ రంగారావు.

సినీ, సాహిత్య రంగంలో స్థిరపడిన ప్రముఖులందరూ ఆయన్ని 'వీఏకేఆర్' అంటుంటారు. బొబ్బిలి జమిందారీ వంశీయులైన వీఏకేఆర్ సొంతవూరు కృష్ణాజిల్లా లక్కవరం. పుట్టింది, పెరిగింది అంతా మద్రాసులోనే.1930లోమద్రాసులోనే జన్మించారు. చిన్నతనం నుంచి నాట్యకళపై ఆసక్తి పెంచుకున్నవీఏకేఆర్ 1960లోవళువూర్ రామయ్యపిళ్లై దగ్గర శిష్యునిగా చేరారు. అడయార్ లక్ష్మణ్, శాంతా ధనుంజయ్ దంపతులతో పాటు కళానిధి నారాయణన్ నుంచి నాట్యకళ, అభినయాన్ని నేర్చుకున్నారు. తర్వాత పద్మా సుబ్రహ్మణ్యం దగ్గర భరతశాస్త్రం నేర్చుకున్నారు. పుట్టింది రాజకుటుంబం కావడం వల్ల అప్పట్లో సామాన్యుల సహవాసం చేయొద్దని తల్లిదండ్రుల నుంచి ఆంక్షలు ఉండేవి. రాజమందిరంలో పనిచేసే దేవదాసీల వల్ల నాట్య కళ రుచి తెలిసింది. అనతికాలంలోనే ఆయన నాట్యంలో ఎంతో అనుభవమున్న నాట్యాచార్యునిగా, కళా విమర్శకుడిగాఎదిగారు. పాత్రోచిత నటనలోనూ, నృత్యంలోనూ పొరపాట్లు జరిగితే మొహమాట పడకుండా కుండకొట్టినట్లు చెప్పే వ్యక్తి వీఏకేఆర్.

భగవంతుడికి నృత్య నివేదన..

రంగారావులోమరో అద్భుతకోణం ఉంది. ఏటా రెండుసార్లు భగవంతుడికి నృత్య నివేదన చేస్తుంటారు. తిరుపతికి సమీపంలోని శ్రీనివాసమంగాపురంలో ఏటా ఆషాడశుద్ధ సప్తమికి సాక్షాత్కారోత్సవ వైభవం జరుగుతుంది. చిత్తూరుజిల్లా పుత్తూరు సమీపంలోని కార్వేటి నగరంలో వేణుగోపాలస్వామి ఆలయంలో కృష్ణాష్టమి పండగ వైభవంగా జరుగుతుంటుంది. ఈ రెండు ఉత్సవాల్లోనూ వీఏకే రంగారావు గజ్జెకట్టి అన్నమయ్య కీర్తనలతో సరస రసపూరిత పదాలు, జావళిలతో స్వామివార్లకు నృత్య కైంకర్యం చేస్తుంటారు. ఈ పూజను 41 ఏళ్ల కిందట మొదలుపెట్టి ఇప్పటికీ అవిచ్ఛిన్నంగా జరుపుతున్నారు.

సాహిత్య సేవ ప్రశంసనీయం..

తెలుగు సాహిత్యంపై వీఏకేఆర్‌కున్న పట్టు అసామాన్యం. బ్రహ్మశ్రీ మల్లాది రామకృష్ణశాస్త్రి గారి శిష్యరికంలో, శ్రీ ఆరుద్ర గారి సాన్నిహిత్యంలో అపారమైన మేధాసంపత్తిని వీఏకేఆర్ సొంతం చేసుకున్నారు. శ్రీ మల్లాదివారి శిష్యరికం చేసినప్పటికీ, వారి'చలవ మిరియాలు'లాగా ఉండవు వీరి విమర్శలు. ఈయన పుస్తక సమీక్షలు చాలా కర్కశంగా ఉంటాయి. తప్పు జరిగితే సహించే మనస్తత్వం ఆయనలో లేదు. ఈయన రచించిన ఆలాపన, త్రివేణి గ్రంథాలు ముద్రితమయ్యాయి. స్వర్ణయుగంలోని సినిమా సంగతులు, సంగీతం, పుస్తక సమీక్షలు తదితర సంగతులన్నీ ఆలాపన గ్రంథంలో కదంబంలాగా మాల అల్లారు. అన్నమయ్య, క్షేత్రయ్య, సారంగపాణి పదాలకు నాట్యకళాకారులు ఎలా అభినయించాలో తెలియజేసే గ్రంథం త్రివేణి. ఇవి రెండూ మేధావుల ప్రశంసలు పొందాయి. సంగీత సాహిత్య విషయాల మీద వీరు వ్రాసిన సమీక్షలు, హిందూ, ఇండియన్ ఎక్స్ప్రెస్, మద్రాస్ మెయిల్, శ్రుతి,స్క్రీన్ లాంటి ఆంగ్లపత్రికలతో పాటుగా, ఆంధ్రపత్రిక, విజయచిత్ర, ఆంధ్రప్రభ, జ్యోతి లాంటి వివిధ పత్రికలలో ప్రచురించబడేవి. కర్ణాటకసంగీతం, భరతనాట్యం, కూచిపూడి, యక్షగానం, లలిత సంగీతం, వాద్య సంగీతం....     ఇలా ఒకటేంటి, వారికి పరిచయం లేని కళారంగం లేదంటే అతిశయోక్తి లేదు. హిందుస్తానీ సంగీతాన్ని కూడా సమీక్షించే సత్తాగల వారు ఈయన. సమీక్షలలో,ఆయన ఇచ్చే మంచి మార్కుల కోసం ఆత్రుతతో వేచి చూస్తుంటారు కళాకారులు, నాటినుండి నేటివరకు.

గ్రామఫోన్ రికార్డుల సేకరణ..

ఎవరూ తనతో పలకని రోజుల్లో గ్రామ్‌ఫోన్ రికార్డులే ఆయన గురువులయ్యాయి. అందుకే ఘుమారు 52వేల రికార్డులను సేకరించారు. ఎవరెప్పుడు అడిగినా రెండునిమిషాల్లో రికార్డు తీసి చేతిలో పెట్టగలిగే నేర్పుగా వీటిని భద్రపరచడం వీఏకేఆర్‌కే చెల్లింది. కేవలం లలిత కళల్లోనే కాకుండా వృక్షశాస్త్రం, పాకశాస్త్రం వంటి ఇతరరంగాల్లోనూ అనుభవముంది. ఇంతటి బహుముఖ ప్రజ్ఞాశాలికి ఎన్నో సత్కారాలు జరిగాయి. సంగీత, సాహిత్యాలలో పరిశోధన చేసే విద్యార్థులకు వీరు మార్గ దర్శకత్వం వహించేవారు. ఎక్కడా దొరకని విషయాలు కూడా వీరి వద్ద లభ్యపడుతాయి. 80 ఏళ్ళ వయసులో కూడా నవయువకుడి వలే ఉత్సాహంగా కళాసేవ చేస్తున్న ఈ కళాసేవకుడికి ఆయురారోగ్యాలు ప్రసాదించమని భగవంతుని వేడుకుందాం!




సాహితీ వి'శారద' - టీవీయస్.శాస్త్రి

Sahitee Vi'sarada'

తెలుగు సాహిత్యంలో 'శారద' కు ఒక ప్రత్యేక స్థానం ఉంది. దురదృష్టమేమంటే, 'శారద' అంటే చాలా మందికి తెలియదు. ఆ మహనీయుని గురించిన చిన్న పరిచయమే ఈ వ్యాసం. శ్రీ యస్.నటరాజన్ అనే వ్యక్తి 'శారద' గా మారటం వరకు ఆయన జీవితంలో అనేక మలుపులు ఉన్నాయి. శ్రీ ఆలూరి భుజంగరావు గారు వ్రాసిన సాహిత్య బాటసారి--'శారద' అనే జీవిత చరిత్రలో,

'శారద'ను గురించిన కొన్ని విషయాలు చదువుతుంటే, కన్నీళ్లు వచ్చాయి.

తమిళనాడులోని పుదుక్కోట ఆయన జన్మస్థలం. భాగీరధి, సుబ్రహ్మణ్య అయ్యర్లు వీరి తల్లితండ్రులు.1924 లో తల్లి తండ్రులకు ఆఖరివాడిగా, అతి బీద బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. వారికి పూట గడవటమే కష్టం. అట్టి పరిస్థితులలో,నటరాజన్ జోలెబట్టి మధూకరం తెచ్చుకొని చదువుకుంటమే కాకుండా, తల్లి తండ్రులను కూడా పోషించాడు. ఖాళీ సమయాలలో, దేవాలయాల వద్ద గంధం, విభూతి అమ్మి కొంత ధనాన్ని సంపాదించేవాడు. అతి చిన్న వయసులోనే,ప్రాచీన, ఆధునిక తమిళ సాహిత్యాన్ని పూర్తిగా ఆకళింపు చేసుకున్నాడు. ఎక్కువగా హాస్య, వ్యంగ్య రచనలు ఆయనను ఆకట్టుకున్నాయి. సహజంగా ఆయనకు సునిశితమైన హాస్య దృష్టి అబ్బింది.నటరాజన్ తన రెండవ ఏటనే తల్లిని కోల్పోయారు. అక్కలిద్దరినీ తెనాలికి చెందిన వారికిచ్చి వివాహం చేయటంతో, సుబ్రహ్మణ్య అయ్యర్ నటరాజన్ తో తెనాలికే చేరాడు.

1937 లో తెనాలికి వచ్చారు. మొదటినుండీ పుస్తకాలను చదవటం, స్వయంగా కొత్త విషయాలను నేర్చుకోవటం నటరాజన్ కు అలవాటు. అలానే, ఆయన, ఆంగ్ల,ఫ్రెంచి భాషలను నేర్చుకోవటమే కాకుండా, నెమ్మదిగా ఆ భాషల్లో ఉన్న కథలను తమిళంలోకి అనువదించటం ద్వారా, తనలోని రచయితను మేల్కొలిపాడు.తెనాలికి వచ్చినప్పుడు ఆయనకు తెలుగు మాట్లాడటం గానీ,వ్రాయటం గానీ తెలియనే తెలియదు.తెలుగును నేర్చుకోవాలని ఆయనకు ఎంతో ఉబలాటం ఉండేది. కానీ, అతని ముందర ఉన్న సమస్య పొట్టనింపుకోవటం, తండ్రిని పోషించటం. తెనాలిలో మారీసుపేటలో ఉన్న 'ఆంధ్ర రత్న హోటల్ 'లో సర్వర్ గా చేరాడు. (అదే పేరుతో అక్కడ హోటల్ చాలాకాలం వరకూ ఉంది. యాజమాన్యంవారు మారి ఉండవచ్చు.) ఇక తెలుగు నేర్చుకోవటం తప్పని సరి అయింది, హోటల్ కు వచ్చిన వారితో మాట్లాడటం మొదట నేర్చుకున్నాడు. తరువాత స్వయంగా తెలుగు భాషను చదవటం, వ్రాయటం నేర్చుకున్నారు.


ఆ రోజుల్లోనే, ఆయన ఆంగ్ల పత్రికలలోని పజిల్సును పూర్తి చేసేవారు. అలా, చాలా సార్లు బహుమతులు కూడా పొందారు. తెలుగులో ప్రాచీన సాహిత్యం వైపు పోకుండా, ఆధునిక, సమకాలీనపు సాహిత్యాన్ని విశ్లేషణాత్మకంగా చదవటం అలవాటైంది. కొడవటిగంటి, చలం లాంటి వారి సాహిత్యాన్ని బాగా అర్ధం చేసుకున్నారు. కనిపించిన ప్రతి తెలుగు పుస్తకాన్ని చదివేవారు. అలా నటరాజన్ కాస్తా'శారద' అయ్యాడు. ఆయనకు తెనాలిలో తెలుగు నేర్పిన అధ్యాపకుడు శ్రీ తురగా వెంకటేశ్వరరావుగారు. వారు,'శారద' చేత గజేంద్రమోక్షం, శ్యామలాదండకం లాంటివి కంఠస్తం చేయించారు. శారద,తన పదిహేనవ ఏటనే తండ్రిని కూడా పోగొట్టుకున్నాడు. ఏకాకి అయిన 'శారద' తీవ్రమైన మనోవేదనకు గురయ్యాడు. ఒక రకమైన షాక్ కు గురయ్యాడు. తండ్రికి దహన సంస్కరణలు చేసిన నాటి రాత్రే మూర్ఛ వ్యాధికి గురయ్యాడు 'శారద'. ఆఖరికి ఆ వ్యాధే అతనిని మృత్యులోకాలకు తీసుకొని వెళ్ళింది. కాలువ పక్క పడిన అతని మృతదేహాన్ని మరుసటి రోజుకు గానీ గుర్తించలేకపోయారు. అలా అర్ధాంతరంగా ముగిసింది 'శారద' జీవితం!ఇక ఆయన రచనా వ్యాసంగ విషయాలకు వస్తే, తొలిసారిగా ఆయన వ్రాసిన వ్యంగ్య రచన 'ప్రపంచానికి జబ్బుచేసింది'. ఇది 1946 లో ప్రజాశక్తి పత్రికలో ప్రచురించబడింది. ఆ రచన వారి సొంత పేరైన యస్.నటరాజన్ పేరు మీదే అచ్చయింది. ఆ రోజుల్లోనే, ఆయన 'ప్రజావాణి' అనే వ్రాత పత్రికను ప్రారంభించారు. ఆ తరువాత 'చంద్రిక'ను మొదలు పెట్టారు. అయితే, వాటిని అనారోగ్య పరిస్థితులు, ఆర్ధిక స్తోమత లేకపోవటం వల్ల ఎక్కువకాలం కొనసాగించలేకపోయారు.

1948 నుండి1955 వరకు అంటే ఏడేళ్ళు మాత్రమే రచనలు చేసారు.తెలుగు స్వతంత్ర, జ్యోతి,హంస వంటి పత్రికలు ఆయనకు మంచి ఊతమిచ్చాయి. ప్రస్తుతం, రక్తస్పర్శ , శారదరచనలు, శారద నవలలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇవి కూడా, 'శారద' అభిమానుల పూనికవల్లనే వెలుగు చూసాయి. శారద, రావూరి భరద్వాజ గార్లు దాదాపుగా ఒకే సమయంలో రచనలను ప్రారంభించారు. ఇద్దరి మీదా చలం గారి ప్రభావం పూర్తిగా ఉంది. శారద జీవితమంతా దరిద్రంతోనే గడిచింది. ఒక చేత్తో గారెలు చేసి అమ్ముతూ, మరో చేత్తో 'మంచి-చెడు' అనే నవలను వ్రాసారు. ఎంత దుర్భర పరిస్థితులు ఎదురైనా రచనా వ్యాసంగాన్ని మానలేదు. ఇక అతని శైలి చాలా భిన్నమైనది. ఎంచుకునే కథా వస్తువు విభిన్నంగా ఉండేది. ఈ రెండు లక్షణాలే శారదను తెలుగు సాహితీలోకంలో విశారదుడిగా నిలబెట్టాయి."కొడవటిగంటి కుటుంబరావు, రావిశాస్త్రి గార్ల రచనలకు వారధి వంటి వాడు శారద" అని ఆ రోజుల్లోనే సాహితీ ప్రియుల మన్ననలను పొందాడు శారద.

కార్మిక ఉద్యమాలలతో సంబంధమున్న ఈయన రచనలలో, కార్మికుల జీవనవిధానం కనపడేది. కమ్యూనిస్టు పార్టీలో గుర్తింపు పొందిన కార్యకర్త. ఇంతటి సాహితీ సుసంపన్నుడైన 'శారద' దుర్భర దారిద్ర్యంతో, మూర్ఛవ్యాధితో,17-08-1955 న, తన 31 ఏటనే శాశ్వతనిద్రలోకి జారుకున్నాడు. ఇదీ, 'శారద నీరదేందు ఘనసార' కన్నీటి కథ. నటరాజన్ అనే తమిళ యువకుడు 'శారద'గా మారిన నిజమైన కథ. 'శారద'జీవితం మరో సత్యాన్ని చెబుతుంది--కష్టాల కొలిమినుండే ప్రజలకు ఉపయోగపడే సజీవ సాహిత్యం ఉద్భవిస్తుంది. ఆకలిదప్పులు,దరిద్రం అతనిని భౌతికంగా బాధపెట్టాయేమో కానీ, అతనిలోని సాహితీ పిపాసను అంటుకోవటానికి, అడ్డుకోవటానికి కూడా అవి భయపడ్డాయి. కేవలం అతను ఒక రచయితే కాదు, తత్వవేత్త, క్రాంతదర్శి, దార్శనికుడు.

తెనాలిలో ఆయన స్మారకచిహ్నాలు లేకపోవటం చాలా విచారకరం. ఆ మహనీయుని ఫోటో కోసం, నా దగ్గరవున్న ఆయన నవలనొక దానికోసం వెదికాను.ఆ నవల వెనకవైపు అట్టమీద ఆయన ఫోటో ఉంది. ఆ నవల కోసం ఎంత వెదికినా కనబడలేదు. "మంచి పుస్తకాలకు రెక్కలు వచ్చి ఎగిరి పోతాయి" అన్న నార్ల వారి మాటలు నిజమే కాబోలు. ఎలాగో ఆయన ఫోటోను సంపాదించాను.     తెలుగువారికి మంచి కథలను అందచేయటానికే ఆంధ్రదేశానికి వచ్చిన ఈ విశారదుడికి బాష్పాంజలి!

***********************************************




అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు - టీవీయస్.శాస్త్రి

amarajeevi shri Potti Sreeramulu

ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కోసం యాభై ఎనిమిది రోజులు నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగం చేసిన వ్యక్తి శ్రీ పొట్టి శ్రీ రాములు. అంతకు ముందు శ్రీ స్వామి సీతారాం 38 రోజుల పాటు నిరాహార దీక్ష చేసి మధ్యలోనే విరమించారు. 1947 ఆగష్టు 15న స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం లేకపోవటం చాలా బాధాకరమైనది. ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం కూడా ఒక భాగంగా ఉండి తమిళుల పరిపాలనలో ఎన్నో బాధలు, ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఆంధ్రులు అంతా ఏకమై స్వంత రాష్ట్ర ఏర్పాటుకు ఎన్నో ఉద్యమాలు నిర్వహించారు.

శ్రీ పొట్టి శ్రీ రాములు గారు,19 -10 -1952 న,మైలాపూరు,మద్రాసు లోని,స్వాతంత్ర్య సమరుడు శ్రీ బులుసు సాంబ మూర్తి గారి గృహంలో నిరసన వ్రతం ప్రారంభించారు.58 రోజులు తన ఆమరణ నిరాహార దీక్షను కొనసాగించి,చివరకు, 16-12-1952 న అమరజీవి అయ్యాడు.ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం 1910 లోనే ప్రారంభం అయింది.1913 లోనే,ప్రధమ ఆంధ్ర మహాసభలు బాపట్లలో నిర్వహించారు.ఈ ఉద్యమంలో శ్రీ న్యాపతి సుబ్బారావు, శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్య, శ్రీ అయ్యదేవర కాళేశ్వర

రావు, కొండా వెంకటప్పయ్య,శ్రీ స్వామి సీతారాం మొదలగు ప్రముఖులు పాల్గొన్నారు. వీరంతా మహాత్మాగాంధీని కూడా కలుసుకొని ప్రత్యేక రాష్ట్ర అవశ్యకతను గూర్చి వివరించి నప్పుడు స్వాతంత్ర్య అనంతరం ఈ సమస్యకు పరిష్కారం చూడగలమని హామీ ఇచ్చారు. ఈ ధ్యేయానికి సరైన పరిష్కారం దొరక్క పొట్టి శ్రీ రాములు గారు నిరవధిక నిరాహార దీక్ష గావించి ఈ ఉద్యమానికి ఆయువుపట్టునిచ్చారు.

శ్రీ రాములు గారు ఎవరెన్ని చెప్పినా, పత్రికల ద్వారా సంపాదకీయాలు రాసినా వాటిని పెడచెవిన పెట్టి దీక్షను కొనసాగించి అమరవీరులైనారు. ప్రజలు రెచ్చిపోయి విశృంఖలంగా అనేక దౌర్జన్యాలకు పూనుకున్నారు. యావత్ ప్రపంచం ఈయన త్యాగాన్ని కొనియాడింది.. అప్పటి భారత ప్రధాని జవర్‌హాల్ నెహ్రూ బాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు చేయుటకు అంగీకరించి ఆంధ్రులకే కాక తమిళ, కేరళ మరాఠీ, గుజరాతీలకు ప్రత్యేక రాష్ట్రాలు ప్రసాదించారు. శ్రీ పొట్టి శ్రీ రాములుగారు నెల్లూరు జిల్లాలోని పడమటిపల్లి గ్రామంలో 1901 మార్చి 16వ తేదిన జన్మించారు. మద్రాస్‌లో విద్యాభ్యాసం గావించారు. తర్వాత సానిటరీ ఇంజనీరు విద్య కోసం బాంబే వెళ్ళారు. కొంతకాలం రైల్వే శాఖలో పనిచేశారు. చిన్న వయసులోనే భార్యా వియోగం కలిగింది.

1927లో శ్రీ రాములు తమ ఉద్యోగానికి రాజీనామా చేసి గాంధీజీ పిలుపు మేరకు జాతీయ ఉద్యమంలో సబర్మతి ఆశ్రమంలో చేరారు. ఆయన నిరాడంబరతను, మానవ సేవను గుర్తించి గాంధీజీ, "శ్రీ రాములు వంటి పది మంది కార్య దీక్షాపరులు ఉంటే దేశ స్వరాజ్యం ఒక సంవత్సర కాలంలో సాధించవచ్చని" చెప్పారు. కృష్ణాజిల్లాలోని కొమ్మరవోలు గ్రామం, గుజరాత్ రాష్ట్రంలోని రాజ్ కోట్ లో గల గాంధీజీ ఆశ్రమాల్లో శ్రీ రాములు గొప్ప సేవలు అందజేశారు. 1938-42 మధ్యలో దేశ స్వాతంత్ర్యం కోసం నిర్వహించిన అనేక సత్యాగ్రహాల్లో పాల్గొని అనేక మార్లు జైలు శిక్ష అనుభవించారు.

1944లో నెల్లూరు జిల్లాను కేంద్రంగా చేసుకొని ఖద్దర్ వాడకంపై ప్రచారం చేపట్టారు. 1946లో నెల్లూరు పట్టణంలోని మూలాపేటలో గల వేణుగోపాలస్వామి దేవాలయంలో హరిజనుల ప్రవేశం కోసం నిరసన వ్రతం చేసి వారికి ఆలయ ప్రవేశం కావించుటలో సఫలీకృతులయ్యారు.చివరి రోజుల్లో చాలా కాలం నెల్లూరు జిల్లాలోని పలుప్రాంతాలలో హరిజనోద్ధరణ కోసం పాటు పడ్డారు. ఆయన జ్ఞాపకార్థం హైదరాబాద్ నగరంలో తెలుగు విశ్వవిద్యాలయానికి శ్రీ పొట్టి శ్రీ రాములు విశ్వవిద్యాలయంగా పేరు పెట్టారు. ప్రస్తుతం నెల్లూరు జిల్లాను 'శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా'గా పేరు మార్చారు. తెలుగు వారి అందరికి స్వరాష్ట్రం ఏర్పాటు చేసిన త్యాగపురుషుడు, శ్రీ రాములు గారి ఆశయాలు, నిరాడంబరత పట్టుదల నేటి యువత నేర్చుకొని, ఆయన అడుగుజాడల్లో నడిచినప్పుడు ఆంధ్రులు అందించే నిజమైన నివాళి అవుతోంది!

అమరజీవి త్యాగానికి ఘనమైన నివాళి సమర్పించుకుందాం!

**********************************************



ప్రముఖ నాస్తికుడు, హేతువాది, సంస్కర్త శ్రీ గోరా గారు - టివియస్.శాస్త్రి

pramukha naastikudu, hethuvadi, samskartha shree goraa garu

చాలా కాలం నుండి నన్నొక ప్రశ్న వేధిస్తుంది. అది ఏమిటంటే, ఆస్తికులు మంచివారా? నాస్తికులు మంచివారా? అని. ఆస్తికత్వం, నాస్తికత్వం అనేవి కేవలం మన నమ్మకాలకు సంబంధించిన విషయాలు.కానీ, మంచితనం నమ్మకానికి సంబంధించిన విషయం కాదు, మనసుకు సంబంధించిన విషయం. ప్రపంచంలో మహాభక్తులుగా చెలామణి అవుతున్న వారిలో దొంగ సన్యాసులు, దుర్మార్గులు చాలామంది ఉన్నారు. అలాగే, మంచివాళ్ళు కూడా చాలామంది ఉన్నారు. అలాగే నాస్తికులలో కూడా మంచివారున్నారు, చెడ్డవారున్నారు. ఈ రెండు భిన్న ధ్రువాలు. ఒక దానితో మరొకటి పోల్చటానికి వీలులేదు. తోటి మనిషికి కష్ట సమయంలో సాయం చేయటం మంచితనం. దీనికి కావలసింది మంచి మనసొక్కటే! మనిషి నాస్తికుడైతే నేమి? ఆస్తికుడైతే నేమి? మానవత్వం లేని మృగం అయితే ఉపయోగ మేముంది? మానవసేవ చేసేవాడు నాస్తికుడైనా దైవస్వరూపుడవుతాడు. దుర్మార్గుడైన ఆస్తికుడు ఎన్ని పూజలు చేసినా అతనికి దైవకటాక్షం లభించదు. కావున అన్నిటి కన్నా ముఖ్యమైంది - మనిషి మంచివాడా, కాదా అన్నదే ముఖ్యం. నేడు మనిషి మితిమీరిన స్వార్ధంతో తాను ఏమి చేస్తున్నాడో తనకే తెలియని స్థితిలో ఉన్నాడు. ఇలాంటి వారు ఆస్తికులైనా, నాస్తికులైనా ఒకటే! మన రాజకీయనాయకులు అందరూ దైవభక్తులే. కానీ, ఉపయోగం ఏముంది? నిజంగా వారికి దైవభక్తి, పాపభీతి ఉంటే, దేశంలో ఇంత అవినీతి వేళ్ళు పాతుకొని పోతుందా? భగవంతుడు కోరేది

ఇటువంటి భక్తులను, భక్తిని కాదు. మానవత్వం, మంచితనం ఎవరివద్ద ఉంటే వారిని వెతుక్కుంటూ భగవంతుడే స్వయంగా వారివద్దకు వస్తాడు. సేవాదృక్పథం, మంచితనం లేని ఆస్తికత్వం శుద్ధ దండుగ. అసలు భక్తి అంటే ఏమిటో తెలుసు కోవాలంటే, 'నారద భక్తి సూత్రాలను' చదివితే తెలుస్తుంది. 'గోరా'గా ప్రసిద్ధులైన శ్రీ గోపరాజు రామచంద్రరావుగారు నాస్తికుడిగా, హేతువాదిగా, గాంధేయవాదిగా తెలుగు వారందరికీ సుపరిచితులు. వారి దృష్టిలో ఆస్తికత, హేతువాదం రెండు భిన్న ధ్రువాలు. నేటి సమాజంలో అగ్ర, నిమ్న జాతులనే వర్ణ బేధాలు, అంధ విశ్వాసాలు పెరగటానికి ఆస్తికతే కారణం అని వారి గట్టి నమ్మకం. మానవులందరూ ఒకటే అన్న భావం పెరగాలంటే ,అది ఒక్క నాస్తికవాదం వల్లనే సాధ్యమని విశ్వసించి, నాస్తికభావాల ప్రచారం కోసం తన జీవితమంతా వెచ్చించిన మహనీయుడు శ్రీ గోరా! శ్రీ గోరా గారు ప్రస్తుతం ఒరిస్సా రాష్ట్రంలో ఉన్న ఛత్రపూర్ అనే కుగ్రామంలో,15 -11 -1902 నజన్మించారు. ఉన్నత కుల హిందూ కుటుంబంలో జన్మించిన శ్రీ రామచంద్రరావుగారు వృక్ష శాస్త్రంలోడిగ్రీ చదివి, మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో అదే శాస్త్రంలో మాస్టర్ డిగ్రీలో ఉత్తీర్ణుడయ్యాడు. శ్రీ గోరా గారు కొంతకాలం అధ్యాపకులుగా వివిధ కళాశాలలో పనిచేశారు. కొంతకాలం శ్రీ లంకలో కూడా పనిచేసారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా లాంటి ఉద్యమాలలో పాల్గొని బ్రిటిష్ ప్రభుత్వపు జైళ్లలో కఠిన శిక్షలు అనుభవించారు. పెళ్ళికి ముందే సెక్స్ పైన అవగాహనలు, కుటుంబ నియంత్రణ, వీటితో పాటు ఎన్నో విప్లవాత్మక మార్పులను తెచ్చిపెట్టిన ఘనత గోరాదే. గోరా అనేక రచనలను చేశారు. 1922 లో సరస్వతిని ఆమె 10 ఏళ్ళ ప్రాయంలోనే వివాహం చేసుకున్నారు. సంఘం, ఆర్ధిక సమత అనే పత్రికలను నడిపారు. వర్ణవ్యవస్థ, అంటరానితనం మీద తన యుద్ధాన్ని ప్రకటించిన గోరా 1940 లోఆయన భార్యతో కలసి నాస్తిక కేద్రాన్ని, కృష్ణా జిల్లాలోని ఒక గ్రామంలో ప్రారంభించటం జరిగింది. దేశస్వాతంత్ర్యంసందర్భంగా, 1947 లో, కేంద్రాన్ని విజయవాడకు తరలించడం జరిగింది.

కుమారులకు ఆయన పెట్టిన పేర్లు - ఉప్పుసత్యాగ్రహం కాలంలో పుట్టినందున లవణం, భారతీయులు చట్టసభలలో నిలిచి గెలిచిన కాలంలో పుట్టినందున విజయం, రెండవ ప్రపంచ యుద్ధకాలంలోపుట్టినందున ఒక కుమారునికి సమరం, మరొక కుమారునికి నియంత. తొమ్మిదవ సంతానానికి నౌవ్ గా పేర్లు పెట్టారు. హిందీ భాషలో నౌవ్ అంటే తొమ్మిది అని అర్ధం. కుమార్తెలు మనోరమ, మైత్రి, విద్య. గోరా గారు 25 ఏళ్ళ వయసు వరకు అస్తికుడే. తరువాత నాస్తిక సిద్ధాంతాలతో జీవితాంతం కృషి సల్పిన గోరా జీవితమే ఒక ఆదర్శం. గోరా గారు తన భార్యకి గర్భం వచ్చిన ప్రతిసారీ గ్రహణ సమయంలో గర్భవతిగా ఉన్న ఆమెను బయటకి తీసుకొని వెళ్లి తిప్పేవారు. గ్రహణం సమయంలో గర్భిణులు బయట తిరిగినంత మాత్రాన పుట్టబోయే పిల్లలకు గ్రహణం మొర్రి రాదు, అని నిరూపించటానికి. గోరా గారి పిల్లల్లో ఎవరికీ గ్రహణం మొర్రి రాలేదు.

గోరా నమ్మిన నిజాలు -

దేవుడు అబద్ధం. నీతి పెరగాలంటే దైవభావం పోవాలి. జాతి మతం కులం పేరుతో ప్రజల మధ్య వైషమ్యాలు పెరుగుతున్నాయి. నాస్తికత్వంలో ఈ వివక్షలకు తావులేదు. దేవుడు, కర్మ అనే భావాలు పోతే మనిషి మతస్తుడిగా కాకుండా మానవుడిగా మిగులుతాడు. సోదరభావం పెరుగుతుంది.

ధర్మపత్ని సరస్వతి గోరా -

గోరాగారి భార్య శ్రీమతి సరస్వతీగోరా సంఘసేవిక, మతాతీత మానవతావాది. మానవులంతా సమానమనే భావం సమాజంలో నెలకొనాలంటే, కులాలు, మతవిశ్వాసాలు ఉంటే సాధ్యం కాదు. నాస్తిక వాదం ఒక్కటే శరణ్యం. కుల, మత రహిత సమసమాజమే ధ్యేయం అనేవారు. విజయనగరంలో 1912లో జన్మించింది. గోరాతో పాటు సరస్వతీ గోరా 1928 ప్రాంతాలలో శ్రీలంకలో వున్నారు. మతాచారాల్ని దిక్కరించారు. పైగా ఆమె గర్భవతిగా ఉన్నప్పుడు గ్రహణాలను కావాలని చూసారు. రాహువు, కేతువులు మానవ సమాజంలోనే ఉన్నారన్నారు. నిప్పుల మీద నడవటమనేది దేవతల మహాత్మ్యం కాదని ఎవరైనా నడవవచ్చని ఆమె స్వయంగా నిప్పులమీద నడిచారు. దేవదాసీలకు స్వయంగా వివాహాలను జరిపించారు. కులనిర్మూలన, నాస్తిక వాదాలను విస్తృతంగా ప్రచారం చేసారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని కొన్నాళ్ళు జైలుశిక్ష అనుభవించారు. అస్పృశ్యతా నివారణ ఉద్యమం చేపట్టారు. మహాత్మా గాంధీజి ఆమె సేవలను గుర్తించి సేవాగ్రామ్ కు ఆహ్వానించారు. ఆహార కొరత ఉన్న రోజుల్లో కూరగాయలను పండించాలని ఉద్యమించారు. ఈనాం భూములను పొలాలు లేని రైతులకు పంచాలని సత్యాగ్రహం చేపట్టారు. ఆచార్య వినోభాభావే చేపట్టిన సర్వోదయ ఉద్యమంతో ప్రభావితులై దేశమంతా ప్రయాణించి వినోభాభావే ఆశయాలకు మంచి ప్రచారం కల్పించారు. మతాన్ని సూచించే ఏ ఆభరణాలను, చిహ్నాలను ఆమె ధరించేవారు కాదు. పుణ్యవతిగా బొట్టూ, కాటుక, గాజులు, మంగళ సూత్రాలవంటివి ధరించలేదు. 1975 జూలై 26న గోరా మరణించినప్పుడు ఆమె అభిమతానికి అనుగుణంగా గోరా గారికి ఏ మత సాంప్రదాయాన్ని పాటించకుండా సంస్కారాలు జరిపించారు.

శ్రీ గోరా గారు రచించిన గ్రంధాలు -

నాస్తికత్వం(దేవుడులేడు), దేవుని పుట్టుపూర్వోత్తరాలు, జీవితం నేర్పిన పాఠాలు, నేను నాస్తికుడిని, సృష్టి రహస్యం, సంఘ దృష్టి, ఆర్ధిక సమానత్వం, నాస్తికత్వం - ప్రశ్నోత్తరాలు, నాస్తికత్వం - ఆవశ్యకత, An Atheist with Gandhi, Positive Atheism, We become Atheists, I learn, people and progress, A note on Atheism, The need of Atheism...

గోరాగారు తన సంతానమందరికీ, వారివారి అభీష్టం మేరకు, అందరికీ వర్ణాంతర వివాహాలు 'నాస్తిక పద్ధతిలో' జరిపించారు. ప్రముఖ కవి, దళిత కులానికి చెందిన శ్రీ జాషువా గారి కూతురైన హేమలత గారిని, తన కుమారుడైన శ్రీ లవణం గారికిచ్చి వివాహం జరిపించిన ఆదర్శవాది శ్రీ గోరాగారు. చెప్పింది చేసి చూపించిన మహనీయుడు శ్రీ గోరాగారు. 1970 లో బోస్టన్ లోనూ,1974లో హాలండ్ లోని అంష్టర్డాంలో జరిగిన అంతర్జాతీయ హ్యూమనిష్టు మహాసభలలో శ్రీ గోరాగారు పాల్గొన్నారు. తెలుగులో ఒక వార పత్రిక 'సంఘం' ను స్థాపించి, దాని ద్వారా తన ఆశయాలను, లక్ష్యాలను ప్రజలలో విశేషంగా ప్రచారం చేశారు. గొప్ప సంఘసంస్కర్త, మానవతావాది, నాస్తిక ఉద్యమ నాయకుడు, హేతువాది అయిన శ్రీ గోరాగారు, 26 -07 -1975 న విజయవాడలోని నాస్తిక కేంద్రంలో ప్రసంగిస్తూ మరణించారు. గోరా గారి శతజయంతి సందర్భంగా 2002 లో భారతప్రభుత్వం, తపాలా బిళ్ళను విడుదల చేసింది. వారి కోడలైన శ్రీమతి హేమలతాలవణం గారు తన తండ్రి శ్రీ జాషువా గారి రచనలను వెలుగులోకి తెస్తూ, మామగారైన శ్రీ గోరా గారు స్థాపించిన 'నాస్తిక కేంద్రాన్ని' కూడా సమర్ధవంతంగా నడిపారు. ఈమె కూడా 19 -03 -2008 న నాస్తికకేంద్రం, విజయవాడలోనే మరణించారు.

తన లక్ష్యాలకోసం జీవితాన్ని మొత్తం ధారపోసిన శ్రీ గోరా గారు చిరస్మరణీయులు.

వారికి నా ఘనమైన నివాళి!

కలడందురు దీనులయెడ

గలదందురు పరమయోగి గణముల పాలన్

గలడందురన్ని దిశలను

కలడు కలండనెడి వాడు కలడో లేడో !!

"A man’s ethical behavior should be based effectually on sympathy, education, and social ties; no religious basis is necessary. Man would indeed be in a poor way if he had to be restrained by fear of punishment and hope of reward after death."- Albert Einstein

Sacrificing the earth for paradise is giving up substance for the shadow.-Victor Hugo (1802-1885)

Emotional excitement reaches men through tea, tobacco, opium, whiskey and religion--George Bernard Shaw (1856-1950)

"Religion is based, I think, primarily and mainly upon fear. It is partly the terror of the unknown and partly, as I have said, the wish to feel that you have a kind of elder brother who will stand by you in all your troubles and disputes. Fear is the basis of the whole thing — fear of the

mysterious, fear of defeat, fear of death. Fear is the parent of cruelty, and therefore it is no wonder if cruelty and religion have gone hand in hand." - Why I Am Not A Christian – Bertrand Russell.

మంచి తనం లేని వాడు ఆస్తికుడైనా,నాస్తికుడైనా ఒకటే అని అంటాను. మరి మీరేమంటారు?

*********************************************




జిల్లెళ్ళమూడి అమ్మ - టీవీయస్.శాస్త్రి

jillellamoodi amma

జిల్లెళ్ళమూడి "అమ్మ"గా పేరొందిన ఈవిడ అసలు పేరు అనసూయ. ఈమె, గుంటూరు జిల్లాలోని బాపట్లకు 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లెళ్ళమూడి అనే కుగ్రామంలో 28 మార్చి, 1923 న సీతాపతి, రంగమ్మ అనే పుణ్య దంపతులకు జన్మించారు. తండ్రి సీతాపతి గారు గ్రామాధికారి. నాలుగు సంవత్సరాల వయసునుండే ఆమె శారీరక, మానసిక స్థితి చాలా

విభిన్నంగా ఉండేది. తరచుగా, trance లోకి వెళ్ళేవారు. ఒక సారి, ఏకంగా అలా పదకొండు రోజులు trance లో ఉండిపోయారు. నెమ్మదిగా స్పృహలోకి వచ్చేవారు. ఆ నాటి వైద్యులకు ఆమె స్థితి చాలా వింతగా తోచింది. వివాహం చేస్తే మార్పు రావచ్చునేమోనని భావించారు.

ఆమెకు 05 -05 -1936న, పదమూడవ ఏటనే వివాహం చేసారు. కానీ, వివాహానంతరం కూడా, ఆమె ఎప్పుడూ ఏదో లోకంలో ఉన్నట్లుగా ఉండేవారు. ఆవిడ భర్త పేరు శ్రీ బ్రహ్మాండం నాగేశ్వరరావుగారు. ఆయనను 'జిల్లెళ్ల మూడి కరణంగారు' అని పిలిచేవారు. అప్పటికే ఆమెలో దివ్యశక్తిని గ్రహించిన కొందరు భక్తులు ఆమెను."మీకు అంత ఆధ్యాత్మిక తృష్ణ, భక్తి ఉండగా, పెళ్లి చేసుకోవటం లోని అంతరార్థం మాకు అర్థం కావటం లేదు." అని అడిగారు. అందుకు, అమ్మ"ఆధ్యాత్మిక జీవితానికి వివాహం అడ్డు కాదు - అని చెప్పటానికే, నేను వివాహం చేసుకుంటున్నాను." అని చెప్పారట. తన భార్య వింత పోకడలకు కొంతకాలానికి అలవాటు పడి, ఆవిడలో ఒక దివ్యమూర్తిని చూసి, ఆవిడ భక్తుడిగా మారాడు శ్రీ బ్రహ్మాండం నాగేశ్వరరావుగారు. కానీ, "అమ్మ" మాత్రం, తన భర్త పాద పూజ చెయ్యటం కొనసాగించారట. భక్తులు, ఆవిడ భర్తను "నాన్నగారు" అని పిలుచుకునేవారట. అయన, 1981లో మరణించారు 'ప్రపంచమంతా ఒక్కటే, ఒక్కడే దేవుడు' - అనేదే ఈమె వేదాంత బోధ.

ఈవిడ 1960-70 లలొ చాలా ప్రసిద్ధురాలు. ఈవిడ, జిల్లెళ్ళమూడిలోని ప్రజలకు మత విషయముల మీద సందేశాలు ఇస్తుండేవారు. భక్తులు ఆవిడను "అమ్మ" అని భక్తిగా పిలుచుకునేవారు. అమ్మకు చాలా విషయాలు తెలుసు. ఒక సందర్భంలో- 'సిద్ధుడికి', 'జ్ఞానికి' గల తేడాను చక్కగా వివరించారు. సిద్ధుడు ప్రజలను తన వద్దకు ఆకర్షించుకుంటాడు వివిధ శక్తుల వల్ల, జ్ఞానికి ఆ అవసరం లేదు. ప్రజలే వారంతట వారే ఆకర్షితులవుతారు. విచిత్రమైన విషయమేమంటే, ఆవిడకు గుడి కట్టడం 1953లో మొదలయ్యి 1985 లో పూర్తి అయింది. ఆ గుడి పేరు "అనసూర్యేశ్వరాలయం". ఆ కట్టిన గుడిలో, ప్రతి సంవత్సరం మే నెల 5వ తేదీన ఆవిడ తన పెళ్ళిరోజును జరుపుకునేవారు. గర్భగుడిలో, భక్తులు ఆవిడను పూజించేవారు. అమ్మ 12-06-1985 న భౌతిక దేహాన్ని విడిచారు. ఆ తరువాత, ఆవిడ భౌతిక కాయాన్ని, ఆవిడ కోరిక మేరకు, ఆ గుడిలోనే ఖననం చేశారు. 1987లో ఆవిడను ఖననం చేసిన ప్రదేశంలో ఆమె పాలరాయి విగ్రహాన్ని నెలకొల్పారు.

వీరికి, ఒక కుమార్తె, పేరు హైమ. ఆ అమ్మాయి, 1944లో జన్మించి, 1968లో మరణించినది. మొదటినుండి, ఆ అమ్మాయి రకరకాల అనారోగ్యాలతో బాధపడుతుండేది. "అమ్మ" తన కుమార్తె త్వరలోనే ఈ ప్రపంచాన్ని వదలి వెళ్ళిపోతుందని తెలుసుకున్నారు. మరణించిన తన కుమార్తెను, ఖననం చేయించి అక్కడ ఒక గుడి కట్టించారు. ఆ గుడి "హైమాలయం" గా పేరొందినది. దానిలో కూడా నిత్యమూ పూజలు, పునస్కారాలు జరుగు తుంటాయి.

Mr. Richard Schiffman in his book "Mother of All" writes "We need not feel that Mother’s feeding of her children is restricted to nourishment for the physical frame alone. It might be said that the food which Amma distributes so lovingly is a maternal symbol of the subtler, spiritual

nourishment, the grace, which she invariably showers on one and all who approached her... When a visitor asked her why she does not give any formal spiritual initiation, she answered: the food I give you is your Upadesha".

చలం లాంటి విభిన్న తత్త్వంగల వ్యక్తిని కూడా అమ్మ ఆకర్షించింది. ఈ క్రింది చిత్రంలో, చలం గారు తల్లి దగ్గర ఉన్న పసిబాలుడువలె ఎంత ప్రశాంతంగా ఉన్నారో గమనించవచ్చు.

(అమ్మతో మహర్షి చలం)

అమ్మ బోధలు

ప్రతిరోజూ మనకు అనుభవంలోకి వచ్చే విషయం ఏమంటే, కొన్ని పనులు అనుకుని చేస్తాము, మరికొన్ని పనులు అనుకోకుండా చేస్తాము. ఇలా జరిపించే దానికి "శక్తి" అని పేరు పెడదాము...... దేవుడున్నాడా అని అనుమానం పట్టుకున్నప్పుడు, నీ మీద నువ్వు నమ్మకం పెంచుకో, నీ మీద నీకు నమ్మకం లేనపుడు, దేవుని మీద నమ్మకం పెంచుకో. మీరు గమనించే ఉంటారు, మీరెంత ఆత్మ విశ్వాసంతో పనిచేసినా, కొన్ని సార్లు ఆ పని మీరనుకున్నట్లుగా కాదు. అటువంటప్పుడు, మీ గురించి మీకు అనుమానం కలిగి, అసహాయులయి, సహాయం కొరకు, మీరు దేవుని వైపు మళ్ళుతారు. మీరు పూర్తి విశ్వాసంతో మీ పనిని, మిమ్మల్ని దేవుని వద్ద ఉంచుతారు. కాని, వేచి చూసినా, ఏమీ కాదు. అప్పుడు మళ్ళీ ఆ పనులను మీ చేతుల్లోకి తీసుకుంటారు. ఈ మొత్తం చక్ర భ్రమణాన్ని, సవ్యంగా ఎందుకు అర్థం చేసుకోరు? మీలో ఉన్న అంతరాత్మ మరియు భగవంతుడు ఒకే సూత్రానికి సంబంధించిన రెండు ధ్రువాలని !

(అత్తగారైన కనకమ్మ గారిసేవలో అమ్మ)


అమ్మ నోట బంగారు మాట - ఒక సారి నేను జిల్లెళ్ళమూడి వెళ్ళినపుడు, ప్రఖ్యాత రచయిత శ్రీ కొండముది శ్రీ రామచంద్రమూర్తి గారు కూడా అక్కడే ఉన్నారు. అక్కడ నుండి వెలువడే ఒక ఆధ్యాత్మిక పత్రికకు గౌరవ సంపాదకులుగా ఉండేవారు.వారితో కాసేపు ముచ్చటించాను. ఆ సమయంలో ఒక 60 ఏండ్ల స్త్రీ ఒకామె అమ్మ వద్దకు వచ్చి, "అమ్మా! నాకు ఏదైనా మంత్రోపదేశం చెయ్యండి, రోజూ దానిని శ్రద్ధగా చదువుకుంటాను." అని ప్రార్థించింది. అందుకు,అమ్మ, "నాకే మంత్రమూ రాదు తల్లీ, ఇంక నీకేమి

బోధిస్తాను." అని అన్నారు. అదీ గాక అమ్మ ఆమెను కుశల ప్రశ్నలు వేసే సందర్భంలో, "తల్లీ! నీకు కోడళ్ళు, అల్లుళ్ళు వచ్చారా?" అని అడిగింది. అందుకు ఆమె, "వచ్చారు,అమ్మా!" అని చెప్పింది. వెంటనే జిల్లెళ్ళమూడి అమ్మ ఆమెతో ఇలా అన్నది, "కూతుళ్ళనూ, కోడళ్ళనూ ఒకే రకంగా చూసుకో! అదేవిధంగా కొడుకులనూ, అల్లుళ్ళనూ ఒకే రకంగా చూసుకో! ఈ వయసులో చేయవలసిన సాధన ఇదే. అద్వైతం అంటే కూడా ఇదే!" అని ఉపదేశించింది. ఆమాటలు నేటికీ నా చెవిలో ప్రతిధ్వనిస్తుంటాయి.

ప్రముఖనటి సావిత్రి బతికున్న రోజులవి. ఆ రోజుల్లో, ఒకసారి జిల్లెళ్ళమూడి అమ్మ మద్రాసుకు వెళ్లారు. అక్కడ ఒక భక్తురాలి గృహంలో అమ్మ విడిదిచేసి ఉన్నప్పుడు సినిమా నటి సావిత్రి అమ్మ దర్శనానికి వచ్చింది. దర్శనం తర్వాత వెళుతూ, జిల్లెళ్ళమూడి అమ్మను తన గృహానికి కూడా రమ్మని వేడుకొంది. అమ్మ మౌనంగా విన్నది. సావిత్రి ఏమనుకుందో ఏమో, "అలా రావడానికి మీరేం తీసుకుంటారమ్మా?" అని వెంటనే అడిగింది. అమ్మ చిరునవ్వుతో, తాను ఇచ్చే అమ్మనే గాని తీసుకునే అమ్మను కానని, జవాబు చెప్పింది. దైవత్వం,మాతృత్వమంటే అలా ఉంటాయి. సావిత్రికి అప్పటివరకూ తారసపడిన గురువులందరూ తీసుకున్నవారే కావటం వల్ల, సావిత్రి అలా అడిగి ఉండవచ్చు.

అమ్మ దివ్యస్మృతికి సభక్తిక సమర్పణ!

***********************************************




శ్రీ బలిజేపల్లి లక్ష్మీకాంత కవి - టీవీయస్.శాస్త్రి

shri balijepalli lakshmeekaantha kavi

'మాయామేయ జగంబె నిత్యమని సంభావించి, మోహంబునన్' - వేదాంతపరమైన ఈ పద్యం గ్రామీణుల గొంతులో కూడా ఇప్పటికీ, ఎప్పటికీ పలుకుతూనే ఉంటుంది. ఈ పద్యం 'సత్య హరిశ్చంద్రీయం' నాటకం కోసం శ్రీ బలిజేపల్లి లక్ష్మీకాంత కవి గారు వ్రాసారు. కేవలం నాటకం కోసం ఇంత భావగర్భితమైన పద్యాన్ని కవి వ్రాసాడంటే అతనిలోనున్న వేదాంత జిజ్ఞాస ఎంత గొప్పదో చెప్పనవసరం లేదు. ఈ ఒక్క పద్యమే కాదు, హరిశ్చంద్రలోని పద్యాలన్నీ ఆణిముత్యాలే! శ్రీ బలిజేపల్లి లక్ష్మీకాంత కవి, పద్య నాటక రచయితయే కాదు, చక్కని నటుడు. అంతే కాదు. స్వాతంత్ర్య సమరయోధుడు. వారిలో ఒక మంచి నటుడుండటం వల్లే, హరిశ్చంద్ర నాటకం అంత రసవత్తరంగా తయారయ్యింది. వారు కూడా ఆ నాటకంలో నక్షత్రకుని పాత్రను అత్యద్భుతంగా పోషించేవారట! వీరి 'హరిశ్చంద్ర' నాటకం ద్వారా ఆ రోజుల్లో ఎంతోమంది నటులుగా ప్రఖ్యాతి గాంచారు. వారిలో ముఖ్యులు స్వర్గీయ డి.వి. సుబ్బారావు, మల్లాది సూర్యనారాయణ శాస్త్రి, బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి, పీసపాటి నరసింహమూర్తి గార్లు. నాకు ఊహ తెలిసిన తరువాత, నేను చూసిన మొదటి పద్య నాటకం హరిశ్చంద్ర. ఆ నాటకం అలానే, నా మస్తిష్కంలో నిక్షిప్తమైంది. తరువాతి రోజుల్లో కూడా ఎన్నోసార్లు ఆ నాటకాన్ని చూడటం తటస్థించింది. కేవలం, ఆ నాటకంలోని భావయుక్తమైన పద్యాల కోసమే ఆ నాటకాన్ని చూసాను. ఆయన సమకాలీన జీవితంలో ఎందరో మహా కవులున్నారు. అయితే వీరిని ఒక్కరిని మాత్రమే పేరు చివరన కవి అని తగిలించి, వారిని 'లక్ష్మీకాంత కవి' అని పిలిచేవారు. అదే వారి ప్రతిభకు నిదర్శనం.

శ్రీ బలిజేపల్లి లక్ష్మీకాంత కవి గారు 23-12-1881న, గుంటూరు జిల్లాలోని బాపట్ల వద్ద ఒక కుగ్రామమైన ఇటికంపాడులో నరసింహశాస్త్రి, ఆదిలక్ష్మమ్మ దంపతులకు జన్మించారు. కర్నూల్ లో మెట్రిక్ పరీక్షలో ఉత్తీర్ణులయిన పిదప సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గుమాస్తాగా పనిచేసారు. ఆయన ప్రవృత్తికి ఆ ఉద్యోగం నచ్చలేదు. అందుచేత తర్వాతి రోజుల్లో గుంటూరులోని హిందూ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా ఉపాధ్యాయులుగా చేరారు. ఆ సమయంలోనే వారు అవధానాలు కూడా చేసారు. చాలామంది సంస్థానాధీశులు, రాజులు వీరిని ఆదరించి, అభిమానించారు. వారిలో ముఖ్యులు సాహితీబంధువైన చల్లపల్లిరాజా గారు. రాజా గారి ప్రోత్సాహంతో, వీరు 1922 లో గుంటూరులోనే చంద్రికా ప్రింటింగ్ ప్రెస్ ను ప్రాంభించారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలుకెళ్ళారు. జైలులో ఉన్నప్పుడే,1924 లో వీరు 'సత్య హరిశ్చంద్రీయం' నాటకాన్ని రచించారు. ఆయనే ఒక నాటక సమాజాన్ని ప్రత్యేకంగా ప్రారంభించి, 'సత్య హరిశ్చంద్రీయం', 'ఉత్తర రాఘవం' నాటకాలను పెక్కుసార్లు ప్రదర్శించారు. వీరు మా నాన్నగారికి గుంటూరులో తెలుగు ఉపాధ్యాయులుగా ఉండేవారని మా నాన్నగారు చెబుతుండేవారు. వీరి రచనా నైపుణ్యం గురించి, నటనా ప్రాభవం గురించి మా నాన్నగారు ఎంతో విశదీకరించి చెప్పేవారు. హరిశ్చంద్రలోని పద్యాలన్నీ వారికి కరతలామలకాలు. వారి ద్వారా, నాకూ చాలా పద్యాలు నోటికి వచ్చు. హరిశ్చంద్ర నాటకం ఎప్పుడు ప్రదర్శించినా, వారు నన్ను కూడా తీసుకొని వెళ్ళేవారు. అలా హరిశ్చంద్ర నాటకం నా జీవితంలో ఒక భాగమైంది. ప్రత్యక్షంగా చూడకపోయినా శ్రీ బలిజేపల్లి లక్ష్మీకాంత కవి గారి మీద నాకు ఎనలేని గౌరవం ఏర్పడింది.

తర్వాత నాటి సినీ దర్శకులైన శ్రీ చిత్తజల్లు పుల్లయ్య గారి ప్రోత్సాహంతో వీరు సినీరంగ ప్రవేశంచేసి, అనేక సినిమాలకు రచయితగా మాటలను, పాటలను వ్రాసారు.1939 లో విడుదలైన 'వరవిక్రయం' అనే సినిమాలో వీరు మొదటిసారి నటించారు. ఆ సినిమాలో లింగరాజు పాత్రను వీరు పోషించిన తీరు పండితుల, పామరుల ప్రశంసలు పొందింది. వీరు వ్రాసిన పద్యాల వల్లనే, SVR నటించిన హరిశ్చంద్ర సినిమా ఘన విజయం సాధించింది అనటంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. తర్వాతి రోజుల్లో శ్రీ కే.వి.రెడ్డి గారు ఎన్టీఆర్ ప్రధాన పాత్రలో సత్యహరిశ్చంద్ర సినిమాను తీసారు. నాటకంలోని పద్యాలన్నిటినీ తీసివేసి, పింగళి గారి చేతనో, సముద్రాల గారి చేతనో సరికొత్త పద్యాలను వ్రాయించారు. ఆ సినిమా అనుకున్నంత ఘన విజయం సాధించకపోవటానికి ముఖ్యకారణం, నాటకంలోని పద్యాలను మార్చటమే అని నా ప్రగాఢ అభిప్రాయం.

శ్రీ లక్ష్మీకాంతకవి గారు రచించిన కొన్ని గ్రంధాలు - శివానందలహరి శతకం(ఆది శంకరుని శివానందలహరికి పద్య రూపం), స్వరాజ్య సమస్య (కవితాసంపుటి), బ్రహ్మరథం (నవల), మణిమంజూష(నవల), బుద్ధిమతి విలాసం(నాటకం), సత్య హరిశ్చంద్రీయం(నాటకం), ఉత్తర రాఘవం(నాటకం-భవభూతి సంస్కృత రచనకు ఆంధ్రీకరణ). వీరు రచన చేసిన సినిమాలు - అనసూయ,జరాసంధ,మళ్ళీ పెళ్లి, వరవిక్రయం, భూకైలాస్(1940), విశ్వమోహిని, జీవన్ముక్తి, బాలనాగమ్మ, తహసిల్ దార్, బ్రహ్మరథం, రక్షరేఖ మొదలైనవి. వీటిలో మళ్ళీ పెళ్లి, వరవిక్రయం, బాలనాగమ్మ, తహసిల్ దార్, రక్షరేఖలో నటించారు కూడా.

30-06-1953న శ్రీ లక్ష్మీకాంతకవి గారు దక్షిణ వారణాసి అయిన శ్రీ కాళహస్తిలో అకస్మాత్తుగా మరణించి శివైక్యం చెందారు.భౌతికంగా వారు మరణించినప్పటికీ, వారు రచించిన 'సత్య హరిశ్చంద్రీయం' నాటకం ఉన్నంత కాలం వారు చిరంజీవులే! 'భక్తయోగ పదన్యాసి వారణాసి' అనే పద్యం నా చెవుల్లో ఇప్పటికీ ప్రతిధ్వనిస్తూనే ఉంది. 'పాడుతా తీయగా' కార్యక్రమంలో చిరంజీవి


ప్రవీణ్ కుమార్ అత్యద్భుతంగా గానంచేసిన హరిశ్చంద్రలోని చక్కని వేదాంత పరమైన ఒక పద్యాన్ని, ఈ లింకులో వినగలరు.

http://www.youtube.com/watch?feature=player_detailpage&v=VpexsnJzmyA#t=20

వెంటరాని సిరిసంపదలను ఇక్కడే వదలి, యశస్సును వెంట తీసుకొనివెళ్ళిన శ్రీ బలిజేపల్లి వారు చిరంజీవులు! సజీవులు!!

బహుముఖ ప్రజ్ఞావంతుడైన శ్రీ బలిజేపల్లి లక్ష్మీకాంత కవి గారికి నా కళాంజలులు!

**********************************************




సాహితీ యోధుడు శ్రీ ఆలూరి భుజంగరావు గారు - టీవీయస్.శాస్త్రి

sahithee yodhudu shree aaloori bhujangaraavu garu

శ్రీ రావూరి భరద్వాజ గారికి జ్ఞానపీఠ పురస్కారం లభించిన సందర్భంలో, ఆయనకు అత్యంత సన్నిహితుడు, గుంటూరులోనే నివసిస్తున్న శ్రీ ఆలూరి భుజంగరావు గారిని కలసి అనాటి జ్ఞాపకాలను గురించి అడిగాను. నాకున్న సందేహాన్ని ముందుగా శ్రీ ఆలూరిని నిర్మొహమాటంగా అడిగి తెలుసుకున్నాను. అదేమిటంటే, 'నిజానికి పాకుడురాళ్ళు నవలకు, అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పురస్కారం లభించే అర్హత ఉందా? అంతకన్నా గొప్ప గ్రంధాలు తెలుగులో లేవా?´ అని. అందుకు శ్రీ ఆలూరి, ´ఆకలి, అవిద్య, అవమానాలు, దారిద్ర్యం లాంటి అష్ట కష్టాలు పడిన ఒక సామాన్యుడు అసమాన్యుడిగా ఎదిగాడు. కష్టాల కొలిమిలో నుంచి బయల్పడిన మేలిమి వజ్రం మా బావ భరద్వాజ. ఈ బూర్జువా ప్రభుత్వాలు, సంస్థలు అలాంటి వారిని కూడా సత్కరిస్తాయని నేను కలలో కూడా ఊహించలేదు. జీవితానుభావాలను రంగరించి నెత్తురుతో,ధైర్యంగా వ్రాసిన నవల పాకుడురాళ్ళు. అటువంటి నవల, అది వ్రాసిన మహర్షి భరద్వాజ ఆ పురస్కారానికి పూర్తి అర్హులు. అందులో ఏమాత్రం సందేహం లేదు.´ అని ఆయన చాలా ఆనందంగా,గర్వంగా చెప్పారు. ఆ సత్కారం ఆయనకే లభించినంత ఆనందంగా ఉన్నారాయన! ఇంతలో చెన్నై నుండి శ్రీ గొల్లపూడి మారుతీరావు గారు ఫోన్ చేసి, వారిని భరద్వాజ గారిని గురించిన కొన్ని విశేషాలను అడిగి తెలుసుకున్నారు.


ఒకే సమయంలో ముగ్గురు స్నేహితులు అయిన శ్రీ ఆలూరి, ´శారద,´ భరద్వాజ గార్లు తెనాలిలో కటిక దారిద్ర్యాన్ని అనుభవిస్తు, అద్భుతమైన సాహితీసేవను కూడా చేసారు. వారిలో ఆలూరి,శారద (వీరిని గురించిన నా రచన తెలుగు వికీలో ప్రచురితమయ్యింది, దానిని మీ కోసం గతంలోనే అందచేసాను.) హోటల్ కార్మికులుగా పనిచేసారు. యజమానులు డబ్బులివ్వటం ఎగవేస్తే, తిరుగుబాటుచేసి - వారిచేతుల్లో తన్నులు తిన్నారు. శారద అతి చిన్న వయసులోనే దుర్భర దారిద్ర్యంతో, మూర్ఛ వ్యాధితో తన సాహితీయాత్రను ముగించి ఈ పాడులోకాన్ని వదలి వెళ్ళాడు. భరద్వాజ ఎన్నో పనులుచేసి(పొలంలో కూలీ పనులతోసహా), ఒకదశలో´ఆకాశవాణి´లో చేరి, జీవితంలో స్థిర పడ్డారు. శ్రీ ఆలూరి భుజంగరావు గారు మాత్రం తను నమ్మిన విప్లవ సిద్ధాంతాలకే కట్టుబడి, జీవితాంతం కష్టాలనే అనుభవించాడు. ఇద్దరు అల్లుళ్ళు encounter లో చనిపోయారు. ఈయన కూడా చాలాకాలం అజ్ఞాతంలోనే ఉన్నాడు. మరణించేటంతటి వరకు కూడా ´విరసం´సభ్యుడే! శ్రీ ఆలూరి భుజంగరావు గారిని గురించి, వారి సాహితీ యాత్రను గురించి తెలుసుకుందాం!

ఈయన 1928 లో గుంటూరు జిల్లా పొన్నూరు దగ్గర కొండముది గ్రామంలో పుట్టారు. తల్లి సీతారామమ్మ తండ్రి వెంకటప్పయ్య.ఆయన జీవితం ఎక్కువగా తెనాలి, గుడివాడలలో గడిచింది. వీరు అనువాద రచయితగా ప్రసిద్ధి చెందారు. భగత్ సింగ్, చంద్రశేఖర ఆజాద్, సుఖదేవ్, మరెంతమందో దేశభక్తులతో కలసి పని చేసినటువంటి శ్రీ యశ్ పాల్ గారు రచించిన స్వాతంత్ర్య పోరాట గాధ 'సింహావలోకన్'ను తెలుగులో చక్కగా అనువదించారు. అంతేగాక, అనేక రాహుల్ సాంకృత్యాయన్ రచనలను తెలుగులోకి అనువదించారు. వీరు చాలాకాలం రాజకీయాల్లో ఉన్నారు. అనేకసార్లు అరెస్ట్ అయ్యారు. ఈయన గాంధీ వాదం - శవపరీక్ష అనే గ్రంధాన్ని వ్రాసారు. ఇది కమ్యూనిస్టు సిద్ధాంతం మీద, గాంధీయిజం మీద పూర్తి విమర్శనాత్మక గ్రంధం. శ్రీ ఆలూరి పారదర్శి, పెద్దన్న, చక్రధర్, జనార్దన్ కలం పేర్లతో చాలా రచనలను చేసారు. చాలా కథలు వ్రాసారు. అవన్నీ కలిపి ´అరణ్యపర్వం´ పేరిట కథా సంకలనంగా వెలువడింది. ´సాహిత్యబాటసారి´ పేర శారద జీవిత చరిత్రను వ్రాసారు. అంతేగాక, ప్రేమ్ చంద్ ( రంగభూమి,గబన్), కిషన్ చందర్ (వాయుగుండం, పరాజయం) తెలుగులోకి అనువదించారు.

ప్రభాత్ అనే హిందీ పత్రికను 6 సంవత్సరాలు నడిపారు. హోటళ్ళలో వెట్టిచాకిరి చేసి ఉపాధ్యాయుడయ్యాడు. హోటల్ కార్మికుడిగా పనిచేసేటప్పుడే వీరికి శారదతో పరిచయం అయింది. ఆ పరిచయమే, తదుపరి రోజుల్లో, శారదను సుప్రసిద్ధ రచయితగా మార్చింది. శారద, భరద్వాజ, ధనికొండ హనుమంత రావు గార్లతోటి స్నేహాన్ని, పరిచయాలను నెమరువేసుకుంటూ, ´స్మృతి శకలాలు´ అనే గ్రంధాన్ని వ్రాసారు. రావూరి భరద్వాజ వీరిని ప్రేమగా ´బుజ్జి´ అని పిలుస్తుంటారు. చేస్తున్న ఉపాధ్యాయ ఉద్యోగాన్ని ముందస్తుగానే విరమించి అజ్ఞాతంలోకి వెళ్లారు. చాలాకాలం తర్వాత మళ్లీ జనజీవన స్రవంతిలోకి వచ్చేసారు. కొంతకాలం బెంగుళూరులో కుమారుడి వద్ద ఉన్నారు. జీవితమంతా విప్లవపోరాటాలు చేసి అలసిసొలసిపోయిన ఈ కమ్యూనిస్టు యోధుడు 20-06-2013న గుంటూరులో తుది శ్వాస వదిలాడు.

విప్లవమే జీవితంగా బతికిన ఈ సాహితీ యోధునికి నా ఘనమైన నివాళి! లాల్ సలాం!!

*********************************************



విశ్వవిఖ్యాత చిత్రకారుడు, రచయిత, తత్వవేత్త - శ్రీ సంజీవదేవ్ గారు - టీవీయస్.శాస్త్రి

vishwavikhyatha chitrakarudu, rachayitha, tatvavetta - shree sanjeevadev gaaru

డాక్టర్ సూర్యదేవర సంజీవదేవ్ గారు(జూలై 03,1924 --ఆగష్టు 25, 1999) ప్రముఖ చిత్రకారుడు, తత్వవేత్త, రచయిత, కవి. తన స్వీయ చరిత్రను 'తెగిన జ్ఞాపకాలు' పేరిట రచించారు. తెలుగు 'ఆత్మకథల' గ్రంధాలలో దీనికొక విశిష్టస్థానం ఉంది. మంగళగిరి, తెనాలికి మధ్యనగల తుమ్మపూడి అనే కుగ్రామంలో, 03-07-1924న ఈయన జన్మించారు. బాల్యంలోనే ఇల్లువదలి దేశ సంచారం చేసారు. 20 ఏళ్ళ వయసులోపే హిమాలయాలతో సహా ఉత్తర భారతదేశాన్ని అంతా తిరిగారు. చాలా భాషలను నేర్చుకున్నారు. ఎస్పరాంటో అనే కృత్రిమ అంతర్జాతీయ భాషలో కూడా ఈయనకు ప్రవేశం, ప్రావీణ్యం ఉంది. లక్నోలో శ్రీ అసిత్ కుమార్ హాల్దార్ వద్ద చిత్రలేఖనం అభ్యసించారు. వీరి కలం స్నేహం అపరమితమైనది. సమకాలినపు ప్రపంచ మేధావుల అందరితోనూ ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేవారు. అమెరికాలోని ఆల్డస్ హక్సలీ నుండి అమెరికాలోనే స్థిరపడిన భారతీయ చిత్రకారుడు శ్రీ దామెర్ల రామారావు గార్ల వరకు వారి మిత్రమండలి సువిశాలమైంది. జిడ్డు కృష్ణమూర్తి నుండి బుచ్చిబాబు, గోపీచంద్ ల వరకు వారితో ఆయనకు ప్రత్యక్ష పరిచయాలు, పరోక్ష సంబంధాలు ఉన్నాయి. రాహుల్ సాంకృత్యాయన్ నుండి బెర్ట్రాండ్ రస్సెల్ వరకు, రవీంద్రనాథ్ ఠాగూర్ నుండి దేవులపల్లి కృష్ణశాస్త్రి వరకు అధ్యయనం చేయటమేకాక వారితో ఇతనికి మంచి మైత్రి కూడా ఉంది. వీరు నివసించే తుమ్మపూడి గ్రామానికి దేశవిదేశాల నుండి కళాకారులు, సాహిత్యోపాసకలు వారికోసం వచ్చేవారు.సంజీవదేవ్ గారి వల్ల తెలుగుప్రాంతం గౌరవం పెరిగిందని ఆ ప్రాంతం ప్రజలు అనేవారు. మానవతావాది అయిన సంజీవదేవ్ గారికి ఏ ప్రాంతమూ పరాయిది కాదు. వసుధైక కుటుంబ సిద్ధాంతాన్ని నమ్మి, దాన్ని ఆచరణలో పెట్టారు. ఈయన, 25-08-1999న మరణించారు. వీరి పేరుమీద 1999 లో ఆయన సన్నిహితులు, స్నేహితులు, 'సంజీవదేవ్ అవార్డు'ను నెలకొల్పారు. దీన్ని తత్వ, కళా, సాహిత్యరంగాల్లో కృషిచేసిన వారికి ఇస్తున్నారు.

వీరి రచనలు, చిత్రాలు - 'తెగిన జ్ఞాపకాలు' అనే గ్రంధం వీరి రచనల్లో ఎక్కువ ప్రాచుర్యం పొందింది. రసరేఖలు,దీప్తిధార, రూపారూపాలు, సమీక్షారేఖలు, బయోసింఫనీ... లాంటి విశేష ప్రాచుర్యం పొందిన మరికొన్ని గ్రంధాలు.


హాస్యం, వేదాంతం - లలితకళారాధనలో ప్రవీణులైన సంజీవదేవ్ గారి హాస్యం కూడా లలితంగా ఉంటుంది. చాలారోజుల క్రితం, సంజీవదేవ్ గారింట్లో దొంగలు పడి, ఆరోజుల్లో పదివేల రూపాయల విలువగల నగలు, పట్టు చీరెలు, మరికొన్ని విలువైన వస్తువులను దోచుకొని వెళ్ళారు. పరామర్శ చేద్దామని వెళ్ళిన వారితో - "ఫర్వాలేదు, నిజానికి మనకేమీ నష్టం లేదు, దీని వల్ల." అని చెప్పేవారు, చిరునవ్వు చెదరకుండా. అదేమిటండీ అలా అంటారని ఆశ్చర్యపడిన "అవునండీ! వారు తీసుకొని వెళ్ళింది నగలనే కదా! తిరిగి మనం వాటిని చేయిస్తే కదా, మనకు నష్టం వచ్చేది. లేకపోతే, నష్టమేముంది?" అని వాదించేవారు. ఈ వార్త తెలియగానే, సంజీవదేవ్ గారి మిత్రులైన చలంగారు అరుణాచలం నుండి ఒక ఉత్తరం వ్రాసారు. "దొంగలు పడ్డారా? మీరు చారుదత్తుడులాగా దొంగలు వేసిన కన్నం దగ్గర కూచొని వారి హస్తకౌశలాన్ని మెచ్చుకోవటం లేదుకదా! ఏమేమి పోయాయి? నగానట్రా అయితే ఫర్వాలేదు. మీ దగ్గరున్న విలువైన పుస్తకాలు, ఉత్తరాలు, చిత్రాలు, భద్రంగా ఉన్నాయా? ..." ఇలా సాగింది ఆ పరామర్శ లేఖ. కేవలం మాటల్లో, వ్రాతలలో గాక నిజజీవితంలో కూడా వేదాంతులుగా ప్రవర్తించిన వారి జీవిత సరళి ఇలాగే ఉంటుంది.

రచనా శైలి - ఆయన భాష, వ్రాసే విధానం సరళంగా, విభిన్నంగా ఉంటుంది. మంచి భావుకత గల రచయిత, కవి కూడా ఆయన. శ్రీ వేగుంట మోహన్ ప్రసాద్ గారు వ్రాసిన 'చితి-చింత' అనే వచన కవితా కావ్యానికి సంజీవదేవ్ గారు వ్రాసిన 'స్పందన'(ముందుమాట) ఎలా ఉందో క్లుప్తంగా ఈ క్రిందనే తెలియచేస్తాను. -

'వ'కు దీర్ఘమిస్తే 'వా','క'కు 'యా'వత్తు ఇస్తే 'క్య', 'క్య'కు సున్నా పెడితే'క్యం'- వాక్యం. 'క'కు దీర్ఘమిస్తే 'కా', 'వ'కు 'యా'వత్తు ఇస్తే, 'వ్య', 'వ్య'కు సున్నా పెడితే 'వ్యం'-కావ్యం. వాక్యంలోని అక్షరాలూ, కావ్యంలోని అక్షరాలూ ఒకటే. అక్షరాల స్థానంలోనే మార్పు. వాక్యం అన్నదానిని త్రిప్పితే కావ్యం అవుతుంది. త్రిప్పటం అంటే వాక్యాన్ని రసాత్మకం చేయటం. అప్పుడే 'వాక్యం రసాత్మకం కావ్యం'. అన్ని వాక్యాలూ కావ్యాలు కావు. కానీ, అన్ని కావ్యాలూ వాక్యాలే! రసాత్మకమైన వాక్యాలు మాత్రమే కావ్యాలు. వాక్యాన్ని రసాత్మకంగా రచించిన వ్యక్తి కవి, ఆ రచించబడ్డది కవిత. కవిత పద్య రూపంలో ఉండాలా, వచన రూపంలో ఉండాలా అన్న ప్రశ్నయే లేదు. అందులోని వాక్యాలు రసాత్మకంగా ఉంటే, అది పద్య రూపంలో ఉన్నా, వచన రూపంలో ఉన్నా కవితయే. రసాత్మకంకాని పద్యం కవిత కాదు, అది కేవలం ఛందోబద్ధ వాక్య నిర్మాణం మాత్రమే అవుతుంది. రసాత్మకం అయిన వచనం కవిత అవుతుంది." చూసారుగా ఆయన పరిశీలనాత్మక దృష్టిని!

ఈ 'రససిద్ధుడు' తెలుగువాడు కావటం, తెలుగువారి అదృష్టం. వారికి నా స్మృత్యంజలి!

***********************************************




అభినవ పోతన శ్రీ వానమామలై వరదాచార్యులుగారు! - టీవీయస్.శాస్త్రి

abhinava pothana shree vaanamaamalai varadaachaaryulugaaru

ఒక మహాకవి చరిత్రను మరో మహాకవి వ్రాస్తే, అది ఎంత సుమధురంగా ఉంటుందో మాటల్లో చెప్పటం కష్టం. ఆ మహాకవి పోతన అయితే, ఆయన చరిత్ర వ్రాసిన మహాకవి శ్రీ వానమామలై వరదాచార్యులుగారు. విశేషమేమిటంటే, సహజకవి అయిన పోతనను గురించి అతి సహజంగా ఆయన చరిత్రను కవితాత్మకంగా వ్రాయటమే! రామాయణాన్ని గురించి అనేక మంది కావ్యాలు వ్రాసారు. కాని, వాల్మీకిని గురించి వ్రాసినవారు లేరు. భాగవతాన్ని గురించి తెలుగు ప్రజలకు అందచేస్తూ, పోతన గారు, తన పూర్వ కవులైన నన్నయ్య తిక్కనాదులకు కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. ఎందుకంటే, వారు భాగవతాన్ని తెనిగించకుండా తనకోసమే వదిలినందుకు! 'పట్టునది కలమో హలమో! - సేయునది పద్యమో సేద్యమో' అని కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి గారు వ్యవసాయమే వృత్తిగా చేసుకొని జీవించి, పంచదార గుళికల లాంటి పద్యాలతో తెలుగువారికి భాగవతాన్ని అందించిన పోతరాజు మహాకవికి నీరాజనం సమర్పించారు. అయితే శ్రీ వానమామలై వరదాచార్యులుగారు, తనకన్నా అయిదు శతాబ్దాల ముందు నివసించిన పోతనను గురించి 'పోతన చరిత్రం' అనే పద్య కావ్యాన్ని వ్రాసారు. ఈ కావ్యంలో, రమారమి మూడువేల రెండువందల పద్యాలున్నాయి. అన్నిటికన్నా మరో గొప్ప విశేషమేమిటంటే, తెలుగుదేశం ఆధునికపు కవితా పోకడలకు అలవాటు పడిన కాలమది. భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం, వచనకవిత్వం లాంటి ఎన్నో నూతన సాహిత్య ప్రయోగాలాతో వర్ధిల్లుతున్న కాలంలో, ప్రాచీన కవితారీతులతో ప్రజలను మెప్పించిన కవి శ్రీ వానమామలై. ఒక మహాకవి చరిత్రను మరోకవి గ్రంధస్థం చేయటానికి రెండు కారణాలు ఉండి ఉండవచ్చు. మొదటిది - ఆ మహాకవి కవితా రీతులు నచ్చటం. రెండవది ఆ కవియొక్క జీవన దృక్పథం వల్ల ప్రభావితుడు కావటం. శ్రీ వానమామలై వరదాచార్యులుగారు 'పోతన చరిత్రం' ను వ్రాయటానికి, పైన చెప్పిన రెండూ కారణం

కావచ్చును. అందులో సందేహించ వలసినదేమీలేదు.

శ్రీ వానమామలై వరదాచార్యులుగారు,1912, ఆగస్టు 16న వరంగల్ జిల్లా మడికొండలో జన్మించారు. తండ్రి గారి పేరు బక్కయ్యశాస్త్రి గారు. వారు నేటి ఆదిలాబాద్ జిల్లాలోని చెన్నూరు అనే గ్రామంనుండి వచ్చి మడికొండలో స్థిరనివాసం ఏర్పరుచుకున్నారు. శ్రీ వానమామలై చిన్నతనంలో ఏ బడికీ పోలేదు. ఇల్లే ఆయనకు బడి. స్వయంకృషి వల్లే కవిత్వం, కావ్యాలు వ్రాయటం మొదలు పెట్టారు. ఆయన వ్రాసిన కావ్యాల్లో 'మణిమాల' చాలా ప్రసిద్ధి చెందింది. చెళ్ళపిళ్ళ, విశ్వనాధ వంటి వార్ల చేత ప్రశంసించబడ్డ కావ్యమది. వరదాచార్యులు గారికి పోతన జీవితమే ఆదర్శం. పోతనలాగే, వీరు కూడా 'పోతన చరిత్రం' ను శ్రీ రామచంద్రమూర్తికే అంకితమిచ్చారు. 'పోతన చరిత్రం' లో కొన్ని కాల్పనిక గాధలు కూడా వున్నాయి. అయితే, అవి పోతన గారి ప్రతిభను, వ్యక్తిత్వాన్ని ఇనుమడింప చేసేవే! పోతనగారి లాగే వీరూ అతి సాత్వికులు, నిరాడంబరులు. 'పోతన చరిత్రం' వ్రాయటానికి దాదాపు పది సంవత్సరాలకు పైగా పట్టింది. అటువంటి గొప్ప కావ్యమైన 'పోతన చరిత్రం' ను ముద్రించటానికి ఎవరూ ముందుకు రాలేదు. 1966 లో అనుకుంటాను, అప్పటి ముఖ్యమంత్రి శ్రీ దామోదరం సంజీవయ్యగారి కృషి, సహకారం వల్ల ఈ కావ్యం వెలుగుచూసింది.

ఆ తరువాత ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు తమ బహుమతితో ఈ కావ్యాన్ని, కవిని సత్కరించారు. బెనారస్లోని సంపూర్ణానంద సంస్కృత విశ్వవిద్యాలయం ఆయనను గౌరవ డాక్టరేట్ తో సత్కరించింది. పోతన నివసించిన 'బమ్మెర' తెలంగాణలో ఒక కుగ్రామం. వరదాచార్యులు గారు నివసించిన మడికొండ కూడా కుగ్రామమే! వారిరువురూ భక్తాగ్రేసరులే! అయితే ఒక చిన్న తేడా - పోతన మహాశయుని భక్తే కవిత్వమయింది. వరదాచార్యులు గారి కవిత్వం భక్తి ప్రేరితమైనది. ప్రతిపద్యం హృద్యం. జీవిత ప్రస్థానపు చివరిఘడియలలో వరదాచార్యులుగారు, వారి పూర్వీకులు నివసించిన చెన్నూరు గ్రామానికే చివరకు చేరుకున్నారు. 'అభినవ పోతన' వానమామలై వరదాచార్యులుగారి ఆశీర్వాదఫలం గడిచిన మూడు ప్రపంచ తెలుగు మహాసభలకు తోడు తిరుపతిలో డిసెంబర్ (2012) 27 నుంచి 29 వరకు జరిగిన నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభల వరకూ తెలుగు జాతిని కాపు కాస్తూనే వచ్చింది. ముచ్చటైన మూడు ప్రాంతాల రూపు రేఖల్ని వానమామలై గారి పద్యంలోనే విందాం -

"ప్రాచ్యదేశాంధ్ర 'శ్రీమహాభారతమ్ము'

భవ్యయ తెలంగాణ 'శ్రీ మహాభాగవతమ్ము'

మహిత రాయలసీమ 'రామాయణమ్ము'


ఘన త్రివేణీ సమాగమాకారమూనె"!

మరో విశేషమేమంటే, మరో అభినవ పోతన కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి గారు శ్రీ వానమామలై వరదాచార్యులు గారు దాదాపుగా సమవయస్కులు. ఒకరు తెలంగాణాను తెలుగు మాగాణిగా చేస్తే, మరొకరు ఆంధ్రావనిని పునీతం చేసారు. ఈ ఇద్దరి

మహనీయుల శతజయంతి ఉత్సవాలు కూడా దాదాపుగా ఒకే సమయంలో ఘనంగా జరగటం కూడా దైవికమే! శ్రీ వానమామలై వరదాచార్యులుగారు వృద్ధాప్యంలో క్షయవ్యాధి సోకి, తన 72 వఏట -1984, అక్టోబర్ 31న, వారు భౌతిక శరీరాన్ని వీడారు. ఒకప్పుడు, వీరి జీవిత చరిత్రను తెలుగు పాఠ్యవాచకంలోబాలబాలికలు చదువుకున్నట్లుగా నాకింకా గుర్తుంది.

ఈ మధ్యనే ఆయన శతజయంతి ఉత్సవాలను జరిపి ఆయన అభిమానులు ఆయనకు ఘనమైన నివాళిని సమర్పించారు!

*********************************************




గజల్స్ గాన కళాప్రపూర్ణుడు - టీవీయస్.శాస్త్రి

ghazal gaana kalaa prapoornudu ghazal srinivas

గజల్ శ్రీనివాస్ గారి పేరు వినని వారుండరు. శ్రీనివాస్ అసలు పేరు కేశిరాజు శ్రీనివాస్.పుట్టింది శ్రీకాకుళం జిల్లాలోని టెక్కలిలోనైనా, పెరిగింది అంతా పశ్చిమగోదావరి జిల్లాలోని పాలకొల్లు ప్రాంతంలోనే! తెలుగులో గజల్స్ ను తన సొంత బాణీలో పాడుతూ, ఆ గానవాహినిని ప్రపంచమంతా ప్రవహింపచేసిన ఈ గంధర్వుడిని గురించిన కొన్ని విషయాలు గర్వంగా చెప్పుకుందాం!గర్వం ఎందుకంటే, ఇతను మన తెలుగుతల్లి ముద్దు బిడ్డ కావటం వల్ల. గాంధీయిజం మీద 125 ప్రపంచ భాషల్లో పాటలుపాడి అరుదైన లిమ్కాబుక్ రికార్డును సొంతం చేసుకున్నారు ఈ శ్రీనివాసుడు.

అంతకు ముందు రెండుసార్లు గిన్నిస్ బుక్ లో ఎక్కి దేశానికే వన్నెతెచ్చారు. తాతయ్య కేశిరాజు వెంకట నర్సింహం పంతులు స్వాతంత్య్ర సమరయోధులు. అందుచేత శ్రీనివాస్ చిన్నతనం నుంచే క్రమశిక్షణలో పెరిగారు. వీరి తండ్రి నరసింహారావు గారు ఉద్యోగరీత్యా అనేక ప్రాంతాల్లో తిరిగి పాలకొల్లులో స్థిరపడ్డారు. అమ్మ రత్నావళి గృహిణి. సత్యసాయి భక్తురాలు. శ్రీనివాస్ బాల్యంలో అమ్మతోపాటు నగర సంకీర్తనకు వెళ్లేవాడు. సెలవురోజుల్లో నారాయణసేవ చేసేవారు. యావత్ ప్రపంచాన్నే తన గజల్స్ తో ఉర్రూతలూగిస్తూ ఆ గజల్స్ నే ఇంటిపేరుగా మలుచుకున్న ఘనుడు గజల్ శ్రీనివాస్. సంగీత, సాహిత్యాలపై పెద్దగా అవగాహనలేని మధ్యతరగతి కుటుంబం వీరిది . భీమవరంలో కొద్దిరోజులు శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నాడు. తండ్రి బదిలీల కారణంగా ఎక్కడా పూర్తిగా నేర్చుకునే అవకాశం లభించలేదు. పాఠశాలలో, కాలేజీలో పాటల పోటీల్లో పాల్గొనేవాడు .బాల్యం చదువులు పశ్చిమగోదావరి జిల్లాలోని నర్సాపురం, పాలకొల్లులోనే సాగాయి. ఆంధ్రావిశ్వవిద్యాలయం నుంచి పొలిటికల్ శాస్త్రంలో బి.ఏ.చేసి ఆ తర్వాత మద్రాస్ యూనివర్సిటీ ద్వారా లైబ్రేరియన్ గా కోర్సు పూర్తిచేసారు. పదిసంవత్సరాలపాటు భీమవరం, కోరుకొండ విద్యాలయాలలో లైబ్రేరియన్ గా పనిచేసారు. సినిమా పాటలు పాడి అనేక బహుమతులు గెలుచుకున్నాడు. కానీ, అది ఆయన మనస్సుకు తృప్తి నివ్వలేదు.

అనుకరణం, అనుసరణం అనేవి లేకుండా తనదైన ముద్ర వేసుకోవడానికి వాటిని ఆటంకంగా గుర్తించాడు. కొత్తదనం కోసం పరితపించాడు . సినిమా పాటలు పాడటం మానేసాడు. అదే సమయంలో డాక్టర్ సి. నారాయణరెడ్డి గారు రచించి, గానం చేసిన గజల్స్ విన్నాడు. ఆ ప్రేరణతో 1986లో మొదటిసారిగా ఆయన రాసిన గజల్స్ ను పాడాడు. కంజీరా సహాయంతో గజల్ పాడుతుంటే శ్రోతల హర్షధ్వానాలు మిన్నుముట్టేవి . గజల్ ను తెలుగుపాటగా, సాహితీప్రక్రియగా మార్చడం సంగీత ప్రియులు కూడా స్వాగతించారు, ఆదరించారు, అభినందించారు. ఆయన అభిమానించే జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సి. నారాయణ రెడ్డిగారితో 1993లో పరిచయమయ్యింది. శ్రీనివాస్ పాడే శైలి గమనించిన ఆయన శ్రీనివాస్ శైలికి అనుగుణంగా గజల్స్ రాయడం శ్రీనివాస్ కు ఎంతో ప్రోత్సాహాన్ని, ఉత్సాహాన్ని ఇచ్చింది. అంతే కాకుండా పదాలను ఎలా పలకాలో, భావవ్యక్తీకరణ ఎలా ఉండాలో నేర్పించారు నారాయణరెడ్డి గారు. విజయనగరంలో 1995లో జరిగిన బహిరంగసభలో సినారె ఈయనను తన మానసపుత్రుడిగా ప్రకటించడం శ్రీనివాస్ కు నోబెల్ బహుమతి అందుకున్నంత ఆనందాన్ని ఇచ్చింది. గజల్ ప్రక్రియకు గుర్తింపు తీసుకురావడంతో పాటు 200లకు పైగా గజల్స్ రాసి, అందులో కొన్నింటిని గానం చేసిన ఆయన అభినందించడం, గజల్ గాన ప్రక్రియకు ఆద్యుడిగా పేర్కొనడం ఆయనకు ఎంతో సంతోషాన్ని కలిగించింది. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా తన మాతృమూర్తి పుట్టినరోజు (ఫిబ్రవరి3)న ఆమె ముందు ఉంటాడు ఈయన.

జన్మనిచ్చిన తల్లి జన్మించిన రోజే పండుగ రోజు ఆయనకు. తల్లిని మించిన దైవం, సొంతఊరును మించిన స్వర్గం, భార్యను మించిన స్నేహితుడు, బిడ్డలను మించిన అనుబంధం, వినయాన్ని మించిన కృతజ్ఞత వేరెక్కడా ఉండవని చాలా గొప్పగా చెబుతుంటారు ఈయన. ఆయన సాధించిన విజయంలో భార్య భాగస్వామి అని భావించి, ఆయన సాధించిన మూడు గిన్నిస్ రికార్డులను ఆమెకు అంకితమిచ్చాడు. ఆయన వారసురాలి పేరు సంస్కృతి. ఈ చిరుత పాడిన ఒక ఆల్బం కూడా ఈ మధ్యనే విడుదలయ్యింది. ఆదినుంచీ శ్రీనివాస్ కు మన సంస్కృతి, సంప్రదాయాలంటే ప్రాణం. అందునా గాంధీ సిద్ధాంతాలంటే ఆయనకు ఎనలేని ప్రాణం. అందుకే ఆయన పాటల్లో ఎక్కువగా మన సంస్కృతి, సాంప్రదాయం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఇప్పటికే దేశవిదేశాలలో కలిపి ఆరువేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. కంజీరాను చేతపట్టుకుని లయబద్ధంగా దరువేస్తుంటే శ్రోతలు

మైమరచిపోయేవారు. తానే సొంతంగా బాణీలు సమకూర్చి అనేక పాటలు పాడారు. చెవులకి ఇంపయినది ఏదయినా సంగీతమే అంటారు ఆయన. అందుకే శ్రీనివాస్ గారు, "పాట కర్ణపేయంగా ఉండి సామాన్యునికి అర్థమయ్యేలా ఉండాలి" అంటారు.

బాపూజీ సిద్ధాంతాలపై తెలుగు, ఆంగ్లంతో పాటు మొత్తం 56 భారతీయ భాషల్లోనూ, 44 విదేశీ భాషల్లోనూ అదే గేయాన్ని, అదే స్వరంతో గానంచేసి దిగ్విజయంగా ముగించారు. ఈ కార్యక్రమాన్ని మొత్తం రికార్డు చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ కు కూడా పంపారు. గజల్ శ్రీనివాస్ ఒక్కొక్క భాషలో ప్రముఖులైన గేయ రచయితల చేత ఈ గేయాన్ని రాయించుకుని ఆ భాషకు గల సహజత్వం కోల్పోకుండా అన్నింటినీ ఒకే స్వరంలో పాడి చూపించారు శ్రీనివాస్. గజల్ ప్రక్రియను మరింత విస్తృతం చేయడానికి గజల్ ఛారిటబుల్ ట్రస్ట్ ను 2005లో ప్రారంభించారు. ఆయన గజల్స్ ఒక స్థాయివారికే పరిమితమని చాలామంది విమర్శించారు. నిజమే! మమతానుబంధాల విలువలు చెప్పే ఆయన పాటలు అక్షరాస్యులై విలువలు మరిచిపోతున్న వారికే! సమాజంలో మార్పు తీసుకువచ్చేలా,సందేశాత్మకంగా ఉండేలా గజల్స్ ఉండాలన్నదే ఆయన ఆశ,ఆశయం. గుర్తింపు కోసం ఇన్నాళ్లు గజల్స్ పాడిన ఆయన   ఇప్పుడు మార్పుకోసం గజల్స్ పాడుతున్నానని అంటారు.ఆయన జీవితాశయాలను ఆయన మాటల్లోనే విందాం! " కీర్తిని, సంపదను,కోట్లాదిమంది అభిమానాన్ని, అనేక పదవులను గజల్ నాకు ఇచ్చింది. వేలాది సంవత్సరాల చరిత్రగల తెలుగు సాహిత్య వనంలో గజల్ మరుపురాని, మధురమైన భావంగా నిలిచిపోయేలా మ్యూజియం ఏర్పాటుచేస్తాను.

ఇప్పటివరకు గజల్ ప్రాచుర్యం కోసం కృషి చేసిన వారి జీవిత విశేషాలు, వారు రచించిన గజల్స్,పుస్తకాలు అన్నీ ఇక్కడ ఉంటాయి. రానున్న శతాబ్దాల్లో పరిశోధనాలయంగా ఇది ఉంటుంది.మన సంస్కృతిని, ధర్మాన్ని మనం మరచిపోతున్నాం. అవి గుర్తుకు చేయడానికే ఇప్పుడు దేవాలయాల పరిరక్షణ కోసం కృషి చేస్తున్నాను. ఆలయానికి పాపభీతితోనే వెళతారు అన్న భావన చాలా మందిలో ఉంది. ఇది చాలా తప్పు. అమ్మ ఒడిలోనూ.. బడిలోనూ నేర్చుకున్న విధంగానే గుడిలోనూ అనేక విషయాలను మనం నేర్చుకుంటాం. క్రమశిక్షణ, సేవాభావం, నైతికత, మానవత ఇలా అనేక అంశాలు గుడిలో నేర్చుకుంటాం. అందుకే ప్రతిఒక్కరూ గుడికి విధిగా వెళ్లాలి. మన సనాతన ధర్మాన్ని పరిరక్షించాల్సిన బాధ్యతను తీసుకోవాలి. ఆలయవాణి వెబ్ రేడియో ద్వారా సనాతన ధర్మాన్ని, భారతీయ సంస్కృతి, ఆలయాల పరిరక్షణ, గోపూజ, పర్యావరణం వంటి అనేక కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నాం. కృష్ణాష్టమిని గోపూజ దినోత్సవంగా నిర్వహించాలని ప్రభుత్వానికి ఒక వినతిపత్రం ఇచ్చాం. అంతే కాకుండా స్వచ్ఛంద సంస్థలు బీడువారిన దేవాదాయ భూముల్లో వట్టిపోయిన ఆవులతో గోశాలలు ఏర్పాటుచేసేలా ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందించాలని కోరుతున్నాం. దేవాదాయ భూముల వివరాలు కంప్యూటరైజేషన్ చేయడంతో పాటు వందలాది సంవత్సరాల చరిత్రగల ఆలయసంపదను పరిరక్షించుకోవాలని ఎన్ఆర్ఐలను కోరుతున్నాం.

ప్రభుత్వ, ఎన్ఆర్ఐల సహాయంతో అనేక దేవాలయాలను పరిరక్షించే చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ సహకారంలో ఎన్నో ఆలయాలను పరిరక్షించే బాధ్యతను తీసుకుంటున్నాం. వకుళమాత దేవాలయాన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం." తన గజల్ గానంతో సాంస్కృతిక రాయబారిగా మారిన ఈ గాన గంధర్వుడు ఈ మధ్యనే ఆఫ్ఘనిస్తాన్ లో శాంతియాత్ర చేసారు. మైవాండ్ బ్యాంకు అఫ్ ఆఫ్ఘనిస్తాన్ ఆహ్వానం మేరకు 25 ఏప్రిల్ నుండి1మే వరకు ఆ దేశంలో శాంతియాత్ర చేసి,ఆ యాత్రలో బాగంగా ఆయన

రూపొందించిన ఉర్దూ గజల్ ఆల్బం "రుబరు"( ముఖాముఖి ) ను ఒక కరుడుకట్టిన మాజీ తాలిబాన్ చేత ఆవిష్కరింపచేసారు.
సదాశయాలతో ముందుకు వెళుతున్న ఈ గజల్ గాన గంధర్వుడు అన్ని విధాలా అభినందనీయుడు!

ఆ అభినయ, గానసరస్వతికి నా హృదయ పూర్వక నివాళి!!